
మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.6.2025
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



వాన చినుకులు

# మిసిమి

చింతనాత్మక సారస్వతం



తేనె పలుకులు

మాసపత్రిక, జులై, 2025 ₹ 50/-

ISSN 2454–4329




అమ్మ సేవతో



వయసు వేడిలో

# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 36** **సంచిక 7**

**జూలై - 2025**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

KALA JYOTHI
Since 1946

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**
Plot No. CFC-1&2, Survey No. 18, E-City,
SEZ, General Industrial Park, Raviryal and Srinagar,
Maheswaram, Ranga Reddy District,
**Telangana - 501 359.**
Ph: 040 - 27612436, 27645538.

Editor: **V. ASWINI KUMAR**
**Ph: 994 951 6567**

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : **జి. ఉమాసుందరి**
**040-27645536**

Scan QR to Pay
**Misimi A Unit of Kalajyothi**

LIBRARY OF CONGRESS
**LCCN 91-903060**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
**ISSN 2454-4329**

**misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com**
www.misimimonthly.com
YouTube **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## జూలై నెల సూచికలు...


పతివాడ - ద్వారం - కాంతారావు : డైరి ... 3

చాందోగ్య ఉపనిషత్తు : ఆచార్య కోదాటి వియ్యన్నరావు ... 5

లలితసంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 9

జీవనమకరందం : ఎ.కె. ... 12

భర్తృహరి : ఆచార్య పి. హరినాథ్ ... 13

తత్త్వమసి... రామకృష్ణ : **మిసిమి** ... 15

ప్రాచీన కావ్యాల్లో పల్లె ఆటల ప్రశస్తి : ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావు ... 23

కుబేరసామ్రాజ్యం కువైట్ : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 29

జిజ్ఞాస మూర్తి : **మిసిమి** ... 37

కందుకూరి సూర్యనారాయణ : వలేటి గోపీచంద్ ... 45

రాణి చంద్రాయమ్మ : రామవరపు వేంకట రమణమూర్తి ... 49

కమ్మతెమ్మెర : డా. బీరం సుందరరావు ... 52

నాటి రాజభవనాలే నేటి మ్యూజియాలు : టి.వి. ప్రసాద్ ... 53

చదువుసంధ్యలు : జూకంటి జగన్నాథం ... 61

అమ్మ స్వగతం : గడ్డం దేవీప్రసాద్ ... 63

రాయలసీమ నవల - బహుజన జీవితం : డా. పొదిలి నాగరాజు ... 65

**మిసిమి**లో చెక్కిన ఓ మైనపు శిల : ఐ.వి. రామరాజు ... 72

ఆర్ట్ ఆఫ్ ఆంధ్ర : వెంటపల్లి సత్యనారాయణ ... 77

చదవండి : **మిసిమి** ... 79





వివిన మూర్తి



ప్రొ. జి. రామకృష్ణ


### అట్టమీది బొమ్మలు




తేనె పలుకులు



అమ్మ సేవలో




వయసు వేడిలో




వాన చినుకులు

# పతివాడ – ద్వారం – కాంతారావు


**చా**లా అంటే చాలా ట్రస్టులు – స్మృతి సభలు – పురస్కారాలు చూస్తుంటాం. ఇదివరకే చెప్పినట్లు కర్తలు – తమ తమ పరపతి పెంపొందించేందుకు గొప్ప వాళ్లను వేదికపైకి ఎంపిక చేస్తారు – లేదా కథాకవితల పోటీ పెట్టి బహుమతులు ఇవ్వటానికి గొప్పవాళ్లను ఆహ్వానించి వారి సరసన కూర్చుంటారు – కాని మణికొండ కాంతారావు గారు – వారి తల్లిదండ్రుల పేరుతో ట్రస్టు పెట్టి మొదటిసారిగా కథానికల పోటీ నిర్వహించారు. 130 కథలను వారు చదివి – జూరీకి అందచేసారు. వారు ఎంపిక చేసిన వారికి బహుమతులు ప్రదానం చేయటానికి ఒక సాయంత్రం ఘన చరిత్ర గల ఒకప్పటి ఆంధ్ర సారస్వత పరిషత్తు – ఇప్పటి తెలంగాణ సారస్వత పరిషత్తు సభామందిరంలో ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేశారంటే – ఏదో యధాలాపంగా కాదు – పెద్ద పెద్ద వారెవ్వరూ లేకుండా – ఎంతో ఆత్మీయుల సమక్షంలో, మిత్రుల సందడిలో – సభను నిర్వహించారు. ప్రతి నిమిషం కార్యక్రమాల్ని నిర్ణయించి – రాసి – నిర్వహణ భారాన్ని మన రాంబాబుకు అప్పగించారు. అప్పుడు వేదకుమార్ గారు ఒక మాటన్నారు. 'పొరపాట్లు జరుగుతుంటాయి. అవికూడా కార్యక్రమంలో భాగమే – మీరేమీ ఆందోళన చెందకండి' నేను, రాంబాబు ఆయన సహనశీలతకు ఆనందించాం – సభలో శ్రీరామచంద్రమూర్తి – శ్రీ కాంతారావు గారు, మన్నవ సత్యనారాయణ– (మాట్లాడుతున్నవారు) శ్రీ నరసింగరావు, వేదిక మీద వుండగా – మిత్రులు – సాహిత్యప్రియులు – హాలు నిండుగా వున్నారు. నాకయితే ఈ సభ విజయాన్ని (విడియోని) ఒక మోడల్ సభావేశంగా చూపాలని వుంది! దర్శక నిర్మాత నరసింగరావు సారస్వత పరిషత్తు వేదికలో తన అనుభవాలను గుర్తుచేసుకున్నారు.




ఒక ఆదివారం పతివాడ సూర్యనారాయణ గారిని కలవటానికి గండిపేట వెళ్లాము. కోవిడ్ కాలం నుంచి వారిని కలవటం కుదరలేదు – అంతకు పూర్వం ప్రతివారం కలిసేవారం – వారు వృత్తి రీత్యా కమర్షియల్ టాక్స్‌లో వుండేవారు. కాని ఉనికి, ఊపిరి మాత్రం నాటకమే – వారికి 96 సంవత్సరాలు. వారి పని వారు చేసుకుంటున్నారు. వారితో ఒక పగలంతా గడిపి ఇంటర్వ్యూ రికార్డు చేశాం. మద్దూరి అన్నపూర్ణయ్య, అల్లూరి (సీతా) రామరాజు, అంజమ్మ, జయప్రద, కొంగర జగ్గయ్య, శ్రీ రవీంద్రనాథ్ ఇలా ఎందరి కబుర్లో చెప్పారు. సాయంత్రం సెలవు తీసుకుంటున్నప్పుడు – వారి వంటకత్తె – 'వీరు ఇంత సంతోషంగా – ఇంత ఉత్సాహంగా వుండటం చూడలేదు – మీరు తరచూ వస్తూండండి' అంది. త్వరలో వారి సంభాషణ '**మిసిమి**'లో చదువుదాం – రామరాజు గారు రాసిన ఇంట్రో ఈ నెలలోనే చదువవచ్చు –


పతివాడ

**మిసిమి** గ్రంథాలయం గురించి ఇదివరకే చెప్పాను. మంచి గంధానికి పన్నీటి జల్లులా మొన్న ద్వారం దుర్గాప్రసాద రావు గారు గ్రంథాలయంలో వారి వయోలిన్‌తో ప్రవేశించారు . ఒకరోజు కాదు – రెండురోజులు – తర్వాత కూడా – సందేశాలతో, సందేహాలతో వారిని విసిగించాను – కాని చిరునవ్వుతో అంతర్ముఖులై నా సందేహాలకు సమాధానాలు – వారి అనుభవాల సంచికలో అన్వేషించి సంభాషించారు – ఈ సమాగమం మాకు – వారికి ఒక వేకువలాంటిది – ఒక పున్నమి లాంటిది . వారు వేయి పున్నములను దర్శించిన మహానుభావులు . ద్వారం వారు తమ అనుభవాలు 'జీవాళి' గ్రంథంలో నిక్షిప్త పరిచారు – అపారమైన ప్రతిభ కలిగి కూడా పొలిమేర దాటని ద్వారం వారి అంతర్ముఖ వ్యక్తిత్వాన్ని మూల్యంకనం చేయటం ఎలా సాధ్యం? మా సంభాషణలో కొంతవరకైనా తెలియవచ్చునేమో '**మిసిమి**'లో త్వరలో చదువుదాం.



ద్వారం దుర్గాప్రసాద రావు

ఇక్కడే ఓ విషయం చెప్పాలి. ద్వారం వారికోసం ద్వారంవైపు చూస్తున్నాం నేను, గోపిచంద్ గారు. మాకు సర్‌ప్రైజ్ – వోలేటి వారు – కందుకూరి సూర్యనారాయణ గారితో వచ్చారు! కందుకూరి సూర్యనారాయణ గారు ఆకాశవాణి వార్తలు – చదివిన పరంపరలో ముఖ్యులు. ఇంతకు ముందు పతివాడ గారు కొంగర జగ్గయ్య గురించి చెప్పారు. అప్పట్నుంచి ఆకాశవాణి వార్తలు చదువుతున్నది – పణ్యాల రంగనాథరావు, కందుకూరి సూర్యనారాయణ, దుగ్గిరాల పూర్ణయ్య, అద్దంకి మన్నార్ ఈ పేర్లన్నీ చెవిలో రింగుమంటాయి మాతరం వాళ్లకి – కందుకూరి సూర్యనారాయణ గారి రేడియో ప్రసంగం – ఆకాశవాణి సౌజన్యంతో ఇస్తున్నాం .




కందుకూరి సూర్యనారాయణ

అందమైన భామలు కందిపోతారని హైటెక్స్ దారుల గుంతలు పూడ్చారు . మాకు పొరుగున జరుగుతున్న ప్రపంచ సుందరి పోటీలకు వంద దేశాల పైగా అందగత్తెలనేవారు వేంచేశారు – తెలంగాణ పర్యాటక శాఖ వారు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ప్రవేశ రుసుం లేదన్నారు – ప్రవేశం ఎలానో చెప్పలేదు. సైట్‌లో చూస్తే – మూసేశాం తర్వాత తెరుస్తాం అన్నారు – ఆ 'తర్వాత' ఇంకా రాలేదు – సరే క్షేత్రంలో చూస్తే అది దుర్భేద్యం – మన దౌర్భాగ్యం – అనుకుని మన గొట్టంలో చూసుకుంటేనే మంచిదనుకున్నాను . అందుకే అన్నారు – అందనిదే అందమయ్యా! అని. అనుకున్నట్లుగానే మే 31వ తేదీన సోనీ లైవ్‌లో అందాల పందాలు కనుల పండువగా చూసాం. ప్రపంచ సుందరి ఈవెంట్ – సి.ఇ.ఓ, నిరుటి అందాల రాణి..... తెలంగాణ ముఖ్యమంత్రి ప్రముఖుల సమక్షంలో – ప్రత్యక్ష ప్రేక్షకులు ఎంతమందో తెలియదు. ప్రొఫెషనల్‌గా జరిగిన పండుగలో థాయ్ అందగత్తె 'మిస్ వరల్డ్'గా ఎంపిక చేశారు. మన నగరంలో అందునా, మా ఆశ్రమం ప్రక్కనే జరిగిన ఈ ఈవెంట్‌ని ప్రత్యక్షంగా చూడలేకపోయాననే దిగులు మాత్రం మిగిలిపోయింది.




థాయ్ సిరి



# చాందోగ్య ఉపనిషత్తు

– ఆచార్య కోదాటి వియ్యన్నరావు

సామవేదానికి సంబంధించిన ఉపనిషత్తులలో చాందోగ్య ఉపనిషత్తు ఒకటి. సామవేదాన్ని సంగీతానికి ఆయువు పట్టుగా భావించడం వలన, ఇందులోని మంత్రాలను గానం చేస్తారు. 'చందోగ' అంటే చందస్సు అనే అర్థం ఉన్నది. అందుచేత చందోబద్ధంగా పాడుకోవడానికి ఇది వీలుగా ఉంటుంది.

**"తత్త్వమ్ అసి లేదా తత్త్వమసి"** దీని ఉపదేశ వాక్యము. అంటే అదే నీవు అయి ఉన్నావు.

**"ఈశావాస్య మిదగ్ం సర్వం"** అన్నది, ఈ ఉపనిషత్తు యొక్క మరొక విశేష వాక్యం. అనగా, ఈ జగత్తు అంతా, ఈశ్వరునితో నిండి ఉంది. ఈ ఉపనిషత్తు మొత్తం ఎనిమిది అధ్యాయాలుగా ఉన్నది. మొదటి ఐదు అధ్యాయాలలో వివిధ రకాలైన ఉపాసనలను గురించి వివరిస్తాయి. మిగిలిన మూడు నిర్గుణ బ్రహ్మజ్ఞానం గురించి తెలియజేస్తాయి. ఉపాసన అంటే ఒక విధమైన పూజా విధానం లేదా కార్యసిద్ధి కోసం ఆచరించే ప్రక్రియ. ఈ ఉపనిషత్తులో పేర్కొనబడిన వివిధ ఉపాసనలు ఈ విధంగా ఉన్నాయి. అవి : 1. ఓంకారోపాసన లేదా ఉద్గీథ 2. సంవర్గ ఉపాసన 3. చతుష్పాదగుణ విశిష్ట బ్రహ్మ ఉపాసన 4. ప్రాణ ఉపాసన 5. పంచాగ్ని ఉపాసన 6. వైశ్వానర ఉపాసన. వీటినే వివిధ రకాలైన విద్యలుగా కూడా ఈ ఉపనిషత్తు చెప్తుంది.

**ఓంకారోపాసన :** ఓంకారాన్ని అనేక గుణముల సారంగా ఈ ఉపనిషత్తు పేర్కొంటుంది. వేదముల యొక్క వివిధ భాగాలైనటువంటి సంహిత, బ్రాహ్మణ, అరణ్యక, ఉపనిషత్తులు 'ఓం' అక్షరములో ఇమిడి ఉన్నాయని చెప్తుంది. అందుచేత ఓంకారోపాసన చేయాలి.

**"ఓమిత్యే తదక్షరముద్గీథముపాసీత**
**ఓమితి హ్యుద్గాయతి తస్యోపవ్యాఖ్యానం."**

ఓంకారాన్ని ఒక విశిష్టమైన మంత్రంగా కీర్తించడం ఈ ఉపనిషత్తు యొక్క విశేషం. ప్రాణశక్తిని ఆవాహన చేయడం తద్వారా అన్ని రకాల ఇంద్రియాలపై అదుపు కలిగి ఉండడం, ప్రాణం యొక్క శుద్ధత్వాన్ని, సర్వంభరత్వాన్ని తెలుసుకోవడం, ఆ విధంగా దేవతల మన్నన పొందడం. ఇందులో భాగంగానే సూర్యఉపాసన, అక్షర ఉపాసన, ప్రాణ ఉపాసన, వ్యాన ఉపాసన, కామపూర్తి ఉపాసనలు చెప్పబడ్డాయి. అట్లే మధువిద్యా ఉపాసన, బ్రహ్మరూపేణ గాయత్రీ ఉపాసన, అంతరజ్యోతి రూపేణ బ్రహ్మ ఉపాసనలు కూడా ఈ ఉపనిషత్తులో క్షుణ్ణంగా వివరించబడ్డాయి. ఒక్క ఓంకారోపాసన ద్వారానే పలురకాలైన ఉపాసనల యొక్క ఫలితాలు సిద్ధిస్తాయని చెప్పడం ఉద్గీథ యొక్క ఉద్దేశ్యం.

**"యథా యథా ఉపాస్తే తదేవ భవతి"** అన్నది సూక్తి.

**సంవర్గ ఉపాసన లేదా విద్య :** సంవర్గ అంటే అన్నింటిని తనలో లయం చేసుకొనేది అని అర్థం. హిరణ్యగర్భను ఉపాసించడం ద్వారా ఉపాసకుడు బ్రహ్మంతో సమానమవుతాడు. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి అన్నీ తానే అయి హిరణ్యగర్భను ఉపాసించడం ద్వారా ఉపాసకుడు ప్రపంచంలో అన్నింటినీ గెలుస్తాడు. అందుచేతనే దీనిని సంవర్గ విద్య అని చెప్పడం జరిగింది. తైత్తిరీయ ఉపనిషత్తు సృష్టి యొక్క ఆవిర్భావాన్ని గురించి చెపుతూ, ఆత్మ నుండి ఆకాశం, ఆకాశం నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలం, జలం నుండి పృథివి వచ్చాయని చెప్తుంది. చాందోగ్య ఉపనిషత్తు దీనినే వ్యతిరేక దిశలో ప్రళయకాలంలో అవి ఒకదానిలో ఒకటి ఏ విధంగా లయం చెందుతాయో వివరిస్తుంది.

**"ప్రాణోవా సంవర్గః"**

పంచకర్మేంద్రియాలు, పంచజ్ఞానేంద్రియాలు, నాలుగు అంతఃకరణలు ప్రాణశక్తిలో లయమవుతాయి. మనస్సుతో సహా అన్ని ఇంద్రియాలు లయమైనప్పుడు జాగృతంగా ఉండేది ప్రాణశక్తి ఒక్కటే. ఇదియే చైతన్యంగా కూడా పిలవబడుతుంది.

**చతుష్పాద గుణ విశిష్ట బ్రహ్మ ఉపాసన :** దీనినే సత్యకామజాబాలో పాఖ్యానం అని కూడా పిలుస్తారు.

జాబాలుడు బ్రహ్మ ఉపాసన యొక్క విధానాన్ని తెలుసుకొన్న వివరం ఇందులో చెప్పబడింది. నాలుగు పాదాలలో మొదటి పాదంగా వాయువును గురించి, రెండవ పాదంగా అగ్ని గురించి, మూడవ పాదం హంస, నాల్గవ పాదం మద్గుః గురించి చెప్తాయి. మద్గుః అంటే జలపక్షి. ఈ విధంగా జ్ఞానం పొందిన జాబాలుని ముఖం బ్రహ్మ వర్చస్సుతో వెలిగిపోతున్నట్లు గురువైన హరిముద్రుడు గమనిస్తాడు. అదే విషయాన్ని జాబాలునికి తెలుపగా, అయినప్పటికీ అవే విద్యలను ముఖతః నేర్పమని గురువుని అర్థిస్తాడు. ఈ సందర్భంలో జాబాలుడు ఈ క్రింది వాక్యాన్ని గుర్తుచేస్తాడు.

**"ఆచార్య ద్వైవ విద్యా విదితా సాధిష్ఠం ప్రాపతి"** ఏ విద్యైనా గురుముఖతా, శ్రద్ధగా నేర్చనిదే అది రాణించదు.

**ప్రాణఉపాసన :** ఇంతకుముందు ఉపనిషత్తులలో ప్రాణం అంటే చేతన లేదా చైతన్యం అని తెలుసుకున్నాం. ప్రాణానికి ఉన్న కొన్ని విశిష్ట గుణాలను చాందోగ్య ఉపనిషత్తు ఈ క్రింది మంత్రం ద్వారా తెలియజేసింది. ''జేష్ఠత్వం, శ్రేష్ఠత్వం, వశిష్ఠత్వం, ప్రతిష్ఠత్వం, సంపదత్వం, ఆయతనత్వం-షడ్గుణాలంకృతః ప్రాణః'' ప్రాణానికి ఆపాదించబడిన ఆరు గుణాలలో జేష్టత్వం అంటే ముందుగా పెట్టడం లేదా ఉనికిలోనికి రావడం, శ్రేష్టత్వం అంటే గొప్పతనం, వశిష్టత్వం (ఐశ్వర్యం), పతిష్ఠాత్వం (అందరికీ ఆధారంగా ఉండడం) సంపదత్వం (సంపద కలిగి ఉండడం), ఆయతనత్వం (అందరికీ నివాసంగా ఉండడం). ఈ గుణాలలో ఒక్కొక్క గుణ ఉపాసన ఒక్కొక్క ఫలితాన్ని కలుగజేస్తుందని ఈ ఉపాసన చెప్తుంది. అంతేగాక, మనిషికి ఉన్న దశ ఇంద్రియాలు (ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు) కూడా తమ శక్తిని ప్రాణానికి ధారపోస్తాయి. అందుచేత మానవునికి ప్రాణం ముఖ్యమైనది. ఈ భాగంలోనే ప్రాణోపాసన ఎందుకు చేయాలి. ఏ విధంగా చేయాలి అన్న విషయాలు కూడా చర్చించబడ్డాయి. ప్రాణోపాసన చేయడం వలన ఈ ఉపనిషత్తు ప్రకారం మూడు సౌకర్యాలు ఏర్పడతాయి. అవి : ఆహారం, వస్త్రం, నివాసం. ప్రాణానికి అన్నమే ఆహారం. అన్నం అన్నది ప్రాణానికి మరొక నామము. అందుచేతనే పూజా సమయాలలో ఆహారాన్ని చూపిస్తూ "ప్రాణాయ స్వాహా' అంటారు. ఆచమనం చేయడం ద్వారా ప్రాణానికి వస్త్రం ఏర్పడుతుంది. అటుపైన శరీరమే ప్రాణానికి నివాసం. ఈ విధంగా ప్రాణం యొక్క ప్రాముఖ్యాన్ని ఈ ఉపనిషత్తు తేటతెల్లం చేస్తుంది.

**పంచాగ్ని ఉపాసన :** చాందోగ్య ఉపనిషత్తు ప్రకారం పంచాగ్నులంటే సాధారణంగా పిలువబడే అగ్ని శిఖలు కావు. సూక్ష్మ శరీరానికి మధ్యన ఉండే బంధాన్ని తెలియజేసేవిగా చెప్పబడింది. ముఖ్యంగా జన్మ, పునర్జన్మల మధ్యన ఉండే సంబంధాన్ని ఇది సూచిస్తుంది. దీనిని ఐదు దశలుగా గుర్తించారు. అవి : 1. బ్రహ్మం-సూర్యుని ద్వారా చంద్రుడు ఏర్పడడం. 2. మేఘం-గాలి వలన వర్షం సంభవించడం. 3. భూమి-కాలం వలన ఆహారం ఏర్పడడం 4. మనిషి-వాక్కు వీర్యంగా రూపొందడం 5. స్త్రీ-సంభోగం ద్వారా గర్భం ఏర్పడడం. పురాణాలలో చెప్పబడే బడబాగ్ని, జఠరాగ్ని కాలాగ్ని, వజ్రాగ్ని మొదలైనవి, ఈ ఉపనిషత్తులో చెప్పబడిన అగ్నులు ఒకటి కావు. ఈ ఉపనిషత్తు పునర్జన్మను సూచిస్తుంది. **'పునరుపి జననం, పునరుపి మరణం'** అన్నది వాక్యం. చాందోగ్య ఉపనిషత్తు ప్రకారం సూక్ష్మ శరీరం, స్థూల శరీరంగా మారే క్రమం ఈ విధంగా ఉంటుంది. జలీయ శరీరం, సోమశరీరంగాను, సోమశరీరం, వృష్టి శరీరంగాను, వృష్టి శరీరం అన్న శరీరంగాను, అన్న శరీరం రేతశ్శరీరంగాను మారుతుంది. ఐదవ దశలో స్త్రీ ద్వారా సృష్టి జరుగుతుంది.

**వైశ్వానర ఉపాసన :** దీనినే అంగీ ఉపాసన లేదా 'జాతవేదసం' అని కూడా పిలుస్తారు. అంటే పుట్టుకను గూర్చిన విషయాలను తెలియజేసేదని అర్థం. ఇక్కడ వైశ్వానరుడు అంటే 'విశ్వవిరాట్'. అతని స్వరూపం గురించి దిగువ మంత్రం పేర్కొంటుంది.

**'స సర్వేషు లోకేషు,**
**సర్వేషు భూతేషు,**
**సర్వేషు ఆత్మసు అన్నమత్తి''** వైశ్వానరుడుగా పిలువబడే విశ్వవిరాట్ సర్వలోకములలోను, సర్వ భూతములయందు, సర్వజీవుల యందు నెలకొని, సర్వత్ర ప్రకాశమానమై ఉన్నాడు. ఇట్టి ఉపాసన చేయువారు సమస్తము అన్నముగా, స్వానుభూతిగా, స్వస్వరూపముగా ఆస్వాదించగలరు. ఉపాసన క్రమంలో ఆహుతులు లేదా సమర్పణలు ఏ విధంగా ఉండాలో తేటతెల్లం చేయబడింది.

అవి :

**"ప్రాణాయ స్వాహా, వ్యానాయ స్వాహా,**

**అపానాయ స్వాహా, సమానాయ స్వాహా,**

**ఉదాయనాయ స్వాహా"** ఎవరైతే పైన తెలిపిన పంచ ఆహుతి సమర్పణ హూమ విధానాన్ని సక్రమంగా పాటిస్తారో వారు విరాట్ స్వరూపుని అనుగ్రహాన్ని పొందుతారు.

**నిర్గుణ బ్రహ్మజ్ఞానం :** దీనిని గురించి 6 నుండి 8వ అధ్యాయములలో చర్చ చేయబడింది. చాందోగ్య ఉపనిషత్తుకు సంబంధించి నిర్గుణ బ్రహ్మజ్ఞానాన్ని గురించిన చర్చే ప్రధాన అంశమని ఎక్కువ మంది భాష్యకారులు భావిస్తారు. ఇంతవరకు పేర్కొన్న వివిధ ఉపాసనలు, యోగ్యతా ప్రాప్తిని కలిగించే సుగుణ ఈశ్వరోపాసనగా చెప్పబడ్డాయి. ఈ వివరణ మొదటి ఐదు అధ్యాయాలలో ఇవ్వబడింది.

నిర్గుణ బ్రహ్మజ్ఞానంలో మూడు అంశాలు ఇమిడి ఉన్నాయి. అవి : సద్విద్య, భూమ విద్య, తరీయ విద్య, ఆరు నుండి ఎనిమిది అధ్యాయాలలో ఒక్కొక్క అధ్యాయము ఒక్కొక్క విద్యను వివరిస్తుంది. "సత్, చిత్, ఆనందోబ్రహ్మ" అన్నది సారాంశం. సత్ అంటే సత్యం లేదా వాస్తవము. చిత్ అంటే జ్ఞానం లేదా స్పృహ. బ్రహ్మాన్ని గూర్చిన జ్ఞానమే ఆనందాన్ని కలుగజేస్తుంది. ఈ మూడింటిని గురించి మరింత విపులంగా తెలుసుకొందాం.

**సద్విద్య :** సద్విద్య అంటే 'సత్'ను గురించిన జ్ఞానం. సత్ అంటే నిజం లేదా వాస్తవం అని చెప్పుకొన్నాం. బ్రహ్మాన్ని గూర్చిన జ్ఞానమే నిజమైన జ్ఞానం అనే అర్థంలో 'సత్'ను గురించి ఈ ఉపనిషత్తు వివరిస్తుంది. ఈ ప్రకరణంలో గురువు, తండ్రి అయిన ఉద్దాలకుడు, శిష్యుడు, కుమారుడు అయిన శ్వేతకేతుకు సత్ లేదా తత్ యొక్క జ్ఞానాన్ని సంవాదరూపంలో బోధించినట్లు ఉంటుంది. ముందుగా ఏది సత్యం, ఏది అసత్యం లేదా మిథ్య అనేది గ్రహించాలి. సత్యాన్ని తెలుసుకోవడమే నిజమైన విద్య లేదా జ్ఞానం. దానికిగాను ఈ ఉపనిషత్తులో కొన్ని ఉదాహరణలు ఇవ్వబడ్డాయి. మట్టితో చేయబడిన కుండను తీసుకున్నారు. ఇందులో కుండమట్టితో చేయబడినది. ఇక్కడ మట్టి, కుండ రెండు రూపాలు. వాస్తవంగా ఉన్నది మట్టి మాత్రమే. మట్టి కారణం, కుండ కార్యం. మట్టి, కుండలో ఒకే పదార్థం ఉన్నది. అదే మట్టి లేదా మృణ్మయం. కుండ అనేది కొత్త పదార్థం కాదు. అది మట్టే. కాబట్టి నామ రూపాలను అధ్యయనం చేస్తే అది 'అపరావిద్య', కారణాన్ని అధ్యయనం చేస్తే పరావిద్య అవుతుంది. ఇక్కడ తెలియదగిన వాస్తవం "ఉన్నది మట్టి మాత్రమే". ఇదే సత్యం యొక్క స్వరూపం. అట్లే బంగారం, బంగారంతో తయారు చేయబడిన వివిధ ఆభరణాలు. ఉన్నది బంగారం మాత్రమే. ఆభరణాలు కావు. తెలుసుకోదగినది. కార్యం పదార్థం కాదు, కొత్తగా పదార్థ సృష్టి జరుగలేదు. అందుచేత ఆభరణాలు మిధ్య లేదా అసత్యం, ఉన్నది బంగారం మాత్రమే, అదే సత్యం. అందుచేతనే 'బ్రహ్మసత్యం, జగన్మిథ్య' అనే వాక్యం ఉద్భవించింది.

దీనికి సంబంధించిన మంత్రం ఈ విధంగా ఉన్నది.

**'సత్త్వ ఏవ, సోమ్య**

**ఇదమ్అగ్ర ఆసీత్**

**ఏకమేవ–అద్వితీయమ్'** సౌమ్యా! మొట్టమొదట 'సత్'యే ఉన్నది. ఇప్పటికీ సత్యే ఉన్నది. ఉన్నది ఎప్పటికీ ఉన్నది. లేనిది ఎప్పుడూ లేదు. సత్ యే, సర్వదా ఏకమై, అద్వితీయమై ఉన్నది. చాందోగ్య ఉపనిషత్తు ప్రకారం సృష్టి మూడు భూతాల ద్వారా ఏర్పడింది. అవి : అగ్ని, జలం, పృథివి. ఈ మూడింటికి మూడు రంగులు ఉన్నాయి. అవి : ఎరుపు, తెలుపు, నలుపు. సృష్టిలోని కార్యాలన్ని ఈ మూడు రంగుల మిశ్రమమే 'సత్' అన్నదే జగత్తునంతా అనేక రూపాలలో విస్తరించి ఉన్నది. సంబంధిత మంత్రం ఈ విధంగా ఉన్నది.

**"తత్ ఐక్షత బహుస్యాం ప్రజాయేయేతి?**

**తత్ తేజో అసృజత?**

**తత్ తేజ ఐక్షత**

**బహుస్యాం ప్రజా యేయేతి?"** సత్ అనే నేను అనేకములుగా అగుదునుగాక! అట్లే బహురూపములు ధరించెదను గాక! దీనిని తెలుసుకొనుటయే ఉపాసకుని యొక్క ధ్యేయం. విశ్వంలోని జీవులందరు, ఈ సత్‌నే మూలంగా కలిగి ఉన్నారు. అదియే ఆధారము, ఆశ్రయముగా కూడ ఉన్నది.

**భూమ విద్య :** ఇక్కడ 'భూమ' శబ్దానికి రెండు అర్థాలు ఉన్నాయి. అవి : అనంతం, ఆనందం. ఆనందం యొక్క మూలాన్ని, స్వభావాన్ని తెలియజెప్పే ప్రయత్నంగా ఈ ఉపనిషత్తు సాగుతుంది. 'ఆనందం బాహ్యంగా ఎక్కడనో లేదు, అది నీలోనే, నీతోనే ఉన్నది' అన్నది దీని భావన.

అయితే దీని ఉనికిని తెలుసుకోవడానికి జగత్తులో ఉన్న వస్తువులు, అంశాలు మధ్యన ఉన్న 'కార్య–కారణ బంధాన్ని' తెలుసుకోవాలి. ఇంతకుముందు చెప్పిన మట్టికుండ ఉదాహరణలో మట్టి కారణం, కుండ కార్యం. జగత్తులో ఉన్న కార్యమంతటికి, నామరూపాలు ఉన్నాయి. అయితే కారణం లేకుండా రూపం లేదు. వివిధ రూపాలలో ఉన్న జగత్కార్యాన్ని తెలుసుకోవడమే భూమ విద్య. ఇందులో 15 రకాలైన ఉపాసనలు వివరించబడ్డాయి. అవి : నామ, మనో, సంకల్ప, వాక్కు, చిత్ర, ధ్యాన, విజ్ఞాన, బల, అన్న, జల, అగ్ని, ఆకాశ, స్మరణ, ఆశ, ప్రాణ ఉపాసనలు. వీటినే భూమ విద్యను సాధించడంలో వివిధ దశలుగా పేర్కొనవచ్చు. ఒక్కొక్క అంశం ఆనందం యొక్క ఒక్కొక్క పార్శ్వాన్ని తెలియజేస్తాయి.

**తురీయ విద్య లేదా బ్రహ్మజ్ఞానం :** చాందోగ్య ఉపనిషత్తు బ్రహ్మంను మూడు రూపాలుగా వర్ణిస్తుంది. అవి : సత్, చిత్, ఆనంద. సత్‌ను సద్విద్యగాను, ఆనందాన్ని భూమ విద్యగానుతెలుసుకొన్నాము. మూడవది అయిన చిత్‌రూప బ్రహ్మం గురించి తెలుసుకుందాం. దీనినే 'దహర విద్య' అని కూడా పిలుస్తారు. నిర్గుణ బ్రహ్మ అంటే రూపంలేని, గుణాలు లేని పరమసత్యం. బ్రహ్మం అన్నది విశ్వంలోని అంతిమ వాస్తవం. అది కాంతివలె నిత్యనిర్మలము. దానిని వార్ధక్యము, మృత్యువు, శోకము, దాహము తాకలేవు. ఆత్మ ఏది కోరుకుంటుందో, అదియే సత్యమై ఉండగలదు.

**"సత్య కామః సత్య సంకల్పో"**
**"అథయ ఇహ ఆత్మానం అను విద్య ప్రజంత,**
**ఏతాంశ్చ సత్యాన్ కామాన్**
**తేషాం సర్వేషు లోకేషు**
**కామచారో భవతి?"**

ఎవరైతే ఆత్మ తత్వమును, ఆత్మ యొక్క ఔన్నత్యమును మనన విద్యల ద్వారా తెలుసుకుంటారో, వారు సత్య కాములౌతారు. వారి ఇచ్ఛానుసారంగా, వారు కోరుకున్నది పొందగలరు. ఆ విధంగా వారు స్వతంత్రులౌతారు.

**"స వా ఏష ఆత్మా హృది?**
**తస్య ఏతత్ ఏవ నిరుక్తం**
**హృద్యమ్ ఇతి?**
**తస్మాత్ హృదయం అహరహర్వా**
**ఏవం విత్ స్వర్గ లోకం ఏతి?"**

ఏ పరమాత్మ కోసమైతే, జీవుడు పరితపిస్తున్నాడో, అది సర్వదా అతని హృదయమునందే ఉన్నది. ఈ విధంగా ఆత్మగల స్థానము హృదయమే అని ఎరిగినవాడు, బ్రహ్మంను అను నిత్యం పొందగలుగుతాడు. నిర్గుణ బ్రహ్మ ఉపాసనలో నాలుగు దశలు ఉన్నాయి. అవి : అక్షిపురుష, స్వప్నపురుష, షుప్తపురుష, ఉత్తమ పురుష. ఇక్కడ 'పురుష' శబ్దం వ్యక్తిని గాక, ఆత్మలేదా చైతన్యాన్ని సూచిస్తుంది. అక్షిపురుష జాగ్రదవస్థలో కళ్ళతో మొదలౌతుంది. కన్ను తెరిస్తే జననం, కన్నుమూస్తే మరణం అన్నది వాస్తవం. దీని వెనుకనున్నది చైతన్యం అని తెలుసుకోవడమే మొదటి దశ ఉపాసన. స్వప్నపురుష అంటే 'తైజస'. దీనినే విశ్వ బ్రహ్మంగా చెప్తారు. ఈ దశలో సంకల్పం చేత స్వప్న ప్రపంచం సృష్టించ బడుతుంది. మూడవదశ అయిన సుషుప్తావస్థలో మనస్సుతో సహా అన్ని ఇంద్రియాలు విశ్రాంతిలో ఉంటాయి, ఒక్క చైతన్యం తప్ప. నాల్గవదశ అయిన ఉత్తమ పురుషకున్న మరొక పేరు 'తురీయ'. అదే చైతన్యం. దేశ, కాల పరిమితులు చైతన్యానికి లేవు. తెలుసుకోదగినది, శరీరము, మనస్సు జడమైనవని వాటికి స్వతహాగా చైతన్యం లేదని, చైతన్యం, శరీరం లేదా మనస్సు యొక్క భాగం కాదని, మనస్సులోని ఆలోచనలతో సహా అన్నీ జడమైనవే నన్న స్పృహ కలిగి ఉండడం. "పరోపకారం ఇదం శరీరం" అన్న సూక్తిలో భౌతిక శరీరము, మనస్సు రెండూ కలిసి ఉన్నాయని అర్థం చేసుకోవాలి. స్థూల శరీరం ఎల్లప్పుడూ మృత్యుకోరల్లో చిక్కుకొని ఉంటుంది. దానినే కాలతత్వం అని పిలుస్తారు. వ్యక్తి మరణించినా చైతన్యం ఉంటుంది. ఎందుచేతనంటే చైతన్యం శ్వాతత్వం కలిగి ఉంది. జీర్ణమైన వస్త్రాన్ని వదలి మనం ఏ విధంగా నూతన వస్త్రాన్ని ధరిస్తామో, అదే విధంగా చైతన్యం కూడా మరొక శరీరాన్ని లేదా దేహాన్ని ఆశ్రయిస్తుంది. ఈ విధమైన అవగాహన ఉపాసకుని చివరిదైన నాల్గవ దశకు చేరుస్తుంది. అదే తురీయ లేదా ఉత్తమ పురుష దశ. హిందూ వాఙ్మయంలో ఈ నాల్గవ దశను చేరుకొన్న వ్యక్తిని ఉత్తమ పురుష అని, విశ్వం మొత్తానికి అధిపతి అయిన విష్ణువుని పురుషోత్తముడని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు భగవద్గీతలోతనను నశింపు లేని ఉన్నత పురుషగా అభివర్ణించుకున్నాడు.

ఆచార్య కోదాటి వియ్యన్నరావు
పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
చరవాణి : 7093260655

# లలితసంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

**– డా. ఎమ్. పురుషోత్తమాచార్య**

**13. కోటి కోటి తారలలో**

రచన : దాశరథి
సంగీతం : మంచాల జగన్నాథరావు
గానం : వి.వసంత

వసంత–త్రిశ్ర ఏక

**కోటి కోటి తారలలో**
**మేటి చందమామలా**
**శ్రావణ నవసరసిలో**
**రమ్య కమలభామలా** ॥కోటి॥

1. కాషాయపటమ్ముతో
జటాకిరీటమ్ముతో
కన్నుల కనికరముతో
అభయమిచ్చు కరముతో ॥కోటి॥

2. ఏ పాపం సోకనట్టి పాపలా,పసిపాపలా
తేజోగంభీరుడైన రాజులా,మహరాజులా
ధరాతలము ముంచెత్తే కరుణారససింధులా
లోకబంధులా ॥కోటి॥

దాశరథిగారి లలితగీతాలలో ఇది ఇక విశిష్టమైన రచన. భావకవితా ధోరణిలో సాగిపోయే ఈ రచనలో 'కర్త' కనిపించకుండా పాటను మలచడం ఒక యుక్తి, ఒక గడుసుదనం. "చందమామలాగా, కమలంలాగా, పసిపాపలాగా" అంటూ 'లా' అనే ఏకాక్షరపదాన్ని 'వలె,వంటి' అర్థంలో పాటంతా విస్తరించుకునేట్టుగా మలిచారు. మొదటి చరణంలో కాషాయవస్త్రం,జటాజూటం అనే ప్రయోగాలతో అటు శివుడిని, ఇటు ఎవరో ఒక యోగిని సూచిస్తున్నట్లుగా భావించవచ్చును. శివుని లక్షణాలను సంపూర్ణంగా పొదిగిన యతీశ్వరుడిని స్తుతిస్తూ ఏదో ఒక సందర్భంలో అవతరించి నట్టున్నది ఈ పాట ధోరణి. కరుణారస సింధువు, లోకబంధువు పరమేశ్వరుడే, పరమేశ్వరస్వరూపుడే.

పల్లవిలోని మొదటి భాగంలో ప్రాసను, రెండో భాగంలో యతిని అనుసరించారు. రెండో చరణంలో ప్రాసను పాటించారు. మొదటి చరణంలో యతిప్రాసల గొడవ లేకుండా స్వేచ్ఛగా వ్రాశారు. "చందమామ, కమలభామ, పటమ్ము, కిరీటమ్ము, సింధులా, బంధులా" వంటి చోట్లలో అంత్యప్రాసను అందంగా పొదిగారు.

ఈ పాటను స్వరపరిచిన జగన్నాథరావుగారు లలిత, శాస్త్రీయసంగీత రంగంలో ప్రసిద్ధి వహించిన గొప్ప వైణికులు. లలితగీతాలకే కాక ఎన్నో అన్నమయ్య సంకీర్తనలకు కూడా స్వరరచన చేశారు. ఆయన గాయని పేరును సూచించే రాగాన్నే ఎంచుకుని దీన్ని వసంత రాగంలో స్వరపరచడం ఎంతో సొగసుగా, సహజ సుందరంగా ఉంది. ఈ రాగం సూర్యకాంతం అనే మేళకర్తరాగజన్యం. ఈ రాగంలో పంచమం ఉండదు కాని 'తారలలో, మేటి' పదాల దగ్గర పంచమస్పర్శ వినిపిస్తుంది. దీన్ని ఒక అందం కోసమే ప్రయోగించారు కాని, పంచమానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. వసంతరాగ సంచారాన్ని పాటించి మనోహరంగా విస్తరింప జేశారు.

ఆనాడు ఆకాశవాణిలో వాద్యాలను ఎక్కువగా వినియోగించేవారు కారు. వయొలిన్, వీణ, వేణువు, క్లారియోనెట్, తబల వాద్యాలు అన్ని ఆకాశవాణి కేంద్రాల లోనూ ఉంటాయి కనుక అప్పటి ఆకాశవాణి లలితగీతాలు ఈ వాద్యాల పరిధిలోనే ఎక్కువగా సంచరించాయి. ఈ పాటలో కూడా ఆ వాద్యాలే వినిపిస్తాయి.

పల్లవికి ముందు 4 ఆవర్తాల బిట్టు వినిపించాక పల్లవిని తారషడ్జమం నుండి ప్రారంభించారు. గాయని వి.వసంత సినీగాయని వసంత కాదు. ఆమె బి.వసంత. ఆమె ఆకాశవాణిలోనూ,గ్రామఫోను కంపెనీలోనూ ఎన్నో లలితగీతాలు పాడారు. వి.వసంత పల్లవిని రెండుసార్లు పాడాక బిట్‌వర్క్ రెండు ఆవర్తాలుగా వినిపిస్తుంది. అప్పుడు వసంతరాగజీవస్వరమైన మధ్యమం నుండి 'కాషాయ పటమ్ముతో' ను ఎత్తుకున్నారు. రెండు పంక్తులను కలిపి రెండుసార్లు, తరువాతి రెండు పంక్తులను రెండు సార్లు పాడి పల్లవిని అందుకుని పాడి 'చందమామలా' దగ్గర వదిలారు. తరువాత విభిన్నరీతిలో మూడు ఆవర్తాలలో బిట్‌వర్కు వినిపించాక రెండవ చరణాన్ని మళ్ళీ మధ్యమం నుండే ప్రారంభించారు. 'ధరాతలము' దగ్గర తారాస్థాయి

గాంధారాన్ని పలికిస్తూ అన్యస్వరమైన చతుశ్రుతి రిషభాన్ని తాకుతూ పాడారు. అలాగే, 'కరుణారససింధులా' దగ్గర పంచమాన్ని బలమైన అనుస్వరంగా మార్చుకుంటూ పాడారు. దీనివల్ల బాణీకి 'మాండ్' రాగపు రంగు కూడా కొంత సోకిందని చెప్పవచ్చు. 'ధరాతలము' పాదాలను రెండుసార్లు పాడాక పల్లవినెత్తుకుని రెండుసార్లు పాడి 'మేటి చందమామలా' ను ఆలాప్‌గా సాకీ పద్ధతిలో పాడి పాటను ముగించారు.

**14. గిరిధరా ఏలరా**

| | |
|---|---|
| **రచన** | **: సి.నారాయణరెడ్డి** |
| **సంగీతం** | **: పెండ్యాల** |
| **గానం** | **: వేదవతీ ప్రభాకరరావు** |

**<u>మిశ్ర అసావేరి-ఏక</u>**

**గిరిధరా ఏలరా**
**కినుక నా మీద** ॥గిరి॥
**ఏదైనా తప్పైనా**
**ఎరిగించరాదా** ॥గిరి॥

1. నిఖిల సుగుణాలకు
నెలవైన నా స్వామి
జన్మజన్మలకు నీ
చరణదాసిని కానా ॥గిరి॥

2. భక్తజనావళి పాదపద్మముల
ఆత్మ సర్వము అర్పణ చేసితి
మీరా ప్రభువే నన్ను దాసిగా
చేరదీయగా చరితార్థనైతి ॥గిరి॥

వాగ్గేయకార ప్రపంచంలో మీరాబాయి గొప్ప మధురభక్తిపూరిత సుమధుర గాయనీమణి. ఆమె వ్రజభాషలో ఎన్నో వేల భజన్స్ వ్రాసినారు.

'గిరిధర' అనే పదం మీద ఆమెకు మక్కువ ఎక్కువ కనుక ఆ పదమే ఆమె రచనల్లో ఎక్కువగా 'నామాంకిత ముద్ర' పద్ధతిలో సంచారం చేసింది. ఈమె అసలు పేరు 'మిహిరాబాయి'. సూర్యునివలె ప్రకాశించేది అనే అర్థంలో తల్లిదండ్రులు పెట్టిన పేరును తన భక్తితత్త్వంతో సార్థకపరుచుకున్న పుణ్యమూర్తి. మీరాబాయికి ఇష్టమైన 'గిరిధరా' పదంతోనే సినారె గారు పాటను ప్రారంభించారు. మూలంలోని భావం చెడకుండా,ఇది అనువాదగీతం అని అనిపించకుండా ఎంతో జాగ్రత్తతో వ్రాసిన పాట ఇది.

తన తప్పేదైనా ఉంటే చెప్పాలి కాని, ఇలా నాపై అలగడం ఎందుకని దీనంగా స్వామిని అడుగుతున్నది ఆ పరమభక్తురాలు. భగవంతుడిని నేరుగా దర్శించలేము. అయితే ఆయన్ను దర్శించాలనుకుంటే ఆయన భక్తుల పాదాలను సేవించాలిట. అప్పుడే ఆయన కరుణించి సాక్షాత్కరిస్తాడనే ధర్మసూక్ష్మాన్ని గ్రహించి మీరాబాయి భక్తుల పాదపద్మాలకు తన ఆత్మను అంకితం చేశానని విన్నవించుకున్నది. ఇది ఒక విశిష్టమైన భక్తి మార్గం.

పన్నిద్దరు ఆళ్వారులలో ప్రసిద్ధుడైన కులశేఖరుడు సరిగా ఇలాంటి మార్గాన్నే అనుసరించి మార్గదర్శకుడైనాడు. భక్తుల పాదధూళిని తాను మోస్తూ స్వామిని చేరుకోవాలని ఆయన సంకల్పించాడు. తానెంతటి మహారాజైనా ప్రతిరోజు మహాభక్తుల పాదాలకు అభిషేకం చేసి ఆ తీర్థాన్ని నెత్తిన జల్లుకునేవాడు.

**"అనిశము నిలిచే సుభక్త పాదధూళి సోకునట్టి**
**నీ కొండకు దారితీయు మెట్ల దారియైన అగుదు"**

అంటారాయన. తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆయన పేరుమీద 'కులశేఖరప్పడి' అనే గడపమెట్టు ఏర్పాటు చేయబడింది. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులందరి తొక్కిడి తనకు కావాలన్న కులశేఖరుని సంకల్పాన్ని అది రుజువు చేస్తున్నది.

పల్లవిలోనూ, మొదటి చరణంలోనూ కవి యతి నియమాన్ని చక్కగా పాటించారు. రెండవ చరణంలో మొదటి రెండు పాదాలలో ఏ పాదానికాపాదంలో యతిని అనుసరించారు. 3,4 పాదాలలో ప్రాసయతిని తీసుకున్నారు. "కినుక, నెలవు, చేరదీయు" వంటి తెలుగు పదాల సొంపును చక్కగా ఉపయోగించుకున్నారు. సి.నారాయణరెడ్డి గారు పరిచయమక్కరలేని జగమెరిగిన సాహిత్యస్వరూపులు.

లలితగీతాలకు రాగం మీద కాని, ఆ రాగలక్షణం మీద కాని అంతగా పట్టింపు ఉండదు. ఏ భాగాన్ని ఏ రాగంలోనైనా పొదగవచ్చు. శ్రావ్యత ప్రధానంగా చూస్తారు కనుక శాస్త్రాన్ని దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉండదు. సరిగా ఇదే లక్షణం సినిమా పాటలకు కూడా వర్తిస్తుంది. ఈ పాటకు బాణీ కూర్చిన పెండ్యాల గారు సినిమారంగంలో లబ్ధప్రతిష్ఠులు.

ఈ పాట ఎత్తుగడ, సంచారసారాంశాన్ని పరిశీలిస్తే 'అసావేరి' రాగపు పోకడలు కనిపిస్తాయి. చరణాల్లోని

అన్యస్వరగమకాలను గమనిస్తే 'పీలూ' రాగం స్ఫురిస్తుంది. కవిగారు అనువదించిన ఆరు పాటలను పెండ్యాలగారే స్వరపరచి బాలసరస్వతి, వేదవతీ ప్రభాకరరావు మొదలైన ప్రముఖ గాయనీమణుల చేత పాడించారు.

వేదవతీ ప్రభాకరరావు గారు ప్రసిద్ధులైన లలిత, శాస్త్రీయ గాయని. వేదికలమీద, ఆకాశవాణిలోనూ ఎన్నో కచ్చేరీలు ఇచ్చారు. వీరు 2013లో తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారాన్ని, మరెన్నో పురస్కారాలను స్వీకరించారు. పాలగుమ్మి విశ్వనాథం, చిత్తరంజన్ మొదలైన ప్రముఖుల స్వరకల్పనలో ఎన్నో పాటలు పాడారు. కొన్ని చిత్రాలో కూడా పాటలు పాడి శ్రోతలను మెప్పించారు.

ప్రారంభంలో సితార్, వేణువులతో అసావేరి రాగంలో నాలుగు ఆవర్తాల బిట్టును వినిపించి ఆధారషడ్జమం దగ్గర వదిలేయగా పల్లవిని సాభిప్రాయంగా గాంధారం నుండి గమకంతో ప్రారంభించారు. అనుపల్లవిలోని 'ఏదైనా తప్పైనా' పదాలను వేదవతిగారు చక్కని గమకంతో రెండు సార్లు ఆలపించారు.

మొదటి చరణానికి ముందు మూడు ఆవర్తాల బిట్టును ఇచ్చి గమ్మత్తుగా అన్యస్వరమైన అంతరగాంధారంలో వదిలేశారు. అక్కడినుంచే 'నిఖిలసుగుణాలకు' అందుకుని పాడుతూ మొదటి రెండు పాదాలు రెండు సార్లు పాడాక వేణువుపై 'గమపదనీ' బిట్టును ఇచ్చారు. ఆ నిషాదం నుంచే 'జన్మజన్మలకు' ను తీసుకుని పాడారు. చరణంలో చివర ఉన్న 'కానా' ను తారషడ్జమంలో అనుసంధించి పాడుతూ అందమైన అవరోహణ గమకాన్ని ఇవ్వడం వల్ల పీలూరాగచ్ఛాయ తొంగిచూసింది.

రెండవ చరణానికి ముందు, మొదటి చరణం లాగానే మూడు ఆవర్తాల బిట్టును ఇచ్చి వేణువుతో అంతర గాంధారాన్ని సూచించగా 'భక్తజనావళి' ని ప్రారంభించారు. మొదటి పాదాన్ని మాత్రమే రెండు సార్లు పాడాక మిగతా పాటను చకచకా రిపిటీషన్స్ లేకుండా పాడారు. "నన్ను దాసిగా,చేరదీయగా చరితార్థనైతి" అని పాడుతున్న విధానంలో పీలూ రాగచ్ఛాయ కొంత కనిపిస్తూ ఉండగా చరణాన్ని ముగించి పల్లవిని అందుకున్నారు.

పాట చివరలో 'ఏలరా' కాగానే సితార్‌పై 'గామపా' అని వినిపించారు. అప్పుడు 'గిరిధరా ఏలరా' ను పంచమం నుండి ఒకసారి, నిషాదం నుండి మరోసారి గమకంతో పాడి, మూడోసారి మళ్ళీ పంచమంలోనే పాడి సితార్ బిట్లను నిషాదంలో వదిలేయగా, నాలుగోసారి నిషాదం నుండి గమకాన్ని మారుస్తూ పాడారు. తరువాత పల్లవిని ఒకసారి పాడి 'గిరిధరా ఏల' అంటూ ముక్తాయి పూర్వకంగా మూడు సార్లు పాడి పాటను ముగించారు.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
*(జాతీయ పురస్కార గ్రహీత)*
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

---

## రోగ భ్రమగ్రస్థులు, రోగ భ్రాంతి - అనారోగ్య భ్రమ

**స్మృతి ఫలకాలు : కొన్ని రాతలు**

- *నేను చెప్పాను కదా! నాకు బాగోలేదని*
- *ఒట్టు. మళ్లీ రాను.*
- *తెలీదు ఎక్కడకు పోతున్నానో?*
- *సెలవు, మళ్లీ కలవను.*
- *మిత్రులారా! నా నుంచి మీకు ఫోన్ రాదు.*
- *మనుషుల్ని ఎలాగైనా చంపవచ్చు.*
- *మర్యాదలతో మట్టుపెట్టవచ్చు.*
- *మంచి భోజనంతో మంచమెక్కించవచ్చు.*
- *తర్కంతో తన్నేయవచ్చు.*
- *ముద్దులతో మట్టుపెట్టవచ్చు.*
- *కత్తితో కడతేర్చవచ్చు.*
- *దయగలవాడు కత్తితో చంపుతాడు.*
- *దుర్మార్గుడు దుర్భాషలతో చంపుతాడు.*

*- ఎ.కె.*

# జీవనమకరందం

1. విశ్వాసం నీకు కనపడని శక్తిమీద నమ్మకం.
   నీవు నమ్మినదానిని చూడగలగటం దానికి బహుమతి.
2. ఏకాంతానికి మించిన తోడు ఉండదు–
   నీ లోగొంతును వినటం అలవాటు చేసుకో – నీవు ఎక్కడైనా ప్రశాంతంగా ఉండగలవు.



3. స్థల, కాలాలకు అతీతంగా పరిణామానికి లోనుకానిదే సనాతన ధర్మం.
4. నిత్య పరిణామం ప్రకృతి ధర్మం.
   మరణం కూడా ఈ పరిణామంలో భాగమే.
5. సానుభూతి మాటలు (ఓదార్పు) ప్రేమదృక్కులు, అభిమానపు చిరునవ్వు
   ఇవన్నీ ధనానికంటే మిన్న.
6. శరీరానికి ఆహారం – ఆత్మకు ప్రార్థన.
7. ప్రేమ రక్షిస్తుంది – కామం కాటేస్తుంది.
8. నిత్యజీవితంలో సంతోషాలన్నింటికీ నువ్వు ఇష్టపడే వస్తువులే కారణం.
9. నీకిష్టంలేని పనిచేయకపోవడమే స్వేచ్ఛ.
10. హృదయంలో ఆర్ద్రత లేనివాడు నిజంగా దరిద్రుడు.
11. ఆటంకాలే జీవితాన్ని నడుపుతాయి.
12. జీవితం – ఆమరణ క్రమశిక్షణ.
13. నిర్వ్యాపకం నిర్వాణాన్ని ఇవ్వదు. సన్యాసం పరిణామ మార్గం కాదు.
14. లక్ష్య సాధన కోసం చైతన్యంతో శ్రమించాలి. అలక్ష్యం నీ శక్తిని హరిస్తుంది.
15. ప్రేమలేని తత్త్వమేమిటి? ప్రేమరహిత తాత్త్వికత మూఢనమ్మకమే.
16. శరీరం సుఖాలకోసమే అయితే, దుఃఖం దానికి మూలం. (దాని పరిణామం).
17. నిన్ను నువ్వు తెలుసుకోవాలంటే అలౌకితత్వాన్ని ఆశ్రయించాలి.
18. సంస్కృతి జాతికి ఓర్పు, ఓదార్పు నేర్పాలి. వారి కర్మలలో ధర్మాన్ని నిలపాలి.
    వారి కష్టసుఖాలలో, సుఖదుఃఖాలలో అండగా నిలవాలి.




**– ఆచార్య పి.ఆర్. హరినాథ్**

**'ఏ**వండీ బాగున్నారా' అని దారిలో ఎదురైన వారిని మనం అడిగాం అనుకోండి. అది ఒక ఆప్యాయమైన పలకరింపు. అందులో తప్పేమీ లేదు. పొరపాటు కూడా లేదు. కానీఎదురైన ఆ పెద్దమనిషి 'ఏం బాగుండకూడదా? ఇట్లాగే పోవాలా? మీరే బాగుండాలా? ఇంకెవరు బాగుండకూడదా?' అని విరుచుకుపడతాడు. మనం నిరుత్తరులమైపోతాము. మరో రెండు రోజుల తర్వాత అదే దారిలో మనం నడుస్తూ ఉంటాం. అదే మనిషి మనకు ఎదురుగా వస్తూ ఉంటాడు. మనం గత అనుభవాన్ని గుర్తుకు పెట్టుకుని– ఎందుకొచ్చినగొడవలే–అని మౌనంగా నడుస్తూ వెళతాము. ఆయన మనల్ని తట్టి పిలిచి 'ఇంతపెద్ద మనిషి ఎదురుగా నడుస్తుంటే మాట కూడా లేదే? ఒక్క పలకరింపు కూడా లేదే? బాగున్నారా అని ఒక మాట అంటే మీ సొమ్మేమైనాపోతుందా? మీ ఆస్తినిఏమన్నా రాయించుకుంటున్నానా?' అని మండి పడతాడు. మనం అయోమయంలో పడిపోతాము. పలకరిస్తే ఒక తప్పు, పలకరించకపోతే మరో తప్పు అయిపోయింది–ఏం చేయాలి అని దిక్కులు చూస్తాము.

ఇది మన కాలానికి మాత్రమే సంబంధించిన విషయం కాదు మనిషి స్వభావం లోనే ఈ విచిత్రమైన అంశం ఉంది. దీని గురించి భర్తృహరి అంటున్నాడు.

**జాడ్యం హ్రీమతి గణ్యతే వ్రతశుచౌ దంభః శుచౌ కైతవం**
**శూరే నిర్ఘృణతా మునే ర్విమతితా దైన్యం ప్రియాలాపినీ**
**తేజస్విన్యవలిప్తతా ముఖరతా వక్తవ్య శక్తిస్థిరే**
**తత్కోనామ గుణోభవేత్సగుణినాం యో దుర్జనైర్నాంకితః**

హ్రీ అంటే సిగ్గు. సిగ్గుపడడం ఒక నాగరికత. ఏదైనా పని చేసేటప్పుడు,మాటలాడేటప్పుడు–ఇది మర్యాదకరంగా ఉందా లేదా అని ఆలోచించాలి. పెద్దలతో వ్యవహరించేటప్పుడు వినయం ఉండాలి. జ్ఞానుల పట్ల గౌరవంఉండాలి .పరుష భాషణం కాకుండా సహనంగా వినాలి. న్యాయం పట్ల ఆదరణ ఉండాలి. నిజాయితీ పట్ల నిబద్ధత ఉండాలి .ఇవన్నీ ఉంటే మనిషికి పరువు. లేకుంటే లోకానికి బరువు. సిగ్గులేని మనిషి అని జనం ఈసడించుకుంటారు. ఇక్కడ హ్రీ అనే మాటలో ఇంత దాగి ఉంది. అలాంటి అందమైన సిగ్గు ఉండే సుజనుని చూసి– వీడు జడుడు వీడికి చురుకుదనం లేదు, అన్నిటికీ వెనకాడతాడు–అని దుర్జనుడు గణిస్తాడు అలాగే వ్రతాల చేత శుచిగాఉన్న వారిని తప్పు పడతాడు. వ్రతం అంటే నిష్ఠ. ఒక నియమముతో ఉండడం. ఒకరు చూసినా చూడకపోయినా ఒకరికి తెలిసిన తెలియక పోయినా పాటించడం. ఇది వ్రతం. అదొక దీక్ష. కొందరికి మితభాషణం వ్రతం. ఎంత మాట్లాడాలో అంతే మాట్లాడుతారు. అనవసరంగా ఇతరుల గురించి అవాకులు చవాకులు మాట్లాడరు. తెలిసీతెలియని వ్యాఖ్యానాలు చేయరు. ఇది ఒక వ్రతం.

మరికొందరు మిత భుక్కులుగా ఉంటారు. మితంగా తింటారు. కనిపించిన తిండినల్లా తినరు. కడుపును చెత్తకుండీలా మార్చి ఏది పడితే అది ఎప్పుడు పడితే అప్పుడు తినరు. వారు ఒక నియమం పెట్టుకుంటారు. ఇలా ఒక్కొక్కరికి ఒక్కో నియమం ఉండవచ్చు. వారు దాని ప్రకారం జీవించవచ్చు. దానిని వ్రతం అంటాం. అలాంటి వ్రతనిష్ఠులు ఎవరైనా ఉంటే–'అదంతా నటనండి నియమము లేదు నిష్ఠ లేదు, మనం అలా వెళ్ళగానే ఇలా మారిపోతాడు ఇదో నాటకం'–అని దుర్మార్గులు అంటారు. శుభ్రంగా ఉంటే 'ఇదంతా పైపై వ్యవహారం' అంటారు, దుష్టులు. ఒక శూరుడుంటే అతనిని 'కఠినుడు' అంటారు. మహా ప్రతాపం చూపి ఏదైనా ఒక క్రూర జంతువును సంహరిస్తే ఆ గెలుపును మెచ్చక 'దయలేని మనిషి' అంటారు. మౌనంగా ఎవరితో మాట్లాడక ధ్యానంలో ఉంటే 'బుద్ధి లేనివాడు' అంటారు. ఆత్మలోకంలో సంచరిస్తూ మహాదార్శనికులుగా నిలిచిపోయిన మహాత్ములను 'పిచ్చివాళ్లు' అంటారు. ఇదంతా దుర్జనుని దృష్టి. ప్రేమతో కరుణతో మాట్లాడితే 'పిరికితనం' అంటారు.

అవతలివాడి పట్ల దయ కలిగి, జాలిగా సానుభూతితో, ఆప్యాయంతో ఉండడం కరుణా మయుల లక్షణం. కానీ దుర్మార్గుల నేత్రాలకు ఇదొక చేతకానితనం, చేవలేని తనం. తేజస్సుతో ఉంటే 'గర్వము' అంటారు. విద్యతో వెలిగిపోయే వాళ్ళు ఉంటారు. అది వారి విద్వత్తు.బుద్ధితో మెరిసిపోయే వాళ్ళు ఉంటారు. అది వారి ధీరత. పరాక్రమంతోపరిఢవించే వాళ్ళు ఉంటారు. అది వారి శూరత.

మనిషిలోని ఉన్నత లక్షణం ఎన్నో రకాలుగా తేజో వలయాలను సృష్టిస్తుంది. వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది. ఆత్మ బలాన్ని ఇస్తుంది. నీచులకు ఇదంతా గర్వము అనిపిస్తుంది, అహంకారము అనిపిస్తుంది. దానిలోని ఆంతర్యాన్ని అసలు శక్తిని గుర్తించే సంస్కారం వారికి ఉండదు కాబట్టి. అలాగే ఇంకొందరు ప్రతిభామూర్తులు ఉంటారు. చతురంగా మాట్లాడగలిగిన వాళ్ళు ఉంటారు. తెలివైన సంభాషణతో సభారంజనం చేయగలిగిన వక్తలు ఉంటారు. వ్యవహారాలను నడప గలిగిన వ్యవహారజ్ఞులు ఉంటారు. సందర్భాన్నిబట్టి సజావుగా విజ్ఞతతో తెలివితో మాట్లాడి పరిష్కరించగలిగిన వాళ్ళు ఉంటారు. అలాంటి వాళ్ళను చూసి వట్టి 'వదరుబోతులు' అని ముద్ర వేస్తారు మూర్ఖులు.

మా ఇంటికి ఎదురుగా ఒక వ్యక్తి ఉండే వాడు. చాలా మౌనంగా తన పని ఏదో తాను చేసుకుంటూ ఉండేవాడు. ఆయనకు ఒక ఖరీదైన కారుకూడా ఉండేది. ఎప్పుడోగానీ కారు బయటకు తీసేవాడు కాదు. ఎక్కువగా నడుస్తూనే ఉండేవాడు. మా పక్కింట్లో ఉండే వ్యక్తికి ఆయనకు స్నేహముండేది. 'ఆయనను చూడండి. ఎంత నిరాడంబరుడో. పెద్ద కారు ఉన్నా కూడా నడుస్తూనే వెళ్తాడు. కనీసం రిక్షా కూడ ఎక్కి వెళ్ళడు. ఎంత నిరాడంబరత.' అని పక్కింట్లో ఉండే వ్యక్తి మెచ్చుకునేవాడు. కొద్దికాలానికి ఎదో విషయమై వ్యవహారం చెడింది. అప్పుడు వ్యాఖ్యానం మారింది.' ఎంత పిసినారి చూడండి. కొల్లబోయినంత డబ్బుంది. ఇంట్లో కారుంది. హాయిగా కారులో వెళ్ళవచ్చుగదా. ఊహూ. వెళ్ళడు. కనీసం రిక్షా ఎక్కి పోవచ్చు గదా. ఊహూ. వెళ్ళడు. నడుస్తూనే వెళ్తాడు. పైసా ఖర్చు చేయాలంటే గిలగిల లాడుతాడు. ఛీ ఛీ ఏమి మనిషో ఏమో.' తీరా నిజం కనుక్కున్నాక తెలిసింది ఏమిటంటే నడవడం అవసరమని ఎదురింటి ఆయనకు వైద్యులు చెప్పారు. చూసే దృష్టిని బట్టి మంచికి కూడా మసి పూయడం జరుగుతుంది. కవి చెప్పినది ఈ లోకం తీరు గురించే కదా. ఇలాగా ఏ గుణం కనిపించినా కూడా దానిని అవగుణంగా పరిగణిస్తూ రంగులు పులిమి దానిని ఒక బలహీనతగా, పరిత్యాజ్యమైన గుణంగా వ్యాఖ్యానం చేస్తారు.. 'దుర్జనుడైన వాడు దూషించరానిది ఏముంది వాడికి అన్నీ తప్పులే'. దీనిని అందమైన తెలుగులో బంధించి మనకు అందించారు ఏనుగు లక్ష్మణ కవి:

**హ్రీరమ్యున్ జడుగాగ సువ్రతునిమాయింగా శుచిన్ దంభిగా**
**శూరున్ నిర్దయుగా మునిన్ విమతిగా శ్రోత్రప్రియాలాపు ని**
**స్సారుంగా బలవంతు గర్వితునిగా సద్వక్త వాచాలుగా**
**గ్రూరుండెన్నిసుధీ గుణంబు దురితారూఢంబుజేయుంగదా**


తెలుగు శతక కర్త రచన మరింత సొగసులీనింది. కవి పద్యాన్ని ఆరంభించడమే హ్రీ రమ్యుడు అన్నాడు. సంస్కృత శ్లోకంలో హ్రీమతి అని మాత్రమే ఉంది. దానికి రమ్యతాగుణాన్ని ఆపాదించి మరింత శోభాయమానం చేశాడు తెలుగు కవి.

ఆచార్య పి. ఆర్.. హరినాథ్,
మైసూర్, ఫోన్ : 9480443108

## నిర్వచనం

ప్రకృతిని – సౌందర్యాన్ని పక్కనబెట్టి, కళకు అర్థం మార్చివేస్తే అదే నిరాకార కళ (Abstract Art)
పికాసో నేను ప్రపంచాన్ని ఫూల్ చేశానన్నాడు – కాని ఆధునిక చిత్రకళ పేరుతో తనని తానే మోసం చేసుకున్నాడు – ఆయన వేసిన చిత్రాలు – భయంకర చిత్రకళా రాజాలు !
సినిమా తారలు – దేవతలుగా వెలుగొందే సమాజంలో – దేవతలు చవకబారు శృంగార గీతాలు పాడే గుంపులుగా కనపడుతున్నారు.

*- నార్ల వెంకటేశ్వర రావు*



# తత్త్వమసి రామకృష్ణ



– **మిసిమి**

ప్రొఫెసర్ జి. రామకృష్ణ

*ప్రొఫెసర్ జి.రామకృష్ణ సంస్కృతాంగ్లాలు బోధించిన ఆచార్యులు. వేదాలను, ఉపనిషత్తులు క్షుణ్ణంగా అధ్యయనం చేసిన పండితులు. ఛాందసవాదానికి దూరంగా, హేతువాదానికి దగ్గరగా ఉంటాయి ఆయన ఆలోచనలు. పిడివాదంపై పిడికిలి బిగిస్తారు. ఉపనిషత్తుల్లోను కొంత రేషనాలిటీ ఉందని ఆధారాలతో చూపుతారు. శంకరాచార్య నుంచి, జిడ్డు కృష్ణమూర్తి వరకు అందరి భారతీయ తత్త్వవేత్తలపై ప్రశ్నలు సంధిస్తారు. నిర్మొహమాటంగా వ్యాఖ్యానిస్తారు. **మిసిమి** బృందం బెంగుళూరు వెళ్ళినప్పుడు వారి గురించి తెలుసుకొని వారితో కొంత సమయం గడిపింది.*

*ప్రొఫెసర్ రామకృష్ణ ఋగ్వేదంపై కన్నడంలో వెలువరించిన పుస్తకం తెలుగు పాఠకలోకాన్ని వివిన మూర్తి గారి అనువాదమై చేరుకుంది. ఎనభయ్యవపడిలో ఉన్న ఈ తేజస్వితో **మిసిమి** సంపాదకులు అశ్వినీకుమార్ ఎటువంటి దాపరికాలు లేకుండా ఆంగ్లంలో జరిపిన సంభాషణ నుంచి కొన్ని భాగాలు **మిసిమి** పాఠకుల కోసం ప్రత్యేకంగా తెలుగులో అందిస్తున్నాం.*

*- ఎ.కె.*

***మిసిమి* :** **ప్రొఫెసర్ రామకృష్ణ గారు *మిసిమి* కి స్వాగతం.. మీరు సంస్కృతం స్కాలర్‌గా ఉపనిషత్తులు అనువాదం చేశారు కన్నడంలోకి. అలాగే తత్త్వశాస్త్రం మీద ఎంతో అవగాహన ఉన్నవారు. మీరు చేసిన కన్నడ ఉపనిషత్తు తెనిగించారు వివినమూర్తి. మీ కృషి తెలుసుకునేముందు మీ చదువు, ఆ నేపథ్యం చెప్పండి!**

**ప్రొ. రామకృష్ణ :** ధన్యవాదాలు అశ్వినీ కుమార్ గారు. నేను బి.ఏ.ఆనర్స్ 1958లో పూర్తి చేశాను. ఎమ్మే సంస్కృతం 59లో చదివాను. 1962లో హైదరాబాద్ వచ్చి కొన్ని నెలలున్నాను. రీసెర్చ్ ప్రయత్నాలు చేశాను. నా ఫెలోషిప్ పూర్తవటంతో ఉద్యోగం కోసం వెతకాల్సి వచ్చింది

***మిసిమి* :** **మీలాగే ఆంగ్ల రచయిత రాజారావు కూడా హైదరాబాద్‌లో ఉద్యోగం నిమిత్తం వచ్చాడు..గుర్తుందా మీకు?**

**ప్రొ. రామకృష్ణ :** హహహ..... బాగా గుర్తుంది..

***మిసిమి* :** **ఆయనకు ఫెలోషిప్ వచ్చి ఫ్రాన్స్ వెళ్లిపోయాడు. మీకూ వస్తే అలా వెళ్ళిపోయేవారేమో..**

**ప్రొ. రామకృష్ణ :** నాకా కోరిక లేదు (నవ్వు)..హైదరాబాద్ నుంచి నేను పూనే సమీపంలోని లోనావాలాకు వెళ్ళాను. అక్కడ కైవల్యధాం అనే విద్యా సంస్థలో రీసెర్చ్ స్కాలర్‌గా చేరేందుకు వెళ్ళాను. అక్కడ చాలా పుస్తకాలు సంస్కృతంలో ఉండటంతో, వాటి సమాచారం సేకరించి, అనువదించి ఇవ్వటం నాపని.

అక్కడ మూడేళ్లు ఉన్నాను. ఆ సమయంలోనే పూనా యూనివర్సిటీ నుంచి ఎమ్.ఏ.ఇంగ్లీష్ చేశాను. అది పూర్తవగానే అంబేద్కర్ కాలేజీ, మహద్‌లో ఇంగ్లీష్ లెక్చరర్‌గా చేరాను. అదే సమయంలో బ్రిటిష్ కౌన్సిల్ వారి స్కాలర్ షిప్ లభించింది, వేల్స్‌లో చదవటానికి. అక్కడ సంవత్సరం చదివి నా కోర్సు పూర్తి చేసి బెంగుళూరు తిరిగొచ్చేశాను. ఇక్కడే నేషనల్ కాలేజీలో ఇరవై ఆరేళ్ళపాటు పనిచేశాను.

**మిసిమి :** **మీరు హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ కాలేదా?**

**ప్రొ. రామకృష్ణ :** కాలేదు.. నాకు పి.హెచ్.డి. లేకపోవటం కారణం. అయినా నాకు చింతలేదు.. నేను ఇతర యాక్టివిటీస్‌లో బిజీగా ఉండటం ఒక కారణం. నేను బెంగుళూరు యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్‌కు సెక్రటరీగా ఉండేవాడిని. ఇంకో ఫెడరేషన్ బాడీ ఉండేది. అది ఆలిండియా స్థాయి. దానికి ప్రెసిడెంట్‌ని. ఇలా అనేక వ్యాపకాలు ఉండేవి. దీనివలన లెక్చరర్లతో చాలా పరిచయాలు ఉండేవి. ఆంధ్రా నుంచి కూడా చాలామందితో పరిచయం ఉండేది.

**మిసిమి :** **ఎప్పుడైనా ఆంధ్రా వచ్చేవారా?**

**ప్రొ. రామకృష్ణ :** చాలాసార్లు వచ్చాను. కర్నూల్, హైదరాబాద్, విజయవాడ, మదనపల్లి, వైజాగ్ ఈ ప్లేసెస్‌కు వెళ్ళాను. విశాఖపట్నంలోనే నా ఋగ్వేద తెలుగు అనువాదం ఆవిష్కరణ జరిగింది. వివిన మూర్తి కూడా వచ్చాడు.

**మిసిమి :** **ఋగ్వేద పుస్తకం కాకుండా మీ ఇతర రచనలు చెప్పండి**

**ప్రొ. రామకృష్ణ :** నేను భారతీయ తత్త్వశాస్త్రం మీద చాలా పుస్తకాలు రాశాను. అలాగే భగవద్గీత మీద రాశాను.

**మిసిమి :** **మీ ఉద్దేశ్యంలో భారతీయ తత్త్వచింతన అంటే ఏమిటి? రాధాకృష్ణన్ గురించి రాశారా, ఇంకెవరి గురించి అయినా రాశారా?**

**ప్రొ. రామకృష్ణ :** లేదు, లేదు.. నేను ఎంచుకున్నది భారతీయ తత్త్వవేత్తలయిన శంకరాచార్య, రామానుజాచార్య, చార్వాక వంటి వారి వర్క్స్ ఎంచుకోవటం జరిగింది. నాకు రాధాకృష్ణన్ గురించి, దాస్ గుప్తా గురించి బాగా చదివాను. తెలుసును.

**మిసిమి :** **ప్రొఫెసర్ కొత్త సచ్చిదానంద మూర్తి గురించి విన్నారా. ఆయన కూడా గొప్ప తత్త్వవేత్త.**

**ప్రొ. రామకృష్ణ :** ఆయన పరిచయమే.. నాగార్జున యూనివర్సిటీలో ఉండేవారు. అక్కడే ప్రొ.అంజయ్య అని ఫిలాసఫీ ప్రొఫెసర్ ఉండేవారు. ఆయన పిలిస్తే చాలాసార్లు అక్కడికి వెళ్ళాను కూడా. కొన్ని ప్రసంగాలు చేశాను.

**మిసిమి :** **మీరు చేసిన ఒక ప్రసంగం గురించి చెప్పాలంటే?**

**ప్రొ. రామకృష్ణ :** ఒకసారి దేవి ప్రసాద్ చటోపాధ్యాయ్ స్మారక ఉపన్యాసం ఇచ్చాను. దేవీప్రసాద్ ఒక తత్త్వవేత్త. కలకత్తాలో ఉండేవాడు. భారతీయ తత్త్వశాస్త్రం మీద, ప్రపంచ తత్త్వశాస్త్రం మీద అనేక పుస్తకాలు వెలువరించాడు.

**మిసిమి :** **మీరు భారతీయ తత్త్వశాస్త్రం అని అంటున్నారు కదా! అసలు భారతీయ తత్త్వశాస్త్రం అంటే ఏమిటి?**

**ప్రొ. రామకృష్ణ :** భారతీయ తత్త్వశాస్త్రం శతాబ్దాల నుంచి, అనేక మంది ఆలోచనా ధారతో వెలుగొందుతోంది. ఉపనిషత్తులు వెలుగులోకి వచ్చినప్పటినుంచి కొంత తాత్విక ఆలోచనలు బయల్దేరాయి మనుషుల మస్తిష్కాల్లో.

**మిసిమి :** **అంటే ఉపనిషత్తులు ఆరంభ సూచికలయ్యాయా తాత్త్విక విచార ధారకు ?**

**ప్రొ. రామకృష్ణ :** లేదు.. మనిషి పుట్టుకతోనే తాత్వికత చోటు చేసుకుంది. మనిషి తనతో తాను ఎలా ఉన్నాడు, తన చుట్టూ ఉన్న ప్రపంచంతో ఎలా ఉన్నాడు, సాటి మనిషితో ఎలా ఉన్నాడు, ఇవన్నీ అతని తాత్త్వికతను వెల్లడిస్తాయి. అయితే ఇవన్నీ తొలి రోజుల్లో రికార్డు కాలేదు. అంతే.

**మిసిమి :** **భారతీయ తత్త్వశాస్త్రం అతి పురాతనమైనది అంటే ఒప్పుకుంటారా?**

ప్రొ. రామకృష్ణ : అలా అని చెప్పలేం. మనిషి ఈ ప్రపంచమంతా విస్తరించి ఉన్నాడు కదా. అలా తాత్త్వికత అనేది అనేక ప్రదేశాల్లో పురుడు పోసుకుంది. గ్రీస్, జర్మన్, ఫ్రెంచ్.. ఇలా ఎన్నో చోట్ల.. పురాతన గ్రీక్ ఫిలాసఫర్ సోక్రటీస్ గుర్తున్నాడా? ఆ తర్వాత ప్లేటో వచ్చాడు, తదనంతరం ప్లేటో.. అలా ఎంతోమంది ఉన్నారు కదా..

**మిసిమి :** **మీరన్నది నిజమే.. టైం లైన్ అంటూ ఒకటుంటుంది కదా?**

ప్రొ. రామకృష్ణ : టైం లైన్ అంటే ఒకటి చెప్పాలి. సోక్రటీస్ కన్నా ముందు కూడా పురాతన గ్రీసు దేశంలో తత్త్వశాస్త్రం ఉండే ఉంటుంది. మనకు తెలియదు, అంతే. దాంతోటి వారి పేర్లు కూడా రికార్డు కాలేదు. అదేకాదు, అప్పటి వారిలో కూడా ఈ ప్రపంచం ఇలా ఎందుకు ఉంది, నేనెవరు.. ఇలాంటి ప్రశ్నలు వారి మనసుల్లో తొంగి చూసే ఉంటాయి. ఆల్డస్ హక్స్లే ఒక పుస్తకం రాశాడు. దానిపేరు Perennial Philosophy.. ఈ పుస్తకం రాయటం కోసం ప్రపంచమంతా శతాబ్దాలుగా జరుగుతున్న మార్పులను జల్లెడ పట్టి రాశాడతను. మనకు పునర్జన్మ అన్న కాన్సెప్ట్ ఉంది.. అందరికీ ఇలాంటి ఆలోచన ఇదేవిధంగా ఉండకపోయినా, కొంత కలవొచ్చు. పైథాగరస్, ఇంచుమించుగా ఇలాంటి మాటే వాడతాడు. మరణం తర్వాత జీవితముందని నమ్మాడు.

ఋగ్వేదం కూడా చుట్టూ ఉన్న ప్రకృతిని చూసి పులకించి పోతుంది. అనేక ప్రశ్నలు లేవనెత్తుతుంది. మిలమిలమనే ఈ నక్షత్రాలు ఉదయాన్నే ఎలా అదృశ్యమవుతున్నాయి. ఇలాంటి ప్రశ్నలు ఆశ్చర్యంతో వేస్తుంది. ఇలా ఇవన్నీ ప్రతిరోజూ, వారానికి, నెలకు జరగటంతో వాటి కదలికను అర్థం చేసుకునేవారు. ఇప్పటిలా ఖగోళ శాస్త్రం అప్పట్లో లేదుకదా. తత్త్వశాస్త్రం అంటే తనని తాను తెలుసుకుంటూ, ప్రకృతిని అర్థం చేసుకోవడమే కదా. ఈ రహస్యాలను ఎంతో కొంత వివరించేవారిని గొప్ప పండితుడిగా భావించేవారు.

**మిసిమి :** **ఇంతకీ ఫిలాసఫీ అంటే ఏమిటి..?**

ప్రొ. రామకృష్ణ : తను ఈ జగతిలో ఒక భాగమే అన్న భావనతో ఉంటూ ఒక జిజ్ఞాసువులా ప్రవర్తించటమే. ఇది ప్రపంచమంతటా వెల్లి విరిసింది. మన భారతదేశం ఒక్కచోటే దీనికి మూలం అని చెప్పటానికి లేదు. ఈ జిజ్ఞాసే మరణం గురించిన అధ్యయనం చేసింది. ఆత్మ అనేది ఉన్నదంది. మరికొంతమంది ఆత్మ బూటకం అన్నారు. ఇక్కడే మనిషికి, ప్రకృతికి ఉండే బంధాన్ని అనేక కోణాల్లో విశ్లేషించాయి వేదాలు.

**మిసిమి :** **మీరు తత్త్వశాస్త్రం అర్థం చెప్పారు.. మూలాల్లోకి వెళ్లారు.. మీరు క్లాస్ రూంలో పాఠాలు చెప్పారా, ఈ అంశంపై ?**

ప్రొ. రామకృష్ణ : క్లాస్ రూంలో నేను తత్త్వశాస్త్రంపై బోధించలేదు. తరగతిగది బయటే చెప్పాను. నేను బోధించింది ఇంగ్లీష్, సంస్కృతం.

**మిసిమి :** **సంస్కృతంలో ఏం చెప్పేవారు?**

ప్రొ. రామకృష్ణ : కాళిదాసు, భవభూతి, బాణుడు వంటి వారి రచనలతో బాటు, సంస్కృతం చరిత్ర గురించి చెప్పేవాడిని. క్లాసురూం బయట వేదాలు, ఉపనిషత్తులు బోధించేవాడిని. నేనూ తరగతి గది బయటే నేర్చుకున్నాను. అలాగే తరగతి బయటే వారికి వాటిగురించి వివరించే వాడిని.

**మిసిమి :** **మన తత్త్వవేత్తలు రాధాకృష్ణన్, సచ్చిదానంద మూర్తి, దాస్ గుప్తా వీరు కొత్తగా ప్రతిపాదించిన సిద్ధాంతాలున్నాయా! ఉన్నవాటిని వివరించారు అంతేకదా!**

ప్రొ. రామకృష్ణ : మీరన్నది అర్ధ సత్యం. వారు భారతీయ తత్త్వశాస్త్రం గొప్పది అని తమకు నచ్చిన విధంగా విశ్లేషణ చేసి ఫలానా ఫిలాసఫీయే నిజమైనది లేదా బలమైన తాత్వికపునాది కలిగుంది అని చెప్పే ప్రయత్నం

చేశారు వారు. రాధాకృష్ణన్ అద్వైతమే అసలు సిసలు జ్ఞానం అనేవాడు. అదెలా సాధ్యం. నాదృష్టిలో లోకాయత గొప్ప జ్ఞాని. గొప్ప ఫిలాసఫర్. ఈదేశంలో అనేకమంది జిజ్ఞాసువులున్నారు. వారు ప్రతిపాదించిన సిద్ధాంతాలున్నాయి. కాబట్టి ఇదే అత్యుత్తమం అన్న ఉచ్చులో పడొద్దంటాను.

**మిసిమి :** **శంకరాచార్యపై మీ అభిప్రాయం?**

**ప్రొ. రామకృష్ణ :** శంకరాచార్య ప్రతిపాదించిన సిద్ధాంతాలను నేను అధ్యయనం చేశాను. నా దృష్టిలో అతనొక సంప్రదాయ బ్రాహ్మణుడు. తనేమంటాడు.."యన్ మనురబ్రవి తత్ సత్యం" అంటాడు. అద్వైతం గురించి చెప్పటానికి “మను” ఏమన్నాడో చెప్పాలా ..మను చెప్పింది వాస్తవం కాదని మేమంటాం.

**మిసిమి :** **అది శంకరుని అభిప్రాయంగా భావించవచ్చు కదా..**

**ప్రొ. రామకృష్ణ :** సరే.. అది అతని అభిప్రాయం అని వదిలేద్దాం.అద్వైతంలో ఏమంటాడు ప్రపంచం ఒక మాయ అని కదా. దీనికి ఆధారంగా ఉపనిషత్ వాక్యాన్ని ఉదహరిస్తాడు. మరో ఉపనిషత్ నుంచి మరో వాక్యాన్ని ఎంచుకుని, తను చెప్పింది అవాస్తవం అని ఎవరైనా చెప్పవచ్చు. తత్త్వశాస్త్ర ప్రపంచంలో, ఒక ఏకీకృత ఆలోచనకు తావులేదు. భారతీయ తత్త్వశాస్త్రంలో న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ ఇలా అనేకం ఉన్నాయి. చూడండి .. ద్వైతం నుంచి అద్వైతం వస్తే దానినుంచి. విశిష్టాద్వైతం మరో శాఖగా తలెత్తింది. ప్రపంచాన్ని ఎవరికి వారు తమ దృక్కోణంతో అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. “న్యాయ” తత్త్వశాస్త్రం తర్కంతో ప్రపంచాన్ని పరికించింది.

**మిసిమి :** **ఈ విషయంలో బుద్ధుడు కొంచెం హేతుబద్ధంగా, తార్కికంగా ఉంటాడేమో కదా.. తను ప్రతిపాదించిన సిద్ధాంతాలు వేదాలు, ఉపనిషత్తుల ప్రపంచాన్ని దాటి కొత్తగా మనిషికి తోచేలా చేశాయి కదా..**

**ప్రొ. రామకృష్ణ :** బుద్ధుడు సంప్రదాయాన్ని అధిగమించి కొత్త ప్రపంచాన్ని మనకు చూపాడు. వర్ణాశ్రమ ధర్మాన్ని తిరస్కరించిన వాడు. మిగిలిన జ్ఞానులెవరూ ఆపని చేయలేకపోయారు. అతని శిష్యుడు ఆనందుడు ఒక ప్రశ్న వేస్తాడు.. మీరు వద్దన్నవన్నీ ధర్మశాస్త్రాల్లో ఉన్నాయి కదా అంటాడు.. బుద్ధుడు ఏమంటాడు.. అలాగా అయితే వాటిని తిరగ రాయాల్సిందే అంటాడు. మనకు మను ధర్మ శాస్త్రము ఒకటే కాదు, ఆపస్థంభ, యాజ్ఞవల్క్య, బహుధాయన, గౌతమ.. ఇలా అనేకమంది రాసినవి కూడా ఉన్నాయి. వీటిల్లో కొన్ని తేడాలున్నా, అన్నీ వర్ణాశ్రమ ధర్మం ఆధారంగానే సాగుతాయి. బుద్ధుడు ఈ నిచ్చెనమెట్ల వ్యవస్థను త్రోసిరాజన్నాడు.

**మిసిమి :** **బుద్ధుడు మొదటి హేతువాదిగా మనం భావించవచ్చా?**

**ప్రొ. రామకృష్ణ :** లేదు.. మనకు హేతువాద సిద్ధాంతం ఉపనిషత్తుల్లో కూడా ఉంది. ఋగ్వేదంలో కనిపించే “ఋత” అన్న విధానం శాస్త్రీయతను కలిగి ఉన్న హేతువు. ఋత, ప్రకృతిలోని అనేక అంశాలను వివరించే ప్రయత్నం చేస్తుంది.

**మిసిమి :** **బుద్ధుడు దేవుడున్నాడని నమ్మలేదు కదా.దైవం ఉనికిని ఒప్పుకోనట్టే కదా?**

**ప్రొ. రామకృష్ణ :** బుద్ధుడు ఎప్పుడూ దైవం గురించి ఆలోచించలేదు. అతని ఆలోచనలెప్పుడూ మనిషి చుట్టే తిరిగాయి. అతనికి మనిషే దైవం (నవ్వు). అతను మనిషికి మనిషే అవసరం.. దేవుడు కాదు అనుకున్నాడు. సమానత్వం ఉన్న ప్రపంచాన్ని కలగన్నాడు. ఆడ,మగ తేడా లేకుండా అందరొకటిగా ఉండాలని నమ్మాడు.

**మిసిమి :** **మరి సన్యాసం గురించి ఎందుకు చెప్పాడు?**

**ప్రొ. రామకృష్ణ :** అతను సన్యాసాన్ని ప్రబోధించలేదు. నీ గురించి, నీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తెలుసుకో అన్నాడు. మనిషికి చివరాఖరి కోరిక ఏమిటి.. సుఖంగా జీవించటమే కదా.. సుఖంగా ఉండాలంటే, దుఃఖాన్ని పారద్రోలమన్నాడు. నీలో దుఃఖం ఎందుకు చోటు చేసుకుంటుందో వెతకమన్నాడు. “ఏ ధమ్మా హేతు పభోవా”..ప్రతి దానికీ కార్య కారణ సంబంధం ఉంటుంది. కారణం లేకుండా ఏదీ

జరగదన్నాడు! . నీకు తెలియని దాన్ని సత్యమని అనుకుంటున్నావు.. అదికాదు. శోధించు.. పరిశోధించు అన్నాడు. అందుకే అన్నాడు..''ప్రతీత్య సముత్పాద్య''. ఆలోచించి ధ్యానంలోకి వెళ్లి సమస్యకో పరిష్కారం చూసే స్థితిని పొందమన్నాడు. ఆ కాలంలో సామాజిక చింతనను మనలో చొప్పించి, ఒక సమభావనను పెంపొందించి మనుషులంతా ఒక్కటే అని చాటినవాడు బుద్ధుడు.

*మిసిమి* : **ఈ కార్య కారణ సిద్ధాంతం మరే ఉపనిషత్తులోనైనా కానీ, ధర్మశాస్త్రములో కానీ ఉన్నదా?**

ప్రొ. రామకృష్ణ : ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకారుణి.. కొన్ని ప్రయోగాలు చేస్తాడు. ఆ ప్రయోగాలన్నీ ఒక ధర్మవాక్యం లోని నిజమెంతో తెలుసుకోవటానికి చేసిన ప్రయత్నం.

*మిసిమి* : **భారతీయ తత్త్వశాస్త్రంలో ప్రతిపాదించిన సత్యం అన్న అంశాన్ని మీరెలా చూస్తారు?**

ప్రొ. రామకృష్ణ : నీకు, ప్రకృతికి ఉన్న సంబంధాన్ని తెలుసుకోవడం, నీ గురించి నువ్వు తెలుసుకోగలగటం, ప్రకృతి లోని మార్పులను గమనించగలటం.. చీకటి ఎందుకు ఏర్పడుతోంది.. వర్షమెందుకు కురుస్తోంది.. ఈ కారణాలను హేతువుతో అన్వేషించడమే సత్యశోధన..

*మిసిమి* : **మహాత్మా గాంధీజీ చెప్పిన సత్యాన్వేషణ కాదిది.**

ప్రొ. రామకృష్ణ : మహాత్ముడి దృష్టిలో సత్యం అంటే మనుషుల మధ్య స్నేహవారధి పెంపొందించటానికి, మెరుగైన అవగాహనకు కృషి చేయటమెలా అన్న అంశం చుట్టూ పరిభ్రమిస్తుంది.

*మిసిమి* : **బుద్ధుడు తన బోధనలతో చేసిన నడకకు, జిడ్డు కృష్ణమూర్తి ప్రసంగానికి తేడా ఉందా?**

ప్రొ. రామకృష్ణ : జిడ్డు కృష్ణమూర్తి గురించి మాట్లాడటం అంటే సమయాన్ని వృధా చేయటమే. ఆయన్ని దేవుడిగా ప్రకటించి పీఠాధిపతిని చేశారు. సరే ఆయన నేను దైవం కాదని చెప్పుకున్నాడు.. కానీ ఆయన ప్రవర్తించిన విధానమంతా నేనే దైవాన్ని అన్నట్టుగా ఉండేది. ఆతను రాసిన ఒక వ్యాసం చదవండి. చాలా నిర్హేతుకంగా ఉండటం మీరు చూస్తారు. ఇంకో విషయం చెప్పమంటారా! మీరు మాట్లాడే మాట హేతుబద్ధంగా ఉంటే, ప్రజలు మిమ్మల్ని ఏదో ఒకరోజున అంగీకరిస్తారు. కానీ మనలో అసంబద్ధత (irrationality) గూడుకట్టుకుని ఉంది. అది ఏస్థాయిలో ఉందంటే, ఆధునిక విజ్ఞాన శాస్త్రం చెప్పే ప్రతి అంశం ఋగ్వేదంలో ఉందని చెప్పటానికి ప్రయత్నిస్తాం మనం..

*మిసిమి* : **మీరు అనువాదం చేసిన "ఋగ్వేదం" పుస్తకం గురించి మాట్లాడుకుందాం. అసలెందుకు మీకు ఆ గ్రంథం అనువదించాలని అనిపించింది.?**

ప్రొ. రామకృష్ణ : మొదట మనం ఋగ్వేదంలో ఏముందో తెలుసుకోవాలి. మన బుర్రను ఎలా బ్రెయిన్ వాష్ చేశారంటే అంతా పెర్ఫెక్ట్‌గా ఉంది, అన్నీ వేదాలలో ఉన్నాయని.. ఈ ఋగ్వేదం అప్పటి మనుషుల మధ్య ఉన్న సంబంధ, బాంధ్యవాల ఆధారంగా రచింపబడింది.. ఒక తెగవారు మరో తెగపై దాడులు చేస్తుండేవారు. ఇక్కడ మనం గ్రహించాల్సింది ఏమిటంటే ఋగ్వేదం కూడా ఆకాలం నాటి జీవనశైలిని ప్రతిఫలించిందన్న అంశాన్ని అప్పటి చరిత్రగానే పరిగణించాలి.

*మిసిమి* : **ఋగ్వేద కాలం మనం చెప్పగలమా?**

ప్రొ. రామకృష్ణ : క్రీస్తు పూర్వం 1600 ప్రాంతంగా అనుకోవచ్చు. ఈకాలాన్నే ఎలా నిర్ధారించారు అనుకోవటానికి కొన్ని పరిమితులు పెట్టుకున్నారు. సింధు నాగరికత కాలం తీసుకోండి. కొంతమంది చరిత్రకారులలో సింధు నాగరికత ఆర్యన్‌లు వచ్చిన సమయంగా చెప్పొచ్చు అన్న భావన ఉంది.. అప్పుడే ఋగ్వేదం పుట్టింది అనేవాళ్ళూ ఉన్నారు. ఇదిలా ఉంటే పురాతత్వ శాస్త్రం చెప్పే ఆధారాలు, వైజ్ఞానిక ఆధారాలు చెప్పేవి మరోలా ఉన్నాయి. ఆ ఆధారాలు ఋగ్వేదం పుట్టుక ముందే సింధు నాగరికత ఏర్పడిందని తెలియచేస్తున్నాయి. సింధు నాగరికత గురించి ఋగ్వేదంలో ప్రస్తావనే లేదంటారు. కానీ అలా

అని పూర్తిగా చెప్పటానికీ లేదు. యజ్ఞం చేయటానికి ఇటుకలతో వేదిక నిర్మిస్తారు కదా. ఆ ఇటుకల తయారీ గురించి వారికి తెలియదు. అవి ఎలా వచ్చాయో తెలియదు. ఎవరు తయారు చేశారో తెలియదు. కానీ ఇటుకల గురించి ఋగ్వేదం "అర్మక" అని చెబుతుంది. అది ఎలా చేశారు, ఎవరు చేశారో వివరించదు. అర్మక అంటే కాల్చగా తయారైన ఇటుకలు. అవేమీ ఆకాశం నుండి ఊడిపడలేదు కదా. కాల్చిన ఇటుకలు సిద్ధంగా ఉంటాయి, ఉపయోగించమని మాత్రమే చెబుతుంది. ఋగ్వేదం రచింపబడిన కాలంలో ఎటు చూసినా కుప్పలు కుప్పలుగా ఇటుకలు అందుబాటులోకి వచ్చుండాలి .. అందుకని ఎక్కువమంది అభిప్రాయపడేదేమిటంటే సింధు నాగరికత, ఋగ్వేదకాలం కన్నా ముందరదే అయి ఉండాలి అని.

***మిసిమి* :** **ప్రొఫెసర్ రామకృష్ణ గారు అంత గొప్ప సింధు నాగరికత ఏమయిపోయింది?**

**ప్రొ. రామకృష్ణ :** చరిత్రకారులు ప్రొ.రొమిల్లా థాపర్ కూడా సమాధానం ఇవ్వలేని ప్రశ్నను మీరడిగారు. నిజానికి దానికి చాలా కారణాలు చెబుతారు. ఆకాలంలో ఏ భూకంపమో వచ్చి ఆ సంస్కృతి నాశనమై పోయుండాలి. లేదా బయటినుంచి వచ్చినవారు ఆ సంస్కృతిని నిర్మూలించి ఉండాలి. కారణాలు ఏవైనా కావొచ్చు.ఇదమిద్ధంగా ఇదే అని చెప్పలేం..

***మిసిమి* :** **మీరు చెప్పిన దాని ప్రకారం, సింధు నాగరికత ఐదువేల సంవత్సరాల నాటిది అనుకుందాం. సుమారు నాలుగు వేల సంవత్సరాల సమయంలో ఆ సంస్కృతిని నాశనం చేశారు లేదా నాశనం అయింది. మధ్యలో ఒక వేయి సంవత్సరాల పాటు కొంత స్తబ్ధత ఏర్పడింది. ఆ తర్వాత వేదాలు, ఉపనిషత్తులు ఏర్పడ్డాయని అనుకోవచ్చా?**

**ప్రొ. రామకృష్ణ :** వేదకాలం 1500 లేదా 1600బి.సి.గా. చెప్పుకోవచ్చు. వైదిక సాహిత్యం నాలుగు విభాగాలుగా ఉంటుంది. సంహిత, బ్రాహ్మణ, అరణ్యక, ఉపనిషత్తులు. వీటిలో "సంహిత"ను కవిత్వంగా చెప్పవచ్చు.అది ఋగ్వేదం కావొచ్చు, అధర్వణవేదం కావొచ్చు. యజుర్వేదం అనేక రకాల బలి సంప్రదాయాలను ప్రస్తావిస్తుంది.

***(ఇక్కడ ఒక లాప్స్ వుంది. అదేమిటంటే – రామకృష్ణ గారు వేదకాలం 1600 బి.సిగా చెప్తున్నారు. కానీ బుద్ధుడు 2,500 బి.సి.కి ముందే ఉన్నారు. అప్పటికే ఉపనిషత్తులు ఉన్నట్లు ప్రమాణం ఉంది. అంటే అంతకుముందే వేదాలు ఉండాలి కదా! ఈ వాదనలోకి నేను పోలేదు)***

***మిసిమి* :** **ఉపనిషత్తుల సారాంశాన్ని ఎలా వివరించవచ్చు?**

**ప్రొ. రామకృష్ణ :** ఉపనిషత్తుల్లో ఉన్న హేతువాదం, తర్కం గురించి మీరు అడుగుతున్నట్టున్నారు.ఇందుకోసం మీరు దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ రాసిన గ్రంధాలను పరిశీలించాల్సి ఉంటుంది. వాటిల్లో ఆయన ఉపనిషత్తుల్లో ఉండే వైజ్ఞానికతను వివరిస్తారు. ఛాందోగ్యపనిషత్తులో ఉద్దాలకుడు నిర్వహించిన ప్రయోగాల ప్రస్తావన ఉంటుంది. ఉదాహరణకు ఒక విత్తనాన్ని అలా పగలగొడుతూ వెళ్ళమన్నాడు. అలా ఎంతవరకూ చేయమంటాడంటే, ఆ విత్తనాన్ని మీరింకా పగలగొట్టలేనంతవరకు. మీకు అక్కడేమీ కనిపించకపోవచ్చు.. కానీ అతి సూక్ష్మమైనదేదో ఉంటుందక్కడ అంటాడు. అదే పరమాణువు అంటున్నాం ఇప్పుడు. తన కొడుకు మీదే ఉద్ధాలకుడు ప్రయోగాలు, పరిశోధన చేశాడు. ఉపనిషత్తులు అనేక విధములైన వాదనలను నిక్షిప్తం చేశాయి. కేవలం ఒక వాదనకే పరిమితమైపోలేదవి. ఆవిధంగా గొప్పవవి.

***మిసిమి* :** **కఠోపనిషత్తులో మరణం గురించిన చర్చ ఉంది కదా..ఏమీ సమాధానం చెప్పలేకపోయింది కదా?**

**ప్రొ. రామకృష్ణ :** అవును.. కఠోపనిషత్తులో ఆ చర్చ చూడొచ్చు అందులో నచికేతోపాఖ్యానం గురించి చెప్పాలి.. నచికేతుడు వయసులో చిన్నవాడు. మరణం గురించి తెలుసుకుందామనుకుంటే, నీకు మరణం గురించి చెప్పినా అర్థం కాదని యముడు, నచికేతుడితో అంటాడు. **"శ్రేయచ్చ ప్రేయచ్చ మనుష్యమేతః**

**తౌ సంపరిత్య వివినక్తి ధీరః"** మనలో రెండు పార్శ్వాలుంటాయి. ఒకటి ఆలోచన.. మరొకటి సంచయనం.. నీవనుసరిస్తున్న మార్గాన్ని బట్టి, రెండింటిలో ఏదైనా ఎంచుకోవచ్చు అంటాడు. కానీ నీ ప్రశ్నకు తుది సమాధానం ఇవ్వదది అని కూడా చెబుతాడు. నీ మార్గంలో ఎన్నో అవరోధాలు ఎదురవ్వడం జరగొచ్చు అని కూడా అంటాడు. కఠోపనిషత్తు పరబ్రహ్మ గురించి ఎంత చెబుతుందో, నీ మస్తిష్కాన్ని నువ్వెలా నియంత్రించుకోవచ్చో చెబుతుంది.

మనం తెలివితేటలు గురించి వ్యాఖ్యానిస్తాం. ప్రతిభ కలవారు.. ప్రతిభ లేనివారు. ప్రతిభ లేనివారికి రిజర్వేషన్లు కల్పిస్తున్నారని వ్యక్తం చేస్తాం. ఉద్దాలకుడు తన కొడుకుపైనే ఒక ప్రయోగం చేస్తాడు. ఆ ప్రయోగంలో పధ్నాలుగురోజుల పాటు ఏమీ తినొద్దు అని కొడుక్కి చెబుతాడు. మంచినీరు మాత్రం ఎంతయినా తాగమని చెబుతాడు. మొదటిరోజున ఋగ్వేదంలోని కొన్ని శ్లోకాలు చెబుతాడు. ఎంత బాగా చెప్పావని పొగిడి, పధ్నాలుగు రోజుల తర్వాత రమ్మంటాడు. అప్పుడడుగుతాడు.. మొదటి రోజు ఋగ్వేదం నుండి కొన్ని శ్లోకాలు చెప్పావు. వాటినిప్పుడు మళ్ళీ పునశ్చరణ చేయి.. అని అడుగుతాడు. ఆ కుర్రవాడు పధ్నాలుగు రోజులపాటు ఏమీ తినకుండా ఉన్నాడు కదా.. ఎలా చెబుతాడో చూద్దామని కుతూహలం.. ఆ కుర్రవాడు నాకంతగా గుర్తులేవని బుర్ర గోక్కుంటాడు. అపుడు ఉద్దాలకుడు ముందర వెళ్లి ఏమైనా తినిరా పుత్రా అని పంపిస్తాడు. అప్పటివరకూ నిరాసక్తంగా ఉన్న ఆ కుర్రవాడు ఉత్సాహంగా వస్తాడు. ఆకలితో ఉండి డస్సిపోయిన పిల్లవాడికి కాస్త ఆహారాన్నిచ్చి చూడండి. ఎంత ఉత్సాహవంతుడవుతాడో. దానితో అతని తెలివితేటల్లోనూ మార్పొస్తుంది అంటాడు ఉద్ధాలకుడు. అందుకే అన్ని ఉపనిషత్తులు, విజ్ఞానానికి భిన్నంగా, వ్యతిరేకించే విధంగా ఉంటాయని అనుకోవటానికి ఆస్కారం లేదు. అలాగని ప్రతిదీ వైజ్ఞానిక దృక్పథంతో ఉంటాయని కూడా అనుకోకండి.

సైన్స్ కూడా రెండు అంశాలను ప్రతిపాదిస్తుంది. ప్రకృతిలోని ఏకాత్మత. విత్తనముంది, నీరు పోసి పెంచితే అందులోని జీవం మొక్కగా ప్రాణం పోసుకుంటుంది కదా. అది ప్రకృతి సిద్ధాంతం. ఈ ప్రతికియను ఎవరు నియంత్రిస్తున్నారు. ప్రకృతే కదా. ఒక పని చేసినప్పుడు ఆ పనిని మీరైనా, నేనైనా, మరొకరైనా అలాగే చేస్తాం. అందులో మార్పు ఉండదు. అలా ప్రకృతి ఒక గొప్ప ఏకీకరణ శక్తి. ఏకీకృత శక్తి కూడా. ఇక రెండవ సూత్రం. Law of causation. ప్రకృతిలో ప్రతి మార్పు ఏదో ఒక కారణం వల్ల ఉత్పన్నమవుతుంది. కారణం, మార్పు.. ఈ రెండు సైన్స్ ప్రాథమిక సూత్రాలు. బుద్ధుడు కూడా ఈ అంశాన్నే నొక్కి చెపుతాడు మీరు సోక్రటీస్, ప్లేటో బోధనలు గమనించండి.. అవెంత నిర్హేతుకంగా ఉన్నా, ఎక్కడో ఓ మూల కొంత సహేతుకత తొంగి చూస్తుంది. అరిస్టాటిల్ ఒక సందర్భంలో అంటాడు. మానవుడు హేతువు నిండిన జంతువు అని. దాన్నే బెట్రాండ్ రస్సెల్ తనదైన హాస్యంతో ఇలా అంటాడు. మానవుడు జంతువు అనేది నిజం, కానీ హేతువు మనిషి రెండూ ఒకచోటుండవే అంటూ ..

మిసిమి : **రామకృష్ణ గారు... మా మిసిమి పత్రిక చింతనతో కూడిన సారస్వత మాస పత్రిక.. మీరు తెలుగు చదవగలుగుతారా?**

**ప్రొ. రామకృష్ణ :** తెలుగు నేను చదవగలను. నాకు ప్రజా సాహితి వారి పత్రిక, ప్రతినెలా వస్తుంది. నా ఋగ్వేద కన్నడ పుస్తకం వివిన మూర్తి అనువాదం చేశారని చెప్పాను కదా. అలాగే నేను రాసిన కన్నడ భగవద్గీతను కూడా వారు తెలుగులోకి అనువదించారు. నా భగవద్గీత పుస్తకం చూసి చాలామందికి కోపం వచ్చింది. వారికి కోపం తెప్పించినందుకు నాకు సంతోషంగా ఉంది. (నవ్వు)

మిసిమి : **సంతోషానందాలకు సంబంధించి మనం అన్ని తత్త్వశాస్త్రాలు చదువుకున్నాము అంటే ఒప్పుకుంటారా?**

**రామకృష్ణ :** మీరన్న దానితో నేను పూర్తిగా ఏకీభవించను.

***మిసిమి :*** **సరే మీరన్న మాటను కొంతవరకూ ఒప్పుకుంటాను. అందరం అన్నీ చదవటం సాధ్యం కాదని**

**ప్రొ. రామకృష్ణ :** కొన్ని సంవత్సరాల కితం అంతర్జాతీయ స్థాయిలో ఉన్న తత్త్వశాస్త్రాలను క్రోడీకరించి ఎనిమిది వాల్యూమ్స్ తీసుకొచ్చాం. వాటి ఉద్దేశం, సామాన్యుడి స్థాయికి తత్త్వశాస్త్రం చేరాలని. వాటిల్లో నేను ఒక చైనీస్ ఫిలాసఫీ పుస్తకం పరిచయం చేశాను.

***మిసిమి :*** **ఇప్పుడు మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతాను. తత్త్వశాస్త్రంపై ఇన్ని పుస్తకాలు మీరు చదివారు కదా. మీరు సంతోషంగా ఉన్నారా?**

**ప్రొ. రామకృష్ణ :** నా సంతోషాన్ని పక్కన పెట్టేద్దాం. "కారల్ మార్క్స్" అనే అద్భుతమైన వ్యక్తి ఉన్నాడు. ఆయన రాసిన చారిత్రక భౌతికవాదం, గతితార్కిక భౌతికవాదం ఉన్నాయి. అవి చదవొచ్చు. వీటి మూలాలు వేదాల్లోను, ఉపనిషత్తుల్లోను మనకు కనిపిస్తాయి. అలాగే వెతికితే మీకు భౌతికవాదం మీదే లోకాయుత తత్త్వశాస్త్రం కూడా ఒక ఆలోచనల పరంపరగా మీకు దర్శనమిస్తుంది. కారణం, మార్పు అనే సైద్ధాంతిక భూమిక లేకుండా కారల్ మార్క్స్ కూడా తన గతితార్కిక వాదాన్ని వివరించలేడు. ఆయన చెప్పేటటువంటి వర్గ సిద్ధాంతం దీని మీద ఆధారపడిందే.మళ్ళీ మన భారతీయ తత్త్వశాస్త్రం దగ్గరకు వస్తే శంకరాచార్య ఉన్నచోటే చార్వాకుడున్నాడు. భారతీయ తత్త్వశాస్త్రమంటే డా.రాధాకృష్ణయే కాదు, దాస్ గుప్తాయే కాదని గ్రహించాలి మనం.. రాధాకృష్ణన్ ఫిలాసఫీ చాలా పాక్షికంగా ఉంటుంది. కుల వ్యవస్థను బలపరుస్తుంది. మనిషి, మనిషికీ మధ్య అసమానతల అడ్డుగోడలు ఏర్పడుతుంటే ఆ అసమానతలను ఆ ఫిలాసఫీ ప్రశ్నించకపోతే ఇంకెందుకు ఆ శాస్త్రం?

***మిసిమి :*** **ధన్యవాదాలు ప్రొఫెసర్ రామకృష్ణ గారు – ఆల్బర్ట్ కేమూ, సార్త్రే, రసెల్, రాధాకృష్ణ, జిడ్డు కృష్ణమూర్తి ఇలాంటి వారి రచనలు చదివిన నేను, కొత్త సచ్చిదానందమూర్తిని తరచూ కలిసినవాణ్ణి – మిమ్మల్ని ఇలా కలిసి మాట్లాడటం ఎంతో సంతోషంగా ఉంది. మీలాంటివారు అరుదుగా తారసపడతారు. అలాగే ఈ సందర్భంలో మీ సంతోషం చూడగలుగుతున్నాను!**

**ప్రొ. రామకృష్ణ :** చాలా చాలా కృతజ్ఞతలు మీకు.... మంచి సంభాషణ చేశాం.

*రామకృష్ణ గారిని కలవటం యాదృచ్ఛికం కాదు. వివిన మూర్తి చెప్పిన తరువాత వారిని వెతుక్కుంటూ చాలాదూరం వెళ్లాం. వారిని చూడటం–వారితో తత్త్వశాస్త్ర విశేషాలు మాట్లాడటం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. చాలాకాలం తరువాత అలాంటి వ్యక్తిని కలిసి సంభాషించడం ఒక అదృష్టం. వారి ముఖంలో వర్చస్సు చూడాలి – వారి స్వరంలో ఆత్మవిశ్వాసం వినాలి – వారి మెరిసే కన్నులలో విద్వత్తు వెలుగుతూ ఉంటుంది. ఏ పరిచయం లేని నన్ను ఆ గంటలోనే ప్రేమించి దగ్గరయ్యారు. వారికి ఫిసలాఫీ గురించి మాట్లాడే నాలాంటి వాడు దొరకడం అరుదు కదా! అల్పాహారం, చల్లని పానీయం అందించారు. మా ఇద్దరికీ తెలుసు మళ్లీ కలిసే అవకాశం ఉండదని. అయినా అరుదైన సమాగమాలు ఆత్మీయంగానే ఉంటాయి. లిఫ్ట్ వరకు వచ్చి పంపారు. ఆయన నవ్వు ప్రపంచాన్ని అర్థం చేసుకుని మన దారులని వెలిగిస్తుంది. వారికి జేజేలు.*

***– ఎడిటర్***

**సంభాషణ : అశ్వినీకుమార్**

ధ్వని ముద్రణకు రాతప్రతి : సి.ఎస్. రాంబాబు *(అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)*

# ప్రాచీన కావ్యాల్లో పల్లె ఆటల ప్రశస్తి

*– ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావు*



చిర్రగోనె ఆట

ఆదికవి నన్నయ్య (క్రీ.శ. 11వ శతాబ్దం) మహాభారతం ఆదిపర్వంలోని కురుకుమారుల బాల్యక్రీడలు మొదలుకొని, ఆ తర్వాత కాలంలో ప్రముఖులైన తెలుగు కవులు అందరూ కూడా తమ కావ్యాల్లో – సందర్భానుసారంగా పల్లె ఆటలకు సముచిత స్థానాన్నే కల్పించారు. అటువంటి వాటిలో – 'చిర్రగోనె' అనే ఆటను మొదట పేర్కొంటాను. ఇది నేటికీ గ్రామాల్లో అత్యంత ప్రచారంలో ఉంది. అధిక సంఖ్యాకులచే అభిమానింపబడుతూ ఉంది. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన నేటి 'క్రికెట్' ఆటను పోలి ఉంది.

**1. చిర్రగోనె :** చిర్రగోనె, చిల్లకట్టె, గిల్లిదండ, కర్రాబిల్ల, బిల్లగోడు అనేవి – ఈ ఆటకు నేడు ప్రచారంలో ఉన్న ప్రాంతీయ నామాలు. కావ్యాల్లో ఇది చిరుతగొడె, బిల్లగోడు, బిల్లగొట్టు అనే పేర్లతో ప్రఖ్యాతి పొందింది. బాలచంద్రుడు ఆటలాడేందుకు పోతున్నపుడు – సేవకులు అతని కొరకు ఆటాడే సాధనాలను వెంట తీసుకువెళ్తారు. వాటిలో **"చిరుతలు తీరైన గొడెలు"** ఉన్నట్లుగా శ్రీనాథుడు (క్రీ.శ. 1370–1450) పల్నాటి వీరచరిత్రలో పేర్కొన్నాడు. నాటి 'చిరుతగొడెలు' నేటి 'చిర్రగోనె' ఆటకు సంబంధించిన సామాగ్రియే. ఈ ఆటకు విశాలమైన మైదానం ఉంటేనే ఆట స్వేచ్ఛగా సాగుతుంది. దీనిని ఇద్దరు గాని అంతకు ఎక్కువ మంది గాని ఆడవచ్చు – చదునుగా ఉన్న నేలపై దాదాపు ఆరు అంగుళాల పొడవు, రెండు అంగుళాల వెడల్పు పరిమాణంలో ఒక 'బద్దీ' (గుంత)ని తవ్వుతారు. ఆ బద్దికి పైన అడ్డంగా 'చిర్ర'ను ఉంచుతారు. చిర్ర అంటే దాదాపు ఆరు అంగుళాల పొడవున్న చిన్న కర్ర. దీని రెండు చివరలు ఆంగ్ల అక్షరం 'వి' ఆకారంలో చెక్కబడి ఉంటాయి. అపుడు మొదటి వ్యక్తి – బద్దిలో 'గోనె'ను ఉంచి, చిర్రను బలంగా దూరంగా ఎగజిమ్ముతాడు. గోనె అంటే దాదాపు రెండు అడుగులు ఉండే రూల్ కర్రలాంటిది. అపుడు రెండవ వ్యక్తి పైకి చిమ్మబడిన చిర్రను గాలిలోనే క్యాచ్ పట్టుకుంటే మొదటి వ్యక్తి ఓడిపోయినట్లు, అలా క్యాచ్ పట్టుకోలేకపోతే ఆట కొనసాగుతుంది. గాలిలోకి చిర్రను చిమ్మిన తర్వాత అది దూరంగా పడుతుంది. అపుడు చిర్రను చిమ్మిన వ్యక్తి, గోనెను బద్ద వద్ద నేలపై అడ్డంగా ఉంచుతాడు. రెండవ వ్యక్తి చిర్రపడిన స్థానం వద్ద నిలబడి చిర్రను గోనెకు సూటిపెట్టి గోనెకు తాకేలా విసిరివేస్తాడు. ఈ పద్ధతి బంతిని వికెట్స్‌కు తగిలేలా విసిరినట్లుంటుంది. అలా తాకితే మొదటి వ్యక్తి ఔట్ అయినట్లు, లేకుంటే మొదటి వ్యక్తి మళ్లీ ఆటను కొనసాగించాలి. అపుడు చిర్ర ఒక చివరను గోనెతో తట్టినపుడు అది గాలిలోకి లేస్తుంది. అది తిరిగి నేలపై పడకముందే గాలిలోనే గోనెతో బలంగా కొడతాడు. అపుడు కూడా రెండవ వ్యక్తి క్యాచ్ పట్టుకొనవచ్చు. అలా కాని పక్షంలో చిర్రపడిన దూరాన్ని బద్ది వద్ద నుండి మొదటి వ్యక్తి గోనెతో ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు, ఏడు అని ఈవిధంగా కొలుస్తూ పోతాడు. ఏడు కాగానే ఒక పాయింట్ వస్తుంది. ఈ పాయింట్ క్రికెట్ 'రన్'తో సమానం. దీన్ని చిర్రగోనె ఆట పరిభాషలో 'పొల్ల' లేదా 'పోరేగాడ్' అని పిలుస్తారు. పొల్ల అంటే పిల్ల అనీ, పోరేగాడ్ అంటే పిల్లగాడు అని అర్థం చేసుకోవాలి. ఈ కొలతలో ఒకటి, రెండు, మూడు అనే కాకుండా వాటికి కూడా మళ్లీ సంకేత పదాలుంటాయి. ఒంటేకాల్,

రెండోచిచ్చి, మూడోముచ్చి, నాల్నడ్డి, అయిదుర పెద్ది, ఆరోకన్ను, పోరేగాడ్. ఈ విధంగా – మరీ చిర్ర దూరంగా పడినప్పుడు నీకు ఇన్ని పోరేగాడ్‌లను ఇస్తున్నాను అని రెండవ వ్యక్తి అన్నప్పుడు కొలవాల్సిన పనిలేదు, (రన్స్ డిక్లేర్ చేయడం అన్నమాట). దూరం తక్కువగా ఉన్నప్పుడు కొలిస్తే ఏ అంకె పదం వస్తే ఆ విధంగా మళ్లీ చిర్రను గోనెతో తాకించాలి. ఉదా: ఒకటి వస్తే ఒంటేకాల్‌ను ఆడాల్సి ఉంటుంది. ఒంటేకాల్ అన్నప్పుడు ఎడమ పాదాన్ని పైకి ఎత్తి, పాదం వేళ్లమీద చిర్రను ఉంచి, కాలును కాస్తా ఎగరేయాలి. అపుడు చిర్ర గాలిలోనికి లేస్తుంది. లేచిన చిర్రను రెండవ వ్యక్తి క్యాచ్‌కు దొరకకుండా గోనెతో మళ్లీ చాచి కొట్టాలి. కొట్టిన తర్వాత గోనెతో పాయింట్లను కొలవాలి. "ఒంటేకాల్"ను కొడుతున్నప్పుడు గోనెకు తగలకుండా చిర్ర కిందపడితే మొదటి వ్యక్తి ఓడిపోయినట్లే. అంతేకాకుండా బ్యాలెన్స్ తప్పి చిర్ర కింద పడిపోయేందుకు రెండవ వ్యక్తి చప్పట్లు కొడుతూ, గంతులేస్తూ, 'కాల్లు కాలంగా పుల్లలేరంగా' అని అరుస్తూ, ఆ పదాన్నే మళ్లీ మళ్లీ పలుకుతూ వేగంగా పాడుతుంటాడు. ఆ అవరోధాన్ని కూడా మొదటి వ్యక్తి ఎదుర్కోవాలి. ఏకాగ్రత, గుండెనిబ్బరం ఉంటే తప్ప అంత సులభంగా గండం గట్టెక్కదు. గ్రామాల్లో చేలూ చెలకల్లో ఎండిన పుల్లలను పొయ్యిల కట్టెల కొరకు ఏరుకుంటారు. అంటే ఒంటేకాల్ భంగిమ – చెప్పులు లేకుండా ఎండలో కాలు కాలుతున్న వ్యక్తి, నేల చుర్రుమని సెగలు కమ్ముతుండగా, పుల్లలేరుకుంటూ త్వరత్వరగా ఒకే కాలుపై నడుస్తున్నట్లు ఉంటుంది. ఈ విధంగా గ్రామీణుల సాంఘిక దయనీయ స్థితి ఇందులో గోచరిస్తుంది. కొల ప్రకారం ఏ అంకె వస్తే ఆ అంకెకు, నిర్దేశించిన పద్ధతి ప్రకారం ఒక్కొక్క భంగిమలో ఆడాల్సి ఉంటుంది. మొదటి వ్యక్తి ఓడిపోయిన తర్వాత రెండవ వ్యక్తి ఆట మొదలుపెడతాడు. ఆట పూర్తయిన తర్వాత పాయింట్లు ఎవరివి ఎక్కువ ఉంటే వారు గెలిచినట్లు. ఓడిపోయిన వ్యక్తి గెల్చిన వ్యక్తికి ఆట పెట్టాలి. ఆట పెట్టడం అంటే శిక్షను అనుభవించడం. 'బియ్యం తెస్తా బియ్యం తెస్తా' అంటూనో 'అచ్చి అమ్మచ్చి దూదేమీద దుమ్మచ్చీ' అంటూనో శ్వాసను ఆపకుండా పదాలను మళ్లీ మళ్లీ పలుకుతూ, పాదాలను ఆపకుండా చిర్రను చేతిలో పట్టుకొని బద్ది వద్దనుండి నిర్దిష్టమైన ప్రదేశానికి పరుగెత్తుతూ చేరుకోవాలి. ఇది దమ్ము (శ్వాస)కు సంబంధించిన పరీక్ష. అది చేతకాదనుకుంటే ఆటలో ఎన్ని పిల్లల (పాయింట్లు)తో ఓడిపోతే అన్నిమార్లు పిడిగుద్దులను భరించాలి. ఈ అనుభవం దేహదారుఢ్యాన్ని పరీక్షించేది. ఈవిధంగా ఇద్దరు లేదా ఎక్కువ మంది రెండు జట్లుగా ఆడే ఈ ఆట ఎన్నో మలుపులతో కొన్ని గంటలపాటు చాలా ఆసక్తికరంగా సాగుతుంది. పరిగెత్తే శక్తి, క్యాచ్ అందుకునే నేర్పులాంటి ఎన్నో స్కిల్స్ ఈ ఆటలోని ప్రతి అంశంలో దాగున్నాయి. అందుకే పల్లెల్లోని ఈ ఆట సంస్కరింపబడి పట్టణాలకెగబాకి మనదేశపు ఎల్లల్ని కూడా దాటి, ప్రపంచ పటంలో ఎందెందు వెదికి చూసినా తానే కన్పిస్తూ నిండుగా ఉన్నది. ఈ ఆటలోని విజయం, గెలిచిన జట్టులోని క్రీడాకారులది మాత్రమే కాదు. అది ఆ దేశానికే సంబంధించింది అన్నంతగా ఈ ఆట ఎదిగిపోయింది.

అసాధారణమైన ఈ ఆట రెండు చిన్న కర్ర సాధనాల ఊతతోనే సాగుతూ 'చిర్రగోనె' లేదా 'బిల్లంగోడు'గా వాటి పేర్లనే తనలో ఇముడ్చుకొని వ్యవహార ప్రసిద్ధిని పొందింది. ఈ ఆటను శ్రీనాథ కవి **"చిరుతలు తీరైన గొడెలు"** అని పల్నాటివీర చరిత్రలో పల్కిన విషయాన్ని ప్రారంభంలోనే తెల్పాను. 'చిర్ర'ను 'చిరుత'గా – 'గోనె'ను 'గొడె'గా భావించాలి. బాలకృష్ణుని క్రీడగా 'బిల్లగొట్లాట'ను తాళ్లపాక అన్నమయ్య (క్రీ.శ. 1408–1503) కీర్తించాడు. **"గల్లు గల్లు మనగాను గజ్జెలు సందెలతోడ బిల్లగొట్లాడేని పిన్న కృష్ణుడు".** 'చిర్ర'ను 'బిల్ల'గా 'గోనె'ను 'గొట్టు'గా అర్థం చెప్పుకోవాలి. వెన్నెలకంటి సూరన (క్రీ.శ. 16వ శతాబ్దం పూర్వార్ధం) తన విష్ణుపురాణ కావ్యంలో బలరామకృష్ణుల బాల్య క్రీడా విశేషాలను వర్ణిస్తూ **"బిల్లగోళ్లు"** అనే పేరుతో ఈ ఆటను కీర్తించాడు. ధూర్జటి కవి (క్రీ.శ. 16వ శతాబ్దం) శ్రీ కాళహస్తి మహాత్మ్యంలో **"బిల్లగోడు"** అని, ఈ ఆటను పేర్కొంటూ తిన్నని బాల్యక్రీడల్లో దీనికి భాగస్వామ్యాన్ని కల్పించాడు. ఈ విధంగా తేజో సంపన్నులైన పురాణ పురుషులైన బలరామకృష్ణులు, చారిత్రక వీరుడైన బాలచంద్రుడు, శివున్ని నిర్మలమైన భక్తితో తన అక్కున చేర్చుకున్న తిన్నడూ – శౌర్య సంపదలో పోటీపడి నిల్చినవారే. బాల్యదశలోనే వారిచేత మన ప్రాచీన తెలుగు కవులు తమ కాలపు చిర్రగోనెను ఆడించి, పువ్వు పుట్టగనే పరిమళించునన్నట్లు వారిలోని ధైర్య గుణాన్ని పసిప్రాయంలోనే వెలికి తీశారు.

నిజానికి చిర్రగోనెను ఆడేవారిలో ముఖ్యంగా ఉండాల్సింది – ధైర్యగుణం. ఆట సమయంలో చిర్ర వేగంగా ముఖానికి అభిముఖంగా వస్తుంది కాబట్టి దాని ధాటికి భయపడకుండా దాన్ని గుప్పిట్లో బంధించగల్గే శక్తి యుక్తులుండాలి. ఈ గుణాలే భావి జీవితంలో ఎంత ఉద్ధృతంగా వచ్చే సమస్యల బారినుండైనా వ్యక్తులకు ఉపశమనాన్ని కల్గిస్తాయి.

**2. కోతికొమ్మ :** చెట్టుకొమ్మను ఆశ్రయించి 'కోతి' ఏవిధంగా సంచరిస్తుందో, అదేవిధంగా పిల్లలు చెట్టు కొమ్మలపై తిరుగుతూ, ఆటలోని దొంగకు అందకుండా తప్పించుకొని తిరుగుతూ ఆడే ఆట ఇది.



కోతికొమ్మ ఆట

ఆటవిక దశలో మనిషిని క్రూరజంతువు తరిమినప్పుడు అతడు వేగంగా సమీపంలో ఉన్న చెట్టు ఎక్కి, జంతువు ఆ ప్రాంతం నుండి వెళ్లిపోయే వరకూ చెట్టును ఆశ్రయించుకొని తనను తాను కాపాడుకునే సందర్భాన్ని ఈ ఆట గుర్తుకు తెస్తుంది. చెట్టు ఎక్కలేని జంతువు కొమ్మలపై దాక్కున్న మనిషిని నేలపై నిలబడే ఎగిరి అందుకునేందుకు ప్రయత్నిస్తుంది. మనిషి దానికి దొరకకుండా పై కొమ్మలకు ఎగబ్రాకడం, ఒకవేళ చెట్లను ఎక్కగల్గే జంతువైతే దానికి అందకుండా కొమ్మలను మారుస్తూ తిరగడం, సమయాన్ని చూసి నేలపైకి దూకి ఆ ప్రాంతం నుండి తప్పించుకోవడం వంటి చర్యలు ఈ ఆటకు రూపకల్పన జరిపి ఉంటాయి. వెన్నెలకంటి సూరన, విష్ణుపురాణ కావ్యం ఈ ఆటను **"కోలక్రోతులు"** (7–22) అని, బలరామకృష్ణుల బాల్యక్రీడా విశేషాల్లో భాగంగా తెలియజేసింది. ఈ ఆటకు ఉపయోగపడే కర్రను 'కోల' అని పిలుస్తారు. ఇది దాదాపు 2 అడుగుల పొడవుండి రూలు కర్రను పోలి ఉంటుంది. ఈ కోలకున్న ప్రాధాన్యత వల్లనే ఈ ఆటను కోలక్రోతులు అని పిల్చి ఉంటారు. ఈ ఆటను కనీసం ఇద్దరు మొదలుకొని అంతకు ఎంత ఎక్కువ మందైనా ఆడవచ్చు. ఉదా : ఇద్దరు వ్యక్తులు ఈ ఆటను ఆడుతున్నారనుకుందాం – వారు సులభంగా ఎక్కగల్గేది, ఎక్కువ కొమ్మలున్నది, యథేచ్ఛగా తిరగగల్గే చెట్టునే ఆటాడేందుకు ఎంచుకుంటారు. చెట్టుకింద ఒక గుండం (గుండ్రని వృత్తం) గీస్తారు. మొదటివాడు గుండం మధ్య నిలబడి కోలను చేతిలో పట్టుకుంటాడు. ఎడమకాలును కొంత పైకి ఎత్తి, కుడి చేతిలో పట్టుకున్న కోలను మోకాలి కిందుగా బలంకొద్దీ దూరంగా విసిరి చెట్టు ఎక్కుతాడు. రెండవ వాడు పరుగెత్తి ఆ కర్రను తెచ్చి గుండంలో వేసి, చెట్టుపైకి ఎక్కిన వ్యక్తిని పట్టుకొనేందుకు ప్రయత్నం చేస్తాడు. చెట్టు కొమ్మను అందుకొని కొమ్మ ద్వారానే చెట్టుపైకి ఎక్కేందుకు ఉద్యుక్తుడవుతాడు. అలా వీలు కానప్పుడు చెట్టు కాండం వద్ద నుండి ఎక్కేందుకు తంటాలు పడతాడు. మొదటి వ్యక్తి చెట్టు దిగిగాని, చెట్టుకొమ్మకు వేలాడి కిందికి దూకి గాని రెండవ వానికి అందకుండా గుండంలోని కోలను పట్టుకోవాలి. ఈలోగా రెండవ వ్యక్తికి అతడు దొరికిపోతే ఔట్ అయినట్టు. అపుడు రెండవ వాడు కోలను విసిరి చెట్టెక్కడం, మొదటివాడు పరుగెత్తి దానిని తీసుకు రావడం, ఈ విధంగా ఆట మళ్లీ మొదలవుతుంది.

ఈ ఆట చెట్టు ఆధారంగానే నడిచినా ప్రాధాన్యం మాత్రం కర్ర (కోల)దే. కర్రను చేతిలో ధరించి ఉండడం, కర్రను విసరడం అధికారానికి చిహ్నాలు. విసిరిన కర్రను పరుగెత్తి తీసుకురావడం సేవక లక్షణం. అందుకే ఈ కర్రను హస్తగతం చేసుకోవడం కోసం ఏర్పడే పోటీ స్వభావంతో ఈ ఆట రక్తి కడుతుంది. చెట్టు ఎక్కడం, కొమ్మలను పట్టుకొని చెట్టుపై తిరగడం, కొమ్మ ఆసరాగా కిందికి దుముక వలసి రావడం అనే అంశాలుంటాయి కాబట్టి ఎంత పెద్ద చెట్టుపైకైనా సులభంగా ఎక్కగల్గే మెళకువలు, ఈ ఆటవల్ల బోధపడతాయి. వృత్తిరీత్యా చెట్లను ఎక్కి దిగేవారి సాధక బాధకాలు అనుభవం ద్వారా బాల్య దశలోనే తెలుసుకొనే వీలు ఈ ఆట వల్ల తెలుస్తుంది. మామిడి, చింత, తుమ్మ, వేప, విప్ప, మర్రి,

అల్లోనేరేడు, రావి, జామ, ఉసిరి మొదలైన చెట్ల నుండి ఆకులు, కాయలు, పండ్లను తెంపేందుకు చెట్టును ఎక్కవలసి వస్తుంది. ఎండిన చెట్టయితే కలపకోసం చెట్టును ఎక్కి కొమ్మలను నరికి వేయవలసి వస్తుంది. ఆటకోసమైనా చెట్లను చిన్ననాడే ఎక్కగల్గితే అవసరాన్ని బట్టి భవిష్యత్తులో చెట్లెక్కే అభ్యాసం జానపదులకు అలవడుతుంది. ఈ విధంగా ఆటకోసం చెట్టుతో అనుబంధాన్ని పెంచుకోవడం వల్ల చెట్ల పేర్లు, వాటి జాతి భేదాలు, ధర్మాలు వాటి ద్వారా మనిషికి సంక్రమించే సంపద, అనుభవరీత్యా తెలిసి తద్వారా నిరక్షరాస్యులైన పల్లె ప్రజలకు వృక్ష సంబంధమైన పరిజ్ఞానం ఏర్పడుతుంది.

'కోతికొమ్మ – కోతికొమ్మచ్చి–ఝూడ్ బందర్' అనే పేర్లతో ఈ ఆట వ్యవహారంలో ప్రసిద్ధి చెంది, 'కొమ్మపై తిరిగే కోతి' అనే అర్థాన్నిస్తోంది. ఈ ఆటలో కోలకు కూడా ప్రాధాన్యం ఉండడం వల్ల ప్రాచీన కవి మాత్రం 'కోలక్రోతులు' అనే పేరునే ప్రయోగించాడు. చెట్లు, గట్లు ఎక్కి దిగడం జానపదుల ప్రవృత్తికీ, వృత్తికీ సంబంధించిన అంశం. అందుకు చిన్ననాటనే ఈ ఆట పునాది వేసి శారీరక వ్యాయామాన్నీ, మానసిక పుష్టినీ వారికి అందజేస్తుంది. ఇతర జానపద క్రీడల్లాగే ఈ ఆటకూడా ప్రాంతాన్ని బట్టి పేరులోనూ, ఆటాడే విధానంలోనూ కొద్దిపాటి మార్పులను కల్గి ఉన్నది.

**3. చెడుగుడు :** 'చెడుగుడు' అనే శబ్దాన్ని క్రమం తప్పకుండా ఒక కూతగా పలుకుతూ ఆడే ఆట ఇది. ఈ ఆటలోని కూతకు గల ప్రాధాన్యం వల్ల దీనికి చెడుగుడు అనే పేరు వచ్చింది. 'చెడుగుడు' అనే పూర్వ రూపం వాడుకలో చెడుగుడుగా మారి నేటి 'కబడ్డీ' ఆటగా రూపాంతరం చెందింది. చెడుగుడు, కబడ్డీ అనేవి నేడు ప్రాంతీయ పదాలు. ఈ ఆట "బల్‌ల్‌ల్ చెడుగుడు చెడుగుడు చెడుగుడు" అనే కూతతో ప్రారంభం అవుతుంది. 'కబడ్డీ' అనే పదాన్ని ఉపయోగించినప్పుడు 'బల్' అనే పదానికి దీర్ఘాన్నివ్వక 'బల్ కబడ్డి కబడ్డి కబడ్డి' అని ప్రారంభంలో మాత్రమే కూతను ఉపయోగిస్తారు.

జానపదుల్లో కేవలం బాలుర ఆటగానే ఇది ప్రసిద్ధి చెందింది.

**"చిదుగు దువ్వల పోటి చెండు గట్టిన బోది**
**యలి యుప్పన బట్టె లప్పళాలు"** (3–33) అని, తిన్నడు చెంచు బాలురతో కలిసి పిన్ననాడు ఆడుకున్న ఆటగా దీనిని ధూర్జటికవి క్రీ.శ. (16వ శతాబ్దం) శ్రీ కాళహస్తి మహాత్మ్య కావ్యంలో ప్రస్తుతించి, ఈ ఆట ప్రాచీనతకు సాక్ష్యాన్నిచ్చాడు. ఈ ఆట ఆడుకునేందుకు చదునైన ప్రదేశాన్ని ఎన్నుకుంటారు. అందులో దీర్ఘ చతురస్రాకారంగా గీతలు గీస్తారు. ఆ గీతలు స్పష్టంగా కన్పించేందుకు ఇసుకను గానీ, సున్నపు మట్టిని గానీ పోస్తారు. దీర్ఘ చతురస్రాకారాన్ని రెండు సమభాగాలు చేస్తూ మధ్య అడ్డంగా ఇంకొక గీత గీస్తారు. అపుడు రెండు జట్లు ఎవరి చతురస్రంలో వారు నిలబడి ఉంటారు. ఒక్కొక్క జట్టులో ఏడుగురు (7) ఆటగాళ్లుంటారు. రెండు జట్లలోనూ ఒకరు 'పెబ్బె' (పెద్ద)గా ఉంటారు. అతడు తన జట్టుకు నాయకత్వ బాధ్యతలు స్వీకరిస్తాడు. ఒక జట్టులోని ఆటగాడు మధ్య గీత దాటి రెండవ జట్టు చతురస్రంలోకి ప్రవేశించి, చెడుగుడు కూతను ఆపకుండా కొనసాగిస్తూ ఒకరినైనా తాకి, తిరిగి మధ్య గీతను తొక్కితే తన జట్టుకు ఒక పాయింట్ తెచ్చినట్టు. అతడు ఎవరినైతే తాకుతాడో ఆ ఆటగాడు ఔట్ అయి తన జట్టునుండి తొలగిపోవాలి. ఈ విధంగా పాయింట్ తేవడానికి ఎంతో నైపుణ్యం ఉండాలి. కారణం – ఎదుటి జట్టులోకి ప్రవేశించింది తానొక్కడే కాని, అవతల జట్టులో ఉన్న ఆటగాళ్ల సంఖ్య ఎక్కువ. వారంతా కలిసి అతన్ని చుట్టుముట్టి మధ్యగీతను అతడు చేరుకోకుండా నిరోధిస్తారు. కూత ఆగిం తర్వాత అతడు మధ్య గీతను తాకినా, అది లెక్కలోకి రాదు. అపుడు పాయింట్ అవతలి జట్టుకే వస్తుంది. ఈ విధంగా ఏ జట్టులోని ఆటగాళ్లు పూర్తిగా వైదొలగుతారో అపుడు రెండవ జట్టుకు విజయం లభిస్తుంది.

నిజానికి ఇది వీరుల ఆట – శత్రుసైన్యంలోకి ప్రవేశించి వారితో యుద్ధం చేసి వారిని క్షతగాత్రుల్ని చేసో, తుదముట్టించో తిరిగి వెళ్లే వీరున్ని, ఈ ఆటలోని దృశ్యం తలపింపజేస్తుంది. ఈ ఆటలో ఎదుటి వాళ్లను విడిపించుకోవడం బలానికి, నైపుణ్యానికి సంబంధించిన అంశాలైతే, కూతను ఆపక కొనసాగించటం అతని దమ్ము (శ్వాస)కు సంబంధించిన విషయం. ఈ ఆటవల్ల ధైర్య సాహసాలు, మెళకువలు వికసించే అవకాశం ఉంది. ఈ ఆటలో దెబ్బలు తగలడం మామూలు విషయమే. ఆటలోని దెబ్బకు

ఎదుటి వ్యక్తులు కారణమైనా దాన్ని ఆటలో భాగంగానే స్వీకరించాలి తప్ప కోపతాపాలకు గురికాకూడదు. అందుకే 'ఆటలోని దెబ్బ అరటిపండు' అనేమాట సామెతగా, జాతీయంగా జానపదాల్లో స్థిరపడింది. దీనివల్ల మనిషిలో కోపతాపాలు తగ్గి సహన బుద్ధి పెంపొందే అవకాశాలు కూడా ఉంటాయి. ఆటలోని సభ్యులు తమ జట్టు వారైనా, ఎదుటి పక్షం వారైనా అది కేవలం ఆట కొనసాగుతున్నంత సేపు మాత్రమే. ఆ తర్వాత అందరూ మిత్రులే. ఈ విధంగా ఆటలోని పరిచయం ఐక్యతకు దారితీస్తుంది.

పల్లెల్లో ప్రాంతాన్ని బట్టి పేరులోనూ, ఆటాడే విధానంలోనూ ఈ ఆటలో నేడు ఎన్నో మార్పులు కన్పిస్తున్నాయి. అది క్రియాత్మక శక్తిని సూచించే జానపద లక్షణం. ఆడే వారినే కాక చూసే వారిని కూడా అమితంగా ఉత్తేజపరిచే ఈ జానపద క్రీడ నేడు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత స్థితిలో ఉన్నది.

**4. చెండు (బంతి) :**

**"సోడు సోడు పోసినాడు – సోమవనం వేసినాడు**
**సోమవనం గిరులమీద – పూలసెండీ లాడుతాడు"**

అంటూ ఒక జానపద ప్రేయసి దూరంగా ఉన్న తన ప్రియుని తలపులతో మధురానుభూతిని పొందుతూ పాడుకుంటున్నది. ఈ విధంగా 'చెండు' నేటి జానపద గీతాల్లోనే కాదు – 'చెండు' లేదా 'కందకం' అనే పేర్లతో శతాబ్దాలుగా నాటి తెలుగు కావ్యాల్లో కూడా చోటు చేసుకొని తన ప్రాచీనతను చాటుకొంది. ఈ ఆట 'బంతి' (బాల్) అనే పేరుతో నేడు అత్యంత ప్రసిద్ధమైన అంతర్జాతీయ క్రీడారంగంలో ఉన్నత స్థాయిని అందుకొన్నది.

ఫుట్‌బాల్, వాలీబాల్, గ్రౌండ్ టెన్నీస్, టేబుల్ టెన్నీస్, బాల్ బాడ్మింటన్, క్రికెట్‌బాల్, హాకీబాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్ ఇవన్నీ కూడా నాటి 'చెండు'కు నేటి ప్రతి రూపాలుగా సాక్షాత్కరిస్తున్నాయి. జట్టుకు ఒకరి నుండి పదకొండు వరకు ఆటగాళ్లను కలిగి యుండి కొనసాగే ఈ బంతి ఆట – వ్యష్టి, సమిష్టి జీవితానికి ప్రతీకగా నిలుస్తుంది. వేలాదిమంది ప్రేక్షకులకు ఆనందాన్ని గొల్పుతుంది. ఇన్ని విశిష్టతలున్న నేటి ఈ బంతి తెలుగు కావ్యాల్లో ఏయే రూపాలను పదిల పరచుకొన్నదో కొంత పరిశీలించడం మంచిది. ద్రోణుడు హస్తినాపురానికి వచ్చినపుడు ధృతరాష్ట్ర, పాండుకుమారులు – **"కందుకక్రీడా పరులయి వేడుకతో నాడు చున్నంత నక్కాంచన కందుకం బొక్క నూతం బడియె"** (5–206) అని, మూలంలో లేని బంతి ఆటను ఆదికవి నన్నయ (క్రీ.శ. 1023–1063) ఆంధ్ర మహా భారత ఆదిపర్వంలో ప్రస్తావిస్తాడు. మూలంలోని ఆటను మార్చి, బంతి ఆటను చేర్చడం వల్ల 'బంతి' ఆటకు నన్నయ కాలంలోని ప్రాచుర్యం అవగతమౌతుంది.

శ్రీకృష్ణ చరిత్రను వర్ణిస్తూ పాండురంగ మహాత్మ్య కావ్యంలో తెనాలి రామకృష్ణ కవి (క్రీ.శ. 16వ శతాబ్దం)–

**"ఆలమందల బోవ శైలమెత్తెడి పూన్కి**
**గేలిమై కందుక క్రీడ సలిపె" (3–178)**

అని ఆటలో బంతిని ఎత్తే విధానాన్ని ప్రత్యేకంగా తెల్పుతాడు. అంటే, గోవుల మందను కాపాడేందుకు పర్వతాన్ని ఎత్తినట్లుగా, శ్రీకృష్ణుడు బంతిని ఎత్తి ఆడినాడు అనేది దీని అర్థం. ఇది ముమ్మూర్తులా నేటి 'షాట్‌పుట్'ను పోలి ఉంది. షాట్‌పుట్ అనే బరువైన ఇనుప బంతిని చేతివేళ్లతోనే పైకి లేపి వీలైనంత దూరంగా విసరటం ఉంటుంది. ఈ ఆటవల్ల వ్యక్తిలోని బల సమీకరణ శక్తి సామర్థ్యాలు బయటపడతాయి. శ్రీకృష్ణుడు పర్వతాన్ని ఎత్తినట్లుగా బంతిని ఎత్తటం వరకే ఈ కవి స్పష్టంగా తెల్పి ఆ తర్వాత ఆటను ఛాయా మాత్రంగా తెలియజేశాడు.

తెనాలి రామకృష్ణుని కంటే దాదాపు రెండు శతాబ్దాలకు ముందుగానే పోతన మహాకవి (క్రీ.శ. 1400–50) భాగవత కావ్యంలో ఇదే విషయాన్ని వర్ణిస్తూ, బ్రహ్మాండాలను కూడా – **"చెండుల క్రియ బట్టి యెగుర జిమ్మెదు హరికి..."** (దశమస్కంధం – పూర్వభాగం–913) కొండను పెకిలించి ఎత్తుట ఒక లెక్కలోనిదా అని తెల్పుతాడు. తెనాలి రామకృష్ణుని వర్ణనలో కృష్ణుడు పర్వతాన్ని కందకం వలె ఎత్తితే, పోతన వర్ణనలో కృష్ణుడు పర్వతాన్ని చెండువలె ఎగురజిమ్ముతాడు. ఈ విధంగా పోతన కావ్యం ఆటలోని స్పష్టతను కొంతవరకు విశదపరుస్తుంది. అంతేకాక ఆంధ్ర మహాభాగవత కావ్యంలోనే –

**"ఉయ్యేలలనూగు జేబంతు లొనరవైచు"** (దశమ స్కంధం–పూర్వభాగం–304) అని, శ్రీకృష్ణుని క్రీడలను వివరిస్తూ బంతి ఆటలోని ఒక విభాగమైన చేతి బంతి ఆటను పోతన పేర్కొంటాడు. బంతి ఆట ఎన్నో పేర్లను

కల్గి ఉండి, పేర్లకు తగ్గట్టుగా విభిన్నమైన పద్ధతులతో ఆడబడే విషయాన్ని ముందే సూక్ష్మంగా వివరించాను. వాటిలోని 'వాలీబాల్' అనే ఆటకూ, పైన వవరించిన పోతన చేతి బంతులకు దగ్గరి సంబంధం ఉంది. ఈ చేతి బంతి ఆటలోని హస్తచాతుర్యాన్నీ, నేర్పునూ –

**"హస్త చాతురీ ధురీణత గందుక క్రీడ సలుపు"** (6-8) అని, తొలి తెలుగు జంట కవులుగా పేరుపొందిన నందిమల్లయ – ఘంటసింగనల (క్రీ.శ. 15వ శతాబ్దం ఉత్తరార్థం) వరాహ పురాణ కావ్యం ఇంకా బాగా ధ్రువీకరించింది. ధూర్జటి మహాకవి, వెన్నెలకంటి సూరన కావ్యాల్లో కూడా 'పూవు పుట్టగనే పరిమళించును' అనే సూక్తికి రూపకల్పన చేస్తూ శూరుల భావి జీవితానికి బాల్య దశలోని ఆటలే దర్పణంగా సూచింపబడినాయి. ధూర్జటి (క్రీ.శ. 16వ శతాబ్దం) శ్రీకాళహస్తి మహాత్మ్య కావ్యం తిన్నని బాల్యక్రీడల్లో ఒక భాగంగా –

**"చిడుగువ్వల పోటి చెండు గట్టిన బోది"** (3-33) అని, చెండును గూర్చి తెల్పుతుంది.

వెన్నెలకంటి సూరన (క్రీ.శ. 16వ శతాబ్దం పూర్వార్ధం) తన విష్ణు పురాణ కావ్యంలో – **"పుట్ట చెండ్లుప్పన బట్టెలు లాలంకులు"** (7-202) అని, వస్త్రపు చెండ్లతో బలరామ కృష్ణులు గోపబాలురతో కలిసి ఆడిన చెండాటను పేర్కొన్నాడు. ఈవిధంగా చెండాట ప్రాచీన కావ్యాల్లో భావి కీర్తివంతుల బాల్యదశలోని ఒక ఆటగానే కాకుండా, వారు పెరిగి పెద్దయిన తర్వాత వారి శౌర్య పరాక్రమాలకు నిదర్శనమైన యుద్ధ వర్ణనలోనూ ప్రదర్శితమైంది. రఘువంశపు రాజు దిలీపుని పరాక్రమాన్ని కీర్తిస్తూ, కవి తెనాలి అన్నయ్య (క్రీ.శ. 16వ శతాబ్దం) సుదక్షిణా పరిణయ కావ్యంలో

"..... వైరి వీరుల

జెండాడుట యేమి దొడ్డ? చెండాడు గతిన్" (2-127) అని, వీరులను చెండాడిన విధానాన్ని వర్ణించాడు. కాకమాని మూర్తి కవి (క్రీ.శ. 16వ శతాబ్దం) రాజవాహన విజయ కావ్యం –

"....... శత్రు శిరంబు

చెండుదు నను మాడ్కిజెండుగొను" (2-23) అని, రాజవాహనుడు రణరంగంలో శత్రు శిరస్సును, ఆట స్థలంలో చెండుగా మల్చుకున్న విధానాన్ని వ్యక్తపరిచింది.

'చెండుతో ఆడుకొను' అనే అర్థాన్ని ఆటపరంగానే ఇవ్వాల్సిన 'చెండాడు' అనే పదం – 'చీల్చు, చంపు' అనే అర్థాలను కావ్యార్థపరంగా ఇస్తూ, ఒక జాతీయ పదంగా కూడా చోటుచేసుకుంది. 'చెండు' వేగానికీ, చురుకు దనానికీ, చైతన్యానికీ ప్రతీక – కాబట్టే అటు బాలలకూ, ఇటు వీరులకూ సమంగా స్ఫూర్తినిచ్చి, వారినే ఆటపట్టించి, తన ఔన్నత్య గర్వంతో నేటికీ ద్విగుణీకృత ఉత్సాహంతో చిందులేస్తూనే ఉంది.

*(ఇంకా వుంది)*

ఆచార్య తంగెడ కిషన్ రావు
పూర్వ వైస్ ఛాన్సలర్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
హైద్రాబాద్, ఫోన్ : 7702414100

## కమ్మతెమ్మెర

**మా**ర్చి సంచికలో ఆచార్య కిషన్ రావు గారి రచన 'ఆట జీవితానికి ఆదర్శం' చాలా ఆసక్తితో చదివాను. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలలో ఆటలకు ఉన్న ప్రాధాన్యాన్ని ఆయన చాలా వివరంగా మనసుకు హత్తుకునేలా చెప్పారు. పరీక్షల్లో మార్కులు సంపాదించే పరుగులో నిర్విరామంగా శ్రమపడుతున్న నేటితరం పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆటల విషయమే మర్చిపోయిన ఈ సమయంలో ఆటల ఆనందాన్నే కాదు బాల్యాన్నే మరిచిపోయి పిల్లలు కోళ్లఫారంలోని కోడిపిట్టల్లాగా పుస్తకాల మధ్యలోనే ఉండిపోతున్నారు. దీనివల్ల జరుగబోయే ప్రమాదం గురించి కూడా కిషన్ రావు గారు గట్టిగా హెచ్చరించారు. పాశ్చాత్య దేశాల్లో అమెరికాలో తల్లిదండ్రులు పిల్లల చదువుకి ఎంత ప్రాధాన్యం ఇస్తారో, ఆటపాటలకు అంతకంటే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అందువలననే అక్కడ పిల్లల వ్యక్తిత్వం బాగా వికసిస్తుంది. అంతేకాకుండా, చదువుతోపాటు సంగీతం, ఏదైనా ఒక వాద్యం తప్పనిసరిగా నేర్పుతారు. పదహారేళ్లకే వారు స్వావలంబులవుతారు. అందరితో చదివించదగ్గ వ్యాసం.




*– ఆచార్య జనపన లక్ష్మీరెడ్డి, హైదరాబాద్.*

# కుబేరసామ్రాజ్యం కువైట్

**ఆంగ్లం – డా. నిమ్మగడ్డ శేషగిరి రావు**

**తెలుగు – శ్రీమతి అట్లూరి జయశ్రీ**

**త**లసరి ఆదాయం, జాతీయ ఉత్పత్తి, ఇటువంటి విశాలవైన అంశాల గురించిన ఆలోచన, లోతైన అవగాహన అప్పుడప్పుడే నాకు కలుగుతున్న తొలి రోజుల్లో, అంటే 1980 ఆ ప్రాంతాలలో, అత్యధిక తలసరి ఆదాయం తో, కువైట్ ఎప్పుడూ అతి సంపన్న దేశంగా గుర్తించ బడుతూ ఉండటం ఇప్పటికీ నాకు జ్ఞాపకమే. ఈ రోజుకు కూడా (2025) కువైట్ 'దినార్' చాలా శక్తి వంతమైన ద్రవ్యం. ఒక్క దినార్ 3-3.5 అమెరికన్ డాలర్లకు సరితూగుతుంది. అంటే అమెరికన్ డాలర్ కంటే దినార్ సుమారు మూడున్నర రెట్ల కొనుగోలు శక్తి గలది .

ఇటీవల కాలంలో ప్రపంచ చరిత్ర గతిని మార్చిన దేశంగా కువైట్ నా మనసులో నిలచిపోయింది. 1990వ సంవత్సరం, ఆగస్టు 2 వ తేదీన, ఏమరుపాటున ఉన్న సుసంపన్న కువైట్ మీద మహా సైన్యంతో దాడి చేసి, దానిని ఆక్రమించుకున్న సద్దాం హుస్సేన్, చరిత్రలో చాలా మందికి పీడ కలగా మిగిలిన మనిషి. కువైట్ పొరుగు దేశాలైన యూ. ఎ. ఈ., ఖతార్, ఒమాన్ లతో పోలిస్తే కువైట్‌కు వెళ్ళటం అంత వీలైన పని కాదు. పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న దుబాయి, అబూధాబీ, బహ్రాయిన్, ఒమాన్, ఖతార్ లాంటి నగరాలను ముందే చూసినప్పటికీ, వెళ్లాలని ఉన్నా, కువైట్ వెళ్ళటం పడలేదు. గత 13 సంవత్సరాలుగా కువైట్‌లో ఒక చమురు కంపెనీలో సీనియర్ పెట్రోల్ ఇంజనీరుగా పని చేస్తున్న నా చిరకాల మిత్రుడు సాగర్ నాకు పంపిన ఆహ్వానం ఎప్పటినుండో అట్లానే ఉంది. జనవరి 2018 ఇండియా ప్రయాణంతో పాటు, తప్పని సరిగా ఈ కుబేర దేశం చూసి రావాలని అనుకున్నాను. నేను కువైట్ వస్తున్నానని తెలిసి, సాగర్ రెండు రోజులు నాతో గడపటానికి కేటాయించటం నాకు మరీ బాగుంది. సాగర్ కుటుంబం ఇండియాలో ఉండటంతో, నేను అతనితో పాటు అతని ఫ్లాట్‌లో ఉండ గలిగాను. ఈ ప్రయాణంలో నా డ్రైవరు, నా గైడ్, నా సంరక్షకుడు, నా మిత్రుడు, శ్రేయోభిలాషి అన్నీ మా సాగరే.



కువైట్ నగరం

సౌదీ అరేబియా, ఇరాక్ దేశాల మధ్య ఒదిగి, 17820 చ. కి. మీ. విస్తీర్ణంతో, కువైట్, యూ. కె. లోని వేల్స్ ప్రాంతమంత. అంటే మనదేశంలో కేరళ రాష్ట్రంలో సగం సైజ్‌లో ఉన్నట్లుంది. సౌదీ రాజ కుటుంబపు సంతతి అయిన ఆల్-సబా వంశపు ఎమిర్ ఆధిపత్యంలో ఉన్న కువైట్, ఇప్పటికీ రాచరికం కొనసాగుతున్న దేశాలలో ఒకటి. మత్స్య కారులుండే ప్రాంతంగా మొదలైన కువైట్, కాలాంతరాన, రేవు పట్టణంగా రూపాంతరం చెంది, అరేబియా, ఇండియా ల మధ్య వారధి వేసింది. 1756 లో స్వతంత్ర ప్రతిపత్తి గల షేక్ సామ్రాజ్యంగా వెలసింది. 18, 19 వ శతాబ్దాలలో కువైట్ షేకులు, శక్తివంతమైన ఒట్టోమన్ సామ్రాజ్యంతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు. 1899లో, అప్పటి షేక్, ముబారక్ ఆల్ సబా, తన సవతి సోదరులైన మహమ్మద్, జర్రాలను హతమొందించాడు. ఈ చర్య, ఒట్టోమన్ ఆధీశులను హతాశులను చేసింది. కొందరు అతని మీద సైనిక చర్య తీసుకోవాలని నిర్ణయించుకోవటంతో, ముబారక్ బ్రిటిష్ వారి పంచన చేరాడు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత, కువైట్ బ్రిటిష్ వారి పరిరక్షక ప్రాంతంగా కొంతకాలం కొనసాగింది. 1930లో కువైట్‌లో చమురు నిల్వలు ఉన్నట్లు కనుగొనటంతో, దాని దశ తిరిగింది. 1961లో కువైట్, బ్రిటిష్ వారి నుండి విముక్తమై, స్వతంత్ర దేశం గా నిలబడింది. సంపద్వంతమైన ఈ చిట్టి దేశానికి, పొరుగు పోరు ఎప్పుడూ ఉంది. సౌదీ అరేబియా, ఇరాక్ దేశాల కన్నెప్పుడూ, కుబేర రాజ్యమైన కువైట్ మీదే.

ఇక్కడున్న 4.8 మిలియన్ల నివాసితులలో, మూడో వంతు మాత్రమే కువైట్ పౌరులు. మిగిలిన వారంతా వలస వచ్చిన వారే. ముఖ్యంగా భారతీయులు. వీరి తరువాత అధికంగా కనిపించే వారు ఈజిప్టు వారు. భౌగోళికంగా చూస్తే ఇదంతా అరేబియా ఎడారిలో భాగం. నీటి జాడ లేని పర్ర. త్రాగటానికి కూడ నీరు లేని దేశం.

సముద్రపు నీటినుండి ఉప్పును వేరు చేసుకుంటే కానీ త్రాగు నీరు లేని పరిస్థితి. మరి కుబేరుడు ఇక్కడ ఎలా కొలువు చేస్తున్నాడో తెలియదు!!! బ్రిటిష్ పౌరులకు, ఇక్కడ దిగిన తరువాత వీసా తీసుకునే అవకాశం ఉంది. కానీ, దిగిన తరువాత ఈ పని కోసం ఒక గంట నుండి 12 గంటల వరకు పట్టవచ్చుని, ఆన్‌లైన్ వీసా తీసుకోవటం మంచిదని సాగర్ సలహా ఇచ్చాడు. అక్కడ దిగటానికి మూడు రోజులు ముందే, 40 డాలర్ల ఫీజుతో, 24 గంటలనుకున్నది.. రెండు గంటలలోనే ఆ పని ముగియటంతో ముందుగానే, ఆ దేశపు పని తీరుతెన్నుల మీద నాకు గురి కుదిరి పోయింది.

ఈ రోజుల్లో, ఎక్కడికైనా వెళ్ళడానికి ముందే, ఆ ప్రాంతాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించేటంత సమాచారం రకరకాల మాధ్యమాల ద్వారా మనకు లభిస్తోంది. ఒక విధంగా ఇది చాలా మంచిది. ఆ ప్రాంతపు చరిత్ర, సాంప్రదాయాలు, సంస్కృతి, ఆచార, ఆహార వ్యవహారాలు వగైరాల గురించిన అవగాహనతో అక్కడికి వెళ్ళినప్పుడు, అక్కడున్న కొద్ది సమయాన్ని మరింత అర్ధవంతంగా గడపటానికి వీలవుతుంది. ఈ విషయంలో నేను కొంచెం పాత కాలపువాడిని. నేను వెళ్లాలనుకున్న చోటు గురించి కూలంకషంగా విషయాలను పొందుపరచిన ఒక మంచి పుస్తకాన్ని వెతికి, వెంట పెట్టుకుంటాను. సామాన్యంగా గూగుల్ లో గాని, అమెజాన్‌లో గాని వెతికితే ఇటువంటి పుస్తకాలు చాలానే దొరుకుతాయి. కానీ కువైట్ మీద నాకటువంటివేమీ దొరకలేదు. ఆన్‌లైన్ సమాచారం కూడా అంతంత మాత్రంగానే ఉంది. కువైట్ యాత్రీకులను ఆకర్షించటానికి అట్టే కష్టపడదేమోనని అనిపించింది.

ముంబై నుండి కువైట్‌కు నాలుగు గంటల విమాన ప్రయాణం ఈ ప్రయాణంలో 20 సంవత్సరాలుగా సాగుతున్న నా ప్రయాణాలన్నిటినీ సింహావలోకనం చేసుకుంటుంటే, మొత్తం మీద అవన్నీ ఒక పద్ధతిలో జరిగాయనిపించింది. నాకు తెలియకుండానే, నేను తిరిగిన దేశాలు నాలుగు ప్రత్యేకమైన వర్గాలుగా ఉన్నాయనిపించింది. నా కుటుంబం, మిత్రులతో కలసి, సులభంగా వెళ్ళగలిగిన ప్రదేశాలు మొదటి వర్గంలోకి చేరుతాయి. యూరోప్, ఇంకా ఇంగ్లీషు మాట్లాడే పాశ్చాత్య దేశాలైన యు. ఎస్. ఎ., కెనడా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ లాంటి దేశాలు ఈ వర్గానికి చెందుతాయని అనుకోవచ్చు. కుటుంబ సహితంగా ఈ దేశాలకు వెళ్ళటానికి ఎక్కువ ఆలోచించ వలసిన అవసరం లేదు. వెళ్ళటానికి కొన్ని ప్రత్యేకమైన ప్రయత్నాలు అవసరమైన ప్రదేశాలు కొన్ని రెండో వర్గం. విమాన మార్గాన వెళ్లగలిగే మధ్య ధరా తీరపు దేశాలు.. టర్కి, మొరాకో, క్రోఏషియా, మొదలైనవి, ఇంకా ఆగ్నేయ ఆసియా దేశాలు, ఇండియా, చైనా, మెక్సికో, కరీబియన్, మోరిషస్, కానరీ ఇలాండ్స్.. ఇవన్నీ యాత్రీకులను దృష్టిలో పెట్టుకుని, ఏర్పరచిన సదుపాయాలతో, తేలికగా వెళ్లగలిగేవే కానీ కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు మున్ముందుగానే చేసుకోవాలి.

ఇకపోతే చేరుకోవటం కష్టతరమైన ప్రదేశాలు మూడవ రకం. మధ్య ఆసియా, మధ్య ఆఫ్రికా, మధ్య అమెరికా ప్రాంతాలకు వెళ్ళటం అంత తేలికేమీ కాదు. పాశ్చాత్య దేశాలలో సదుపాయాలకు అలవాటుపడిన వారికి, విమాన మార్గం దరిదాపులలో కూడా లేని దేశాలకు వెళ్ళటం కష్టమే. నేను దర్శించిన ఇరాన్, సిరియా, ఇజ్రాయెల్, లెబనాన్, సూడాన్, పాకిస్థాన్, బర్మా, క్యూబా, ఉజ్బెకిస్తాన్, ఇథియోపియా, మడగాస్కర్, మాసిడోనియా లాంటి బాల్కన్ దేశాలు, బోస్నియా, అల్బేనియా, కాకసస్ పర్వత ప్రాంతపు దేశాలైన ఆర్మేనియా, అజర్బైజాన్ దేశాలు, కొంత వైవిధ్యం కలిగిన యాత్రలను ఇష్టపడేవారికి నచ్చుతాయి. యాత్రలలో నిత్యం సుఖం కోసం వెతుక్కునేవారికి ఇవి సరిపడవు. ఇకపోతే నాలుగవ కోవకు చెందినవి, నిజమైన సాహసయాత్రలు. ఈ దేశాలు క్లిష్టమైన నైసర్గిక పరిస్థితులు, రాజకీయ అస్థిరత, అనిశ్చితి, నిరంతర యుద్ధాలతో అలజడిగా ఉంటాయి. యెమెన్, ఉత్తర కొరియా, ఉక్రెయిన్, సహారా ఎడారి ప్రాంతపు, పశ్చిమ ఆఫ్రికా, వెనిజుయేలా, ఈ తరగతిలో ప్రధానంగా ఉన్నా, ఎవరెస్ట్ పర్వతారోహణ, కిలిమంజారో శిఖరారోహణ, అన్నపూర్ణ పర్వత పాద ప్రదక్షిణ లాంటి వాటిని కూడా ఈ వర్గంలో చేర్చవచ్చు. నా యాత్రలు ఈ నాలుగు రకాలుగానూ సమ న్యాయంతో సాగాయనే అనుకుంటాను. మొదటిరకం యాత్రలకు కుటుంబ సభ్యులు, ముఖ్యంగా పిల్లలతోనూ, సన్నిహితులతోనూ వెళితే, రెండు, మూడు కోవలకు చెందిన యాత్రలు సాధారణంగా ఒంటరిగానే చేస్తుంటాను. నాలుగవ రకమైన ప్రయాణాలకు ముందు, ఎన్నో విషయాలు ఆలోచించు కోవాలి. ఈ యాత్రలు చేయటానికి నిబద్ధతతో కూడుకున్న సుదీర్ఘ కాల ప్రయత్నం, యజ్ఞంలా చేపట్టాలి. ఎంతో ప్రయాసకు తట్టుకోగలగాలి. ఇటువంటి యాత్రలు మిత్ర బృందంతో కలసి చేయటం మంచిదని అనుభవం కొద్దీ తెలుసుకున్న విషయం. ఇట్లా చేయటం వలన విషయ

పరిజ్ఞానాన్ని పెంచుకోవటం, పంచుకోవటం, ఒకరికొకరు అండగా ఉండటం, ఖర్చులు పంచుకోవటం, లాంటి లాభాలెన్నో!!

సాగర్ నివాసం, కువైట్‌కు 30 కి. మీ. దూరాన నగర శివార్లలో ఉన్న 'మాంగాఫ్'లో. అతను నన్ను తీసుకెళ్లటానికి విమానాశ్రయానికి వచ్చాడు. దోవలో తన పెద్ద పడవలాంటి లాండ్ క్రూయిజర్ ప్రాదో కార్‌లో పెట్రోల్ పోయించాడు. పెట్రోల్ ధర లీటర్ 20 రూపాయలు, లేదా 18 పెన్నీలు. అంటే ఇండియా ధరలో నాలుగో వంతు. ఇంగ్లండ్ ధరలో ఏడవ వంతు. ప్రపంచంలోనే చమురు ఉత్పత్తికి 10వ స్థానంలో ఉందట, కువైట్. రోజుకు 2.5 మిలియన్ల బారెళ్ళ (1 బారెల్ = 159 లీటర్లు) చమురు ఉత్పత్తి చేస్తుందట. సౌదీ అరేబియాతో పోల్చితే ఇది నాలుగో వంతే అయినా, అక్కడ నివసించే జన సంఖ్య (1.4 మిలియన్ పౌరులు, 4.7 మిలియన్ నివాసులు) దృష్ట్యా, తలసరి ఉత్పత్తి ఎక్కువ. రోజుకు 15 మిలియన్ బారెళ్ళు, 11 మిలియన్ బారెళ్ళు చమురు ఉత్పత్తి చేసే అమెరికా, రష్యాలను కూడా త్రోసి రాజని, అత్యంత సంపద్వంతమైన దేశంగా పైస్థానంలో కువైట్ నిలవటానికి కారణం ఇదే కదా అనుకున్నాను. మంది తక్కువైతే మజ్జిగ చిక్కన అంటారు. మరి కుబేరుడు ఉండటానికి నీళ్ళు లేకపోయినా, చమురు ఉంటే చాలనుకుంటా!!

పదమూడేళ్లుగా కువైట్‌లో ఉంటున్నా, తనను చూడటానికి వచ్చిన వారే కానీ నాలా కేవలం దేశమంతా తిరిగి చూడటానికి మాత్రమే వచ్చిన వారు లేరని సాగర్ అన్నాడు. అతను చెప్పిన దాని ప్రకారం, కువైట్ అంతర్జాతీయ యాత్రికులకు అంత ఆకర్షణీయం కాదు. నా కెవరైనా అ ప్రాంతమంతా బాగా తెలిసిన గైడ్ దొరుకుతారేమో చూడమని సాగర్‌ను కోరాను. అట్లా ఒకరు దొరికారు కానీ రోజుకు 600 డాలర్లు అడగటంతో, ఏకగ్రీవంగా నిరాకరించాము. ఆ గైడ్ గతంలో పెద్ద పెద్ద అధికారులకు, దేశాధినేతలకు పని చేశాడట. నాలాంటి సామాన్య యాత్రికులకు అతని ఖర్చు భరించటం కష్టం. చివరికి సాగర్ ఆధ్వర్యంలోనే పుర విహారం చేయటానికి నిర్ణయించుకున్నాము. అదీ ఒకందుకు మంచిదేలే అనిపించింది. తొందర లేకుండా, మన సమయాన్ని మనకు కావాలసినట్టు, సన్మిత్ర సాంగత్యంలో గడపవచ్చు.

మొదటగా మేము చూసినది, 413 మీటర్ల అల్ హమ్రా టవర్. ఇది కువైట్‌లో అత్యంత ఎత్తయిన భవనం. 2018లో, ప్రపంచంలోని ఎత్తైన భవనాలలో 15వ దానిగా ఈ టవర్ ఉంది. ఒక పలుచని ఎత్తైన రేకు ముక్కను నిలుచోబెట్టి నపుడు, జవ జవ లాడుతూ, వంకర తిరిగి వాలుగా, విలాసంగా నిలబడినట్లున్న ఈ టవర్, వంపు తిరిగి ఉన్నతంగా నిలబడిన ఆకాశ హర్మ్యాలలో మొదటిదట.



ఆల్ హమ్రా టవర్

కువైట్ మొత్తంలో 34 టవర్లు ఉన్నాయి. వీటిలో33 టవర్లు, సముద్రపు నీటి నుండి స్వేదనం ద్వారా, ఉప్పును వేరు చేసి, తేర్చుకున్న నీటిని నిలవ చేసే వాటర్ టాంకులు. ఒక దానిలో మాత్రం ఏవేవో పరికరాలు ఉంటాయి. వీటిని 6 గ్రూప్‌లుగా నిర్మించారు. 6వ గ్రూప్‌లో నిర్మించబడిన 'కువైట్ టవర్లు' అరేబియన్ గల్ఫ్ రోడ్డులో ఉన్నాయి. ఇవి మూడు టవర్లు. పర్షియన్ గల్ఫ్ లోపలికి చొచ్చుకు పోయిన భూభాగంలో వర్తులాకారం గా వీటిని నిర్మించారు. కువైట్ క్షితిజ రేఖకు ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన భవన సముదాయం ఇది. ఈ మూడు టవర్లలో, ఎత్తైన టవర్ 187 మీటర్లు. వర్తులాకారపు భవంతిలా సాగిన ఈ భవన నిర్మాణం, కొంత ఎత్తుకు వెళ్ళాక, ఒక పెద్ద గోళాన్ని మోస్తుంది. దీని క్రింది అర్ధ భాగం 4500 క్యూబిక్ మీటర్ల నీటిని నిలువ చేసే టాంకు. పై అర్ధ భాగం 90 మందికి సరిపోయే రెస్టారెంటు. దీని పైన మళ్ళీ కొంత వర్తులాకారపు భవన నిర్మాణం. మళ్ళీ మరొక గోళం. ఇక్కడికి దీని ఎత్తు 123 మీటర్లు. ఈ గోళం దాని ఇరుసు మీద, ప్రతి 30 నిముషాలకు ఒకసారి 360 డిగ్రీలు తిరగటం పూర్తి చేసుకుంటుంది. ఇందులో ఒక కెఫే ఉంది. ఇక్కడ 30 నిముషాల పాటు కూర్చుంటే, కువైట్ దృశ్యాలు మన కళ్ళ ముందు ఆగకుండా కదలిపోతూ పూర్తిగా ఆవిష్కరమవుతూ ఉంటాయి. దీని పైన ఇంకా కొనసాగిన నిర్మాణం, కొసతేలి ఆకాశం లోకి చొచ్చుకు పోతున్నట్లు కనపడుతుంది. రెండవ టవర్ ఇదే నమూనాలో, ఒక్క గోళాన్ని మోనస్తా కనపడుతుంది. దీని ఎత్తు 147 మీటర్లు. దీనిని పూర్తిగా నీటిని నిలవ చేయటానికే వాడతారు. మూడవది కొనసాగి పోయిన టవర్. దీని మీద గోళాలేమీ లేవు. మిగిలిన రెండు టవర్లకు సంబంధించిన ఉపకరణాలు ఇందులో

ఉంటాయి. ఇక్కడ సందర్శకులను అనుమతించిన వరకు వెళ్ళటానికి టికెట్ ఉంది. సాగర్ టిక్కెట్స్ కొని తెచ్చాడు. 80 మీటర్ల ఎత్తులో ఒకసారి, 120 మీటర్ల ఎత్తులో మరొకసారి ఆగినపుడు కనుచూపు మేరా కనిపించే కువైట్ నగర దృశ్యాలు... ఒక వైపు మానవ నిర్మిత కుబేర సామ్రాజ్యం, మరొక వైపు సుందర అరేబియన్ సాగర సౌందర్యం. కనువిందుగా ఉన్నాయను కున్నాను. సాగర్ సాన్నిహిత్యంతోవాతావరణం స్నేహ సౌరభాలతో గుబాళించుతూనే ఉంది. .

ఇక్కడ రెండు ప్రధాన రహదారులున్నాయి. ఒకటి హై వే 30, రెండవది హై వే 40. వీటితో పాటు తీరం వెంట సాగి పోయే అరేబియన్ గల్ఫ్ రోడ్డు, నగరం చుట్టూ వేసిన 7 వరుసల రింగు రోడ్డు తో కువైట్ జన జీవన, రవాణా, ప్రసారం, ప్రయాస లేకుండా, నిరాటంకంగా సాగుతున్నట్లు కనపడింది. అక్కడ నుండి బయలుదేరి, మరొక మూడు నూతన భవనాల వైపు సాగిపోయాము. మొదటిది సమావేశ మందిరం (కన్వెన్షన్ సెంటర్), రెండవది నాటక శాల. మూడవది సంగీత కచేరీల కోసం. మూడు భవనాలను చాలా పెద్ద ఎత్తున నిర్మించారు. ఈ మూడు భవనాల మీద ఒక పెద్ద కార్ పార్కింగ్, దాదాపు ఒక కి. మీ. పొడవున సాగి ఉంది. అంత పెద్ద పార్కింగ్‌లో మా కారు ఒక్కటే ఉంది. మరొక 10 మైళ్ళ ప్రయాణం తరువాత, సాగర్ కారు ఇళ్ల మధ్యలో ఉన్న ఒక అద్దాలమేడ ముందు ఆగింది. విలాసవంతంగా కనపడుతున్న అక్కడి ఇళ్ళన్నీ, అదొక ధనిక నాగరీకులుండే చోటు అని చెప్పకనే చెపుతున్నాయి. అద్దాల మేడ ముందు భాగమంతా గోడలకు అద్దపు ముక్కల తాపడంతో తళ తళ లాడుతోంది. లిడియా ఆల్ కట్టాన్ ఇటలీకి చెందిన కళాకారిణి. ఆమె, నవతరం కువైట్ కళాకారుడైన ఖలీఫా ఆల్ కట్టాన్‌ను వివాహం చేసుకున్నది. మేము చూస్తున్న ఈ కళాఖండం ఆమె సృష్టే. ప్రస్తుతం ఇదొక మ్యూజియం. సాగర్ సహోద్యోగి ఒకరు, ఇదొక అద్భుత సృజన అని, నాకు తప్పక చూపించమని చెప్పారట. ఇంత దూరం ప్రయాణం చేసి, తీరా ఇక్కడకు వచ్చాక, అక్కడ ఎవరూ కనపడలేదు. తాళం వేసి ఉంది. ఏమి చేయాలో తెలియక అటూ ఇటూ చూస్తుంటే, అటుగా పోతున్న ఒక వ్యక్తి మా వైపు వచ్చాడు. చూడగానే మా పరిస్థితి అర్ధమైనట్లుంది. అతను చెప్పిన దాని ప్రకారం, ఈ భవనం చూడాలంటే, ముందుగా లిడియాతో, మాట్లాడి, సందర్శన సమయం కుదుర్చుకోవాలాట. అప్పుడు ఆమె స్వయంగా తానే వచ్చి రెండు గంటల పాటు అంతా తిప్పి చూపిస్తుందట. ఆమె ఫోన్ నెంబర్ కూడా ఇచ్చాడు. అది అంత అర్రీ బర్రీగా కుదిరే వ్యవహారం కాదని తెలిసిపోయింది. ఈ సారికి బయట నుండి చూడటంతో సరి పెట్టుకుని అక్కడి నుండి వచ్చేశాము. మొత్తానికి అక్కడ కుబేరుడి సంస్థానాధీశుల నివాస గృహాలు చూశామనిపించింది.

చమురు నిక్షేపాల పుణ్యమా అని, నడమంత్రంగా నడచి వచ్చిన సిరితో, మధ్య ఆసియా గల్ఫ్ దేశాలన్నీ, తమ దేశాలను తీర్చి దిద్దుకునే ప్రయత్నంలో పడ్డాయి. ప్రపంచ పటంలో, తమ ఉనికిని గొప్ప గొప్ప భవంతుల రూపంలో చాటుకోవాలనే వారి ప్రయత్నంలో భాగంగా, అక్కడ వైభవంగా కనిపించే మసీదులు కట్టబడ్డాయి. ఉపయోగంతో పాటు, అధ్భుత సాంకేతిక ప్రతిభను ప్రతిఫలించే భవనాలు మానవ మేధకు ఋజువులుగా కూడా వెలిశాయి. కువైట్ కూడా ఇదే పంధాను అనుసరించినా, ఇక్కడి మసీదులు మాత్రం, దీని పొరుగు దేశాలైన అబూ ధాబీ, మస్కట్, ఖతార్, బహ్రాయిన్‌లలో కనిపించే మసీదులంత గొప్పగా నాకు కనపడలేదు. ఇక్కడి మసీదుల చుట్టూ దగ్గరగా కట్టిన ఇతర నిర్మాణాల వలన కూడా, వీటి కళతగ్గినట్లు కనిపించింది. మేము అక్కడికి వెళ్ళేసరికి, మధ్యాహ్నం ఒంటి గంట అయింది. మసీదు చుట్టూ కట్టిన చిన్న భవనాలలో ఒక దానిలో కొందరు కేరళ ముస్లిములు సమావేశమై ఉన్నారు. అక్కడ, మసీదుకు సంబంధించిన వ్యక్తి ఒకే ఒక్కడున్నాడు. అతనే మమ్మల్ని లోపలంతా తిప్పి చూపించాడు.

ఆపాటికి భోజన సమయమవటంతో, ఆల్ ముబార్కియా సూక్‌లో 'ఫ్రీజ్ స్వేలే' రెస్టారెంట్ వైపుకు మళ్ళాము. ఇది కూడా, సాగర్ సహోద్యోగుల సలహానే. సూక్ మొదట్లోనే, మూడంతస్తుల భవనంలో ఉంది ఇది. అంత పెద్దదేమీ కాదు. ఎక్కడా ఇంగ్లీషు కనపడలేదు. అంతటా అరబిక్ వ్రాతలే ఉన్నాయి. ఇదీ ఒకందుకు మంచిదే ఎందుకంటె, ఇక్కడకు వచ్చేవారు ముఖ్యంగా స్థానికులై ఉంటారు. దాని లోపలికి వెళ్ళగానే, అక్కడొక పౌర సమావేశమేదో జరుతున్నట్లనిపించింది. ఇక్కడ విశ్రాంతిగా కూర్చుని భోజనం చేయటం కుదరని పని అనిపించింది. ముఖద్వారం బయటే గెస్టుల పేర్లు తీసుకుంటూ, టేబుల్ కేటాయిస్తూ ఒక హొటల్ ఉద్యోగి కనిపించాడు. అతని చుట్టూ ఒక గుంపు ఉంది. ఇదంతా చూసి, సంశయిస్తూ

మరొక చోటుకు వెళ్లిపోదామా అనుకుంటున్న మమ్మల్ని, ఎక్కడినుండి చూశాడో... చూసి, అతను మా దగ్గరకు వచ్చి, ఇంకొక్క 15 నిముషాలుంటే రద్దీ తగ్గి, టేబుల్ దొరుకుతుందని హిందీలో చెప్పాడు. 'సరేలే' అని సర్ది చెప్పుకుని అక్కడే టేబుల్ దొరికే వరకు కూర్చున్నాము.

20 నిముషాలకు మాకు టేబుల్ దొరికింది. అప్పటికే అక్కడ దాదాపు 150 మందికి భోజనం అందిస్తున్నారు. కుటుంబంతో వచ్చిన వారిని పై అంతస్తుకు పంపుతున్నారు. మేమేమీ ఆర్డరు చేయక ముందే, కూరగాయల ముక్కలు, తరిగిన ఉల్లిపాయలతో ఆకర్షణీయంగా కనపడుతున్న ఒక పెద్ద సలాడ్ బౌల్ మా ముందుంచబడింది. అతిథుల గౌరవార్ధం దానిని ఉచితంగా ఇస్తారట. మాకు తెలిసిన అరబిక్ పదార్థాలతో మా భోజనం మొదలెట్టాము. శెనగలతో తయారు చేసే హమస్, బాబా ఘనోష్ అనే కాల్చిన వంకాయల వంటకం, బ్రెడ్‌లతొ మొదటి వాయ భోజనం బ్రహ్మానందంగా ఉంది.

ఆహారంలో ప్రధానాంశంగా ఏదైనా మంచి కువైట్ వంటకాన్ని సూచించమని హోటల్ వెయిటర్‌ను అడిగాను. 'చికెన్/మటన్ మాజ్బూస్' కానీ, చేప ఇష్టమైతే 'ముతాబక్ జుబైది' కానీ తీసుకోమని చెప్పారు. నేను చేప వంటకం కావాలని చెప్పాను. సాగర్ చికెన్ మాజ్బూస్ అడిగాడు. ఈ రెంటిలోనూ కనిపించినది కుంకుమ పువ్వు, వెన్న వేసి వండిన అన్నం. దీని మీద నాకు, రక రకాల సుగంధ ద్రవ్యాలు, ఉల్లిపాయలు వేసి, వండిన ఒక పెద్ద చేపను వడ్డించారు. దానిని రుచి చూడటంతోనే, మళ్ళీ మళ్ళీ తినాలనిపించే పదార్థాల జాబితాలోకి దానిని చేర్చేసుకున్నాను. భోజనానంతరం తెచ్చిన తాజా తాజా స్వీటు, నా స్వీటు సన్యాసానికి తాత్కాలికంగా చెక్ పెట్టింది. మంచి కాఫీ, గ్రీన్ టీ, యాలకులు ఇంకా ఇతర దినుసులతో తయారయ్యే కహ్వాలతో అక్కడ మధ్యాహ్న భోజనం ముగిసింది. దీని తరువాత ఒక మంచి నడక కావలసిందే. సూక్ ఈ మూల నుండి ఆ మూలకు ఒక సుదీర్ఘ కాలినడక ప్రారంభించి, లిబరేషన్ టవర్ చేరుకున్నాము. ఆపాటికి మృష్టాన్న భోజన ఆయాసం, నిద్రావస్థ వదలిపోయాయి. ఆల్ ముబారకియా సూక్ హడావుడిగానే ఉంది కానీ నాకెందుకో, ఇస్తాంబుల్, దమాస్కస్, కెయిరో, దుబాయిల సూక్‌లలో నేను చూసిన వాస్తవిక జనజీవన ప్రతిబింబం ఇక్కడ అనుభవంలోకి రాలేదు.

లిబరేషన్ టవర్ 372 మీటర్ల ఎత్తుతో, ఆల్ హమ్రా టవర్ తరువాత రెండవ స్థానంలో ఉంది. ఇరాక్ కబంధ హస్తాల నుండి కువైట్ విముక్తి చెందిన చారిత్రాత్మక ఘట్టానికి గుర్తుగా దీనిని నిర్మించారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 26 వ తేదీని 'జాతీయ విముక్తి దినం' గా గుర్తు చేసుకుంటారు. 1990 ఆగస్టు 2వ తేదీన సద్దాం హుస్సైన్ సైన్యం కువైట్ మీద ఆకస్మాత్తుగా దాడి చేసి రెండు రోజుల్లో దానిని కైవసం చేసుకుంది. దీనికి కొంత నేపథ్యం ఉంది. 1980లలో జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధంలో, పెరుగుతున్న ఇరాన్ ప్రాబల్యానికి జడిసిన కువైట్, ఇరాక్‌కు అప్పు రూపంలో ఆర్థిక మద్దత్తు ఇచ్చింది. యుద్ధానంతరం, దాదాపు దివాళా తీసిన ఇరాక్, కువైట్ నుండి తీసుకున్న అప్పు తీర్చే పరిస్థితి లేదు. అంతేకాకుండా, ఏటవాలుగా జరిపిన త్రవ్వకాల మూలంగా, కువైట్ ఇరాక్ వారి చమురు నిల్వలను కొల్లగొట్టిందని, ఇరాక్ నియంత సద్దాం హుస్సైన్ ఆరోపించాడు కూడా. ఈ రెండు రోజుల మెరుపు దాడికి దారి తీసిన పరిస్థితులు ఇవి అని వినికిడి. విచిత్రమేమిటంటే, ఇరాన్ ఇరాక్‌ల మధ్య నడచిన యుద్ధంలో, ఇరాన్ అంటే నచ్చని పాశ్చాత్య దేశాలు, సద్దాం హుస్సైన్‌కు మద్దత్తు పలికి, అతని ప్రాబల్యాన్ని పెంచి పోషించారు. అతడు, కువైట్ మీద దాడి చేసిన వెంటనే, వీరే అతనిని, నియంతగా, రాక్షసునిగా అభివర్ణించారు. 1991 ఫిబ్రవరి నెలలో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో నడచిన 48 నానా దేశాల సైన్యం జరిపిన ఆపరేషన్ డెసర్ట్ స్టోర్మ్ ఫలితంగా కువైట్ విముక్తమవటం...నాకు తెలిసిన సమకాలీన చరిత్ర. దీనిని మొదటి గల్ఫ్ యుద్ధంగా కూడా అభివర్ణిస్తారు. ఇదంతా నేను నా ఇంట్లో కూర్చుని చూడగలగటం శాటిలైట్ టెక్నాలజీ సౌజన్యంతోనే. అప్పుడే దానికున్న అపరిమిత సంభావ్యత ప్రపంచానికి పరిచయం చేయబడింది.

ఈ యుద్ధంలో కొల్లగొట్ట బడిన నేషనల్ మ్యూజియం, తరువాత మళ్ళీ పునరుజ్జీవనం పొందింది. అక్కడ మేము, ఫైలకా ద్వీపం నుండి సంగ్రహించిన పురావస్తువులు, హెలెనిస్ట్ కాలం నాటి రాతి ఫలకాలు, మొదలయిన సేకరణలను చూసాము. మ్యూజియం చూడటం పూర్తయ్యే సరికి సాయంత్రం అయింది. రాత్రి దీపాలతో వెలిగే కువైట్ టవర్లు చూడాలని సాగర్ సూచించటంతో మళ్ళీ అటు వెళ్ళాము. నిజంగానే, మారే రంగులతో వెలుగుతున్న టవర్లు, అలౌకికంగా కనిపించాయి.

మరోసారి సముద్రతీరంలో, నగర సౌందర్యాలను

కళ్ళలో నింపుకుని, ఒక గంట ప్రయాణం చేసిన తరువాత సాగర్ అపార్ట్మెంట్ చేరుకున్నాము. వెళుతూ వెళుతూ, లు లు సూపర్ మార్కెట్‌లో రాత్రి భోజనానికి కావలసినవి కొనుక్కున్నాము. అక్కడ దొరకని రుచులు లేవు. ఇండియన్, అరబిక్, వంటకాలతో పాటు చాలా రకాల అంతర్జాతీయ రుచులు కూడా ఉన్నాయి. అక్కడ నివసించే జనాభా ఎన్ని రకాలైన వారో, ఇక్కడ విక్రయిస్తున్న వంటకాల వైవిధ్యం చూస్తే తెలుస్తుంది. చికెన్ షావర్మా జన బాహుళ్యంలో చాలా ప్రాచుర్యం పొందిన అరబిక్ ఫాస్ట్ ఫుడ్. అదే నేను తీసుకున్నాను. అనుకున్నట్లే చాలా రుచిగా ఉంది.

సాగర్ అపార్ట్మెంట్ ఉన్న మాంగాఫ్, ఎత్తైన అపార్ట్మెంట్ల సముదాయంతో ఉన్న నివాస ప్రాంతం. అతని ఫ్లాట్ చాలా విశాలంగా, మా ఇద్దరికీ 'చాలా ఎక్కువ' అన్నట్లు ఉంది. ఇక్కడ, వలస వచ్చిన వారికి స్వగృహం కొనుక్కోవటం అంత తేలికేమీ కాదట. కానీ అద్దెకు తీసుకోవటం తేలికే. పైగా అక్కడ ఎంత కాలం ఉంటాడో తనకే తెలియదు కాబట్టి, ఇల్లు కొనుక్కోవటం గురించి సాగర్ ఆలోచన కూడా చేయటం లేదు.

నాకు కువైట్‌లో ఇంకొక రోజు ఉంది. సాగర్ మిత్రులు నన్ను అవెన్యూస్ మాల్‌కు తీసుకెళ్లమని చెప్పారట. 1.2 మిలియన్ చ.మీ. వైశాల్యంతో, ఇది ప్రపంచంలో అతి పెద్ద షాపింగ్ మాల్‌లలో రెండవది. అదొక్కటి చాలు నా రెండవ రోజు మొత్తం గడిపివేయటానికి. కానీ ఆ ఆలోచనే నాకు నచ్చలేదు. ఇంత దూరం వచ్చింది షాపింగ్ మాల్‌లో గడపటానికా? అనిపించింది. పైగా అమెరికా, ఇంగ్లండ్ దేశాలలో అటువంటివి చాలా చూశాను. నాకు కొనుక్కో వలసినవి ఏమీ లేవు కూడా. 'అది నా వల్ల కాని పని' అని సాగర్ నొచ్చుకోకుండా చెప్పటానికి నేను చాలా కష్ట పడవలసి వచ్చింది. "అవి ఎంత గొప్ప వైనా, అక్కడి నుండి బయట పడే సరికి నేను మానసికంగా ముడుచుకు పోతాను" అని మోమాటం లేకుండా చెప్పేశాను. నా పరిస్థితిని పెద్ద మనసుతో అర్థం చేసుకుని, సాగర్ మరో సూచన చేశాడు. అది ఫైలకా ఐలాండ్. అరేబియన్ గల్ఫ్‌లో, కువైట్ నగర తీరానికి 20 కి. మీ. దూరం. అక్కడున్న పురాతన, సమకాలీన చరిత్ర ఆనవాళ్ళు కువైటీలకు గర్వకారణమట. చాలా మంది వారాంతపు సెలవు గడపటానికి అక్కడికి వెళతారట. సాగర్ ఆ మాట చెప్పటం పూర్తి కాక ముందే, 'మనం అక్కడికే వెళుతున్నాం' అని చెప్పేశాను. నా సంతోషాన్ని గమనించి అతను కూడా ఒప్పేసుకున్నాడు. ఉదయపు ఉపాహారం, శరవణ భవన్‌లో. శరవణ భవన్ ప్రయాణం చెన్నైలో మొదలై, ప్రపంచమంతా చుట్టింది. ఒక్క లండన్‌లోనే మూడు బ్రాంచీలు ఉన్నట్లు నాకు తెలుసు. ఆనియన్ మసాలా దోశ, నన్ను కువైట్‌లోనే, జన్మ భూమికి దగ్గరగా తీసుకెళ్ళింది. బ్రేక్ఫాస్ట్ తరువాత, కువైట్ మెరినాలో కార్ వదిలేసి, స్పీడ్ బోట్ వైపుకు దారి తీసాము. వాతావరణం కొంచెం వేడెక్కుతోంది. ఆ మాటే పైకి అంటే, సాగర్ నేను మంచి టైమ్‌లో కువైట్ వచ్చానని అన్నాడు. జనవరి నెల ఇక్కడ ఆహ్లాదంగా ఉంటుందట. అదే జులై/ ఆగస్ట్ నెలలో, వేసవికాలంలో వస్తే ఉష్ణోగ్రత 56 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటుందట. మండుటెండ నుండి తప్పించు కోవటం కోసమే, వాళ్ళ స్వాతంత్ర్య దినోత్సవాన్ని కూడా జూన్ నుండి ఫిబ్రవరికి మార్చుకున్నారట.

స్పీడ్ బోటు ఎక్కి కూర్చుని, దూరమౌతున్న కువైట్ క్షితిజరేఖను చూస్తూ, నిద్రలోకి జారుకున్నాను. ఫైలకా ఐలాండ్ చేరటానికి 40 నిముషాలు పట్టింది. మధ్యలో సాగర్ నన్ను కుదిపి లేపాడు. డాల్ఫిన్లు గుంపులుగా సముద్రంలో పైకెగిరి, పల్టీ కొట్టి మళ్ళీ సముద్రంలోకి దూకుతూ ఆడుకుంటున్నాయి. వాటి సహజ వాతావరణంలో డాల్ఫిన్లను నేను మొదటిసారి చూస్తున్నాను. సాగర్ నన్ను లేపటం మంచిదయ్యింది. బోటు కెప్టెన్ చెప్పిన దాని ప్రకారం, అక్కడ డాల్ఫిన్ల సయ్యాట మామూలుగా కనిపించే దృశ్యమేనట. చాలా సంవత్సరాల క్రిందట, నా భార్యతో కలసి మారిషస్ వెళ్ళినప్పుడు, హిందూ మహాసముద్రంలో డాల్ఫిన్లను చూడటం అనేది ఒక రోజంతా పట్టే ట్రిప్. ఆ రోజంతా ఎదురు చూసినా, ఒక్క డాల్ఫిన్ కూడా అప్పుడు మాకు కనపడ లేదు. ఇప్పుడు ఇక్కడ అనుకోకుండా హృద్యమైన ఆ దృశ్యం కనపడటం, ఆశ్చర్యకరమైన పరమానందం.

**ఫైలకా ఐలాండ్** : ఫైలకా ఐలాండ్ గురించి ముందు రోజు కువైట్ నేషనల్ మ్యూజియంకు వెళ్ళినప్పుడు కొంత విని ఉన్నాను. అందుకే అక్కడికి వెళ్ళి చూడాలని బలంగా అనిపించింది. ఇక్కడ క్రీ. పూ. 3000 నాటికే మెసపోటేమియన్లు నివసించిన ఆనవాళ్లు ఉన్నాయి. దిల్మున్ నాగరికత ఏర్పరచుకున్న దిల్మున్లు అరేబియా ద్వీపకల్పంలోని పర్షియన్ గల్ఫ్‌లో స్థిరపడ్డారు. వీరు ప్రవృత్తి రీత్యా వర్తకులు. ఈ నాగరికతకు సంబంధించిన కేంద్రాలను ఇదివరలో బహ్రెయిన్‌లో నేను చూశాను. తరువాత కొంత



ఫైలకా ఐలాండ్‌లో ఒక శిధిలం

కాలం పాటు, ఈ ద్వీపం గ్రీకు వారి అధీనంలో ఉంది. ఇక్కడ వారు ప్రార్థనా మందిరాలు మొదలైన నిర్మాణాలను చేపట్టారు. అలెక్సాండర్ ది గ్రేట్ తన సైన్యాన్ని ఇక్కడ విడిది చేసేవాడని ప్రతీతి. ఇట్లా ప్రతి శకము నుండి సేకరించిన ఆనవాళ్ళు కువైట్ మ్యూజియంలో ఇన్నాయి. వీటి వెలికి తీతలో డేనిష్ పురావస్తు శాస్త్రజ్ఞుల పాత్ర ఎంతో ఉందట. 1990, ఆగస్టు నెలలో కువైట్ మీద మెరుపు దాడి చేసిన సద్దాం హుస్సేన్ తన సైన్యాన్ని ఫైలకా ద్వీపంలోనే మోహరించాడట. ఆనాటికి ఫైలకా చిన్న పట్టణం. అక్కడ సుఖంగా జీవిస్తున్న 2000 మంది తమ ఇళ్ళూ, వాకిళ్ళను శాశ్వతంగా వదిలేసి కువైట్ నగరానికి తరలి వచ్చేశారు.

ఈ రోజు మనకు అక్కడ కనిపించేది ఇరాకీ సైన్యం అమానుషంగా తుపాకీ గుళ్ళతో, బాంబులతో గుల్ల చేసిన శిధిల భవనాలు మాత్రమే. నివసించే మనుషులు లేక వట్టి పోయిన ఊరులో దిట్టమైన రోడ్లు అట్లానే ఉన్నాయి. వీధి దీప స్తంభాలు, వదిలి పోయిన మనుషుల కోసం తలలు వాల్చి దుఃఖిస్తున్నట్టు, ఒరిగిపోయి ఉన్నాయి. ఆ వీధుల వెంటే కొంత దూరం నడుస్తూ వెళ్ళాము. అక్కడ శిధిలమైన భవనాలను చూస్తూ జరిగిన వినాశనాన్ని అంచనా వేయటానికి ప్రయత్నించాను. ప్రత్యేకంగా అక్కడ ఒక స్కూలుభవనం నా దృష్టికి వచ్చింది. ఇప్పటికీ చూపరులను ప్రశ్నిస్తున్నట్లున్నల్ల బోర్డు, విరిగిన కుర్చీలు, బల్లలు, మా వైపు తేరిపార చూస్తున్నట్లు కనిపించాయి. బాంకులూ మొదలయిన ధృఢమైన భవనాలు గట్టిగానే ఉన్నాయి కానీ, చెక్కులు పోయి ముక్కలు విరిగి, సద్దాం సైన్యంబాంబులూ, తుపాకీ గుళ్ళతో చెక్కిన వికృత కళా ఖండాలుగా కనపడుతున్నాయి. కువైట్ సైన్యం సద్దాం హుస్సేన్ సైన్యాన్ని ఎంతో కాలం నిలువరించ లేక పోయాయి. చాలా మంది కువైట్ ప్రజలు, రాజ కుటుంబం, అధికార వర్గం కూడా పొరుగున ఉన్న సౌదీ అరేబియాకు పెద్ద వాహనాలలో పారిపోయి రక్షణ పొందారు. కువైట్ ఒక సునంపన్న దేశం కాక పోయినట్లయితే, చరిత్రలో ఈ ఘటన, ఒక పెద్ద దేశం, పొరుగున ఉన్న చిన్న దేశాన్ని సహజంగా కబళించినట్లు చెప్పుకోవటంతో అయిపోయేది. పర్షియన్ గల్ఫ్ ప్రపంచపు ఇంధన ఖజానా. కువైట్ మీద ఇరాక్ దాడిని ఖండించి, నిలువరించక పోతే, సౌదీ అరేబియాతో పాటు, మిగతా చమురు నిక్షేపాలున్న గల్ఫ్ దేశాలన్నీ సద్దాం గుప్పిటలో చిక్కి, చివరికి ప్రపంచ దేశాలన్నీ అతనికి దాసోహమన వలసిన ప్రమాదకర పరిస్థితివస్తుందనే ప్రతిపాదనతో, పాశ్చాత్య దేశాల నాయకత్వంలో 48 ప్రపంచ దేశాలు సకాలంలో సైనిక చర్య తీసుకోవటం వలన, చరిత్ర గతి మారింది. ఆసక్తి కలిగించిన విషయం ఏమిటంటే, కొద్ది కాలం క్రితమే యుద్ధ భూమిగా ఉన్న ఈ ఐలాండ్, ఈ రోజు పర్యాటక ఆకర్షణగా మారింది. జరిగిన వినాశనం, మిగిలిన శిధిలాలు స్వార్థం నిండిన మనుషుల రాక్షస చర్యలకు ప్రతీకలుగా నిలచి ఉన్నాయి. అదొక భవనం లేని మ్యూజియంలా, నియంతల నిరంకుశత్వానికి నిలువెత్తు నిదర్శనంగా ఉంది. పచ్చని జీవితాలు, క్షణాలలో మంటగలిపే దానవులుంటారని నిత్యం గుర్తు చేయటానికా అన్నట్లు శోకిస్తూ ఇంకా అలాగే ఉంది.

అక్కడ ఒక బస్ టూరు కూడా ఉంది. బస్‌లో వెళ్ళినప్పుడు సద్దాం హుస్సైన్ దురాగతానికి గురైన ప్రతి అంగుళాన్ని చూడవచ్చు. ఒక చోట దజన్ల కొద్దీ ఇరాకీ సైన్యం ఉపయోగించిన టాంకులు, వాహనాలు, తుపాకులు, బాంబులు విసరటానికి ఉపయోగించే హొవిట్జర్లు, పోగువడి కనివించాయి. ఇవేవీ పనికొచ్చేటట్లు లేవు. చూడటానికి ఇదంతా ఎంతో విచారకరంగా ఉన్నా, వాటిని అలా ప్రదర్శించటం.. యుద్ధ పర్యవసానాలు ఎట్లా ఉంటాయో ముందు తరాల వారికి తెలపటానికి ఉపయోగ పడుతుందని నాకనిపించింది.

**నర జాతి చరిత్ర సమస్తం పర పీడన పరాయణత్వం..**
**రణరక్త ప్రవాహసిక్తం భీభత్సరస ప్రధానం ..**
**నర హంతలు ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి**
**రణరంగం కాని చోటు భూ స్థలమంతా వెతికినా**
**దొరకదు** అని శ్రీ శ్రీ చెప్పినట్లు .. చరిత్ర పొదవునా.. పరిణామ క్రమానికైనా, సాంస్కృతిక పురోగతికయినా,

మతానికైనా, ధనానికైనా.. మనుషులు కొట్టుకోవటమే ఎక్కువసార్లు జరిగేది. శాంతియుత సహ జీవనం, అహింస, లాంటి సిద్ధాంతాలు ఇటీవల కాలంలో ఉద్భవించినవే. విద్యాభ్యాసం, సాంఘిక విలువలపట్ల అవగాహన ఇందుకు కారణం కావచ్చు. ఇటువంటి ప్రదేశాలు హింసాయుత యుద్ధ పర్యవసానాలను మన కళ్ళ ముందుంచుతూ, మనిషిలో స్వతహాగా ఉండే హింసా ప్రవృత్తిని నిమ్మళింపచేసే ప్రయత్నం చేస్తాయని నా నమ్మకం.

ఈ ఐలాండ్‌లో మేమొక ఒంటెల శాలకు వెళ్ళాము. ఇక్కడున్న ఒంటెలు తెల్లనివి. వీటి దూడలు, దక్షిణ అమెరికాలో కనిపించే లామాలలాగా, చాలా చూడ ముచ్చటగా ఉన్నాయి. ఇక్కడ ఒకప్పటి స్థానిక జీవన విధానాన్ని ప్రదర్శించే మ్యూజియంతో కూడిన ఒక పల్లెను రూపొందించారు. ఇక్కడ గగన తలం నుండి తీసిన ఫోటోలలో, పురాతన శిధిలాలున్న తావులు, డేనిష్ పురావస్తు శాఖ వారు చేపట్టిన పనులను చూడవచ్చు. ఇక్కడున్న ప్రదర్శితాలలో కువైట్ పురుషుల మైనపు ఆకృతులు నన్ను ఆకట్టుకున్నాయి. విశ్రాంతిగా మెత్తని దిండ్ల మీద కూర్చుని, ఒకరితో ఒకరు మాట్లాడుకుంటున్నట్లు, కాహ్వా తాగుతున్నట్లు, బోర్డుల మీద ఆడే ఆటలాడు కుంటున్నట్లు, సహజంగా, నిజ పరిమాణాలతో వీటిని మలిచారు. ఇట్లా సేద తీరే పురుషుల సంఘాన్ని 'దివానియత్' అంటారని సాగర్ చెప్పాడు. నాకు కూడా మన దేశంలో మర్రిచెట్టు కింద వేసవి కాలంలో, రచ్చ బండ మీద పురుషులు కాలక్షేపం చేయటం గుర్తొచ్చింది. ఇక్కడ రాజకీయాలు, గాలి కబుర్లు, ఒకటేమిటి? అన్నీ దొర్లిపోతూ ఉంటాయి. నేను పురుష పక్షపాతిని కాను. కానీ ఒకటి మాత్రం ఒప్పుకోక తప్పదు. ఎద లోతుల్లో వ్యధలను ఆర బెట్టుకోవటానికి, స్త్రీలకున్నన్ని అవకాశాలు పురుషులకు ఉండవు. కువైట్‌లో పురుషుల సంఘ జీవనం కోసం ఇటువంటి 'దివానియత్'లు ఉండటం హర్షణీయం.

ఫైలకా ఐలాండ్‌కు వెళ్ళటం వలన, నా కువైట్ పర్యటన సార్థకమైనట్లు అనిపించింది. స్పీడ్ బోట్‌లో, తిరిగి కువైట్ తిరిగి వచ్చే సరికి, అక్కడి భవనాలన్నీ విద్యుద్దీపపు వెలుగులు వెదజల్లుతూ, మాకు స్వాగతం పలికాయి. నా విమానానికి ఇంకా నాలుగు గంటల సమయం ఉంది. తరువాత రెండు గంటలు సుల్తాన్ స్టోర్ లో మంచి అరబిక్ వంటకాలను, ఆస్వాదించాలని అనుకున్నాము. వీటిలో ముఖ్యమైనది, హమస్‌తో పాటు ఆరగించ వలసిన ఫత్తయెర్ జాటర్(రక రకాల దినుసులు, సువాసనగా ఉండే ఆకుల మిశ్రమాన్ని లోపల ఉంచి తయారు చేసే రొట్టెలు). తీరా అక్కడికి వెళ్ళే సరికి, సుల్తాన్ స్టోర్ కట్టేసి ఉంది. ఇంకో అరగంట వరకు తెరవరని తెలిసింది. అటువంటిదే మరొక బేకరీ 'లులు' కు వెళ్ళాము. అక్కడ ఈ రోజు తాజాగా తయారు చేసిన ఆహారం తీసుకోవాలనుకున్నాను. కువైట్‌లో పనిచేసే వాళ్ళలో ఎన్ని ప్రాంతాల వారుంటారో అన్ని రకాల ఆహారం అక్కడ కనపడింది. ఇక పోతే, అరబిక్, ఇండియన్, చైనీస్, ఇటాలియన్ వంటకాలు మామూలే. మేము ఇండియన్ ఇంకా అరబిక్ చిరు తిండిని ఎంచుకున్నాము.

కాసేపాగి, మళ్ళీ ఒక సారి సుల్తాన్ స్టోర్ తెరిచారేమోనని అటు వెళ్ళాము. ఈ సారి మా అదృష్టం బాగుంది అది తెరచి ఉంది. ఆ రోజు ఫత్తయెర్ జాటర్, హమస్ తినాలని రాసి పెట్టి ఉందనుకుంటాను. ఫత్తయెర్ జాటర్ పాలస్తీనా వంటకమైనా, అరబ్బు దేశాలన్నిటి లో ఇది జనాదరణ పొందింది. ఆ సాయంత్రం మిగిలిన సమయమంతా కబుర్లు చెప్పుకుంటూ గడిపేశాము. నా విమానం తెల్లవారు జామున. సాగర్ నన్ను ఎయిర్ పోర్టులో దింపాడు. అతనికి హృదయ పూర్వకంగా కృతజ్ఞత తెలుపుతూ సెలవు తీసుకున్నాను.

అతని సమయంలో 48 గంటలు నాకు కేటాయించి, దగ్గరుండి నాకు కువైట్లో చూడవలసినవన్నీ తిప్పి చూపించటం, కేవలం మిత్ర బంధం వల్లనే. విమానాశ్రయంలో కూర్చుని నా కువైట్ పర్యటన గురించి సింహావలోకనం చేసుకుంటుంటే, కువైట్ నగరంలో నేను చూసినవన్ని ఒక ఎత్తైతే, ఫైలకా ఐలాండ్ చూడటం మరొక ఎత్తు. మొదటి గల్ఫ్ యుద్ధ పర్యవసానాలకు సాక్షీభూతంగా నిలచిన ఈ ప్రదేశం, ఈ యాత్ర కోసం నేను కేటాయించిన సమయానికి అర్థం చేకూర్చింది. ఒకటి మాత్రం నిజం. సాగర్ ఆహ్వానం లేకుండా, నా అంతట నేను వెళ్ళినట్లైతే, చాలా విషయాలు, కువైట్‌ను ఒక విదేశీయుని దృక్కోణం నుండి చూడ గలిగే వాడిని కాదు. ఇంతకు ముందులాగా విమానంలో నుండి క్రిందికి చూసినప్పుడు, కువైట్ నాకు పరిచయం లేని ప్రదేశంగా ఇక ముందు కనిపించదనే సంతోషంతో మనసు నిండిపోయింది.

ఇంగ్లీషు మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)
e-mail: srnimmagadda@googlemail.com
అనువాదం: శ్రీమతి జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)
e-mail: jayasreeatluri@hotmail.com



వివిన మూర్తి

# జిజ్ఞాస మూర్తి

– మిసిమి

**తె**లుగు సాహిత్యలోకంలో వివిన మూర్తి గారిదో విభిన్న ప్రయాణం..ఆయన రాయగలిగినంత రాయకపోవటానికి కారణం, కథానిలయం కోసం తన సమయాన్ని వెచ్చించటం అని తెలిస్తే ఆశ్చర్యపోతాం. నిజానికి కథానిలయం గురించి అంతగా అంకితమైపోవటానినికి కారణం, కాళీపట్నం రామారావు గారికి ఆయనిచ్చిన మాట. దానికోసం తన సాహిత్య కృషిని త్యాగం చేశారు. అంతేకాదు ఆయనకు తను రాసిన వాటిని పుస్తకాలుగా తీసుకురాకపోవటం, చాలా విమర్శన వ్యాసాలు ఎవరికి పంపకుండా తన వద్దనే ఉంచుకోవడం ద్వారా కూడా తెలుగు సాహిత్యానికి లోటే అనిపిస్తుంది.ఏదిచేసినా లోతుగా చేయటమే ఆయన లక్ష్యం. సాహిత్య విమర్శ కన్నా, సాహిత్య తత్వం ఆయన్ని ఆకట్టుకుంది. ఆయనతో మాట్లాడితే తెలుగు సాహిత్యం తొలిరోజుల చరిత్రను మనం తెలుసుకుంటాం. బెంగుళూరు, శ్రీకాకుళం మధ్య తిరుగాడే ఈ సాహిత్య జీవి **మిసిమి** బృందం బెంగుళూరు వెళ్ళినప్పుడు, బెంగుళూరు ట్రాఫిక్‌ను ఈదుకుంటూ మమ్మల్ని చేరుకున్నారు..తెలుగు సాహిత్య జిజ్ఞాసి వివినమూర్తితో **మిసిమి** పత్రిక సంపాదకులు అశ్వినీకుమార్ జరిపిన సంభాషణ నుంచి కొన్ని భాగాలు

***మిసిమి*** : **వివిన మూర్తి గారు నమస్కారం.. మిసిమికి స్వాగతం.. మీరు మిసిమి పత్రిక కోసం చాలా రాశారు. మీనుంచి చాలా నేర్చుకున్నాం. మీ దగ్గర నుంచి ఏం చేయకూడదో కూడా నేర్చుకున్నాను. ఈ నేపథ్యాన్ని ఆధారం చేసుకుని కొన్ని ప్రశ్నలు వేస్తాను. మీ సాహిత్యాన్ని మీరు సీరియస్‌గా తీసుకున్నట్లు అనిపించదు. నిజమేనా? కొంచెం వివరిస్తాను. మీరు కథలు రాసినా, వ్యాసాలు రాసినా, విమర్శలు రాసినా.. ఎక్కడో వదిలేస్తున్నారు.. అంటే కొంత మేర రాసి ఆపేస్తున్నారనిపిస్తుంది?**

**వివిన మూర్తి :** నేను సీరియస్‌గానే తీసుకుంటున్నాను. కాకపోతే ఏమిటంటే ఒక ఆలోచన నుంచి ఇంకో ఆలోచన నుంచి మరో ఆలోచనకు, ఇలా సాగుతుంది నా ప్రయాణం–

***మిసిమి*** : **ఫ్రాగ్మెంటెడ్‌గా ఉంటాయి మీవన్నీ..**

**వివిన మూర్తి :** ఫ్రాగ్మెంటెడ్ కాదు. మొత్తం అన్నీ కలిపితే కానీ, నేనెంత సీరియస్సో అర్థం కాదు. నేనేదీ పుస్తకంగా తీసుకురాలేదు. ఎవరో ఒకటో, రెండో వేశారు కానీ.

***మిసిమి*** : **బహుశా మీరు పుస్తకరూపంలో తీసుకు రాకపోవడం ఒక కారణం కూడా నాలాంటి వాడు ఈ ప్రశ్న అడగటానికి.**

**వివిన మూర్తి :** కావొచ్చు. ఇప్పుడు నేనో నవల రాస్తున్నాను. ఓ మూడు వందల యాభై పేజీలయింది. ఇంకో వారంలో పూర్తవుతుంది. ఈ నవల ప్రారంభం ముప్పై ఏళ్ల కిందట జరిగింది. అప్పుడు ఆరంభించిన ఆ రచన అలా అనేక ఆలోచనలను పురుడు పోసుకుంది. ఆ నవలపై రాసుకున్న నోట్సే నాలుగు వందల పేజీలుంది.

**మిసిమి :** **ముప్పై ఏళ్లలో మూడొందుల యాభై పేజీల కోసం నాలుగు వందల పేజీల నోట్సు ఆశ్చర్యంగానే వుంది! సమాజం – ఆర్థిక సమీకరణలు చాలా మారిపోయింది కదా. మీ సబ్జెక్టు కూడా మారిపోయి ఉంటుందే.**

**వివిన మూర్తి :** సబ్జెక్టు కాదు. ఇప్పుడు ప్లాట్ అనేది ఒకటుంటుంది. సబ్జెక్టు అనేది ఒకటుంటుది. ప్లాట్ పెద్దగా మారదు. సబ్జెక్ట్ మారుతూనే వస్తుంది. ముప్పై, నలభై ఏళ్ల క్రితం కమ్యూనిస్టు వాతావరణం ఉండేది. ఇప్పుడు లేదు.. నా కథ 1978వరకూ వస్తుంది. 78నుంచి 89వరకూ మరొకటి వస్తుంది. 89నుండి 2014 వరకూ మరొకటి ఉంటుంది.

**మిసిమి :** **అంటే మూడు నవలలు అవుతాయన్నమాట.**

**వివిన మూర్తి :** అవును. నవల ప్రారంభం 1910 ప్రాంతంనుంచి మొదలవుతుంది. కానీ కథా కాలం మాత్రం 1960వ దశకంలో. ఇందులో 1910లో పుట్టిన పాత్రలుంటాయి, అలాగే 1925, 1940లో పుట్టినవి కూడా ఉంటాయి.

**మిసిమి :** **ఓకే అర్థమయింది.కానీ ఈనవలను పొదగటానికి ఇంతకాలం పట్టడానికి కారణమేమిటి?**

**వివిన మూర్తి :** ఏమిటి అంటే కారణం, నాకు కథానిలయం పని ఒత్తిడి.. కారా మాస్టారుకు ఇచ్చిన మాట!

**మిసిమి :** **కథా నిలయం వద్దకు మళ్ళీ వద్దాం. మీకు ఇతర ఎంగేజ్మెంట్‌లు ఉండటం కారణం నవల గురించి చెప్పారు. కథలు గురించి చెప్పండి.**

**వివిన మూర్తి :** కథలు రెండొందల వరకూ రాశాను.

**మిసిమి :** **ఇన్ని కథలు రాశారు. ఒక్క పుస్తకం కూడా రాలేదు.?**

**వివిన మూర్తి :** 2006లో నా చివరి పుస్తకం వచ్చిందండీ. కాళీపట్నం మాస్టారు వేశారు. ఆ కథల సంపుటి పేరు "ప్రవాహ". ఆ తర్వాత "కథాప్రహేళిక" అనే పుస్తకంలో కొన్ని కథలు వేశాను. అవి ఒక ప్రయోగం కథలు. పాఠకుల చేత  మాట్లాడించి అభిప్రాయాలు రాయించి వేసిన పుస్తకం అది.

**మిసిమి :** **మీ మాటలకు అడ్డొస్తున్నాను. మీరు రెండొందల కథలు రాశానన్నారు కదా. వాటిలోని అంతస్సూత్రమేమిటి?**

**వివిన మూర్తి :** అన్నింటికీ మూలం వెతకటం. ఫిలాసఫీ చెప్పటం వేరు. జిజ్ఞాస వేరు.

**మిసిమి :** **ఇలా ఎందుకు జరిగింది? వీళ్ళు ఇలా ఎందుకు అన్నారు? ఇది తెలుసుకోవటం మీ జిజ్ఞాస. సరే.. వ్యాసాల్లోకి వద్దాం.**

**వివిన మూర్తి :** వ్యాసాలొక అరవై నుంచి డెబ్బై వరకూ ఉంటాయి.

**మిసిమి :** **మీ వయసుకి, అనుభవానికి చాలా తక్కువ ఆ సంఖ్య – అవునా?**

**వివిన మూర్తి :** ఇవి ఎవరైనా అడిగితే రాయటం జరిగింది. లేదంటే నాకు బుద్ధి పుట్టినప్పుడు రాశాను.

**మిసిమి :** **ఒక పుస్తకం తీసుకుని రాసిన సందర్భాలు లేవా?**

**వివిన మూర్తి :** అలా పుస్తక సమీక్షలు నేను చేయలేదు. భూషణం గారి కథల మీద ఒకటో, రెండో సమీక్షలు చేశానేమో. ప్రధానంగా సాహిత్య తత్త్వం మీద చేశాను. దానికి ఉండేటటువంటి సమాజ మూలాల మీద రాశాను.

**మిసిమి :** **సమాజ మూలాలన్నారు. సాహిత్య తత్త్వం అన్నారు. ఇవి ప్రత్యేకంగా ఎన్ని రాసుంటారో చెప్పండి?**

**వివిన మూర్తి :** ఒక ఇరవై, ఇరవైదుంటాయి.

**మిసిమి :** **సాహిత్యం అంటే ఏమిటి మీ ఉద్దేశ్యంలో! అక్షరం ఉన్నదంతా సాహిత్యమేనా?**

**వివిన మూర్తి :** అవును.. అక్షరంలో ఉన్నదంతా సాహిత్యమే. కానీ ఎక్కువ భాగం ఆనందపరచటం కోసం రాసిందే..

**మిసిమి :** **అంటే రసానందం కోసం రాసిందేనా?**

వివిన మూర్తి : రసానందం కాదు.ఆనందపరచటం అంతే.రసం అన్నది కొంత తెలిసినవారికి.. అలాంటి వారిలో ఆనందం కలిగించేది రసానందం.

**మిసిమి : జనరల్‌గా ఆనందం కలిగించేది కథ కదా**

వివిన మూర్తి :ఆనందం, సంతోషం రెండు పదాలున్నాయి. ఇలాంటి పదాలకు భిన్నార్థాలుంటాయి. వాటిల్లో మనిషికి తాదాత్మ్యత కలిగించేది ఆనందమన్నమాట.

**మిసిమి : వాటిమీద వ్యాసాలు రాశారన్న మాట.**

వివిన మూర్తి : వాటి మీద కొద్దికొద్దిగా రాశాను. అవేమిటి, ఎందుకు అంశాల మీద.

**మిసిమి : మీరు కొన్ని విమర్శనా వ్యాసాలు రాశారు.అవి నేను చదివాను.అవి మీరు సీరియస్‌గా రాసినట్లు లేరు.**

వివిన మూర్తి : మీరేం చదివారు?

**మిసిమి : మీరు వెల్చేరు నారాయణరావు చేసిన కన్యాశుల్కం అనువాదం మీద విమర్శ రాశారు. నేను మీకో కామెంట్ పెట్టాను. ఎందుకు మీరు అలా ఒదిగొదిగి రాస్తారు. పూర్తిగా ఎందుకు రాయరు అని అడిగాను. మీరు కూడా అది ఒప్పుకున్నారు. నేను మిమ్మల్ని తప్పు పట్టడం లేదు. అది మీ తత్త్వం కావొచ్చు అంటాను. ఒక్కొక్కరు ఒక్కో విధంగా చెబుతారనుకోండి. అలా చెబితే ఎక్కదు వాళ్ళకి. వాళ్ళకే కాదు, చదివే వారికి కూడా ఎక్కదు. చదివే పాఠకుడిలో అయోమయం నెలకొంటుంది.**

వివిన మూర్తి : నాకు సాహిత్యం పేరుతో అవతలి వారిని ఎటాక్ చేయటం ఇష్టముండదు.

**మిసిమి : నా ఉద్దేశంలో మీరు చదివిన తర్వాత చెప్పదలుచుకున్నది నిర్మొహమాటంగా చెప్పాలి..**

వివిన మూర్తి : నేను ఘాటుగా రాసింది ఒకేఒక్క సారి. అది మీకు పంపించిన వ్యాసంలో. దాన్ని మీరు ఎటాక్ అంటారేమో తెలీదు. నేను తప్పితే ఇంకెవరూ చేయలేరు అనుకున్నప్పుడే ఆవిధంగా రాశాను. ఆ ఒక్కసారిన్నీ. అది తప్పితే సాహిత్య తత్త్వం మీద చాలా వ్యాసాలు రాశాను.

**మిసిమి : అంటే సాహిత్య విమర్శ చేయలేదు.. సాహిత్య తత్త్వం మీదే రాశానంటారు.**

వివిన మూర్తి : విమర్శ అంటే “కావాలి వేయి కలాల నిఘా” అన్న వ్యాసం ఆంధ్రజ్యోతిలో వచ్చింది. అందులో అసలు విమర్శ అంటే ఏమిటి, సాహిత్యమంటే ఏమిటి అన్న అంశాలపై రాశాను.

**మిసిమి : ఒక్క వ్యాసంలో అన్నీ రాయలేరు కదా.**

వివిన మూర్తి : దాని గురించి “కథాయానం” అనే శీర్షిక మొదలుపెట్టాను. ఆ శీర్షికతో “సారంగ” వెబ్ పత్రికలో పన్నెండు వారాలపాటు వ్యాసాలు రాయటం జరిగింది. కథ చరిత్ర చెప్పే ప్రయత్నం చేశాను. ఎందుకంటే చెప్పాను కదా.. చాలా మంది లోతైన ఆలోచనలకు, అంశాలకు వెళ్ళరు. వారికి కావలసినది నినాదప్రాయమైన అంశాలు.

**మిసిమి : ఇక్కడేమవుతుందంటే, మీ సాహిత్యం ఎలా ఉన్నా, విమర్శ ఎలా ఉన్నా అంతా లెఫ్ట్ భావాలే కనిపిస్తాయి (మీరు అంటే మిమ్మల్ని అంటున్నానని కాదు) అది కథో, కవిత్వం ఏదైనా కావొచ్చు. అలా రాయకపోతే పట్టించుకోవటం లేదు. ఒప్పుకుంటారా ఆ విషయం?**

వివిన మూర్తి : సాహిత్యాన్ని లెఫ్ట్, రైట్ మరోటి, ఆ దృష్టితో చూడకూడదు అని నేను నమ్ముతాను. అంటే నువ్వొక భావజాలానికి బద్ధుడవై, దాని ప్రకారం అభిప్రాయాలు చెబుతానంటే నేనొప్పుకోను.

**మిసిమి : కానీ జరిగేదదే. జరుగుతున్నది అదే మనమేం చేయలేకపోతున్నాం**

వివిన మూర్తి : చేయలేకపోతున్నాం అన్నది పక్కనుంచుదాం. అసలు చేయాలా, అక్కర్లేదా ?

**మిసిమి : కానీ వాళ్ళు వస్తువును చెరబట్టారు కదా?**

వివిన మూర్తి : అది కాదండీ. ఇప్పుడు లెఫ్ట్ కూడా పోయింది కదా. ఇప్పుడు అస్తిత్వ వాదం వచ్చింది. అస్తిత్వ వాదం వచ్చాక ఏం జరుగుతోంది. ఫిర్యాదీ స్వరమే ఉంటుంది. పాతదో, కొత్తదో, ఇప్పటిదో నువు ఫిర్యాదు

చేస్తూనే ఉంటావు. అసలా ఫిర్యాదులో, నీకు జరిగింది వేరు. నీ పూర్వీకులకు జరిగింది వేరు. వోల్గా "స్వేచ్ఛ" నవల రాసినప్పుడు, నేను నాలుగు వ్యాసాలు ప్లాన్ చేశాను.. అసలు స్వేచ్ఛ అంటే ఏమిటి, స్వేచ్ఛకు, స్వాతంత్ర్యానికి ఉన్న తేడా ఏమిటి! స్వేచ్ఛ అంటే స్వ ఇచ్ఛ. మనిషి సమాజంలో ఉన్నప్పుడు ఎలా కుదురుతుంది.!

**మిసిమి :** **దీనికి నేనో నిర్వచనం చెప్పాను సర్. స్వేచ్ఛ అనేది ఎడారి లాంటిది.. ఎటుపోవాలో తెలియదు.**

**వివిన మూర్తి :** ఇప్పుడు దానికి బోల్డంత అట్రాక్షన్ ఉంటుంది. బోలెడంత కిట్టించొచ్చు. దేన్నయినా రాయొచ్చు. కానీ అది కరెక్ట్ కాదు అని చెప్పే వ్యాసాలన్న మాట నేననుకున్నది. అంటే మగాడికి అక్కర్లేదా స్వేచ్ఛ?

**మిసిమి :** **ఈసందర్భంగా నేనొక్కటే చెబుతాను. అడివి బాపిరాజు "తుఫాన్" నవల చదివే ఉంటారు. అందులో స్త్రీ స్వేచ్ఛ గురించి చెబుతాడు అప్పట్లో బొగ్గు ఇంజన్‌లు వుండేవి కదా..స్వేచ్ఛ బొగ్గు ఇంజన్‌లో ఆవిరిలాంటిది. దానిని నియంత్రించితేనే రైలు నడుస్తుంది. లేకపోతే ఆవిరైపోతుందంటాడు!**

**వివిన మూర్తి :** స్వతంత్రం అంటే నిన్ను నీవు ఎలా మేనేజ్ చేసుకుంటావో తెలుసుకోవడం.కానీ నేను నా ఇష్టం వచ్చినట్టు ఉంటాను అంటే ఎలా.

**మిసిమి :** **ఆవిరైపోతుంది.. బండి నడవదు. (నవ్వు)**

**వివిన మూర్తి :** అట్లాగ నాకనిపించినవాటికి రాశాను. ఈమధ్య "ఒంద్రుమట్టి" అని ఒక నవల చదివాను. నల్లూరి రుక్మిణి గారు రాశారు. ఆ పుస్తకం మీద 'ముట్టి చూస్తే' 'పట్టిచూస్తే' అని రెండు వ్యాసాలు రాశాను. ముట్టి చూస్తే, అంటే అలా టచ్ చేసి చూస్తే కారంచేడు వ్యవహారం అదీ ఉంది. తర్వాత పట్టి చూస్తే.. అంటే ఏ భావం చెప్పటానికి ప్రారంభించి, ఏ భావం చెప్పలేకపోయారు. ఇది రాద్దామని అనుకున్నాను. అనుకున్నాక, దీనివల్ల ఉపయోగమేమిటి అనిపిస్తుంది నాకు. ఎవరికి చెబుతున్నాను అనిపించింది.

**మిసిమి :** **అట్లా అనుకుంటే ఎలా? రికార్డు చేయాలి కదా.. అంటే రాయగలిగే శక్తి ఉన్నవారు రాయాలి. ఏమవుతుంది.. ఎవరు చదువుతారు అన్న ఆలోచన రానీయకూడదు.**

**వివిన మూర్తి :** అప్పుడు మీరా వ్యాసం వేయకపోతే ఎవరికీ పంపించేవాడిని కాదు. ఎందుకంటే నేను రాసిన యాభై, అరవై వ్యాసాలున్నాయి. ఎవరికీ పంపించకుండా పడి ఉన్నవి.

**మిసిమి :** **మీకోసం మీరు రాసుకున్నవి. ఆ యాభై మాకు పంపిస్తే, మాకు మేలు చేసిన వారవుతారు.**

**వివిన మూర్తి :** అలాగే

**మిసిమి :** **ఏది వేయాలో అనే ఛాయిస్ మాకు వదిలేయండి.**

**వివిన మూర్తి :** ఈమధ్య ఒకతను మీరేది పంపించినా వేసుకుంటామన్నాడు. నేనొప్పుకోలేదు. నీకు ఒక లక్ష్యం ఉండాలి. మీ పేరామీటర్స్ మీకుండాలి. పేరు చూసి వేసేట్టుగా ఉండకూడదని చెప్పాను.

**మిసిమి :** **ఒక ఎడిటోరియల్ పాలసీ అంటూ ఉండాలి కదా. అది డిఫైన్ చేయగలిగి ఉండాలి ఎడిటర్ అనేవాడు**

**వివిన మూర్తి :** ఇప్పుడు అలాంటివేమీ లేవండి ఇవాళ కథల మీద ఒక జూమ్ మీటింగ్ జరిగింది. బెంగుళూరు చర్చ అని ఒక జూమ్ మీటింగ్ పెట్టుకున్నాం. నాలుగు కొత్త కథలు తీసుకొచ్చారు.కొత్త కథకులను అర్థం చేసుకోవాలి అని అందరికీ ఉంది. ఈ కాలాన్ని అర్థం చేసుకోగలమా అని ప్రయత్నం చేస్తే అది ఎప్పటిదో కాలం.. ఉంటే నాస్టాల్జియా లేకపోతే ఫిర్యాదు. ఎలా ఉంటారంటే ఈ కథకులు.. ఓ పక్క కమ్యూనిస్టునని చెప్పుకుంటాడు. మరోపక్క బండి చక్రం వాడటం లేదు, అని బాధపడుతుంటాడు. మార్పు కోరని వాడు కమ్యూనిస్టు ఎలా అవుతాడు. మార్పు అనేది అనివార్యం. revolution is part of evolution అని మర్చిపోతే ఎలా అంటాను. its not at all an alternative to evolution. అవుతుంది. కొన్నిచోట్ల మనుషులు తిరగబడతారు.అదికూడా evolution లో భాగమే.

**మిసిమి :** **వివిన మూర్తి గారు, మీ కథల గురించి చెప్పారు. మీ కథల్లో ఉన్నది జిజ్ఞాసే. అలాగే విమర్శ గురించి చెప్పారు.**

**వివిన మూర్తి :** నేను రాసింది ఎక్కువ సాహిత్య తత్వం. ప్రపంచ తెలుగు మహా సభలు జరిగినప్పుడు, తెలుగు విశ్వవిద్యాలయం వారు వారి జర్నల్స్‌కు రాయమన్నారు. అంశం స్వాతంత్ర్యానంతర కథ. సరే వెతికి పట్టుకొని రాశాను.

**మిసిమి : అసలు స్వాతంత్ర్యం గురించి మనకు కథలేమి వచ్చాయి?**

**వివిన మూర్తి :** స్వాతంత్ర్యం ప్రేరణగా వచ్చిన కథలున్నాయి. అచ్చంగా స్వాతంత్ర్యం మీద లేవు.

**మిసిమి : నా ఉద్దేశంలో రాజారావు రాసిన కాంతాపురా ఒక్కటే ఉంది. అది స్వాతంత్ర్యం మీద వచ్చిందే.**

**వివిన మూర్తి :** అంటే స్వాతంత్ర్యం పోరాటంలో పాల్గొన్న వీరుల మీద వారి కష్టాల మీద వచ్చిన కథలు లేవు.

**మిసిమి : వాళ్ళు జైలులో పడిన కష్టాలు గురించిన రచనలు వచ్చాయా? అదే రెండవ ప్రపంచయుద్ధం గమనించండి. ఎన్ని రచనలొచ్చాయో.. ఎన్ని కథలు, ఎన్ని నవలలు, ఎన్ని సినిమాలొచ్చాయో.. మన దగ్గర గాంధీ మాఊరొచ్చాడు అన్న కథలు తప్ప ఇంకేమీ లేవు. పత్రికలు, జర్నల్స్ ఈరకంగా స్వాతంత్ర్య ఉద్యమం కథలు ఉంటే వాటిగురించి అడుగుతారు కానీ మనకేమి దొరకవు.**

**వివిన మూర్తి :** "మహతి" గురించి మీకు తెలుసు కదా. వాళ్ళో పెద్ద కంపైలేషన్ తెచ్చారు. చాలా voluminous work. అందులో చిత్తశుద్ధితో రాసిన వారి రచనలు వెతికితే పట్టుమని పదిశాతం లేరు.

**మిసిమి : అందులో విశ్వనాథ సత్యనారాయణ ఎంత విస్తృతంగా రాశారో చూశాను. శ్రీశ్రీ ఎంత రాశాడో చూసి సిగ్గుపడ్డాను. పట్టుమని పదిపేజీలు రాయలేదు.. ఎందుకిలా జరుగుతుందని బాధేస్తుంది.**

**వివిన మూర్తి :** నాకు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు గురువు. ఎందుకంటే ఆయన "మిణుగురులు" అని వ్యాసాలు రాశాడు.ఆ వ్యాసాలు ఆయన కథలకన్నా గొప్పగా ఉంటాయి. ఆయన వ్యాసాలలోని కంటెంట్ మనం అంగీకరించకపోవచ్చు, కానీ ఆయన చేసిన కొన్ని రకాల పరిశీలనలు, వ్యాఖ్యలు మనం ఒప్పుకు తీరాల్సిందే. ఆయన బంకించంద్ర ఇష్టుడు. కానీ బంకించంద్ర మీద ఆయన వ్యాసం చదవాలి. ఆయన జస్టిస్ పార్టీ పత్రికలో "జస్టిస్ పార్టీ భూత, భవిష్యత్, వర్తమానాలు అని రాశాడు. ఆ ఒక్క వ్యాసం చదివితే చాలు. ఆయనని ఆ పత్రిక వారడగటం, ఈయన రాయటం ముచ్చట అనిపిస్తుంది. ఆయన ఒక మాటంటాడు, నువ్వు ఎప్పుడయితే జరిగిన తప్పుల మీద బతకాలనుకుంటున్నావో, అప్పుడిక బతకలేవు అంటాడు. ఎప్పుడయితే నువ్వు జరిగిపోయిన తప్పుల గురించి పార్టీ పెట్టావో, ఆ పార్టీ ఉండదు అన్నాడు. ఆయన రాశాడు.. వీళ్ళు వేశారు. ఇద్దరికీ దండమే.. నిజమే బ్రాహ్మలు చేశారు.. ఎంతకాలం తిడతావు..వాళ్ళకే పేరొస్తుంది. ఇలాగే రాశాడాయన.

**మిసిమి : సర్, మనం ఇంకో విషయం లోకి వెళ్దాం. మీరు కథా నిలయంలో ఏళ్ల తరబడి వుండి, చాలా పనులు చేశారు. నేను కళ్ళారా చూశాను, ఒకరోజు కాదు.. వారం రోజుల పాటు చూశాను. మాస్టారు మీద గౌరవంతో చేశారా, కథల మీద ప్రేమతో చేశారా.. నాకు స్పష్టంగా చెప్పండి..**

**వివిన మూర్తి :** నాకసలు ఆ ప్రాజెక్ట్ మీద గౌరవం కూడా లేదు. ఈ పాతకథలు సేకరించటం, దాచటం.. ఇదంతా టైం వేస్ట్ మాస్టారు అని చెప్పాను.

**మిసిమి : అభిప్రాయం చెప్పేశారు.**

**వివిన మూర్తి :** చెప్పేశాను. చెప్పేశాక, ఆయన నా దగ్గర మాట తీసుకున్నారు. ఇది ముప్పై ఏళ్ళు నడవాలి.. అంటే ఒక తరం..

**మిసిమి : ఒక తరం అంటే ముప్పై ఏళ్ళు కదా.**

**మిసిమి :** ఆయన ఏమన్నారంటే ఈ ముప్పై ఏళ్ళు కథానిలయం నడవటానికి, నేను ఎన్నాళ్ళు బతుకుతానో తెలియదు. ఆయన డెబ్భైరెండో ఏట కథానిలయం మొదలెట్టారు. ఆయనప్పుడు ఏమన్నారంటే నేనింకో ఏడెనిమిదేళ్ళు బతుకుతానేమో.. మిగిలిన ఇరవై ఏళ్ళు నువు నడపాలని నన్ను కోరారు. నాకు ఏ

పనినైనా సంపూర్తి చేయటం అలవాటు. నేవీలో లేబొరేటరీలు నేను అలాగే డిజైన్ చేశాను. అలా ఏ పని తీసుకున్నా పూర్తిగా మనసు పెట్టి చేస్తాను. రామారావు మాస్టారు మొదట అనుకున్నదేమిటంటే కథల పుస్తకాలను సేకరిస్తే చాలని.. ఎంతమంది రచయితలు ఉంటారంటే.. వెయ్యి లోపే అని లెక్కేశారు. కానీ నేనిప్పటికి నోట్ చేసింది పందొమ్మిది వేలమంది కథకులున్నారని. దానికి డేటాబేస్ తయారు చేయటం కోసం స్వయంగా చదువుకుని నేర్చుకున్నాను. ఈ పనంతా 2003లో మొదలుపెట్టాం.

**మిసిమి :** **నేను మిమ్మల్ని కథల మీద గౌరవమా,ఆయన మీద గౌరవమా అని అడిగాను. ఈరెండూ కాదు. ఆయనకిచ్చిన మాటమీద గౌరవం.**

**వివిన మూర్తి :** నాకు కథల మీద గౌరవం ఎప్పుడు పెరిగిందంటే పుస్తకంలో వచ్చిన కథలు, పుస్తకంలో రాని కథల మీద వ్యాసం రాసినప్పుడు పెరిగింది. అటు సంపుటిలుగా, ఇటు సంకలనాలుగా కాకుండా విడిగా వచ్చిన కథలు లక్షకు పైగా ఉన్నాయి. అవన్నీ పత్రికల్లో వచ్చాయి. మనం వాటిని పరికించి చూస్తే మనకర్థమయ్యేదేమిటంటే మానవ మనస్తత్వం, భారతీయ మనస్తత్వం కొంతయినా అర్థమవుతాయి. మానవ మనస్తత్వం, భారతీయ మనస్తత్వం ఒకటి కాదా అని మీరనొచ్చు.. వాతావరణం వలన నేల స్వభావం మారుతుంది. ఆహారం దొరికే విధానాన్ని బట్టి మనిషి ప్రవృత్తి మారుతుంది. ఆహారం సుళువుగా లభించిందనుకోండి అప్పుడొకలాగా ఉంటాడు. దుర్గమప్రదేశాల్లో ఉండే వారి ఆలోచనలు ఒకలా ఉంటాయి. గ్రీస్ ఉంది. అది ద్వీపాల సముదాయం. ఈ ద్వీపాల మధ్య ప్రయాణం చేయాలంటే, ఆ వ్యక్తి చాలా సాహసవంతుడై ఉండాలి. మనకూ, చైనాకు జనాభాతో పాటుగా విశాలమైన భూఖండం ఉంది.

**మిసిమి :** **దీనివలన ఆలోచనా విధానం కూడా తేడాగా ఉంటుందా?**

**వివిన మూర్తి :** ఉంటుంది. క్లైమేట్‌కు, మానవుడి ఆలోచనా విధానానికి తప్పకుండా సంబంధం ఉంది. ఇక్కడ నేను చేసిన పరిశీలనేమిటంటే, ఓ రచయిత పుస్తకం తీసి పాత్రలు పరిశీలించి, ఒక విశ్లేషణ చేసేవాడిని.

**మిసిమి :** **మీరిప్పటి వరకు ఎన్ని కథలు చదివి ఉంటారు?**

**వివిన మూర్తి :** ఇప్పటి వరకు నమోదు చేసిన కథలు లక్షా ఎనిమిది వేలు. నేనొక పదిహేనువేల కథలు చదివి ఉంటాను.

**మిసిమి :** మీరొక ట్రెండ్ ఈ కథల్లో చూసుంటారు కదా. వీటిలో ఆడవారికి, మగవారికి కథా రచనలో ఏమన్నా తేడా ఉంటే చెప్పండి.

**వివిన మూర్తి :** ఈ కథలలో 1950ల్లో స్త్రీ ఎలా ఉంది, అరవైల్లో ఎలా ఉంది, డెబ్భైల్లో ఎలా ఉందో తెలుసుకోవడానికి వీలయింది.

**మిసిమి :** **మీరు సంవత్సరాల వారీగా అంటే దశకాల గురించి చెబుతున్నారు.**

**వివిన మూర్తి :** పోనీ ఒక పీరియడ్‌లో స్త్రీలు ఎలా ఆలోచించేవారో అనుకుందాం. దానికి తోడు అప్పుడు ఎక్కువ స్త్రీల పత్రికలొచ్చాయండీ. 1919లో "సావిత్రి" అనే పత్రిక వచ్చింది. అలాగే "అనసూయ" అనే పత్రిక వచ్చింది. స్త్రీల పత్రికలు రావటానికి కారణం మనమీద బెంగాలీ ప్రభావమెక్కువ. బెంగాల్‌లో స్త్రీల గురించి ఎక్కువగా ఆలోచిస్తారు. దానివలన స్త్రీల పత్రికలు చాలా వచ్చాయి. కానీ పాఠకుల్లో స్త్రీలు తక్కువగా ఉండేవారు. నేనొకసారి వాదించాను.. చలం స్త్రీల కోసం రాశాడా? స్త్రీల గురించి రాశాడా అని.. తేడా ఉంది కదా. స్త్రీల మీద రాశాడు కానీ, స్త్రీల గురించి రాయలా..మగాళ్ళను మీరు సరిగ్గా ఉండండి లేకపోతే ఇలా ఆడాళ్ళు తయారవుతారు అని హితబోధ కోసం రాశాడు. He addressed only gents.. బెంగాలీ సాహిత్యమంతా... addressing gents మనకు కనిపిస్తుంది.

**మిసిమి :** **ఇదంతా మగాళ్లకు చెప్పటం కోసం రాశారంటారు?**

**వివిన మూర్తి :** అవును. ఆడవాళ్ళపై ఆలోచన చేయటం కోసం వచ్చిన ధోరణి ఈ కథలను చదివినప్పుడు తెలిసింది. సత్తిరాజు సీతారామయ్య గారని బాపు తాతగారు ఏలూరులో ఏడెనిమిది పత్రికలు నడిపారు. "హిందూ సుందరి," "దేశోద్ధారకుడు" ఇట్లాంటి పేర్లేవో ఉండేవి. ఆయన 1903లో హిందూ సుందరి పత్రిక ఎడిటర్‌గా స్త్రీ దొరికితేనే మొదలుపెడతానని ప్రకటించి, రెండేళ్లపాటు ఎదురు చూశాడు. చివరికి ఎవరు దొరక్క 1905లో ఆయనే ఎడిటర్‌గా మొదలు పెట్టాడు. అప్పటికింకా తెలుగు కథ రాలేదు. పత్రిక మొదలు పెట్టిన రెండేళ్ళకు చోడవరంలో ఉండేటటువంటి "మొసలికంటి రామాబాయమ్మ గారు" దొరికారు ఆయనకు. మరొకావిడ "బాలాంత్రపు శేషమ్మ", కాకినాడకు చెందినావిడ .. వీరిద్దరినీ ఎడిటర్లుగా పెట్టారు. నేను కాదు, ఆడవాళ్ళ గురించి రాయటం కాదు, ఆడవాళ్ళనే రాయమంటాను అని ఆయన రాశారు.. అయితే ఆ ఆడవాళ్ళిద్దరూ ఆయన్ని రహస్యంగా అడిగారుట.. మేం రాస్తాం కానీ, మా పేర్లు వేయకపోతేనే అంటూ.. ఒక సోదరి అనే పేరుతో రాశారు వాళ్ళు..

**మిసిమి :** **ఇంతకీ ఏం రాశారు వాళ్ళు?**

**వివిన మూర్తి :** వాళ్ళ కష్టాలు గురించి రాశారు సర్. 1906లో "అంతఃపురోపన్యాసాలు" అనే కథలు వచ్చాయి. అవి రాసింది తల్లాప్రగడ సూర్యనారాయణ.. ఆడవాళ్ళు ఎలా ఎదిరిస్తారో రాస్తాడాయన. మనకి చలం, గురజాడ, శ్రీ శ్రీలే తెలుసు.. ఈయన గురించి తెలియదు. ఆనాడు రాసినవారిలో పులిగుర్తి నరసమాంబ, బాలాంత్రపు శేషమ్మ, మొసలికంటి రామాబాయమ్మ, భండారు అచ్చమాంబ ముఖ్యులు.. ఇందులో పులిగుర్తి నరసమాంబ పూర్తి వ్యతిరేకంగా రాసేది. ఇప్పుడు సనాతన ధర్మం గురించి తపించి పోతున్నట్టు ఆవిడ అప్పుడు రాసింది. బాల్య వివాహాలు అప్పుడెక్కువ కదా. విద్యావంతులైన వారెవరైనా వ్యతిరేకించి రాశారా అని వెతికాను. చాలా తక్కువ.. నాలుగైదు వ్యాసాలు కష్టమ్మీద దొరికాయి. వ్యతిరేకించినవాళ్ళు ఉన్నారు. కానీ వారి వాయిస్ అక్షరంగా కనపడలేదు. ప్రగతిశీలురమని, ప్రోగ్రెసివ్ అనిపించుకోవాలన్న వెర్రి ఆరాటమే తప్పిస్తే, ఆలోచనాపరులమని అనిపించుకోవాలని ఉండదు మనకు. ఆధిక్యతాకాంక్షతో ఆధిక్యులం ఎలా అనిపించుకకుంటామంటే పవిత్రత ద్వారా.. మొదట్లో ఓ సోదరులారా, మా కష్టాలు గమనించరా అని పద్యాలు రాసేవారు, ఏదీ సావిత్రి, అనసూయ పత్రికల్లో. తరువాత కనుపర్తి వరలక్ష్మమ్మ గారు "శారద లేఖలు" తో చాలా లిబరల్‌గా రాసేవారు. తనకాలానికి ముందు చూపున్న వ్యక్తి. ఆవిడ రాసిన ఒక కథలో ఒక రచయిత ప్రదర్శన కాంక్షతో ఏది చెబితే జనాలకి నచ్చుతుందో అవి చెబుతుంటాడు. ఈవిడేం చేసింది .. భార్య పాత్ర ద్వారా జనమేమి అనుకుంటారో కాదు, నీకు నచ్చినది చెప్పు అనిపిస్తుంది. అదీ వరలక్ష్మమ్మ గారి గొప్పదనం. యద్దనపూడి లాంటి రచయిత్రులను మనవాళ్ళు విమర్శిస్తారు కదా. వాళ్ళు పూర్తి కమర్షియల్ కాదు. వాళ్ళు సమాజాన్ని గురించే రాశారు. కలలు కనమని రాశారు. కలలు కనొద్దని చెప్పే హక్కు మనకెక్కడుంది.

**మిసిమి :** **స్త్రీల ఆలోచనలు గురించి బాగా చెప్పారు. మీ అనువాదాలు గురించి చెప్పండి..**

**వివిన మూర్తి :** మొదటగా చేసిన అనువాదం పట్టాభి గారిది. ఆయన దక్కన్ హెరాల్డ్ లో what life taught me అనే శీర్షికతో వ్యాసం రాశారు. నేనీ ఊరొచ్చిన కొత్తలో ఆయన దగ్గరకు రోజూ వెళుతుండే వాడిని. ఆ వ్యాసం నాకు నచ్చి అనువాదం చేశాను. ఆంధ్రజ్యోతిలో వచ్చింది. తర్వాత నాలుగైదు సంకలనాలలో చోటు చేసుకుంది. మనసు ఫౌండేషన్ వారి కోసం while sewing sandals అనే పుస్తకం అనువాదం చేశాను. దానిపేరు "చెప్పులు కుడుతూ కుడుతూ".. ఈమధ్య స్ఫూర్తి ఫౌండేషన్ వారు పదివేల కాపీలు వేశారు. నాకేమీ డబ్బులక్కర్లేదు అని చెప్పాను. పేరు తీసేసినా ఫర్వాలేదని చెప్పాను. అట్లాగా

ఆ పుస్తకం నలుగురిలోకి వెళ్ళింది. ఆ తర్వాత రెండు, మూడు పుస్తకాలు చేయాలని నేను, రాయుడు గారు అనుకున్నాం. వాటిలో Social Christianity ఒకటి. కానీ కథానిలయం లో కథలను తెలుగులో ఇండెక్స్ చేయటంలో టైమంతా దానికి సరిపోయింది. కన్నడం నుంచి మూడు చేశాను. భగవద్గీత చేశాను

**మిసిమి :** **కన్నడం బాగా వచ్చా మీకు.. భగవద్గీత కూడా కన్నడం నుంచా?**

**వివిన మూర్తి :** నేను కన్నడం చదవగలను కానీ రాయలేను, మాట్లాడలేను. ఈ భగవద్గీత వీరభద్రప్ప అనే ఆయన రాసింది. ఇది రెగ్యులర్‌గా చదివే భగవద్గీత కాదు. రేషనల్‌గా ఉన్న పుస్తకం. దీన్ని వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారు కొంత తెలుగులో చేశారు. ఆమధ్యలో ఆయన పోవటంతో మిగిలిన భాగాన్ని నేను పూర్తి చేశాను. విశాలాంధ్ర వారు పబ్లిష్ చేశారు, మాఇద్దరి పేర్లతో.. ఆ తర్వాత వాళ్లు నవకర్నాటక వాళ్ళు నోబుల్ గ్రహీతలపై కన్నడంలో ఒక పుస్తకం వేశారు. ఆ పుస్తకం పై రెండేళ్లపాటు కృషి చేసి 108మంది గ్రహీతల గురించి రాశాను. వాళ్ళు చేసినదానికంటే అదనంగా కొన్ని అంశాలు చేర్చి రాశాను. వాళ్ళకి ఇచ్చాను. వాళ్ళు ఎక్కడ పారేశారో తెలియదు. ఒకసారి ఇచ్చిన తర్వాత మళ్ళీ నేనడగను.

**మిసిమి :** **నోబెల్ బహుమతికి సంబంధించిన వ్యాసాలు మేం కూడా రాయించాం**

**వివిన మూర్తి :** సంతోషం మీరూ ఆవిధంగా కృషి చేసినందుకు.. నేను నోబెల్‌పై వ్యాసాలు మూడు పుస్తకాలుగా రాశాను. చేతిరాతే అప్పటికి కంప్యూటర్‌పై టైపింగ్ మొదలు పెట్టలేదు. విశాలాంధ్రలో అప్పుడు రాజేశ్వరరావు గారు ఉండేవారు. ఒకవిధంగా బాధేస్తుంది. అంత కష్టపడి రాశాక ఆ పుస్తకాలు వెలుగు చూడకపోవటం.. నేననుకున్న మరో ప్రాజెక్టు "అఆ"లు. అంటే అంబేద్కర్ ఆలోచనలు. అనేక అంశాల గురించి ఆయన అభిప్రాయాలు, వాటికి ఆయన చూపే ప్రామాణికాలు ప్రస్తావిస్తూ తయారు చేసుకున్నాను.

**మిసిమి :** **మిసిమి గురించి ఏం చెబుతారు?**

**వివిన మూర్తి :** ***మిసిమి*** గురించి చెప్పాలంటే మీ ఎఫర్ట్‌కు దణ్ణం పెడతాను. కానీ శ్రద్ధ లేని రచయితలు ఎక్కువయ్యారు. మనమేదైనా రాశామంటే మనస్ఫూర్తిగా రాయాలి సర్.. లేకపోతే రాయకూడదు. మీరు కాంట్రవర్సీలు పెట్టుకోరు. చెప్పే పాయింట్ లోతైన విమర్శతో ఉండాలని మీరు ఆశిస్తారు.

ఒకసారి పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారితో అన్నాను. మీరు కాంట్రవర్సీని వెతుకుతారు. దానివలన ఏ సాహిత్య ప్రయోజనం లేదని చెప్పాను. మీకు సేల్స్ పెరుగుతాయి అంతే అన్నాను. మీరు అలాకాదు. కాంట్రవర్సీ క్రియేట్ చేయాలని ఆశించరు.

ఇప్పటికి తెలుగులో మంచి వ్యాసాలు వస్తున్న పత్రికగా "***మిసిమి***" ని చెప్పుకోవచ్చు. అలాగే చాలా వెబ్ పత్రికలున్నాయి. వాటిల్లో "ఈమాట" చాలా చక్కగా ఉంటుంది.

**మిసిమి :** **సర్ మేం ప్రతి వ్యాసం జల్లెడ పట్టి, ఫిల్టర్ చేసి, ఆయా రచయితలతో మాట్లాడి చక్కగా తీర్చి దిద్దే ప్రయత్నం చేస్తాం. మా కష్టాన్ని గుర్తించినందుకు మీకు కృతజ్ఞతలు.**

**బెంగుళూరు ట్రాఫిక్ తట్టుకుని ఇక్కడికి వచ్చి ఇంటర్వ్యూ ఇచ్చినందుకు మీకు చాలా థాంక్స్.. నమస్తే**

**వివిన మూర్తి :** నమస్కారం.

**సంభాషణ : అశ్వినీకుమార్**

ధ్వని ముద్రణకు రాతప్రతి : సి.ఎస్. రాంబాబు *(అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)*

# ఆకాశవాణి... వార్తలు చదువుతుంది కందుకూరి సూర్యనారాయణ

**ఆకాశవాణిలో మీ ప్రవేశం ఎలా జరిగింది?**

నేను చదివిన చదువుకు నా ఉద్యోగానికి సంబంధం లేదు, గ్రాడ్యుయేషన్ ఎకనామిక్స్‌లో చేసి, ఎం.ఏ - మద్రాస్ స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్‌లో చేశాను. తర్వాత గ్యాప్ వచ్చింది, ఉద్యోగం రావడానికి. ఆ రోజుల్లోనే నార్ల వెంకటేశ్వరరావు గారు ఆంధ్రజ్యోతి స్టార్ట్ చేశారు. నార్ల వెంకటేశ్వరరావు గారు, మా నాన్న గారు కందుకూరి వీరభద్రరావు గారు ఆకాశవాణి శ్రోతలకు సుపరిచితులు, ఆయన పాటలు ఇప్పటికీ ప్రసారం అవుతుంటాయి. విద్యావేత్త, గొప్పవ్యక్తి వాళ్ళిద్దరు క్లాస్‌మేట్స్ అన్నమాట, ఏదో మాటల్లో మా అబ్బాయి ఉన్నాడు, ఉద్యోగానికి ట్రై చేస్తున్నాడు అంటే, ఆయన అన్నారట, మీ వాడికి అభ్యంతరం లేకపోతే వచ్చి మా ఆంధ్రజ్యోతి ఎడిటోరియల్ బోర్డ్‌లో కూర్చోమని చెప్పండి అన్నారట. మా నాన్నగారు నాతో చెప్పారు, నార్ల గారు ఇలా అన్నారని. ఇష్టమైతే వెళ్ళు అని. అప్పటికే నాకు ఫ్రస్ట్రేషన్ వస్తుంది ఉద్యోగ వేటలో, ఏదో కాలక్షేపంగా ఉంటుందని, అలా ఆంధ్రజ్యోతిలో సబ్-ఎడిటర్‌గా జాయిన్ అయ్యాను. ఇది 1961-62లో జరిగింది. అప్పటికి నార్లగారు ఎడిటర్, విద్వాన్ విశ్వం గారు అసిస్టెంట్ ఎడిటర్, నండూరి రామ్మోహన్ రావు గారు సీనియర్ సబ్‌ఎడిటర్, తుర్లపాటి కుటుంబరావు గారు, ఐ. వెంకట్రావుగారు, మేమంతా సహచరులం. రామ్మోహన్‌రావు గారు ఇన్‌ఛార్జ్ గా ఉండేవారు, రోజూ నైట్ షిఫ్ట్, ఆల్టర్నేటివ్‌గా ఉండేవి. అలా అది నాకు ఈ రంగంలోకి ప్రవేశించడానికి దోహదం చేసింది.



కందుకూరి సూర్యనారాయణ

తర్వాత ఆల్ ఇండియా రేడియో అంటే అందరికీ ఒక గ్లామర్ ఉండేది, నాన్న గారు హెడ్ మాస్టర్‌గా రిటైర్డ్ అయిన తర్వాత 10 సం. ఆకాశవాణిలో ఎడ్యుకేషన్ బ్రాడ్‌కాస్ట్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు. ఆయన ఎక్కువగా రూపకాలు అవి రాస్తుండేవారు. అలా ఆల్ ఇండియా రేడియోకి వస్తూ పోతూ ఉంటే ఒక అభిలాష ఏర్పడింది ఆకాశవాణి అంటే. రేడియో వెళ్ళడమంటేనే ఒక గొప్ప అవకాశం. ఆవరణలో ప్రవేశించడం అంటేనే, అలాంటిది న్యూస్ చదువుతానన్న ఆలోచన ఎప్పుడూ రాలేదు. ప్రాంతీయ వార్తలు వింటూ ఉండే వాళ్ళం, నేషనల్ న్యూస్ వినేవాళ్ళం. ఆ రోజుల్లో పన్యాల రంగనాధరావుగారు, కొత్తపల్లి సుబ్రమణ్యం గారు అంటే గొప్ప అభిమానం ఉండేది. ఈ తరం మమ్మల్ని ఎలా అనుకుంటున్నారో ఆ తరంలో వాళ్ళని మేము అలా అనుకునే వాళ్ళం. వాళ్ళని ఎప్పుడైనా చూస్తాం అనుకునేవాళ్ళం. ఇంకా బుచ్చిరెడ్డి గారు, తిరుమలశెట్టి శ్రీరాములు గారు, ఈయన అందరిలోకి జూనియర్, నేను జాయిన్ అయ్యేటప్పటికి ఆయన జూనియర్ మోస్ట్, నేను జాయిన్ అయ్యాక సీనియర్ అయ్యారు, అపుడు యూనిట్‌లో సిస్టమ్ ఎలా ఉండేదంటే.. తెలుగు యూనిట్‌లో 4 సబ్ ఎడిటర్‌లు ఉండేవారు, ఇద్దరు న్యూస్, స్టాఫ్ ఆర్టిస్ట్‌లు అనేవారు. ఈ సబ్ ఎడిటర్స్ ఆల్ ఇండియా సర్వీస్ వాళ్ళు, తర్వాత పంజాల, రంగనాథరావు గారు, కొత్తపల్లి సుబ్రమణ్యం గారు, బుచ్చిరెడ్డి గారు, జి.ఆర్. రావు గారు వీరు నలుగురు సబ్ ఎడిటర్స్. 1, 2 సంవత్సరాలలో వాళ్ళకి ప్రమోషన్ వచ్చాయి. వాళ్ళు మిగతా మీడియాకి వెళ్ళిపోయారు. పన్యాల, కొత్తపల్లి, బుచ్చిరెడ్డి గారు హైదరాబాద్ వచ్చేశారు.

తర్వాత న్యూస్, స్టాఫ్ ఆర్టిస్ట్‌లతో యూనిట్ రన్ చేశారు. ఇంకా సబ్ ఎడిటర్స్‌ని ఎవర్నీ వేయలేదు. ఆ తర్వాత మేము రిక్రూట్ అయ్యాం.

**మీరు ప్రింట్ మీడియా నుండి ఒకసారి ఎలక్ట్రానిక్ మీడియాకి రావడం, ఒక రకంగా మీరు ప్రింట్ మీడియాలో మహామహులు, లబ్ధ ప్రతిష్టులతో పనిచేశారు. విద్వాన్ విశ్వం, నండూరి రామ్మోహన్ గారు, ఇలాంటి వారితో పనిచేసి ఆకాశవాణికి వచ్చారు ఎలా అనిపించింది?**

నేను చేరేటప్పటికి ఆకాశవాణిలో పంన్యాలరంగనాథరావు, కొత్తపల్లి సుబ్రమణ్యం, బుచ్చిరెడ్డి గారు మా తరంతో పోలిస్తే ఒక మెట్టు ఎక్కువే. అంటే వాళ్ళ నాలెడ్జి, హుందాతనం, వాళ్ల డివోషన్ కూడా మా కంటే ఎక్కువే ఉండేది. అక్కడ అలాంటి గొప్ప వాళ్ళతో పనిచేశాక, ఇక్కడ కూడా నేను ఆరాధ్యంగా భావించే పన్యాల, కొత్తపల్లి లాంటి వాళ్ళతో పాటు కూర్చుని వాళ్ళ గైడెన్సులో, ఇలా చదవాలి, అలా చదవాలని మమ్మల్ని తీసుకువెళ్ళి చూపిస్తుండేవారు, అలా చేరడంలో ఒక విధమ్మైన కాన్ఫిడెన్స్ వచ్చింది. ట్రైనింగ్ ఉండేది కాదు, స్ట్రెయిట్‌గా తీసుకెళ్ళి కొన్ని రోజులు అబ్జర్వ్ చేయమనేవారు, తర్వాత మమ్మల్ని స్టూడియో లోకి పంపి వార్తలు చదవమనే వారు.

**మొదటిసారిగా ఆల్ ఇండియా రేడియో న్యూస్ చదివేటప్పుడు మైక్ ముందు ఎలా అనిపించింది?**

ఎంతో కాన్ఫిడెంట్‌గా ఉన్న మొదట్లో కొంత నర్వస్‌నెస్ వచ్చింది, వీళ్ళందరు చెబుతుండేవారు, భయపడకు జాగ్రత్తగా చదువు అని, కొత్తలో కొంచెం సరిగా చదవలేదు, అది శ్రోతల్లో కూడా తెలిసంది మొదట్లో.అ ందులో 1962లో చైనా యుద్ధం, ఆ వార్తలు కూడా ఉండేవి దాంతో ఇంకొంచెం తొట్రుపాటు, కంగారు ఉండేది మొదట్లో. కొద్ది రోజుల్లో సెట్ అయిపోయింది. ఒక రోజు స్విచ్ ఆన్ చేసినట్లయింది. నేను స్టూడియో నుండి బయటకు వచ్చేసరికి తిరుమలశెట్టి శ్రీరాములు గారు ఫోన్ చేశారు, కుర్రాడు బాగా చదువుతున్నావు, ఇలా చదువు అని. 4వ రోజు కృష్ణశాస్త్రి గారి నుండి లెటర్ వచ్చింది. చాలా బాగా చదివావు. ఇలాగే చదువు. సంతకం పెట్టి పంపారు. ఇంక అక్కడ నుండి వెనుతిరిగి చూసుకోలేదు. చివరి వరకు అలా వచ్చేసిందంతే. ఒక ఒరవడిలాగా వచ్చింది. చెప్పాలంటే పన్యాల గారి లాగా చదవాలి అనే గోల్ బాగా పెట్టుకున్నా. ఎంచేతంటే ఆయన వార్తలు చదువుతుంటే గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ అనేది పూర్వకాలంలో చాలా ప్రసిద్ధి చెందిన రైలు, అది వెళ్తుంటే టక్, టక్ మనే ఒక హుందాతనం కనబడేది. ఆయన వార్తలు అలా ఉండేవి. తర్వాత కొత్తపల్లి సుబ్రమణ్యం గారు ఆయన వార్తలు కూడా అలాగే ఉండేవి. వీళ్ళిద్దరు మాకు ఆదర్శంగా ఉండేవారు.

**మీరు వార్తలను చదవడమే కాకుండా, అనువాదం కూడా చేసేవారు ఈ రెండు బాధ్యతలు ఎలా చేశారు?**

నాకు అదృష్టం కొద్ది అనువాదం అనేది నాలో ఉందేమే అనిపించేది. ఎందుకంటే ఆంధ్రజ్యోతిలో చేరినపుడు నార్ల అంటే ఎంత టఫ్ ఉంటారో అందరికీ తెలుసు. ప్రతి పాయింట్ వదలకుండా చేశేవారు ఆయన. అలాంటి వారి దగ్గర పనిచేశాను కదా. ఆయన 6 నెలలు తిరక్కుండానే నా చేత బ్యానర్ హెడ్ లైన్స్ రాయించారు, అపుడు వీరభద్రరావు గారని ఇంఛార్జ్ ఉండేవారు. ఆయన అన్నారు ఏమోయ్ సూర్యనారాయణ మేము ఇన్నేళ్ళు నుండి చేస్తున్నాము. నార్ల మమ్మల్ని ఒక్కసారి కూడా రాయమని అడగలేదు. నీచేత చేపించారని అన్నారు. అలా ట్రాన్స్‌లేషన్ నాకు ఆంధ్రజ్యోతి నేర్పింది. అది ఇక్కడ ఉపయోగపడింది. నార్ల వే ఆఫ్ రైటింగ్ నాకు ఇష్టం. ఒక పోయటిక్ ఫ్లేవర్ ఉంటుంది. నేను రేడియోలో జాయిన్ అయ్యి మొదట ట్రాన్స్‌లేషన్ చేసినపుడు సీనియర్లు అందరూ చాల బాగా మెచ్చుకున్నారు. మా టైమ్‌లో ప్రతిది ఒక పద్ధతిలో ఉండేది. ట్రాన్స్‌లేషన్ మా సీనియర్లు ఏ ఒరవడిలో పెట్టారో అదే మేము కూడా ఫాలో అవ్వాలి. కొన్ని వర్డ్స్ ఉండేవి, ఈ వర్డ్‌కి ఇదే ఉపయోగించాలి ఎంచేతంటే, రేడియోకి స్టాండర్డ్ ఉంటుంది. ఇంకా ఎంతో జాగ్రత్తగా ఉండేవారంటే ఒక ఉదాహరణ చెప్తాను. అప్పుడు నాన్ అలైన్‌మెంట్, అంటే అలీన విధానం కొత్తగా వచ్చింది. దానికి తెలుగు వర్డ్ కావాలి, నార్ల గారు అలీన విధానం అని ఉపయోగించారు. అదే మేము కూడా వాడితే మేము ఆంధ్రజ్యోతిని ఫాలో అయ్యామని అనుకుంటారు. ఆల్ ఇండియా రేడియో ఫాలో

అవడానికి వీల్లేదు. అంత స్ట్రిక్ట్‌గా ఉండేవారు. అపుడు 'ఏ రాజ్య కూటానికి చెందని విదేశాంగ విధానం' అని ఇంత పొడుగు పెట్టాం. ఆ ట్రాన్స్‌లేషన్ మేము సొంతంగా చేసుకున్నాం. శ్రోతలు కూడా అంతే అలెర్ట్‌గా ఉండేవారు. ఒక చిన్న తప్పు ట్రాన్స్‌లేషన్ గాని దేంట్లో అయినా ఉంటే వెంటనే ఉత్తరాలు రాశేవారు. మమ్మల్ని ఎక్స్‌ప్లెయిన్ అడిగేవారు. వార్తలు వినడం అందరికీ దైనందిన జీవితంలో ఆనాడు భాగంగా ఉండేది.

**మీరు యుద్ధ సమయంలో రేడియోలో చేశారు కదా, ఆ సమయంలో యుద్ధ వార్తలు చదివేటప్పుడు ఎలా అనిపించేది. అంటే గంభీరంగా అలా?**

మన వాళ్ళ యుద్ధ సమయంలో విజయాలు సాధించినప్పుడు చదివే వార్తలు బాగా అనిపించేవి. మిగతా అన్ని విషయాలు తీసుకుంటే స్పోర్ట్స్‌లో విజయం సాధిస్తే ఆ చెప్పేటప్పుడు ఆటోమేటిక్‌గా వచ్చేది కొంచెం చూయించేవాళ్ళం. నేను చేసేవాణ్ణి, తర్వాత మా రేడియో స్టాండర్డ్స్‌లో విషాదకరమ్మైన వార్త ఉందనుకోండి, ఆ వార్త చదివేటప్పుడు ఆ ధ్వని వచ్చేది బాధ అనేది, ఆ విధంగా మేము జాగ్రత్త పడేవాళ్ళం. వార్తలు చదవడంలో కొంచెం పోటీతత్వం ఉండేది సహజంగా, భాగం చదవాలని అందరికీ ఉండేది, ఏ మాత్రం సరిగా చదవక పోయినా రేపు శ్రోతలు నన్ను ప్రశ్నిస్తారు అనే భయం ఉండేది.

**ప్రజల్లో రాజకీయ నాయకులు, సినిమావాళ్ళు, స్టేజ్ ఆర్టిస్ట్‌లాగా గ్లామర్ ఉంటుంది అది మీకు ఎప్పుడయినీ అనుభవం జరిగిందా?**

చాలా జరిగాయి, ఎవరైనా పరిచయం చేస్తున్నప్పుడు నేను సో అండ్ సో అని చెప్పినప్పుడు చాలా తేడా కనిపిస్తుంది. మా ఫ్రెండ్స్ అంటుండేవారు. పరిచయం చేస్తూ ఎవరైనా మీపేరు చెప్పగానే మీ మొహంలో లైట్లు వెలుగు తీయండి అనేవారు. మా ముందు తరాల వారిని కూడా మేము అలాగే అభిమానించే వాళ్ళం, ఇక్కడ జి. నళిని మోహన్ అని ప్రాంతీయ వార్తలు చదివేవారు, ఆయన నేను రేడియో ఇంటర్వ్యూకి వచ్చినపుడు లోపలికి పంపిస్తుంటే ఆయన్ని చూసి చాలా థ్రిల్ అయిపోయాను. అలా నాకు కూడా మంచి ఎక్స్‌పీరియన్స్ జరిగాయి.

**మీరు ఆంధ్రప్రదేశ్ నుండి ఢిల్లీకి వెళ్ళారు ఆ జర్నీ మీకు ఎలా అనిపించింది?**

జీవితంలో ఎపుడు అనుకోలేదు అలా జరుగుతుందని, జీవితంలో అదొక పెద్ద మలుపు. చాలా గొప్ప అవకాశం. అక్కడ వాతావరణం మొదట్లో కొంత ఇబ్బందిగా అనిపించింది. కాని మనస్సులో ఒక విధమ్మైన సంతోషం ఉండేది. యూనిట్‌లో ఉన్నపుడు చుట్టూ తెలుగు వాళ్ళుండేవారు. బాగా పరిచయాలు. ఒకరికి ఒకరం హెల్ప్‌ఫుల్‌గా ఉండేది. ఆ విధంగా బాగానే అడ్జస్ట్ అయ్యా. అక్కడ పెద్ద పెద్ద ఆర్టిస్ట్‌లు అంతా అలా తిరుగుతుండేవారు. ఆ అనుభూతి చాలా గొప్పగా ఉండేది. వద్దాది అప్పారావు గారు ఉన్నపుడు ఓ రోజు ప్రక్కన ఒకావిడ కూర్చుంటే చూపించారు. ఆవిడ బేగం అక్తర్. అప్పట్లో నెహ్రూ లాంటి వారు ఆమెకి ఫాన్స్. అలాంటి వ్యక్తులు కనపడుతుంటే ఒక విధమ్మైన అనుభూతి కలిగేది. అదృష్టమే అది.

**కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టడం, లేదా మంత్రి వర్గ విస్తరణ ఇటువంటి సమయంలో ప్రాముఖ్యత ఉంటుంది కదా? ఈ సమయంలో మీరు ఎలా సర్దుబాటు చేసుకునేవారు?**

బడ్జెట్ అంటే విపరీతమ్మైన టెన్షన్ ఉండేది, అపుడు బడ్జెట్ కూడా డిఫరెంట్‌గా ఉండేది. సాయంకాలం 5.30–6 గంటలకి పెట్టేవారు. అంచేత ఫైనాన్స్ మినిస్టర్ ఎంతసేపు చదువుతారో తెలియదు. అంచేత స్పీచ్ అయ్యేదాక తెలుగు న్యూస్‌కి టైమ్ వస్తుందో రాదో తెలియదు. 7 వరకు ఫైనాన్స్ మినిస్టర్ మాట్లాడితే 7.05 కి న్యూస్ వెళ్ళాలి. అంచేత ఏం చేసేవారంటే ఒంటిగంటకి పర్మినెంట్‌గా సెక్యూరిటీ రూమ్ పెట్టి ప్రతి లాంగ్వేజ్ నుంచి ఒకర్ని లేదా ఇద్దరిని అక్కడి తీసికెళ్ళి క్లోజ్ చేసి, పోలీస్‌లతో సెక్యూరిటీ ఉంచేవారు. అక్కడ బడ్జెట్ పేపర్స్ మాకు డిస్ట్రిబ్యూట్ చేశారు. అక్కడ ఎడిటర్లు ఉండేవారు. వాళ్ళు ఎడిట్ చేసి ఇస్తే మేము ట్రాన్స్‌లేషన్ చేసి రెడిగీ ఉండేవాళ్ళం. అందుకే ఫుల్ సెక్యూరిటీ పెట్టేవారు. ఇంకా మంత్రి వర్గం అలాంటివి ఉన్నప్పుడు మా సీనియర్ల చేత చదివించే వారు. నెహ్రూ

గారు ఫేవర్ పర్మనెంట్‌గా పన్యాల ఉండేవారు. ఇంకా ప్రైమ్ మినిస్టర్ ప్రెస్ కాన్ఫరెన్స్ ఉందంటే బుచ్చిరెడ్డి ఇంఛార్జ్‌గా ఉండేవారు, పన్యాల ఇవాళ మీరు చదువుతారు అనేవారు. అంటే షెడ్యూల్ ఛార్ట్ ఉంటుంది. దాని ప్రకారం వేశేవారు. షెడ్యూల్ ఎలా ఉన్నా ముఖ్యమైన న్యూస్ ఉంటే సీనియర్ల చేత చదివించేవారు. అలా ఉండేది. తర్వాత మా జనరేషన్ వచ్చేసరికి మార్చడం అలాంటివి తక్కువయ్యాయి. ఎందుకంటే అందరూ సమానంగానే చదువుతారు అనే సెన్స్‌లో ఉండేది. కాని బడ్జెట్ ఉన్నపుడు నన్ను తీసుకెళ్ళేవారు ఎక్కువగా, ఎందుకంటే నేను ట్రాన్స్‌లేషన్ బాగా చేస్తానని వాళ్ళకి నమ్మకం.

**ఈ క్రమంలో ఎక్కడయినీ మీరు విమర్శ ఎదుర్కొన్నారా అంటే వార్తలు చదవడంలో కాని లేక ట్రాన్స్‌లేషన్‌లో గాని అంటే ముఖ్య విషయాల్లో?**

మొదట్లో కొన్నాళ్ళు ఓపెనింగ్ అనౌన్స్‌మెంట్ కొంచెం తేడా అంటే ఒక పద్ధతిలో ఉండేది. నేను ఒక ముద్ర లాగా చేశా. శ్రోతలు కూడా ఆకాశవాణి అనగానే కందుకూరి సూర్యనారాయణ అని ఒకటి ప్రజల్లో వచ్చేసింది. మొదట్లో కొంతమంది అలా ఎందుకు చదువుతారు అన్న వారు కూడా ఉన్నారు. చిన్న చిన్న మిస్టేక్స్ తప్పితే పెద్దవి ఏం జరగలేదు, ట్రాన్స్‌లేషన్‌లో కూడా, మిస్టేక్స్‌కి స్కోప్ తక్కువ.

నాకు ఒక్కడే అబ్బాయి. ఢిల్లీలో ఉంటాడు. ఢిల్లీలో ఉండటం వలన బంధువులతో కలవడానికి కష్టమయ్యేది. శుభకార్యాలకు రావడం కుందరక పోయేది. నేను చాలా మిస్ అయ్యాను.

**మీరు రష్యా కూడా వెళ్ళారు అది ఎలా జరిగింది?**

అపుడు రష్యా ఇండియా చాలా క్లోజ్‌గా ఉండేవి. వాళ్ళు ఒక డెసిషన్ తీసుకున్నారు. వాళ్ళ బ్రాడ్‌కాస్ట్ మన ఇండియన్ అన్ని అఫీషియల్ లాంగ్వేజెస్‌లో పెట్టాలనుకున్నారు. కంటెంట్ అంతా వాళ్ళదే కాని మన భాషల్లో ప్రసారం చేయాలి. మొదట్లో హిందీ, ఉర్దూ ఉన్నాయి. తెలుగు తర్వాత వచ్చింది. వాళ్ళు అడిగితే ఆకాశవాణి డైరెక్టర్ గారు ఇంట్రస్ట్ ఉన్న వాళ్ళు పేర్లు ఇమ్మన్నారు. అలా ట్రాన్స్‌లేషన్, వాయిస్ టెస్ట్ చేసుకున్నారు వాళ్ళు. ఇంటర్వ్యూలో నేను సెలెక్ట్ అయ్యాను. కాని ఇక్కడ ఇంకో విషయం. స్టాఫ్ ఆర్టిస్ట్ కాబట్టి రిజైన్ చేసి రష్యా వెళ్ళాలన్నారు. నాకు ఇష్టం లేకుండే, కాని నాన్నగారు, మిగతా వాళ్ళని కూడా అడిగి వారి సలహాలు తెలుసుకున్నా, అలా కొంత కాలం గడిచింది. ఆ తర్వాత మాస్కో వెళ్ళి సూర్యనారాయణ ఇంకా రాలేదని, హీ షుడ్ కమ్ అని అడిగారట. అంటే వాళ్ళకి నా ఫర్మార్మెన్స్ అన్నీ నచ్చాయనుకుంటాను. తర్వాత గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వాళ్ళు 2 సంవత్సరాలు ఉండి తిరిగి వస్తే అదే జాబ్ ఇస్తామన్నారు. సెక్యూరిటి ఉంది కాబట్టి వెళ్ళాను. మాక్జిమమ్ 3 సంవత్సరాలు అన్నారు. ప్రొఫెషనల్‌గా మాస్కోలో 2 సంవత్సరాలు గొప్ప పిరియడ్, మాస్కోవాళ్ళు నన్ను చాలా గౌరవించేవారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా. కాకపోతే బాగా చలి, భోజనం కొద్దిగా ఇబ్బంది ఉండే, ప్రొఫెషనల్‌గా చాలా బాగా ఉంది. ఒక డ్రామా ప్రోగ్రామ్‌లో అన్ని క్యారెక్టర్స్ ఒక్కన్నే చేశా అపుడు అందరూ థ్రిల్ అయ్యారు. రష్యాలో తెలుగు వ్యక్తిగా మంచి గుర్తింపు వచ్చింది. వాళ్ళు అక్కడే ఉండమని కంటిన్యూ అవ్వమన్నారు. కాని వాతావరణం అవి కొంచెం ఇబ్బందిగా ఉండటంతో వెనక్కి వచ్చేశా. 2 సంవత్సరాలలో. కాని వెనక్కి వచ్చాక శాలరీలో చాలా మార్పు వచ్చింది. 2 సంవత్సరాలు సర్వీస్ బ్రేక్ అయ్యిందని, నేను మళ్ళీ జాయిన్ అయ్యాక సేమ్ పోస్ట్‌లో, శాలరీ మాత్రం బేసిక్‌లో ఇచ్చారు. జీతం మొదట్లో వచ్చినంతే ఇచ్చారు. ఎందుకంటే రీఅపాయింట్‌మెంట్ కాబట్టి అన్నారు. నేను సీనియర్ మోస్ట్‌ని, కాని జూనియర్ మోస్ట్‌ని అయ్యాను.

*ఆకాశవాణిలో శ్రీ వలేటి గోపీచంద్ గారు, శ్రీ కందుకూరి సూర్యనారాయణ గారితో జరిపిన సంభాషణలలో కొన్ని భాగాలు పైన ఇచ్చాము. దీనికి ఆకాశవాణి సమ్మతి తీసుకోవటం జరిగింది.*

# రాణి చంద్రాయమ్మ

**– రామవరపు వేంకట రమణమూర్తి**

ఉత్తరాంధ్రలో ఒక సంస్థానాన్ని, గోదావరి సీమలో ఒక సంస్థానాన్నీ పాలిస్తున్న రాజులు మరణించినప్పుడు ఏర్పడిన పరిస్థితులను సరిదిద్దుతూ ఆయా వంశాల రాజులను నిల్పిన ఒక రాణి చరిత్ర నేడు చరిత్ర పుటల్లో మరుగున పడిపోయింది. ఈ రోజు మనం ఆ రాణి గురించి కొంతవరకు తెలుసుకుందాం.

వరాహానదీ తీరంలో ఉంది ఏటికొప్పాక. ఈ ఏటి కొప్పాకకు చెందినవారు చింతలపాటి రాశిరాజు లేదా రాచిరాజు. ఈయనకు నలుగురు కుమార్తెలు. అందులో ఒకరైన చంద్రాయమ్మను విజయనగరం సంస్థానం రాజైన (పెద) విజయ రామరాజుకు ఇచ్చి వివాహం చేసారు. మిగిలిన వారిలో ఒకరిని పెద్దాపురం రాజవంశం వారికి, అంటే వత్సవాయి వారికి, ఇంకొకరిని అలమండకు చెందిన కాకర్లపూడి వారికి, మఱొకరిని పాంద్రంకి చెందిన సాగి వారికి ఇచ్చి వివాహాలు చేసారు. వీరి సోదరుడు నీలాద్రి రాజు. ఈ చింతలపాటి నీలాద్రి రాజు పెద విజయ రామరాజుకు బావమరిదే కాకుండా నమ్మకమైన సర్దార్‌గా నిల్చాడు. అంతేకాదు చిన విజయరామరాజుతో పాటుగా పద్మనాభ యుద్ధంలో (1794, జూలై 10 న) వీరమరణం పొందాడు. విజయనగర సంస్థానాధీశుడు అయిన మొదటి లేదా పెద విజయ రామరాజు (1708-1757)కు మొదటి భార్యగా పూసపాటి వారింటికి వచ్చింది చంద్రాయమ్మ. పెద విజయ రామరాజు బొబ్బిలి యుద్ధం (1757, జనవరి 24 న) జరిగిన మూడో రోజు రాత్రి బొబ్బిలి కోట దేరాలో నిద్రిస్తున్న సమయంలో తాండ్ర పాపారాయుడు (బొబ్బిలి సంస్థానాధీశుడు గోపాలకృష్ణ రంగారావ్ బావమరిది) హత్య చేసాడు. విజయ రామరాజు హత్య చేయబడడం, ఇతనికి పిల్లలు లేకపోవడం విజయనగర సంస్థానంకు లోటుగా మారింది.

విజయ రామరాజుకు అంతవరకు బాసటగా నిల్చిన ఫ్రెంచి సేనాని కల్నల్ బుస్సీ విజయనగరం రాణులను కనీస మర్యాదగా పరామర్శించకపోవడంతో విజయనగరం ప్రధాని బుఙ్గా బుచ్చన్న, సైన్యాధ్యక్షుడు కాకర్లపూడి రామభద్ర పాయకరావ్ (అనకాపల్లి-సత్యవరం సంస్థానాధీశుడు), మిగిలిన వారికి విజయనగర రాజు హత్య విషయంలో ఫ్రెంచివారి హస్తం ఉందనే అనుమానం వచ్చింది. ఇటువంటి పరిస్థితులలో చంద్రాయమ్మ తగిన నిర్ణయం తీసుకుంది.

అదేమిటంటే, శ్రీకాకుళం ఫౌజుదార్ అన్వరుద్దీన్‌కు సహాయంగా గంజాం ప్రాంతంలోని ప్రతాపగిరి కోట (సనఖిమిడి) పైకి దాడికి వెళ్ళినప్పుడు (1734) దేవుపల్లి కోట రాజు సీతారామరాజు మరణించాడు. ఇతని కొడుకు ఆనందరాజుని దత్తత తీసుకుంది. ఇతడే చరిత్రలో రెండవ ఆనందరాజు (1732-1760) గా ప్రసిద్ధుడు. తండ్రి సీతారామరాజు మరణించిన నాటినుండి ఈ ఆనందరాజు, విజయ రామరాజు, చంద్రాయమ్మ సంరక్షణలో విజయనగరం కోటలో పెరుగుతున్నాడు. చిన్న బాలుని దత్తత తీసుకునే బదులుగా ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా యువకుడైన ఆనందరాజుని దత్తత తీసుకుంటే కొంతవరకు స్వయంగా రాజకీయ నిర్ణయాలు తీసుకొనే ప్రతిభ దత్తునికి కలుగుతుంది అని చంద్రాయమ్మ భావించింది. రాజమాత నిర్ణయానికి ప్రధాన దివాన్ బుఙ్గా బుచ్చన్న, సైన్యాధ్యక్షుడు కాకర్లపూడి రామభద్ర పాయకరావు, రాణి సోదరుడు చింతలపాటి నీలాద్రి రాజు మిగిలిన సర్దారులు మద్దతు తెలిపారు. ఆనందరాజు రాజు కాగానే బుస్సీని విజయ రామరాజు హత్యపై సంజాయిషీ కోరేడు. దీనికి ఆగ్రహించిన బుస్సీని కోస్తా ప్రాంతం నుండి తరిమివేయాలని నిర్ణయించి తగిన చర్యలు చేపట్టేడు. ఇదే సమయంలో యూరప్‌లో సప్తవర్ష సంగ్రామం (1756- 1763) జరుగుతున్న సందర్భంగా బ్రిటన్, ఫ్రెంచి దేశాలు బద్ధశత్రువులుగా మారేరు. బ్రిటిష్, ఫ్రెంచి వారి గొడవలు ప్రభావం ఇక్కడి బ్రిటిష్- ఫ్రెంచి వారిపై కూడా పడింది. పుదుచ్చేరిలోని ఫ్రెంచి గవర్నర్ ఆదేశాల మేరకు బుస్సీ తమిళనాడుకు వెళ్ళిపోయాడు. ఇదే సమయంలో ఆనందరాజు ఫ్రెంచివారిపై దాడులు ప్రారంభించేడు. ఆనందరాజు కోరిక మేరకు కలకత్తా నుండి రాబర్ట్ క్లైవ్ ప్రతినిధి కర్నల్ ఫోర్డ్ వచ్చి ఆనందరాజును కలిసాడు. ఆనందరాజుకు కల్నల్ ఫోర్డ్‌కు 1758, నవంబర్ (21న)లో ఒప్పందంపై వరాహానదీ తీరంలోని ఏటికొప్పాకలో సంతకాలు జరిగాయి. దీనికి కారణం వరాహానదీ నీటి సౌకర్యం, ఇంకా ఈ ఊరు రాజమాత చంద్రాయమ్మ పుట్టింటివారైన చింతలపాటివారు ఉండే ప్రదేశం కావడమే. పిఠాపురం దరినున్న చందుర్తిలో 1758 డిసెంబర్, 7న జరిగిన యుద్ధంలో ఫ్రెంచి వారిని, పెద్దాపురం వత్సవాయి వారిని, పిఠాపురం రావు వారిని ఆనందరాజు, బ్రిటిష్ సేనలు కలసి ఓడించాయి. దీనితో కోస్తా ప్రాంతంలో ఫ్రెంచివారి ప్రాబల్యం తుడుచుకు

పోయింది. ఆ తరువాత జరిగిన సామర్లకోట యుద్ధంలో పెద్దాపురం రాజు వత్సవాయి జగపతి, పిఠాపురం రావు పెద మహీపతి ఓడిపోయారు. తరువాత మళ్ళీ జరిగిన ఉందూరు (1759) యుద్ధంలో పిఠాపురం వారు, దచ్చివారు పలాయనం చిత్తగించగా, పెద్దాపురం జగపతి రాజు అసువులు బాశాడు. ఇలా ఆనందరాజు ఫ్రెంచి వారిపై తగిన చర్య తీసుకోవడం రాజమాత చంద్రాయమ్మకు ఆనందం కలిగించింది. కానీ మళ్ళీ రాజమాత చంద్రాయమ్మ ఇంకొక సమస్యను ఎదుర్కోవలసి వచ్చింది. ఉందూరు విజయంతో తిరిగి వస్తున్న ఆనందరాజు మశూచి వలన ఏలూరు- రాజమహేంద్రవరం మధ్య దారిలో 1760 ఫిబ్రవరి 25న మరణించాడు. ఇదే సమయంలో ఆనాటి హైదరాబాద్ నవాబ్ సలాబత్ జంగ్ (పాలన 1751-1762) విజయనగరంపై దాడికి ఆలోచనచేశాడు.

ఆనంద గజపతి మరణవార్త తెలియగానే రాణీ చంద్రాయమ్మ రాజమహేంద్రవరం వైపు ప్రయాణిస్తూ దారిలో ఉన్న తాళపాలెంలోని పూసపాటి రామభద్రరాజు రెండవ కుమారుడు వేంకటపతి రాజు (12 సం॥ బాలుడు)ని దత్తత తీసుకుంది. ఈ బాలునికి తన భర్త పేరు విజయ రామరాజు గజపతి అని నామకరణం చేసింది. ఇతనే తరువాత కాలంలో పద్మనాభ యుద్ధవీరుడుగా (1794, జూలై 10) చరిత్ర ప్రసిద్ధుడు. దత్తత కార్యక్రమం పూర్తి చేసుకుని తన రాజ్యంపై దండెత్తవద్దని, సంప్రతింపులకై తానే రాజమహేంద్రవరం వైపు వస్తున్నట్టుగా హైదరాబాద్ నవాబ్ సలాబత్ జంగ్‌కు వార్త పంపింది. తాను (చిన) విజయ రామరాజును దత్తత తీసుకున్న విషయం కూడా విశదపరిచింది. రాణీ చంద్రాయమ్మ రాకకై సలాబత్ జంగ్ కొవ్వూరులో దాదాపు పది రోజులు వేచి ఉన్నాడు. తన సోదరుడు నిజామ్ అలీ (బ్రిటిష్ వారి మద్దతు ఉన్నవాడు) తో తనకు ఉన్న ఇబ్బంది; అలాగే ఆనందరాజు మరణం వలన విజయనగరం సంస్థానంకు కలిగిన ఇబ్బంది... ఇలా రెండూ కలసి ఇరువురి నడుమ ఒప్పందం లేదా సంధి చేసుకోవడానికి మార్గం సుగమం అయింది. ఒకవేళ సంధి కుదరకపోతే, యుద్ధం అనివార్యమైతే అందుకు సిద్ధమై తగిన సైనికబలంతో రాణీ చంద్రాయమ్మ రాజమహేంద్రవరం చేరడం కూడా ఆమె రాజకీయ పరిణితికి నిదర్శనంగా కనబడుతోంది. వీరిద్దరి మధ్య సంధి వలన నవాబ్ రాణీ తన దత్తుణ్ణి విజయనగర సంస్థానాధీశునిగా గుర్తించడం జరిగింది. ఇలా ప్రతీ అడుగును విజ్ఞతతో వేస్తూ విజయనగర సంస్థానంకు బయటి నుండి ఎటువంటి ముప్పు కలుగకుండా చేయడంతో రాణీ చంద్రాయమ్మ కృతకృత్యురాలైంది. విజయనగరం సంస్థానం రాజు మరణంతో ఎదుర్కొన్న సమస్యలాంటిదే పెద్దాపురం సంస్థానం కూడా ఎదుర్కొంది. ఇటువంటి సమయంలో తన విజ్ఞతతో చంద్రాయమ్మ పెద్దాపురం సంస్థానాన్ని కూడా కాపాడిందని చెప్పవచ్చు. దీనికి కారణం తన తండ్రి (చింతలపాటి రాశిరాజు) తమ ముగ్గురు అక్కచెళ్ళెళ్ళలో ఒకరిని (తన సోదరిని) పెద్దాపురం సంస్థానం వారికి ఇచ్చి వివాహం చేయడమే. అంటే తన సోదరి అత్తగారింటి సమస్యను కూడా తన సమస్యగా భావించి పరిష్కరించింది చంద్రాయమ్మ. పెద్దాపురం సంస్థానాన్ని పాలిస్తున్న వత్సవాయి రాయపరాజు (రెండవ రాయపరాజు (1688-1714) మరణం తరువాత అతని పెద్ద కొడుకు తిమ్మ రాజు (1714-1734) తన పదవ ఏట రాజు కావడం జరిగింది. అందుచేత అతని తల్లి రాఘవమ్మ (రాగమ్మ) రాజ్యపాలన బాధ్యత చూస్తుండేది. ఈమెకు తిమ్మరాజుతో పాటు బలభద్రరాజు, సూరపరాజు అనే ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. ఇటువంటి సమయంలో రాజమండ్రి ఫౌజుదార్ (గోల్కొండ నవాబు ప్రతినిధి) రుస్తుం ఖాన్ పెద్దాపురంపై దాడి చేసాడు. మోసంతో పెద్దాపురం వద్ద తన విడిదికి రప్పించి వీరిని చంపివేశాడు. దీనివలన సంస్థానానికి రానున్న ప్రమాదాన్ని గుర్తించింది రాజమాత రాఘవమ్మ. తన మనుమడు (సంస్థానాధీశుడు తిమ్మరాజుకు కొడుకు) ఏడాది వయసు గలవాడిని కాపాడమని కొంపెల్ల లక్ష్మమ్మ అన్న బ్రాహ్మణ స్త్రీకి అప్పగించి తన బంధువైన చంద్రాయమ్మ వద్దకు పంపింది. ఆ తరువాత వెంటనే రాజమాత రాఘవమ్మతో పాటు అంతఃపుర స్త్రీలు సజీవ దహనం పాలయ్యారు.

పసిబాలుడైన జగపతి తల్లి (పెద్దాపురం సంస్థానాధీశుడు తిమ్మరాజు భార్య) రాణీ చంద్రాయమ్మకు మేనకోడలు అవుతుంది. బాలుడైన జగపతిని తప్పించి చంద్రాయమ్మ దగ్గరకు చేర్చే క్రమంలో దురదృష్టవశాత్తూ ఫౌజుదారి రుస్తుం ఖాన్ భటులకు చేబ్రోలు గ్రామ సమీపంలో లక్ష్మమ్మ దొరికిపోయింది. వీరిద్దరినీ రుస్తుం ఖాన్ ఖైదు చేసాడు. ఇలా కొంత కాలం గడిచింది. అప్పుడు రుస్తుం ఖాన్‌ని చంపి అతని కొడుకు నురుద్దీన్ గోల్కొండ నిజాం అనుమతితో రాజమండ్రి ఫౌజుదార్ అయ్యాడు. ఖైదు చేయబడిన బాలుడు జగపతిని విడిపించడానికి విజయనగరం సంస్థానాధీశుడు విజయ రామరాజు (చంద్రాయమ్మ భర్త) ఫౌజుదార్ (నురుద్దీన్)పై దాడి

చేయడానికి రంగం సిద్ధం చేసాడు. విజయనగర సేనలకు, నురుద్దీన్‌కి 1734 లో పిఠాపురం దరినున్న చేబ్రోలు వద్ద యుద్ధం జరిగింది. ఇందులో నురుద్దీన్ మరణించేడు. బాలుడైన జగపతిని చెఱసాల నుండి విడిపించి విజయనగరం కోటకు చేర్చారు, విజేతలైన విజయనగరం వారు.

విజయనగరం కోటకు చేరిన బాలుడైన జగపతి పెంపకం బాధ్యతను రాణీ చంద్రాయమ్మ తీసుకుంది. అప్పటికే ఆనందరాజు (బాలుడు, బొబ్బిలి యుద్ధంలో విజయ రామరాజు మరణం తరువాత విజయనగరం రాజైనవాడు) కూడా చంద్రాయమ్మ సంరక్షణలో ఉన్నాడు. కాని దురదృష్టం కొద్దీ జగపతి, ఆనందరాజుల మధ్య స్నేహంకు బదులు స్పర్ధలే పెరిగేయి. అందుచేత జగపతికి 15 సం॥లు వయసు రాగానే ఆనాటి రాజమండ్రి అమీన్‌దార్ "నీమత్ ఆలీ"ని మంచి చేసుకొని 1749 లో జగపతిని పెద్దాపురంకు రాజుగా చేయించేడు విజయ రామరాజు. (బొబ్బిలి యుద్ధం సమయంలో జగపతి విజయ రామరాజు పక్షం వహించేడు). జగపతి పెద్దాపురం సంస్థానాన్ని 1749 నుండి 1758 వరకు పాలించేడు. తరువాత కాలంలో ఆనందరాజుతో జరిగిన చందుర్తి, సామర్లకోట యుద్ధాలు తరువాత జరిగిన ఉండూరు యుద్ధంలో (1759) లో ఈ వత్సవాయి జగపతి మరణించాడు. ఇటువంటి సమయంలో మళ్ళీ చంద్రాయమ్మ రంగప్రవేశం చేసింది. యుద్ధంలో చనిపోయిన వత్సవాయి జగపతి కుమారుడు తిమ్మరాజు (ఇతనే 4వ తిమ్మరాజు. పాలనాకాలం 1760-1797)ను పెద్దాపురంకు రాజును చేసింది. అప్పటికి తిమ్మరాజు వయసు ఆరేళ్ళు. ఈ బాలుడైన తిమ్మరాజును, తాను విజయనగరం సంస్థానం కోసం దత్తత తీసుకున్న బాలుడైన (11 సం॥వాడు) (చిన) విజయ రామరాజును తీసుకుని కొవ్వూరులో విడిది చేసియున్న గోల్కొండ (హైదరాబాద్) నవాబును కలుసుకుంది. నవాబుతో సంధి చేసుకుంది. దీనివలన తిమ్మరాజును పెద్దాపురం సంస్థానం రాజుగాను, (చిన) విజయ రామరాజును విజయనగర సంస్థానం రాజుగాను గోల్కొండ నవాబు గుర్తించేడు. గతంలో ఆనందరాజు, జగపతి కలహించుకున్నా, ఇప్పుడు మాత్రం ఈ యిద్దరు రాజులు ప్రాణస్నేహితుల వలె జీవించారు. ఇలా రాణి చంద్రాయమ్మ రెండు సంస్థానాల రాజకీయ పరిస్థితిని సరిదిద్దింది. కానీ రాణీ చంద్రాయమ్మకు తన సంస్థానంలోనే ఒక శత్రువు తయారు అయ్యాడు. (చిన) విజయ రామరాజును చంద్రాయమ్మ దత్తత తీసుకోవడం అతని సవతి అన్న సీతారామరాజుకు ఇష్టం లేదు. ఆనాటికి ఈయన 30 సం॥వాడు. తనని కాదని సవతి తమ్ముని పట్టాభిషేకం చేయడం ఇతనికి ఇష్టం లేదు. అందుచేత మన్య ప్రాంతాలలో తిరుగుబాట్లు చేయించాడు. ఒకసారి విజయనగరం కోట రక్షణాధికారి మరియు కోటలో సిబ్బందికి జీతాలు ఇచ్చే అధికారి అయిన సాగి నారాయణ రాజును లోబరచుకుని హఠాత్తుగా తన సిబ్బందితో కోటలోనికి ప్రవేశించి (చిన) విజయ రామరాజుని, రాణి చంద్రాయమ్మని గృహనిర్బంధంలో ఉంచి రాజ్యపాలనకు సిద్ధం అయ్యాడు.

కానీ సంస్థానంలోని చాలామంది సర్దారులు చంద్రాయమ్మకు అండగా నిల్చారు. వీరందరూ ఎదురు తిరగడంతో గత్యంతరంలేక రాజీకి వచ్చి (చిన) విజయ రామరాజును, అతడు రాజుగా గుర్తించాడు. దీనికి బదులుగా సీతారామరాజును దివాన్‌గా చేయడానికి చంద్రాయమ్మ అంగీకరించింది. కానీ నిజానికి సీతారామరాజు తన కుటిల యత్నాలను ఆపలేదు. సీతారామరాజు దివాన్ అయిన కొలది రోజులకే ప్రధాన దివాన్ బుఝ్ఝా బుచ్చన్న మరణించడం జరిగింది. బుచ్చన్న మరణం సీతారామరాజుకి కలసివచ్చింది. రాణి చంద్రాయమ్మ దేవుపల్లి కోటలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో రాణీ చంద్రాయమ్మను (1761) రహస్యంగా హత్య చేయించాడు. సీతారామరాజు చేసిన ఈ పనివలన విజయనగరం సంస్థానం సమర్ధురాలైన చంద్రాయమ్మ వంటి రాణిని కోల్పోయింది. దివాన్ బుఝ్ఝా బుచ్చన్న మరణం, రాణీ చంద్రాయమ్మ హత్యల వలన సీతారామరాజు ప్రభావం చినవిజయరామరాజుపై చాలాకాలం సాగింది. సీతారామ రాజు వలన రాజ్య విస్తరణ జరిగినా, ఆర్థికపరంగా అస్తవ్యస్థ పరిస్థితులు ఏర్పడి పరోక్షంగా పద్మనాభ యుద్ధంకు (1794, జూలై 10) దారితీసి ఒక పెద్ద సంస్థానం కూలిపోవడానికి కారణం అయ్యింది. విజయనగరంలో చంద్రాయమ్మ నిర్మించిన ''అయ్యా కోనేరు'' (హై కోనేరు) నీటిపంపులు రాకముందు విజయనగరవాసుల దాహార్తిని తీరుస్తూ ఉండేది. ఇలా విజయనగరం, పెద్దాపురం సంస్థానాలలో ఇబ్బందులు ఏర్పడినప్పుడు తన రాజకీయ సమర్థతతో వాటిని పరిష్కరిస్తూ తగిన కృషి చేసి రాణీ చంద్రాయమ్మ విజయనగర సంస్థాన చరిత్రలో తరచి చూస్తేనేకాని కన్పించని ఓ అద్భుతశక్తిగా నిలిచింది.


రామవరపు వేంకట రమణమూర్తి
విశ్రాంత ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్, ఆకాశవాణి, విశాఖపట్నం.
ఫోన్ : 9440 798 301

## కమ్మతెమ్మెర

పుస్తకప్రేమికులతో ముఖాముఖి – **మిసిమి**కి పసిడి కాంతి.

ఇద్దరు పుస్తకప్రేమికులతో అశ్వనీకుమార్ గారు నిర్వహించిన "ముఖాముఖి"తో మే 2025 **మిసిమి** సంచిక పసిడి కాంతులీనింది. హృదయమే గ్రంథాలయమైన లంకా సూర్యనారాయణగారూ, ఇంట్లో పిల్లల కంటే అరలు అరలుగా బారులుతీరిన పుస్తకాలను నిత్యం తడిమితడిమి తనిసిపోతూ అక్షరంకోసం తపించిపోయే పెద్ది సత్యనారాయణ గారూ **మిసిమి** పుటలను తమ జ్ఞాపకాలతో పరిమళింపచేశారు. అనుభవాలతో వెలిగించారు. లంకావారికి గ్రంథాలయమే ఇల్లు. ఇక పెద్ది వారికి మట్టిపరిమళం చిరునామా! పెద్దివారు బెంగుళూరు శివారు గ్రామంలో వ్యవసాయం చేస్తూ, మట్టిని ముద్దాడుతూ పసిడిపంటలు పండిస్తూ అభ్యుదయరైతుగా అందరి మన్ననలందుకుంటుండగా, లంకావారు ఎక్కడ పుస్తకం కనపడ్డా ప్రేమగా చేతుల్లోకి తీసికొని, ఆత్మీయంగా స్పృశించి, అన్నమయ్య గ్రంథాలయం పుస్తకాల వరుసలో దాన్ని పదిలపరిచి పదింతలు ఆనందిస్తున్నారు. ఇద్దరూ మర్యాదను ప్రేమిస్తారు. పుస్తకాల్లాగే మనుషులనూ ప్రాణాధికంగా గౌరవిస్తారు. "నా ప్రయాణం నూరేళ్ళ పండుగ" అని తమ సుదీర్ఘ జీవనయానాన్ని అభివర్ణించుకున్న పెద్ది సత్యనారాయణ గారు 96 సంవత్సరాల వయస్సు లోనూ నిత్యంపంచె, చొక్కా, కండువాతో నడిచొచ్చే తెలుగుతనానికి ప్రతీకగా కనిపిస్తారు. 1952లోనే మద్రాసు యూనివర్సిటీ నుండి ఎం.ఏ. (తెలుగు) పట్టభద్రులై, ప్రిన్సిపల్‌గా, ఉపాధ్యాయులుగా, పాఠశాల వ్యవస్థాపకులుగా విద్యారంగానికి సేవలందించారు. అనంతరం సేద్యం మీదకు దృష్టి మరలించి పసిడిపంటలు పండించారు. లాభాలూ గడించారు. ఆచార్య రంగా గారితో, మహాకవి జాషువాతో అత్యంత సన్నిహితంగా మెలగిన పెద్దివారు గొప్ప వ్యక్తిత్వంతో కుటుంబపెద్దగా ఆదర్శప్రాయు లయ్యారు. 'తెనుగులెంక' తుమ్మలవారితో అనుబంధం వారి క్రమశిక్షణకు నిదర్శనం. నిత్యం ఏదో ఒక పుస్తకాన్ని చదవడం, ఆ రచయితను అభినందించడం, నచ్చిన పుస్తకాన్ని ప్రతులు కొనుగోలు చేసి సాహితీ ప్రియులకు పంపడం, సన్నిహితులైన మిత్రులు, బంధువులు, కవులు, దేశనాయకుల గురించి తమదైన శైలిలో వ్యాసాలు రాయడం, ప్రత్యేక సంచికల్లో ప్రచురితం చేయడం పెద్దివారి దినచర్యలో భాగం. నాటి యజ్ఞదత్తునిలా తండ్రిని కంటికి రెప్పలా చూచుకునే కుమారుడు కృష్ణ కుమార్ నిలువెల్లా సంస్కారం మూర్తీభవించిన సౌజన్యమూర్తి. అశ్వనీకుమార్ గారే అన్నట్లు నెలల బాలునిలా నవ్వే నిర్మల ప్రశాంతవృద్ధులు పెద్దివారు. పెద్దమనసుతో తమ జ్ఞాపకాలనూ, అనుభవాలనూ **మిసిమి** పాఠకులతో పంచుకోవడం, అందుకు సంధానకర్తగా నిలిచిన ఎడిటర్ గారు, వారిమిత్రులు అభినందనీయులు. లోకంలో చాలామంది కళ్ళు సంపాదన వైపో, సంసారం వైపో చూస్తుంటాయి. కానీ, లంకా సూర్యనారాయణ గారి నేత్రాలు పుస్తకాల్ని పలకరిస్తూ సాఫల్య పాత్రాలవుతాయి. వేటపాలెం సారస్వత నికేతనానికీ, రాజమండ్రి గౌతమీ గ్రంథాలయానికీ దీటుగా అన్నమయ్య గ్రంథాలయాన్ని గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో అభివృద్ధి చేసిన లంకావారి శ్రమా, కృషీ, లక్ష్యం స్ఫూర్తిదాయకాలు. దేశంలోనే ఎక్కడా దొరకని అరుదైన గ్రంథాలు, ప్రత్యేక సంచికలు, పాత పుస్తకాలు లంకావారి కృషితో పాఠకులకు, పరిశోధకులకు అందుబాటులోవున్నాయి. అన్ని గ్రంథాలయాల్లోనూ పుస్తకాలుంటాయి. కానీ, పాఠకులను ప్రేమగా ఆహ్వానించి, అడిగిన పుస్తకాన్ని క్షణాల్లోనే అందజేసే ఆత్మీయత గల సుభాషిణి గారిలాంటి ఉద్యోగులు, లంకావారిలాంటి సహా, కేవలం అన్నమయ్య లైబ్రరీలోనే కన్పిస్తారు. అజో.విభో.కందాళం ఫౌండేషన్ వారి జీవన సాఫల్య పురస్కారం రూ. 1,35,000 నగదు బహుమతిని (ఒక్కొక్క పుస్తకానికి ఒక్కొక్క రూపాయి చొప్పున) గ్రంథాలయానికే వినియోగించిన మన తరం గ్రంథాళ్వార్‌ను కొత్తతరానికి **మిసిమి** ద్వారా పరిచయం చేసిన ఎడిటర్ గారికీ, సి.యస్. రాంబాబు గారికీ నా ఆత్మీయ అభినందనలు. కృతజ్ఞతలు.





లంకా సూర్యనారాయణ



పెద్ది సత్యనారాయణ

*– డా. బీరం సుందరరావు, చీరాల -523155, ఫోన్ : 6303443302*

# నాటి రాజభవనాలే నేటి మ్యూజియాలు



నేచురల్ హిస్టరీ మ్యూజియం, సిడ్నీ

– టి.వి. ప్రసాద్

ప్రపంచ దేశాల్లోని చాలా రాజభవనాలు ప్రముఖ మ్యూజియాలుగా, మరికొన్ని విలాసవంతమైన హెూటళ్ళుగా, గొప్ప వ్యక్తుల వివాహవేడుకలకు వేదికలుగా మారిపోవడం గమనించవచ్చు. రాజభవనాలు, మ్యూజియాలుగా మారిపోవడానికి ముఖ్య కారణం అవి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగి ఉండడం, ఒకనాడు జనసామాన్యానికి రాజప్రాసాదాల్లోకి ప్రవేశం నిషిద్ధం.

మారిన రాజకీయ, సాంఘిక పరిస్థితులవల్ల సామాన్యులు కూడా నేడు రాజవంశాల విలాస జీవనశైలిని, వారి వైభవాన్ని, (తరతరాలుగా వివిధ ప్రదేశాల నుండి సేకరించిన) కళాఖండాలు, శిల్పాలు, వజ్రాభరణాలు, ఆయుధాలు, దుస్తులు మొదలైన అపూర్వసంపదను చూడగలుగుతున్నారు. కాలక్రమంలో రాజరికాలు పతనమై పోయినా వారి నివాస, పాలనా భవనాలు మాత్రం పదిలంగా గత వైభవానికి ప్రతీకలుగా మిగిలిపోయాయి.

రాజభవనాలు ఆయాదేశాల వారసత్వ సంపదకు నిలయాలు. చరిత్రకు, సంస్కృతికి కేంద్రాలైన రాజభవనాలు మ్యూజియాలుగా మారిపోవడంవల్ల వాటిని కాపాడే, నిర్వహించే బాధ్యత మ్యూజియాలకు చెందుతుంది. మ్యూజియాలుగా మారిపోయిన రాజభవనాలు వాస్తు నిర్మాణ శైలిని, ప్రభావాలను ఆనందించడానికి, అధ్యయనం చేయడానికి ఉపయోగపడితే, మ్యూజియాలు నాటి వారసత్వ కళాసంపదను పదిలపరిచి ముందు తరాలకు అందిస్తాయి. పర్యాటకులవల్ల ఆ ప్రాంతానికి ఆదాయం సమకూరి ఆర్థిక పరిపుష్టి కలుగుతుంది. ఒకప్పుడు ప్రముఖ వ్యక్తులకు, రాజప్రతినిధులకు, దూతలకు పరిమితమైన రాజభవన ప్రవేశం, సందర్శనం సామాన్యులకు అందుబాటులోకి రావడం యాదృచ్ఛికంగా జరిగిన మార్పుకాదు. ప్రజల చైతన్యం, తిరుగుబాటు వల్లనే రాజరికాలు పోయి ప్రజాప్రభుత్వాలు ఏర్పడడం సాధ్యపడింది.

**ప్రజాచైతన్యానికి కారణాలు :** రాజకీయ అణచివేత, సామాజిక ఆర్థిక అసమానతలు, బలవంతపు మతమార్పిడి, విదేశీయుల దాడి, ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడం, అసమర్థపాలన, నాయకత్వలోపం, స్వేచ్ఛను హరించడం, అసంతృప్తిని అణచివేయడం కనీస అవసరాలు కరువై పోవడం, సంపద పంపకంలో వ్యత్యాసం, కుల మత ప్రాంతీయ లైంగిక అసమానతలు పాటించడం మొదలైనవి. వీటికి తోడు సామాజిక సమస్యలు, అవినీతి తోడవుతాయి. ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకం వమ్మయితే ఆందోళన ఉద్యమరూపం దాలుస్తుంది. అది ముదిరి ప్రభుత్వ వ్యతిరేకతగా తిరుగుబాటు జరుగుతుంది, ఫలితంగా రాజరికం నశించి ప్రజాప్రభుత్వాలు ఏర్పడతాయి.

పై కారణాల వల్ల ప్రపంచంలోని చాలా రాజభవనాలకు రాజులు, చక్రవర్తులు, సుల్తాన్‌లనుండి విముక్తి లభించింది. ఈ మార్పు ఐరోపా దేశాల్లో మొదలై తూర్పుదేశాల వరకు వ్యాపించింది. కొద్దిపాటి రాజభవనాలు రాజులకు నామ మాత్రంగా విలాసభవనాలుగా, మిగతావి మ్యూజియాలుగా, హెూటళ్ళుగా, వేరే కార్యకలాపాలకు కేంద్రాలుగా మారిపోయాయి. ఇలా మ్యూజియాలుగా మారిపోయిన ప్రముఖ రాజభవనాలను, కొన్నిటిని మాత్రమే ఖండాలవారీగా పరిశీలిద్దాం. అమెరికా ఖండంలో ఉత్తరమెరికా పశ్చిమాన వున్న హవాయి, హూనలూలూ



లూవ్రె మ్యూజియం

ద్వీపంలో ఉన్న అయొలానీ రాజభవనం, 1982లో నిర్మించబడింది. రాజభవనం 1969 వరకు హవాయి రాజధానిగా, ఆఖరి రాజు వరకు నివాస భవనంగా ఉంది. 1893లో రాజు పదవీచ్యుతుడైన తర్వాత అందులో హవాయీ తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటయింది. ఈ భవనం అధికారిక ఉత్సవాలకు, అశాంతికి చారిత్రక సాక్ష్యంగా మిగిలిపోయింది.

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో మ్యూజియాలుగా మారిన రాజభవనాలు లేవుగానీ, అక్కడి ప్రముఖ భవనాలు ప్రభుత్వ కార్యాలయాలకు నిలయాలు, సిడ్నీలో నేచురల్ హిస్టరీ మ్యూజియం, 1967లో స్థాపించబడినది అలాంటిదే.

ఐరోపా – ఫ్రాన్స్ పారిస్ రాజభవనం లూవ్రె మ్యూజియంగా మార్చబడింది. ఇది అధికసంఖ్యలో సంవత్సరానికి ఒక కోటి వరకు సందర్శకులను ఆకర్షించే మ్యూజియం. సెయిన్ నది కుడివైపు దక్షిణదిశలో వున్న ప్రసిద్ధ మ్యూజియం. మొట్ట మొదటి రాజభవనం ఇదే స్థలంలో 12వ శతాబ్దంలో ఫిలిఫ్ రాజు చేత నిర్మించబడింది. ప్రస్తుత భవనాన్ని లూయీ XIV నిర్మింపజేశాడు. దీన్ని ఫ్రెంచి వాస్తుశిల్పి పియరీ లెస్ కాట్ డిజైన్ చేశాడు. 15–17 శతాబ్దాల్లో భవన నిర్మాణంలో అనేక మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి.

1680 లూయీ చక్రవర్తి రాజాస్థానాన్ని వెర్సైల్స్‌కు తరలించాలనుకున్న నిర్ణయంతో లూవ్ర పాత్ర మారిపోయింది. దాంతో పాతభవనం చక్రవర్తులు సేకరించిన వివిధ కళాకృతులను దాచడానికి కేటాయించబడగా కొన్ని గదులు ఆర్ట్‌గ్యాలరీలుగా మారిపోయాయి. ఆ తర్వాత నెపోలియన్ కాలంలో యూరప్, ఈజిప్ట్, సిరియాల నుండి లూటీ చేయబడిన కళా సంపదతో మ్యూజియం బాగా అభివృద్ధి చెందింది. ఫ్రెంచి విప్లవం (1789) ఫలితంగా రాజభవనం ప్రజల సందర్శనకు తెరవబడింది. తిరుగుబాటు ప్రభుత్వం లూవ్రలో వున్న సకల వస్తుసంపదను ప్రజల ఆస్తిగా ప్రకటించి ప్రదర్శనకు వీలు కల్పించింది. చాలా దేశాలు తమ తమ దేశాల కళాఖండాలను తిరిగి యివ్వాల్సిందిగా చేసిన ప్రయత్నాలు కొంతవరకు ఫలించాయి. రెండో ప్రపంచ యుద్ధసమయంలో లూవ్రలోని అమూల్య వస్తువులను దేశ నడిమి ప్రాంతాలకు తరలించి భద్రపరిచారు. 1945 ఫ్రాన్స్ విముక్తి తర్వాత అవన్నీ తిరిగి మ్యూజియానికి చేరుకున్నాయి. 1981లో ప్రభుత్వం మ్యూజియాన్ని పునర్మించాలన్న నిర్ణయంతో అందులోని ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఉత్తర విభాగంలోకి మార్చబడి మ్యూజియం స్థలాన్ని విశాలం చేయడం కోసం 1990లో మరికొంత స్థలం దీనికి జతచేయబడింది. తలక్రిందులుగా ఉండే పిరమిడ్ నిర్మాణం కూడా అప్పుడే జరిగింది.

**మ్యూజియంగా లూవ్ర గొప్పదనం :** దీనిది ప్రపంచ ప్రఖ్యాత మ్యూజియాల్లో ప్రథమస్థానం. ఇది పాశ్చాత్య కళాఖండాల నిలయం, మోనాలిసా, వీనస్ అఫ్ మిలో, వింగ్డ్ విక్టరీ (Winged Victory) మొదలైన అమూల్య చిత్రాలు, ప్రఖ్యాత కళాకారుల కృతులతోపాటు మధ్యయుగాలనాటి కోట శిథిలాలను నాటిచరిత్రకు సాక్ష్యాలుగా నిలిచినవి కూడా చూడవచ్చు. ఇది పురాతన, గ్రీక్, రోమన్ శిల్పాలు, ఈజిప్ట్ పురాతన వస్తువులు, ఇట్రుస్కన్ ఆర్ట్స్, అలంకార కళలు, పెయింటింగులు, రాతప్రతులు, డ్రాయింగులు అన్నీ కలిపి ఐదు లక్షల ప్రదర్శనా వస్తువుల (exhibits) ను కలిగి వుంది. వాటిలో 35,000 వస్తువులు ప్రదర్శించబడుతున్నాయి. కళావైభవానికి నిలయమైన ఈ మ్యూజియం ప్రపంచంలోని అతిపెద్ద మ్యుజయంగా పేరుగాంచింది. మ్యూజియంలోని కొన్ని కళాకృతుల్ని ఆన్‌లైన్‌లో చూడవచ్చు. మ్యూజియం చూడడానికి ప్రవేశ రుసుముంటుంది.

**వెర్సైల్స్ రాజభవన మ్యూజియం :** పారిస్‌కు 20 మైళ్ళ దూరంలో పల్లె ప్రకృతిలో నిర్మించబడిన (మరో) చక్రవర్తుల భవనం ఇది. ఇప్పుడది పారిస్‌లో ఉపనగరంగా కలిసి పోయింది. ప్రస్తుతం ఇది ఫ్రాన్స్ చరిత్ర మ్యూజియం.

1682 నుండి రాజకీయ కేంద్రశక్తిగా వ్యవహరించింది. లూయీ XIV చక్రవర్తి పారిస్ నుండి ఇక్కడికి తరలించిన రాజకుటుంబం 1789 విప్లవకాలంలో బలవంతంగా పారిస్ తీసుకురాబడింది. అలా వెర్సైల్స్ రాజభవనం ప్రాచీన రాచరికానికి పరిపూర్ణ చిహ్నంగా నిలిచిపోయింది. ఈ భవననిర్మాణం 1664-1710ల మధ్య జరిగింది. ఫ్రెంచి విప్లవం తొలిదశలో తిరుగుబాటుదార్లు రాజభవనం మీద దాడి చేశారు. వెర్సైల్స్ రాజభవనం చక్రవర్తుల దర్పానికి, వైభవానికి వివిధ దేశాలనుండి సేకరించిన కళాసంపదకు నిలయం. ఫిలిప్స్ తన అభిరుచికి తగ్గట్టుగా ఎన్నెన్నో దేశాల నుండి చేసిన కళాసేకరణ, భవనంలోని ఫర్నిచరు అత్యంత సుందరమైనది, విలువైనది. ప్రజా తిరుగుబాటుతో రాజభవనానికి, అందులోనిఅమూల్యమైన సంపదకు ఆపద కలుగుతుందేమోనన్న భయంతో సంపదను వేరేచోటికి మార్చాలని భావిస్తాడు. అది ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తుందన్న మున్సిపల్ కౌన్సిల్ సలహాను, ప్రజాభిప్రాయాన్ని మన్నించి రాజభవనాన్ని ఖాళీచేయించే ఆదేశాలను ఉపసంహరించు కుంటాడు. తర్వాత ఎనిమిది నెలల్లో ఫ్రాన్స్ చరిత్రే మారిపోయింది. 1791లో లూయి అరెస్టు తర్వాత రాజకుటుంబీకులు భవనంలోని వస్తువుల్ని వదిలేయాలని అసెంబ్లీ నిర్ణయించింది. అదే ఇప్పుడు ఫ్రాన్స్ చరిత్ర మ్యూజియంగా సేవలందిస్తోంది. ఈ వెర్సైల్స్ మ్యూజియం కూడా నిత్యం వేలాది సందర్శకులతో సందడిగా ఉంటుంది.

**మాడ్రిడ్ (స్పెయిన్) పాలస్ మ్యూజియం :** పశ్చిమ ఐరోపాలోని రాజభవనాలన్నిటికన్నా పెద్దది. ప్రపంచంలోని పెద్ద రాజభవానాల్లో ఒకటి. 1,35,000 చ.మీ. విస్తీర్ణంలో, 3,418 గదులుగల రాజభవనం. మాడ్రిడ్‌లోని 18వ శతాబ్దపు ఈ భవనం ప్రస్తుత రాజ కుటుంబ అధికార నివాసం. మరో రాజభవనం 'జార్ జులా పాలెస్' జాతీయ పండుగలకు, అధికార కార్యక్రమాలకు ఉపయోగించ బడుతోంది. మిగతా సమయంలో జన సామాన్యం చూడడానికి ఈ భవనం తెరచి ఉంటుంది. ఫిలిప్ రాజు 1561 నుండి నివాసంగా మార్చుకున్న ప్రదేశం ఇప్పుడు పాతకోటగా పిలువబడుతోంది. 1734లో అగ్ని ప్రమాదంలో అది కాలిపోగా అదే చోట ఫిలిప్ పూర్తిగా రాయి, ఇటుకతో కొత్త రాజభవనాన్ని (కొత్త కోటను) నిర్మింపజేశాడు. తర్వాత అనేక నిర్మాణాలు జరిగి ఛార్లెస్ III, అల్ఫోన్సో XII, XIII లకు నివాసంగా మారింది. ఈ భవనంలో ఫ్రాన్సిస్కో గోయా, జియోవాని బెటిస్టా, టీపోలో ( Tiepolo) , డియాగో వెలాజ్ క్వజ్, కారవాజియో లాంటి ప్రఖ్యాత స్పెయిన్ కళాకారులకు, నిపుణులు తయారు చేసిన సంగీత పరికరాలకు నిలయం. వివిధ రకాల ఆయుధాలకు నిధి.

**నేషనల్ మ్యూజియం - ప్రాడో, మాడ్రిడ్ :** దీన్ని 'రాయల్ మ్యూజియం ఆఫ్ పెయింటింగ్' అని అంటారు. ప్రపంచం లోని అత్యంత ఖరీదైన కళాఖండాలను, ఐరోపా వివిధ శైలుల పెయింటింగులను కలిగివున్న సమగ్ర మ్యూజియం. దీన్ని ఛార్లెస్ III 1785లో మొదలు పెట్టగా, నెపోలియన్ యుద్ధాల ఫలితంగా ఆలశ్యమై ఫెర్డినాండ్ VII కాలంలో పూర్తి అయింది. ఇది నియో క్లాసికల్ శైలీనిర్మాణం రాయల్ పెయింటింగ్ మ్యూజియంగా ప్రారంభించబడినది. ఇది 1886లో ప్రాడో నేషనల్ మ్యూజియంగా మార్చబడింది. రాజభవనాలనుండి సేకరించిన పెయింటింగులతో హాప్స్ బర్గ్, బౌర్బన్ (Bourbon) చక్రవర్తులు సేకరించిన కళాఖండాలతో మొదలై, కళాప్రియులు, కళాపోషకులు ఛార్లెస్ ఎ, ఫిలిప్ II (టిషన్‌ను పోషించిన రాజులు)ల కాలంలో బాగా అభివృద్ధి చెందింది. ఆస్థాన కళాకారుడు డియగో వెలాజ్ క్వజ్‌ను ఇటలీకి పంపించి అక్కడ పెయింటింగులను కొనిపించారు. ఫెర్డినాండ్ VII కాలంలో ఎక్కడెక్కడి పెయింటింగులు ఈ మ్యూజియానికి చేర్చబడ్డాయి. స్పెయిన్ కాన్వెంట్లలో, మోనస్టరీలలోని కళను సేకరించడం, నూతన భవనాలను నిర్మించడంతో ప్రాడోమ్యూజియం ప్రముఖ మ్యూజియంగా గుర్తింపు పొందింది. ఎల్‌గ్రెకో, వెలాజ్ క్వజ్, గోయా, రైబేరా బోస్క్, పీటర్ బ్రూజెల్, రాఫేల్, రెంబ్రాంట్, వాన్ డైక్ మొదలైన ఉద్దండ కళాకారుల కృతులు ఇందులో ప్రదర్శితాలు. 1981లో, 1937 నాటి పికాసో చిత్రం గెర్నికా చేర్చబడింది. అనేక వివాదాల తర్వాత పికాసో ఆశయానికి వ్యతిరేకంగా అది క్వీన్ సోఫియా మ్యూజియానికి మార్చబడింది. చిత్రకళాప్రదర్శన కొరకే ప్రత్యేకంగా, అదీ చక్రవర్తులచేత నిర్మించబడిన భవనం.

**లండన్ మ్యూజియాలు :** ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల తర్వాత చెప్పుకోవలసింది లండన్ మ్యూజియాలను గురించి. ఏ దేశంలోనైనా మ్యూజియంలోనికి ప్రవేశరుసుము



హెర్మిటేజ్ మ్యూజియం - సెంట్ పీటర్స్ బర్గ్, రష్యా

ఉంటుంది ఒక్క లండన్ మ్యూజియాలకు తప్ప. లండన్ ఆర్ట్ గాలరీలకు, ప్రత్యేక కళాప్రదర్శనకు మాత్రం టిక్కెట్ వుంటుంది. బ్రిటిష్ మ్యూజయం, నాచురల్ హిస్టరీ మ్యూజియం, సైన్స్ మ్యూజియం, విక్టోరియా ఆల్బర్ట్ మ్యూజియం మొదలైన 114 శాశ్వత మ్యూజియాల్లో ప్రవేశం ఉచితం. లండన్‌లో చారిత్రక ప్రాధాన్యత కలిగిన చాలా భవనాలు మ్యూజియాలుగా మారిపోయాయి. టవర్ ఆఫ్ లండన్, హాంప్టన్ కోర్టు పాలెస్, కెన్సింగ్టన్ పాలెస్, క్యూ పాలెస్‌లు అలాంటి వాటిలో కొన్ని. మ్యూజియం కొఅకే నిర్మించబడింది విక్టోరియా ఆల్బర్ట్ భవనం.

**హెర్మిటేజ్ మ్యూజియం - సెంట్ పీటర్స్ బర్గ్, రష్యా :** ఇది 1764 లో కాథరీన్ ద గ్రేట్ చేత స్థాపించబడిన ఆర్ట్ మ్యూజియం. వింటర్ పాలెస్‌ను ఆనుకుని వున్న భవనం జార్ చక్రవర్తులు సేకరించిన కళాసంపదను ప్రదర్శించడానికి కేటాయించబడింది. ఇది పూర్వ జార్ చక్రవర్తుల నివాసభవనం. నేవానది ఒడ్డున 1780 లో నిర్మించబడిన మొదటి చక్కనైన నిర్మాణం. రాణి ఎలిజబెత్ దీన్ని సాటిలేని భవనంగా తీర్చిదిద్దింది. 1754లో నాలుగు వందల మంది పనివారు పాల్గొనగా భవనం 1762 నాటికి పూర్తి అయింది. అన్నీ తెల్ల రాతి స్తంభాలతో, ఎర్రరాతి నిర్మాణం. భవన పైకప్పులో 176 శిల్పాలు, భవనం లోపల బంగారు రంగు స్టక్కో పెయింటింగులు, వెలుపలి భాగం తెల్ల, లేత ఆకువచ్చ రంగుల్లో మెరిసి పోతుంటుంది. 1500 గదులు, 1886 ద్వారాలు, 1945 కిటికీలు, 117 మెట్లు ఉన్న మూడంతస్తులతో 14.2 హెక్టార్ల విస్తీర్ణం ఆక్రమించుకున్న భవనం. నలువైపులా వున్న లలితసుందర ముఖ భాగాలతో రష్యా బరోక్ శైలిలో నిర్మితమైన ఉత్కృష్ట భవనం జార్ చక్రవర్తల దర్పానికి, వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది.

1917లో నికోలస్ II పదవీచ్యుతుడయ్యే వరకు రాజ నివాసంగా కొనసాగిన భవనం రష్యన్ విప్లవం తర్వాత హెర్మిటేజ్ మ్యూజియ భాగంగా మారిపోయింది. విప్లవం తర్వాత కొద్దికాలం రష్యా తాత్కాలిక ప్రభుత్వ ఆధీనంలో, ఆపైన రెడ్ గార్డ్ సైనిక ముట్టడితో తాత్కాలిక ప్రభుత్వం నుండి తొలగింబబడింది. విప్లవం సోవియట్ పుట్టుకకు కారణమయింది. సెంట్ పీటర్స్ బర్గ్ రష్యా సాంస్కృతిక రాజధాని. రష్యా ముఖ్యపట్టణం మాస్కోకు వాయవ్యంగా 400 మైళ్ళ దూరంలో బాల్టిక్ సముద్రతీర నగరం, మాస్కో తర్వాత రెండవ పెద్ద నగరం.

**హెర్మిటేజ్ మ్యూజియం ప్రత్యేకతలు :** ఈ మ్యూజియం సెంట్ పీటర్స్ బర్గ్ నగరంలో 1764న 'కాథరీన్ ద గ్రేట్' చేత రాజాస్థాన మ్యూజియంగా స్థాపించబడింది. ఇది వింటర్ పాలెస్‌ను ఆనుకుని వుంటుంది. జార్ చక్రవర్తులు సేకరించిన కళాసంపదను భద్రపరచడానికే ప్రత్యేకంగా నిర్మించబడిన భవనం ఇది. చక్రవర్తుల రాణీవాసం పరులకెవ్వరికీ ప్రవేశంలేని భవనం. అందువల్లనే దీనికి 'హెర్మిటేజ్' అనే పేరు వచ్చింది. 1917 అక్టోబర్ విప్లవానంతరం చక్రవర్తుల కళా సేకరణ అంతా ప్రజల వశమైంది. 1930-34ల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామీకరణకు దీటుగా వుండడం కోసం యాంత్రిక పరికరాలు కొనడం కోసం మ్యూజియంలోని కొన్ని కళాఖండాల్ని అమ్మివేయడం జరిగింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం, 19. 20 శతాబ్దాల ఐరోపా ఆర్ట్ సేకరణ పెరిగిపోయింది. ప్రస్తుతం మ్యూజియం ఐదు భవనాల సముదాయం. వీటిలో వింటర్ పాలెస్ భాగం కూడా ఉంది.

మ్యూజియంలో దాదాపు 3 మిలియన్ల కళాకృతులు, వస్తువులు ఉంటాయి. చాలా విలువైన కళాసేకరణ ఈ మ్యూజియం ప్రత్యేకత. రాతియుగంతో మొదలై మధ్య యుగాలను కలుపుకొని రినైజర్స్‌కాలం వరకు ఉన్న వస్తుప్రదర్శనా నిలయం. ఇటలీ రినైజన్స్ కాలపు బరోక్ కళాకృతులకు ప్రతినిధి ఈ మ్యూజియం, ఆసియా కళాకృతులతో విస్తృతపరచబడింది. రష్యానుండి తూర్పు వైపు దృష్టి సారిస్తే కన్పించే రాజభవన మ్యూజియంలో చైనా, జపాన్, ఉత్తర కొరియా, లావోస్ మ్యూజియాలు ముఖ్యమైనవి. వీటిని గురించి తెలుసుకునే ముందు దిగువన ఐరోపా - ఆసియాలను కలిపే బోస్పరస్



తోప్కాకి రాభవన మ్యూజియం - ఇస్తాన్‌బుల్ - టర్కీ

జలసంధిలో వున్న ఇస్తాంబుల్ మ్యూజియంను గురించి తెలుసుకుందాం.

**తోప్కాకి రాభవన మ్యూజియం - ఇస్తాన్‌బుల్ - టర్కీ :** తోప్కాకి కోట ఇస్తాన్‌బుల్ పీఠభూమిపైన గోల్డెన్ హార్న్ ప్రదేశంలో, మార్మరా సముద్రం, బోస్పరస్ జలసంధి కలిసేచోట రాజసం ఒలకబోస్తూ ఠీవిగా కనువిందుచేసే రాజభవన మ్యూజియం. దాదాపు 400 సంవత్సరాల కాలంలో టర్కీని పాలించిన 30 మంది ఓటోమన్ సుల్తాన్‌లకు రాజధాని. 173 ఎకరాలలో వ్యాపించిన పెద్ద రాజభవనం. 1459 - 1465ల మధ్య జరిగిన ఈ నిర్మాణం ఇస్తాంబుల్ (టర్కీ) ఫాతివ్ డిస్ట్రిక్ట్‌కు తూర్పున ఉన్న అత్యంత సుందరమైన భవనం. 1478 - 1853 వరకు రాజనివాసం, 1853-1924 ల మధ్య ఉన్నత రాజోద్యోగులకు వసతిగృహం. వందలమంది ఉంపుడు గత్తెలు, నపుంసకులకు నివాసం.

సుల్తాన్ మహ్మద్ 1453లో కాన్స్టెంట్ నోపుల్‌ను జయించిన తర్వాత రాజభవనం చాలావరకు శిధిలావస్థకు చేరుకుంది. ఒకప్పటి ఓటోమన్ రాజ కొలువు ప్రస్తుత ఇస్తాంబుల్ విశ్వవిద్యాలయంగా మారిపోయింది. 1930లో కాన్ స్టెంట్ నోపుల్ టర్కీ (ప్రస్తుతం తుర్కియా)గా మార్చబడింది. ఈ రాజప్రాసాదం నాలుగు ప్రాంగణాలు ఉంపుడుగత్తెల నివాసం (సరాయి, హేరంల మిశ్రమం) భవనాలన్నీ ఓటోమన్, బరోక్ శైలిలో ఉంటాయి. భవన సముదాయం నుండి సముద్రాన్ని, జలసంధిని చూసినా; సముద్ర ఆవలి తీరం నుండి ఎదురుగా కన్పించే భవన సముదాయాన్ని చూసినా రెండు దృశ్యాలూ మనోహరంగా ఉంటాయి.

కామాతురులైన సుల్తానులు, అత్యాశపరులైన రాజోద్యోగులు, అందమైన ఉంపుడుగత్తెలు, కుట్రలు పన్నే నపుంసకులు (కొజ్జాలు) అంతా కలిసి 15-19 శతాబ్దాల మధ్య ఒకేచోట జీవించిన భవన సముదాయం. ఓటోమన్ రాజుల కొలువు. నాటి విలాసవంతమైన రాజభవనాలు, వజ్రహారాలతో నిండిన అలంకారాలు, చాలా పెద్ద హేరమ్ (ఉంపుడుగత్తెల నివాసం). వారి జీవితాల్లోని ఆకర్షణను తెలియజేస్తాయి. మొత్తం ప్రాంగణం నాలుగు విభాగాలుగా ఉంటుంది. మొదటి ప్రాంగణం నేలంతా రాళ్ళతో కప్పబడి వుంటుంది. లోపల మ్యూజయం, బైజంటైన్ చర్చి, నాటి టంకశాల కన్పిస్తాయి. దీని ముఖ ద్వారంలో 1778 నాటి జలయంత్రం ఉంటుంది. రెండవ రాజభవనం రాచకార్య కలాపాలకు ఉపయోగించబడింది. ఈ భవనాన్ని కున్న గేట్‌లో నుండి సుల్తాన్ తల్లి మాత్రమే గుర్రాల మీద రాకపోకలు సాగించేది. మూడవ ప్రాంగణం చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగి ఉంది. ఇందులో అహ్మద్ 111 గ్రంథాలయం, రాజకోశాగారం ఉన్నాయి. నాలుగవ ప్రాంగణం హేరమ్. ఉంపుడు గత్తెల 6 అంతస్తుల నివాస భవనం. ఇది నిషేధిత ప్రాంతం. ఇది సుల్తాన్లు మాత్రమే సందర్శించే ప్రదేశం. ఈ భవన సముదాయ నిర్మాణం అత్యంత క్లిష్టంగా, అందమైన పెంకులతో (టైల్స్) అలంకరించబడిన ప్రాంగణం. 300 గదులు, 9 స్నాన వాటికలు, 2 మసీదులతో నిత్యం కొజ్జాల కాపలాతో ఉండేది.

ఈ మ్యూజయం వాస్తు నిర్మాణ కౌశలానికి, సేకరించి పెట్టిన చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన వస్తు సముదాయానికి నిలయం. ఇది చాలా పెద్ద సంచయ మ్యూజియం. పింగాణీ పాత్రలు (పోర్సిలిన్), దుస్తులు, ఆయుధాలు, ఓటోమన్ కాలపు సూక్ష్మకళాకృతులు, ఇస్లాం చేతిరాతప్రతులతో చాలా మ్యూజియాల ప్రదర్శనా వస్తువులకన్నా ఘనమైన వస్తుసంచయం కలిగి ఉంది. ఇక్కడే ఉన్న మరొక గొప్ప మ్యూజియం హాయియా సోఫియా భవనం, చర్చిగా ఖ్యాతిగాంచిన భవనం. ఇప్పుడు మ్యూజియంగా ఇస్లాం కాలపు రోమన్ ఆర్థోడాక్స్ చర్చిగా, ఆ తర్వాత రోమన్ కాథలిక్ చర్చిగా, పిదప ముస్లిం మాస్క్‌గా మారిపోయింది.

**పాలెస్ మ్యూజియం (ఫర్బిడెన్ సిటీ) బీజింగ్, చైనా :** బీజింగ్ నగరం మధ్యలో వున్న చైనా చక్రవర్తుల

రాజభవనం 1406లో 1420ల మధ్య నిర్మించబడిన ఈ భవనస ముదాయంలో 980 కట్టడాలున్నాయి. మింగ్ నుండి కుంగ్ రాజవంశాల వరకు, 1421 నుండి 1911 వరకు చక్రవర్తుల, రాజపరివారానికి నివాసం. అలాగే రాజకీయ కేంద్రం కూడా. రాజప్రాసాదం అంతా కలిపి 180 ఎకరాల స్థలంలో 72 లక్షల చదరపు మీటర్లలో వ్యాపించి ఉంటుంది. ఇది చైనా సాంప్రదాయ రాజ భవనాల నిర్మాణానికి నమూనాగా ఉంటుంది. తూర్పు ఆసియా వాస్తు నిర్మాణ సాంస్కృతిక కళను ప్రభావితం చేసింది. నిషేధ నగరంగా ప్రఖ్యాతిగాంచిన దీన్ని యునెస్కో 1987లో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. ఇది ప్రపంచంలోనే అధిక సంఖ్యలో దారు శిల్పాలు, వస్తువులు, ఇతర పరికరాలకు నిలయం. సామాన్య ప్రజలకు గాని, విదేశీయులకుగానీ ప్రత్యేక అనుమతి లేనిదే లోనికి ప్రవేశ నిషిద్ధం. కందకాల మధ్య రాజభవనాలు, మెరిసే బంగారపురంగు పై కప్పు (టైల్స్) పలకలు, ఎర్ర స్తంభాలు వీటి చుట్టూ ఎత్తైన ప్రాకారాలు ప్రతి మూలమీద పర్యవేక్షక, పహారా స్థంభాలు (Towers) ఉంటాయి. భవనం వెలుపల వైపు రాజదర్బారు, లోపల విశాలమైన న్యాయసదనాలతో ప్రతి భవనం దేనికదే ప్రత్యేకతలు కలిగిన వాస్తు వైభవం కలిగి ఉంటుంది. భవనాలను కలుపుతూ పాలరాతి డాబాలు, వంతెనలు - అవన్నీ ఇప్పుడు ప్రజలు చూడటానికి అందుబాటులోకి వచ్చిన మ్యూజియంలోని భాగాలు. చైనా ఆఖరి చక్రవర్తి పూయీ 1912లో రాజ్యాన్నిత్యజించి లోపలి భవనాలకే పరిమితమై పోయాడు. బయటిభవనాలన్నీ ప్రజావినియోగానికి నిర్దేశించబడ్డాయి. 1924 నాటి తిరుగుబాటు పూయిని బయటికి పంపి, అందులో పాలెస్ మ్యూజయంను స్థాపించింది.

**పాలెస్ మ్యూజియం :** 1925 నాటి లెక్కల ప్రకారం చక్రవర్తులు 1.17 మిలియన్ కళాకృతుల్ని సేకరించారు. అవన్నీ నిషిద్ధ నగరంలో భద్రపరచ బడ్డాయి. భవన గ్రంథాలయం ఎన్నెన్నో అరుదైన పుస్తకాలకు, చారిత్రక డాక్యుమెంట్లకు నిలయం. చైనా అంతర్యుద్ధంలో కమ్యూనిస్టుల విజయం తర్వాత జాతీయప్రభుత్వం దేశంలో ఎక్కడెక్కడో వున్న కళాకృతుల్ని సేకరించి మ్యూజియంలో భద్రపరిచింది. 500 సంవత్సరాల రాజకీయ అధికార కేంద్రంగా ఉన్న రాజభవనం అంతా ఇప్పుడు పాలెస్ మ్యూజియం అధీనంలో ఉన్న ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక కేంద్రం, సంరక్షించబడిన అతిపెద్ద రాజభవన సముదాయం. 18 లక్షల కళాకృతులున్న ఈ మ్యూజియాన్ని ఏటా దాదాపు 17 మిలియన్ సందర్శకులు చూస్తారని అంచనా. 2024 నవంబర్ 5 నాటికి చక్రవర్తి పూయిని రాజభవనం నుండి బహిష్కరించినప్పటినుండి వంద సంవత్సరాలు పూర్తయ్యాయి.

**నేషనల్ మ్యూజియం, కొరియా :** కొరియా చరిత్రలోనూ, కళారంగంలోనూ ప్రముఖపాత్ర వహించిన మ్యూజియం. ఇది కొరియా చక్రవర్తి సన్‌జోంగ్ ప్రారంభించిన మొదటి మ్యూజియం. చక్రవర్తి కుటుంబానికి చెందిన అమూల్య కళాసంపద కొరకు, రాజకుటుంబ సభ్యుల సందర్శన కొరకు చాంగ్యాంగ్ గంగ్ అనే చోట ఇది స్థాపించబడింది. జపాన్ ప్రభుత్వ పాలనలోకి వచ్చిన తర్వాత ఈ మ్యూజియం సేకరణలు అభివృద్ధి చెందాయి.

1945లో దక్షిణ కొరియాకు స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఏర్పడ్డ ప్రభుత్వ మ్యూజియం ఇది. అనేక విద్యా కార్యక్రమాలను, చరిత్ర, చిత్రకళ, పురావస్తు (ఆర్కియాలజీ) రంగాల్లో పరిశోధనా కార్యక్రమాలను చేపట్టింది. విద్యా సంబంధిత కార్యక్రమాలను, వివిధ ప్రదర్శనలను నిర్వహిస్తూ అభివృద్ధి చెందింది. 2021లో కొరియా నేషనల్ మ్యూజియం, 20వ వార్షికోత్సవ సందర్భంగా ఇంచియాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొత్త మ్యూజియం శాఖను తెరిచింది.

**మ్యూజియం గొప్పదనం :** ఇందులో 3 లక్షల పదవేల పైచిలుకు సేకరణలు భద్రపరచబడ్డాయి. వీటిలో 15000 వస్తువులు దీనిలోని ఆరు గాలరీల్లో 6 విభాగాల్లో శాశ్వతంగా ప్రదర్శించబడుతున్నాయి. ప్రాచీన చరిత్ర విభాగం, మధ్యయుగాల, ఆధునిక చరిత్ర విభాగం, కానుకల విభాగం, చేతిరాత, పెయింటింగ్‌ల విభాగం, చివరగా శిల్ప, చేతి కళాకృతుల విభాగాలు 3 లక్షల చ.మీటర్ల స్థలంలో ఉన్నవి. ప్రపంచంలోని పెద్ద మ్యూజియాలలో ఇది ఒకటి.

**మ్యూజియం ప్రత్యేకతలు :** మ్యూజియంలోపలి వస్తుసముదాయానికి ఏమాత్రం ప్రమాదం జరగకుండా (6 పాయింట్ల రిక్టర్ స్కేలు) భూకంపాన్ని తట్టుకునేలా నిర్మించబడింది. ప్రదర్శనా వస్తువులుంచిన అరలు ఎంతటి



నేషనల్ మ్యూజియం, కొరియా

షాక్‌లనైనా తట్టుకునేలా, కృత్రిమ కాంతి స్థానంలో సహజ సూర్యరశ్మి, ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఏసి కట్టడం ఇది. అగ్ని ప్రమాదాన్ని తట్టుకోగల ప్రత్యేక పదార్థంతో (మెటీరియల్) హాళ్ళు, విద్యాసౌకర్యాలు, పిల్లల మ్యూజియం, పెద్ద బాహిరంగ ప్రదర్శనాస్థలం, కాఫీ, టీ హోటళ్లు, షాపులతో నిర్మితం. మ్యూజియంలోని అమూల్య వస్తుసంపదను కాపాడుకోవటం కోసం ఇన్ని చర్యలు తీసుకోబడ్డాయి. ప్రపంచంలోని ఎక్కువ స్థలంలో నిర్మితమయిన మ్యూజియాలలో దీనిది ఆరవ స్థానం. 229 x 551 చ.మీ.విస్తీర్ణంలో ఉండే ఇది మ్యూజియంగా మారిన పాలెస్‌కాదు గానీ రాజభవన స్థలాలలో నిర్మించ బడిన అతి పెద్ద మ్యూజియం.

**కొరియా ద్వీపకల్పం :** 1910లో పరాధీనమైన ఈ మ్యూజియం. దేశం 35 సంవత్సరాల నిరీక్షణ తర్వాత 1945 ఆగస్ట్ 15న జపాన్ వలస పాలన నుండి విముక్తి పొందింది. కొరియా సంస్కృతిని భాషను తుడిచి వేయాలనుకున్న జపాన్ ఆశలు ఫలించలేదు. నాటి రెండు కొరియాలు రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మిత్రరాజ్యాల జోక్యంతో విముక్తిపొందాయి. ప్రభుత్వ శలవు దినం ఆగస్ట్ 15 నాడు కొరియాలో వివాహం జరగడం అక్కడి ప్రత్యేకత.

**లువాంగ్ ప్రబాంగ్ లావోస్-రాయల్ పాలెస్ మ్యూజియం:** ఫ్రెంచి వలస రాజ్యాల పాలనలో 1904 సిసివాంగ్ వోంగ్ రాజు, అతని కుటుంబం కోసం రాజభవనం నిర్మించ బడింది. అధికారం, విదేశీ సందర్శకులు నదీప్రయాణం నుండి నది దిగువన దిగి నేరుగా రాజభవనంలోకి ప్రవేశించడానికి వీలుగా మెకాంగ్ నది ఒడ్డున నిర్మించ బడింది.

1904-1909ల మధ్య నిర్మించబడిన రాజభవనం 178 ఎకరాల విస్తీర్ణం (72 హెక్టార్స్) లో నిర్మించబడిన గొప్ప భవనం. యునెస్కో దీన్ని (1987) సాటిలేని వాస్తు శిల్పానికి, ముఖ్యంగా రాజవంశ చరిత్రను కాపాడటంలో భవనం నిర్వహించిన పాత్రకు, 5 శతాబ్దాల చైనా పాలనా శక్తికి గుర్తుగా దీన్ని ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించింది.

ఈ రాజభవన మ్యూజియం వాస్తు కళ, కళా సాంప్రదాయాలు పెనవేసుకున్న రెండు వేల సంవత్సరాల నాటి కట్టడం. శ్రీలంకలో తయారుచేయబడిన 50 కేజీల బరువు, 83 సెం.మీటర్ల ఎత్తు, వెండిబంగారు, కాంస్య మిశ్రమ లోహాలతో తయారైన బుద్ధ విగ్రహాన్ని కలిగి ఉండడం మ్యూజియం ప్రత్యేకత. అరుదైన, అమూల్యమైన కళాకృతులు, పెయింటింగులు, సిరామిక్స్, అలంకార సామగ్రి, పెంకుల పైకప్పులు, శిల్పాలు, అపురూప కంచు వస్తువులు, విగ్రహాలు, ఎనామిల్ వస్తువులు అన్నీ కలిపి ఒక మిలియన్ వస్తు సంచయ నిలయం కియాంగ్ చక్రవర్తులు సేకరించిన వస్తువులన్నీ అలంకార, సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యతను కలిగినవీ, విజ్ఞాన శాస్త్రానికి చెందినవీ పదిలంగా, పదిరకాలుగా వర్గీకరించ బడి ప్రదర్శించబడుతున్నాయి. లలిత కళలు, అనువర్తిత కళలు, హస్త నైపుణ్య కళాకృతులు, పురావస్తు విభాగం, మానవ విజ్ఞానశాస్త్రం (ఏంత్రపాలజీ), మానవ జాతి శాస్త్రం (ఎథ్నాలజీ), స్వీయ చరిత్రలు, చరిత్రలు, సాంస్కృతిక చరిత్ర, శాస్త్ర సాంకేతిక విభాగం, అని పదిరకాలు. పిల్లల కొరకు ప్రత్యేకంగా మ్యూజియం, బొటానికల్, జువాలజికల్ గార్డెన్స్ ఉండటం మరో విశేషం. 1975 లో కమ్యూనిస్టులు రాజరికాన్ని పడగొట్టి, రాజకుటుంబాన్ని శిబిరాలకు తరలించి మ్యూజియాన్ని జాతిపరం చేశారు. లావోస్ ప్రపంచంలోని ఐదు కమ్యూనిస్టు దేశాల్లో ఒకటిగా, మిలియన్ ఏనుగుల దేశంగా ప్రత్యేకతను చాటుతోంది.

**మన దేశంలోని రాజభవనాలు, మ్యూజియాలు, విలాసవంతమైన హోటళ్ళు :** ఉత్తర భారత దేశంలోని కోటలు, రాజభవనాలు వివిధ దేశాల వినోద, విజ్ఞాన యాత్రీకుల్ని ఆకర్షించడమే కాకుండా, దేశ ఆర్థిక సంపదను పెంచడంలో ప్రముఖపాత్ర నిర్వహిస్తున్నాయి. రాజస్థాన్ రాజభవనాలు, కోటలు చెక్కు చెదరకుండా పూర్వవైభవాన్ని కాపాడుకుంటూ, పూర్వ రాజరిక దర్పానికి ప్రతినిధులుగా



సాలార్‌జంగ్ మ్యూజియం, హైదరాబాద్.

సందర్శకులతో సందడిగా ఉంటాయి. ప్రతి కోట లోపల విలసావంతమైన రాజాభవనాలు, దేవాలయాలు, మ్యూజియాలు ఉంటాయి. జైపూర్ కోటలు ఇటు నగరం మధ్యలోనూ అటు సమీపంలోని కొండల్లోనూ ఉంటాయి. ప్రఖ్యాత జంతర్ మంతర్, హవామహల్, లేక్‌పాలెస్ ఇక్కడివే. దుర్భేధ్యమైన మిగిలిన కోటలన్నీ కొండలలో, కొండలపైన నిర్మించబడినవి. వీటిలోని మ్యూజియాలన్నీ రాజకుటుంబాలు ఉపయోగించిన సమస్త వస్తుజాలాన్ని ప్రదర్శిస్తున్నాయి. కొన్ని కోటలు విలాస వంతమైన హోటళ్ళుగానూ, వివాహ వేదికలుగా మారిపోయాయి. ఉమైద్ రాజభవనం రాజ కుటుంబసభ్యులు, మ్యూజియం, హోటల్ మూడింటికి నిలయం. ఇందులోని వివిధ కాలాలనాటి, రకరకాల మోడళ్ళ వింటేజ్ కార్లను చూడవచ్చు.

అన్ని మ్యూజియాల్లో ప్రదర్శనా వస్తులన్నీ దాదాపు ఒకేరకంగా ఉంటాయి. ఆయుధాలు, ఆభరణాలు, వాహనాలు, గద్దెలు, పల్లకీలు, మేనాలు, అలంకరణ సామగ్రి, శయ్యలు, ఆసనాలు, సంగీత పరికరాలు మొదలైనవి ఉంటాయి. హోటళ్ళుగా మారిపోయిన కోటలు కొన్ని జోధ్‌పూర్ – రాడిసన్ హోటల్, అజ్మీర్ – హోటల్ మాన్‌సింగ్, జైపూర్ హోటల్, ఓబెరాయ్, జోద్‌పూర్, ఉదయ్‌పూర్‌లలోని లేక్‌వ్యూ హోటళ్ళు, పైన చెప్పుకున్న కోటలన్నీ దేశ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజా సందర్శనకు తలుపులు తెరిచాయి.

1757 నాటికి మనదేశంలో నవాబుల పెత్తనం అంతమైంది. 1858 బ్రిటిష్ ప్రభుత్వం నవాబుల అధికార చిహ్నంగా వున్న మొఘల్ కోర్టును రద్దుచేయడంతో నవాబుల, రాజుల పాలనా ప్రాబల్యం తగ్గిపోయింది. స్వాతంత్యం సిద్ధించిన తర్వాత అక్కడక్కడా వున్న సంస్థానాలన్నీ భారత ప్రభుత్వంలో విలీనమైనాయి.

(1971) ప్రీవీవర్స్ రద్దు కారణంగా రాజరిక అవశేషాలు తుడిచి పెట్టుకుపోయిన ఫలితంగా రాజభవనాలు మ్యూజియాలుగా, ప్రముఖ హోటళ్ళుగామారిపోయాయి. హైద్రాబాద్‌లోని ఫలక్‌నుమా, చౌమహల్లా పాలెస్‌లు హోటళ్ళుగా మారిపోగా సాలార్‌జంగ్ భవనం మ్యూజియంగా మారిపోయింది.

బెంగుళూరు జయమహల్ పాలెస్, మైసూర్ లలిత్ మహల్ గొప్ప హోటళ్ళుగా ప్రసిద్ధిచెందాయి. ట్రావెన్కూర్ భోపాల్, జోధ్‌పూర్ లాంటి రాజభవనాలు, 500 లకు పైగా నంస్థానాలు అన్నీ గత చరిత్ర వైభవానికి చిహ్నాలుగా ప్రస్తుతం మ్యూజియాలుగా, హోటళ్ళుగా మారిపోవడం కాలం తెచ్చిన మార్పు.

విదేశాల్లోని ప్రఖ్యాత రాజభవనాలు కూడా ధనిక విలాసవంతులకు, సినిమా స్టార్స్‌కు, క్రీడాకారులకు (స్పోర్ట్స్‌మన్‌కు) ఆతిథ్యమిస్తూ, వివాహ వేడుకలను ఘనంగా జరుపు కోవడానికి, సినిమా షూటింగులకు అవకాశం కలిగిస్తున్నాయి. మనదేశంలో సంపన్నులు నాటి రాజ భవనాల్లో వివాహాలు జరుపుతూ తమ దర్పాన్ని ప్రదర్శిస్తుంటే, మరీ ధనికవర్గాల వారు విదేశీ రాజభవనాల్లో (నేటి హోటళ్లు) రకరకాల వేడుకలు జరుపు కోవడానికి మొగ్గు చూపిస్తున్నారు.

**కొన్ని విదేశీ రాజభవన హోటళ్ళు :** ఫోర్ సీజన్స్ హోటల్, లయన్ పాలెస్ – సెంట్ పీటర్స్ బర్గ్, జారా పాలెస్, షాటూ–మాల్టా, సిరగాన్ పాలెస్, కెంపెన్‌స్కీ – ఇస్తాన్ బుల్ (టర్కీ), అమన్– నమ్మర్ పాలెస్, బీజింగ్ (చైనా), విల్లా ఆఫ్ ఎస్టేట్– ఇటలీ ఇంపీరియల్ పాలెస్ హోటళ్ళు రాచమర్యాదలు, సౌకర్యాలు కలిగించడంలో ప్రసిద్ధి గాంచాయి.

***రాజుల సొమ్ము రాళ్ళ పాలు అనేది పాత పాట***
***రాజుల సంపద ప్రజల పాలు అన్నది నేటి మాట.***

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(టి.వి.ప్రసాద్), ఫోన్ నెం. 7981398250

# చదువుసంధ్యలు

**– జూకంటి జగన్నాథం**

**నా**కు ఐదేళ్లు వయసు దాటిదాటగానే మా అమ్మ బలవంతంతో అప్పటికే చదువుకుంటున్న మా అన్న సర్కార్ బడిలో మా బాపు నన్ను చేర్పించాడు. అప్పటికి అన్నా నేను ఇద్దరమే మా ఇంట్లో పిల్లలము. చిన్న బాపులు ముగ్గురు ఉండేవారు. మా నాయనమ్మ లెమ్మంటే లేవాలి కూసోమంటే కూర్చోవాలి అంత భయంలో పెట్టింది. ఎవరైనా చెప్పింది వినకుంటే ఆరోజు ఇంట్లో పెద్ద గొడవ పంచాయతీ అయ్యేది.. మా నాయనమ్మ అంటే మా ఇంటిలోనే కాదు మా వాడలోనే కాదు చుట్టుపక్కల ఊర్లలోనూ పెద్ద హడల్. ఎప్పుడు ఎవరిని ఎందుకు ఏ విధంగా బండబూతులు తిడుతుందో అని మా నాయనమ్మ నోటికి మొక్కేవారు. ఎవరూ దాని జోలికి పోయేవారు కాదు. అప్పుడు మాకు రెండు పాలు ఇచ్చే బర్లు ఉండేవి. ఆ పాలను మా నాయనమ్మ పిడకలు కొట్టి నిప్పులతో దాలిని అంటించి పాలు కాగ పెట్టే కుండను అందులో వుంచి పైన సిబ్బిని మూతగా పెట్టేది. ముగ్గురు చిన్న బాపు మధ్య పెరిగిన మమ్మల్ని బాగా గారాభంగా చూసేవారు.

మా అన్నకు అప్పటికే ఇంట్లో బుద్ధిమంతుడు అనే పేరు ఉండేది. ఎందుకంటే ఆయన రోజూ బడికి పోయి వచ్చి మా అమ్మ చెప్పినట్టు వింటూ వాచకాలు చదువుకునేవాడు రాసుకునేవాడు. ఇక నేను సరే అని చెప్పింది విని నా మిత్రులతో కలిసి స్కూలు ఎగ్గొట్టి బడికి దూరంగా వాగు ఒడ్డున ఉన్న మర్రి చెట్టు కింద గోటీల ఆటలు ఆడుకొని , వ్యవసాయ పెద్ద మోట బాయిలలో ఈతలు కొట్టేవాళ్ళం.

అన్నతో పాటు నన్ను స్నానం చేయించి మా అమ్మ దువ్వెనతో తల దువ్వి ఉతికిన బట్టలు తొడిగి రాత్రి మిగిలిన చల్ది అన్నంలో చింతకాయ తొక్కుతో మంచి నూనె కలిపి తినిపించి బడికి తోలేది. నేను మా అన్న వెంట బడికి పోయేవాడిని. కానీ వెంటనే బయటకు మిత్రులతో కలిసి వచ్చి వాగొడ్డున ఉన్న పెద్ద మర్రి చెట్టు కింద ఆటలాడుకునేవాళ్ళం. ఎప్పుడైనా చెప్రాసి బెస్త పోశాలు మమ్మల్ని బడికి పట్టుక పోవడానికి చింత బరిగె వచ్చేవాడు. మేము దూరం నుంచి చూసి చెట్టు ఎక్కే వాళ్ళం. ఏమీ అన కిందికి దిగమనేవాడు. మేము అస్సలు దిగేవాళ్ళం కాదు. పోశాలు చూసి చూసీ తిరిగి వెళ్లిపోయేవాడు. ఈమధ్య బడి విడిచి పెట్టే మధ్యాహ్న సమయం అయ్యేది. నేను నా సంచి పట్టుకొని ఏమీ ఎరగనట్టు మందిలో కలిసి బడి నుంచే వస్తున్నట్టు మా అన్న వెంట ఎప్పటిలాగా ఇంటికి పోయేవాడిని. తల చెదిరిన నా అవతారాన్ని చూసి మా అమ్మ తమ్ముడు బడికి వచ్చిండారా మా అన్నని అడిగేది. ఆయన నిశ్శబ్దంగా నాతో బడికి వచ్చింది కానీ మధ్యలో చూసేసరికి తరగతి గదిలో కనిపించలేదు అన్నాడు. అరేయ్ జగనూ బడి తప్పించి ఏడ ఆడుకొని పోయినవ్‌రా అని గద్దించి అడిగేది. నేను అమాయకంగా ముఖం పెట్టి అమ్మా బడిలోనే ఉన్నాను అనేవాణ్ణి. మా అమ్మ నా గురించి మొత్తం తెలిసినట్టు కోప్పడేది. మా బాపు గానుగ కట్టేవాడు వచ్చి వాడే చదువుకుంటాడు తీయ్ అన్నం పెట్టు మళ్లీ పగటిపూట బడికి పోతరు అంటూ వెనకేసుకొచ్చేవాడు.

1961 ప్రాంతంలో మా బడి దొరగారి పశువుల దొడ్డిలో ఉండేది. పొద్దున పశువులు మేతకు పోయాక పెండ ఉచ్చ గడ్డీ తీసేసేవారు. అనంతరం జనపనార పట్టాలను కింద మూడు నాలుగు వరసలు పరిచేవారు. వాటి పైన విద్యార్థులు కూర్చునేవారు. సార్లకు ఒక కుర్చీ ముందు టేబుల్ ఉండేది వెనుక గోడకు ఒక బ్లాక్ బోర్డు తలిగించేవారు. అంతా పశువుల మూత్రం రొచ్చు పెండా ఒక రకమైన వాసన కలగలిసి వచ్చేది. అప్పుడు మా స్కూల్ హెడ్మాస్టర్గా కొన్ని రోజులు విఠల్ మరికొన్ని రోజులు వెంకట నరసయ్య సార్లు సిరిసిల్ల నుండి వచ్చి పని చేసేవారు. మా ఊరి ఆనందం, జ్ఞానానందం బద్దెనపల్లి నుంచి సైకిల్ పైన వచ్చే నాగభూషణం సార్లు అన్ని తరగతులకు పాఠాలు చెప్పేవారు. ఆ రోజుల్లో బేసిక్ ఎడ్యుకేషన్ ఉండేది. గోడకు తలిగేసిన కాట్నాలను కింద పెట్టి ప్రతి విద్యార్థికి రాట్నం, పత్తి ఏకు ఇచ్చి దారం వడకమనేవారు. క్రాఫ్ట్ టీచర్ జ్ఞానందం సారు ఈత కమ్మల చీరుకొని తెచ్చి ఆ ముక్కలతో జింకలను, వివిధ ఆకారాల పెంపుడు జంతువులను అల్లేవాడు విద్యార్థులకు ఇచ్చి అలా అల్లమని తర్ఫీదు ఇచ్చేవాడు. నాకైతే రత్నం తిప్పుతూ పడికే దారం ఎప్పటికీ తెగిపోతుండేది. ఇక ఈత కమ్మలతో పెంపుడు జంతువులను అస్సలు అల్లక రాకపోయేది. టీచర్ ఈత ముల్లుతో నొప్పి కలిగేలా కుచ్చేవాడు. రాట్నం మీద దారం వడక రాని విద్యార్థులకు మట్టలు మీద చింతబరిగెతో సురుక్కు మనేలా కొట్టేవారు. అటు వానకాలం చదువు చదివ లేకపోతే, ఇటు క్రాఫ్ట్ అని అస్సలు వచ్చేది కాదు. ఈ దెబ్బల బారి నుంచి బడి తప్పించి నావంటి వారితో కలిసి బయట మామిడి తోటలో చింతతోటలో వివిధ రకాలైన ఆటలు ఆడుకునేవాళ్లం.

మొత్తానికి నా ప్రాథమిక విద్యాభ్యాసం అంతా మా ఊరిలో అటసటాలు గానే సాగింది అని చెప్పాలి.

ఎండకాలం వచ్చిందంటే ఒంటి పూట బడులు ఉండేవి. బడి తర్వాత ఇంటికొచ్చి మధ్యాహ్నం తిని బయటపడి సోపతి గాళ్ళతో చెరువులకో, రాయి మోట బాయికో ఈత కొట్టడానికి వెళ్లే వాళ్లం . అసలు సమయం తెలిసేది కాదు. రెండు మూడు గంటల వరకు ఈత కొట్టేవాళ్లం. గడ్డ మీదికి వచ్చి పొడి బట్టలు వేసుకొని ఒకరి ముఖాలు ఒకరం చూసుకొని నీ కళ్ళు ఎర్రగున్నయ్ అంటే నీ కళ్ళు ఎర్రబడ్డాయి అనుకునేవాళ్లం. తల మీద జుట్టు రాగి వెంట్రుకల్లా నిక్కబొడుచుకొని తలంతా చిందరవందరగా ఉండేది. ఇంట్లో వాళ్ళు మమ్మల్ని ఈతకు పోయినట్టు అసలు ఏర్పాటు చేయకుండా అప్పటికే ఒక ఉపాయం కనిపెట్టాము. అది మా ఇంట్లో గానుగ కొట్టం లోకి పోయి గానుగలో అడుక్కు అప్పటికే ఊరిన మంచి నూనెను తలకు రుద్దుకొని, మా ఇంటి వెనుక పెరట్లోని గడ్డివాములో దాచుకున్న విరిగిన అద్దంముక్క, దువ్వెనతో ముఖం చూసుకుంటూ దువ్వుకునేవాళ్లం .కాళ్లకు చేయిలకు నూనె చమురును బూడిద బూడిదైన చర్మంపై ఏర్పడకుండా రాసుకొని మంచిగున్ననా అంటే నేను మంచిగా ఉన్నానా అనుకొని ఎవరి ఇళ్లళ్లకు వాళ్లం ఏమి తెలియనట్టు పూర్తి అమాయకంగా ముఖం పెట్టి పోయేవారం.

ఇంట్లోకి అడుగుపెడుతున్నమో లేదో మా అమ్మ అరేయ్ ఇంతసేపు ఎటు పోయినవ్ రా అడిగేది. ఎటు పోలేదు ఇంట్లోనే ఉన్నా అని చెప్పేది. ఈత కొట్టడానికి పోయినట్టున్నారు కదరా అని ప్రశ్నించేది. నేను ఏది తలకు నూనె అట్లనే ఉన్నది ఇంకా చూడు అమ్మా అనే వాడిని. మా అమ్మా, బాపు చిన్నబాపులు తమలో తాము నవ్వుకుంటూ ఆ మా తెలిసింది తియ్యిరా ముఖమంతా నూనె కారి, కండ్లు ఎర్రగా అయిపోయాయి. మరి ఎటు పోయింర్రురా ఎర్రటి ఎండలో ఏమి మాములు చేయబోయార్రా అనేది. ఇంత మంచిగా తయారైన ఈతకు పోయినట్టు ఎట్లా తెలిసింది వీళ్ళకి అని తెల్లారి మిత్రులందరం కలిసి అమాయకంగా చర్చించుకునే వాళ్లం. పిల్లలను పెద్దలు చూసే తీరు గురించి ఒక ముఖ్య సంఘటన మీతో పంచుకోవాలని అనిపిస్తుంది. ఇక నా మిత్రులతో కలిసి ఫక్తు బడి తప్పించి నా ఇష్టం వచ్చినట్టు ఆయా కాలాల్లో ఆడే తీరొక్క ఆటపాటలు ఆడుకునే వాళ్లం. అందులో భాగంగానే ఆ సంవత్సరం కాముని పున్నం వచ్చింది. మా బాపుతో నేను కోలలు కావాలి అని జాజిరి ఆడుకోను అడిగాను. ఆయన మా అమ్మకి తెలియకుండా పోయి వడ్ల లక్ష్మీపతి తాత దగ్గర కోలలు చేసి తీసుకొచ్చి నాకు ఎవరికి చెప్పకు రా అంటూ ఇచ్చేవాడు. నేను అంతే రహస్యంగా కోలలను మా ఇంటి వెనుక గడ్డివాములో దాచుకునేవాడిని. కాముని పున్నానికి రెండు రోజుల ముందు ఆడోళ్ళు చప్పట్లు కొడుతూ కాముని పాటలు, పిల్లలు జాజిరి ఆటపాటలతో ఇల్లల్లూ తిరుగుతూ ఆడుకొనేవారు. పొద్దు గూట్లో పడగానే ఊరంతా మారు మోగిపోయేది. నేను నా మిత్రులు సరే మా ఇంట్లో మా అమ్మకు చిన్న బాపులకు తెలయకుండా మా ఇంటికి దూరంగా ఉన్న వాడల్లో తిరుగుతూ జాజిరి ఆటలు ఆడుతున్నాము. అప్పటికే జాజిరి ఆడగా వచ్చిన బియ్యాన్ని బుస్స సోమయ్య దుకాణంలో అమ్మి పుట్నాలు బెల్లం కొనుక్కోవాలని, మిగతా ఎవరైనా ఇచ్చిన పైసలు పంచుకొని గోటీలు ఆడుకోవాలని ప్రణాళికలు రచించుకున్నాం.

అప్పుడు మా ఊర్లో కరెంటు లేదు. పిండి ఆరబోసినట్టు వెన్నెలలో ఆడుకుంటూ ఆడుకుంటూ నేను అలసిపోయి నాకు తెలియకుండానే ఎవరి గద్దె మీదనో నిద్ర వచ్చి పడుకున్నాను. ఊరంతా సద్దుమణిగింది. రాత్రి బాగా పొద్దుపోయింది. ఇంత అర్ధరాత్రి దాటినా ఇంటికి రాకుండా నేను ఎటు పోయానో అని మా అమ్మ ఏడుపు అందుకుంది. ఇక మా బాపూ ముగ్గులు చిన్న బాపులు మా నాయనమ్మతో సహా అందరూ నాకోసం ఊరంతా వెతుకసాగారు అనే బదులు గాలించసాగారు అంటే సబబుగా ఉంటుంది. వెన్నెల బాగా కాస్తుంది. నడిపి చిన్న బాపు వ్యవసాయ బావులు, చెరువు దిక్కు పోతే, మిగతా వారు వాగు వైపు పోయి నాకోసం చూడసాగారు. అర్ధరాత్రి దాటిపోయింది మా బాపు బాగా ఆందోళన చెందాడు. చివరికి వెతుకగ వెతికగా ఒకరి ఇంటి ముందు గద్దె అరుగు మీద పడుకొని గాఢ నిద్రలో ఉన్నాను. మా బాపు బాగా విసిగిపోయి నన్ను లేపి ఎంత సేపాయరా నీకోసం వెతకబట్టి అంటూ కోపంగా గట్టిగా చెయ్యితో రెండు దెబ్బలు కొట్టాడు. నేను ఏడుపు ఎత్తుకున్నాను. మళ్లీ మా బాపు నన్ను దగ్గర తీసుకొని ఊకించి భుజం మీద ఎత్తుకొని ఇంటికి తీసుకుపోయాడు. చిన్న బాపులు మా నాయనమ్మా ఒక్కరు ఒక్కరుగా ఇంటికి వస్తున్నారు. మా అమ్మ నన్ను దగ్గర తీసుకొని వెక్కి వెక్కి దుఃఖించింది.

తెల్లారిన తర్వాత మా బాపు రాత్రి నన్ను కొట్టినందుకు ఏమనుకున్నాడో ఏమో కానీ తెల్లారి మార్కెట్లో ఉన్న మల్లమ్మ హొటల్లో తీసుకపోయి నాకు బాద్ షా తినిపించాడు. అప్పుడు మా బాపు నన్ను చూసి నీళ్లు నిండిన కండ్లను ఎర్ర గీతల దుబ్బాక రుమాలతో ముఖం పక్కకు తుడుచుకున్నాడు.

జూకంటి జగన్నాథం
ఫోన్ : 9441078095



# అమ్మ స్వగతం

– గడ్డం దేవీప్రసాద్

రాత్రంతా కలత నిద్రతోనే గడిచిపోయింది. పొద్దెక్కి జాము అవుతున్నా లేవ బుద్ధి కాలేదు. గత రాత్రే కాదు. హాయిగా కంటి నిండా కునుకు తీసి ఎన్ని దశాబ్దాలు క్షణాల్లా గడిచిపోయాయో! ఆలోచిస్తూ పడుకొనే తలతిప్పి చిన్న పెంకుటింటి గది నలువైపులా దృష్టి సారించింది. గట్టిగా నిట్టూర్చి వైరాగ్యంతో కూడిన నవ్వును కళ తప్పిన ముఖంపైన కప్పింది. కప్పుకున్న దుప్పటిని తొలగిస్తూ పైకి లేచి గోడ ఆసరాతో నిలుచుంది. మళ్ళీ చుట్టూ చూసింది. రత్నకాంతులతో రాజమందిరాలను తలదన్నే రీతిలో వెలుగొందిన భవన సముదాయంలో ఉండిన తనను కొద్ది పాటి వర్షానికే ఉరిసే ఈ ఇరుకైన పెంకుటింట్లోకి తన బిడ్డలే కర్కశంగా నెట్టేయడం...తలచుకోడానికే తనకు సిగ్గనిపించింది. కాస్త ఓపిక తెచ్చుకుని నాలుగడుగులు వేసి తనను తాను తేరిపార చూసుకుంది. ఇతర భాషామ తల్లులు క్రొత్త వలువలతో ఆరోగ్యంగా కళగా నడయాడుతుంటే సన్నబడిన తన మేనును రెండు మూడు అతుకులతో రంగు వెలసిన కోక, వదులైన రవిక కప్పి ఉంచుతున్నాయి. అక్షరానికి ఏ విధంగా చూసినా క్షయం ఉండదు కదా! అక్షరభోజనాన్ని కళ్ళు,చెవుల ద్వారా గ్రహించి ఆకలింపు చేసుకొనే తనకు ఏమిటీ దురవస్థ? ఔనూ తను కడుపారా తృప్తిగా తిని ఎన్ని వేసంగులు దాటి వెళ్ళాయో! అవధానాలు జరిగే సమయంలో తప్పు.లెక్క వేయడానికి పూనుకొని వెంటనే ఆ ప్రయత్నం విరమించింది. తలుపు తీసి గచ్చులు ఊడిన వీధి అరుగుపై కూర్చుంది.

శతాబ్దాలుగా ఎందరెందరో తన ముద్దు బిడ్డలు పోటీలు పడుతూ అక్షరమాలతో పలు రకాల ప్రక్రియలలో ఆశువులుగా ఎన్నో శతకాలు,కావ్యాలు వినిపిస్తుండేవారు. అవి మధుర మంజుల రసాలు ఊరుతూ వీనులను సోకుతుంటే తన కడుపుకు మృష్టాన్న భోజనంగా చేరి ఒకింత భుక్తాయాసాన్ని కలిగించినా ప్రేమతో వారిని అక్కున చేర్చుకొని ముద్దాడేది.

సరస్వతీదేవి తన అంశతో భాషామతల్లులనెందరినో భరతఖండాన సృజన చేస్తే వారి నడుమ తను మహారాణిలా వెలుగొందిన ఆ రోజులు ఇక మీదట జ్ఞాపకాలుగానే మిగిలిపోతాయేమో! ఆ రోజుల్లో అన్ని చోట్లా తనకు నీరాజనాలు అర్పించేవారే కదా! దక్షిణ భారతన ఐతే ఇక చెప్పేదేమి? తుళు వంశాజుడయినా, కన్నడ నాడప్రభువైనా, ఇప్పటి అరవనాడును పాలించిన మరాఠా రాజులైనా, ఒడియా ప్రాంత నాయకులైనా అందరూ తమతమ సభామంటపాల్లో నాకు అగ్రాసనం వేసిన వారే!

ఆ మహారాజులందరూ తమ భాష కాకున్నా స్వయంగా తెలుగులో కావ్య రచనలు చేసి నన్నెంత సంతోషపరచారో! తలచుకుంటే ఇప్పుడూ తనువు పులకరిస్తోంది. ఈనాడు ఎవరో తన దరికొచ్చి కావ్యగానం చేస్తారనే ఆశ లేదు కానీ కనీసం మంచి తెలుగు పలుకులు చెవిన పడితే తన ఆకలి కాస్తా అయిన తీరుతుందని కదా ఇక్కడ కూర్చున్నాను. ఇతర భాషా పదాలతో కల్తీ అయిన మాటలే తెలుగు నాట వినవస్తున్నాయి. ఆ కల్తీ అక్షర భోజనంతోనే కదా నాకు అజీర్తి చేస్తోంది. పైగా ఆగని విరోచనాలు కూడానూ. ఇది వరలో ఎంతో విశాలంగా ఉన్న తెలుగు నేలా ఇప్పుడెంతగానో చిక్కిపోయింది తనలాగా అనుకొని నిట్టూర్చింది. నా ప్రమేయం లేకుండానే ఈ నిట్టూర్పులు, వెర్రి నవ్వులు రావడం ఏమిటో!

అదిగో! ముద్దులొలుకుతూ వస్తున్న బడి పిల్లలు, కళాశాల విద్యార్థులు. అయ్యో! భాషతో బాటూ తెలుగు ఆహార్యమూ వదిలేసి ఆ బట్టలు ధరించడం ఏంటో! "మాకొద్దీతెల్లదొరతనం" అంటూ ప్రాణాలు సైతం లెక్కచేయక పోరాడిన తెలుగు జాతేనా ఇది? ఈ దేశంలో అప్రాచ్యపు భాషకు తామే మహారాజా పోషకులం అనుకొంటూ తల్లి భాషను జీవచ్ఛవం చేసేసి ఊరేగుతూ మురిసిపోతోందేమిటి? ఈ జాతిభాషా దౌర్భాగ్యంతో కదా నేను అందరి భాషామతల్లుల నడుమ వెలవెల పోతున్నాను. "గతమెంతో ఘనకీర్తి కలిగిన తెలుగోడా" అనే నానుడి నాకూ వర్తిస్తుందేమో! ఇంటి భాషగా,వాడుక భాషగా, బడి,

పరిపాలనా భాషగా నన్ను నిలపడానికి సమిష్టిగా నడుం బిగించి ఉద్యమించని రచయితలు ఎందరున్నా ఫలమేమి? అనకూడని మాటలు మాట్లాడడానికి, ఓట్లు అడుక్కోడానికి మాత్రమే భాషను వాడుకొనే రాజకీయ నాయకులు పాలకులయ్యాక తనను ఇనుమంతైనా పట్టించు కుంటున్నారా? పాలకుల నుండి అనుచితాలను అడుక్కునే ప్రజలు తమ భాషలో పాలన చేయమని ప్రభుత్వాలపై ఒత్తిడి ఎందుకు చేస్తారు? చివరకు ఇరు వర్గాల వారికీ ఇది బిక్షగాళ్ళ భాషగా మారిపోయిందేమి?

పంటచేలలో పాలకంకులు పైరగాలికి తలలూపుతున్న వేళ వినవచ్చిన పల్లె పదచుల పాటలు, యక్షగానాలు, జానపదుల కళారీతులు ఏమైపోయాయి. తల్లులు పాడే జోలపాటలకు పసిపిల్లలే కాదు నేనూ ఆదమరచి నిద్రపోయేదాన్ని కదా! ఏవీ ఆ లాలి పాటలు! పంచపాత్రలోని నీటికి భక్తిభావం తోడై తీర్థం అయినట్టు ఎదలోతుల్లోని ఆర్తి పదాల అల్లికలతో సప్తస్వరాల తోడుగా సంకీర్తనలు వెలువరించి కర్ణాటక సంగీతాన్ని తెలుగుతో గొప్పగా వన్నెలద్దిన అలనాటి వాగ్గేయకారులు ఇప్పుడేరి!

రాజుల పురస్కారాలను తృణీకరించి కేవలం నన్ను ఆనందిపచేయడానికే ఎన్నెన్నో రచనలు చేసిన మహానుభావు లెక్కడ? భాష మనుగడకు, వికాసానికి పాటుపడక కేవలం తమ రచనలు అందరూ చదివేయాలనే అత్యాశాపరులైన ఈనాటి రచయితలెక్కడ? భాష వాడుకలో ఉంటే కదా ఎవరి రచనలు అయినా చదివే వీలు ఉండేదన్న కనీస అవగాహన లేదేమిటి వీరికి.నా బిడ్డడు కాకున్నా నాకు ఎంతో సేవ చేసి అనేక విధాలుగా నాకు పునరుత్తేజం కలిగించిన దత్త పుత్రుడు బ్రౌను చూపిన దారిలో ఒక్క బిడ్డడు అయినా ప్రయాణం మొదలెడతాడా? అదీ ఎండమావే అయిపోతే నేనూ అందరిలా నన్ను అందలం ఎక్కించిన మారిషస్సుకో ఇదివరలో పాతాళలోకం అని పిలవబడిన అమెరికాకో వలస పోతానేమో! అసంకల్పితంగా మరోసారి దీర్ఘంగా నిట్టూర్పు విడిచింది.

గడ్డం దేవీప్రసాద్
ఫోన్ : 8971830473

## కమ్మతెమ్మెర

మే నెల **మిసిమి** అందుకున్నాను. **మిసిమి** పాఠకులకు యిద్దరు మహనీయుల గురించి గొప్ప వ్యాసాలు అందించారు. మహానుభావులు శ్రీ పెద్ది సత్యనారాయణ గారు, శ్రీ లంకా సూర్యనారాయణ గారు గురించి చదివి ముగ్ధుడనయ్యాను. యిలాంటి వారి గురించి రాస్తూ – **మిసిమి** పాఠకుల్లో చైతన్య స్ఫూర్తి కల్గిస్తున్నారు. సూర్యనారాయణ గారు ఒక సంస్థ వంటివారు. కొన్ని వేల పుస్తకాలు కొని – సేకరించి గ్రంథాలయం స్వయంగా ఇర్వహిస్తున్నారంటే ప్రభుత్వాలు – అధికారులు చేయలేని మహత్తర కృషిని జాతికందించారంటే – గుర్తింపు కోసమా! పద్మశ్రీలు కోసమా! నిస్వార్థమైన వారి అభిరుచి సమాజానికి – సాహిత్యానికి – పరిశోధనకు ఉపయోగపడేలా చేయడం అద్భుతం సుమా! నార్ల వారికీ – ఆరుద్ర గారికీ – నటుడు రాజనాల గారికీ స్వంత గ్రంథాలయాలున్నాయని విన్నాము. రాజమండ్రి గౌతమీ గ్రంథాలయం, విజయవాడలోని రామ్మోహన గ్రంథాలయం కంటే సూర్యనారాయణ గారి గ్రంథాలయం చాలా గొప్పదిగా దర్శనమిస్తున్నది.



శ్రీ పెద్ది సత్యనారాయణ గారు కర్షకులు – టీచరు – కమ్యూనిస్టు. రాజకీయాలలోకి ప్రవేశించకపోయినా ఎన్.జి. రంగా గారితో, తుమ్మల – జాషువా – వెంకట కవి వంటి సాహితీమూర్తులుతో స్నేహం. 96 సంవత్సరాల యువకునిగా కనిపించారు. ఒక శతాబ్దాన్ని కనులారా దర్శించిన మానవతామూర్తి. వారి జీవనం – జీవితం తెరచిన పుస్తకం. అధికమాసాలతో కలిపితే వంద సంవత్సరాలు పండించుకున్న మాన్యశేఖరులు శ్రీ సత్యనారాయణ గారు. వారి శరీరానికి వృద్ధాప్యం కానీ – మనస్సు మాత్రం నిత్య వసంతం సుమా! వీరి కథనాన్ని చదివి నా మనసు ఆనంద తరంగమయ్యింది. ఆ మహనీయ మూర్తులకు మనసా–వచసా పరిపూర్ణ హృదయంతో నమస్కరిస్తున్నాను.

*- చెరుకువాడ వెంకట రామయ్య, విస్సాకోడేరు, ఫోన్ : 9542118184*

# రాయలసీమ నవల - బహుజన జీవితం

**- డా. పొదిలి నాగరాజు**

"కుల, వర్గ సమస్యల సమ్మేళనంతో సాహిత్యాన్ని విశ్లేషించేది సాహిత్యంలో బహుజన దృక్పథం అవుతుంది" అని 'బహుజన సాహిత్య దృక్పథం కొన్ని ఆలోచనలు' అనే వ్యాసం బహుజన దృక్పథాన్ని నిర్వచించింది. ప్రస్తుత సామాజిక మానవునికి ప్రకృతి వల్ల సంభవించే సమస్య కంటే కులం, మతం, వర్గం నుంచి వచ్చే సమస్యలే ఎక్కువ. తెలుగు సాహిత్యంలోని బహుజనుల జీవితాలన్నీ సమస్యల వలయంలో నుంచే కనిపిస్తాయి. ఈ విషయంలో రాయలసీమ సాహిత్యం అతీతమేమీ కాదు. ఇతర ప్రాంతాలతో పోల్చి చూస్తే రాయలసీమలోని బహుజనుల జీవితాలు భిన్నంగా కనిపిస్తాయి. రాయలసీమలో జీవించే బహుజనులు వృత్తిని నమ్ముకొని జీవించేవాళ్ళు కొంత మందైతే, కులవృత్తనేది ఏమీ లేకుండా వుండేవాళ్ళు మరికొంతమంది వున్నారు. సంచార జాతుల జీవనవిధానం, వృత్తికళాకారుల జీవనవిధానం బహుజనుల్లో మరోపాయ. వీళ్ళే కాకుండా వివిధ రకాలుగా జీవించే బహుజనులు వున్నారు. వీరందరి జీవితాల నేపథ్యం బహుజన జీవితంగానే పరిగణింప బడుతుంది. ఇలాంటి వాళ్ల జీవితాలను రాయలసీమ నవలాసాహిత్యం కొంతవరకే చిత్రించగలిగింది. ఈ కొద్ది సాహిత్యమైనా బహుజనుల గురించి ఆలోచించిందంటే ఇది బహుజన సాహిత్యానికి మేలుకొలుపనే చెప్పాలి.

రాయలసీమ నవల నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి 1872లో రచించిన శ్రీరంగరాజు చరిత్రతో మొదలైంది. ఇది తెలుగులో తొలి నవల కూడా. రాయలసీమ తొలి నవలా రచయిత్రిగా భావించే దేవమణి సత్యనాథన్ తొలి తెలుగు నవలా రచయిత్రి కూడా. ఈమె 1908లో రచించిన నవల 'లలిత'. రాయలసీమ నుంచొచ్చిన ఈ రెండు తొలి తెలుగు నవలల్లో బహుజనుల జీవితం సూచనప్రాయంగా చిత్రింపబడింది. ఆ తర్వాత కల్వటాల జయరామారావు రచించిన రేనాటి వీరుడు నవలలో ఒడ్డె ఓబన్న బహుజన పాత్ర. ఇతను నవలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాటానికి కుడిభుజంగా వున్న వ్యక్తి. దీని తర్వాత 1950 వరకు వచ్చిన సీమ నవలల్లో అంతటి నరసింహం రచించిన 'ఆదర్శం' నవలలో బహుజనుల జీవితం కొంత వరకు కనిపిస్తుంది. 1950-80 మధ్య వచ్చిన సీమ నవలా సాహిత్యంలోని బహుజన జీవితం కన్నా 1980 తర్వాత వచ్చిన రాయలసీమ నవలా సాహిత్యంలోనే బహుజన జీవితం బాగా కనిపిస్తుంది. ముఖ్యంగా రాయలసీమలో ప్రసిద్ధ నవలా రచయితలైన డాక్టర్ కేశవరెడ్డి, వి.ఆర్. రాసాని, బండి నారాయణస్వామి, శాంతి నారాయణ, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి లాంటి రచయితల నవలల్లో బహుజన జీవితం ఎంతో చిక్కగా చిత్రించబడింది.

డాక్టర్ కేశవరెడ్డి రాయలసీమలోని చిత్తూరుజిల్లా నవలా రచయిత. ఈయన నవలలు ఇతర భాషలలోకి కూడా అనువాదమయ్యాయి. ముఖ్యంగా సమాజం వెలుపల ఉండే జీవితాలను నవలల ద్వారా పరిచయం చేసిన వినూత్న రచయిత కేశవరెడ్డి. ఈయన నవలలు పాఠకులకు ఎప్పుడూ దళిత, బహుజన జీవితాలనే పరిచయం చేశాయి. సమాజంచేత పీడింపబడిన దళిత బహుజనుల జీవితాలను తన నవలలకు వస్తువులుగా ఎంచుకొని వారి జీవన విధానాన్ని, జీవితాలలోని ప్రధాన సమస్యలను తక్కువ పేజీలలో ఎక్కువగా అందించగలిగిన చేయి తిరిగిన సీమ నవలా రచయిత డాక్టర్ కేశవరెడ్డి.

కేశవరెడ్డి 1987లో రాసిన నవల 'రాముడుండాడు రాజ్జిముండాది'. ఇందులో బహుజనుల జీవితం ఉంది. కోనిగాడు, మల్లిగాడు, కంసాలి, ఈడిగ, చాకలి, పూజారి మొదలైన వాళ్లంతా పల్లెలో బతకలేక పల్లెనిడిచి నగరానికి వెళ్తూ రాముడుండాడు రాజ్జిముండాది అని అనటంతో నవల ముగుస్తుంది. కోనిగాడు చేసిన అప్పు కోసం

పెదనాయుడి వద్ద ముప్పై సంవత్సరాల నుంచి చాకిరీ చేస్తూనే వుంటాడు. పట్టణంలో దిన కూలీ చేసే కోనిగాడి కొడుకు మల్లికాడిని కూడా తన వద్ద పాలేరు పనికి పెడితే ఎకరం పొలమిస్తానని పెద్దప్ప నాయుడు కోనిగానికి ఆశ చూపిస్తాడు. కోనిగాడు తన కొడుకు మల్లిగాడిని పట్నం నుంచి పిలిపిస్తాడు. దేశాలు తిరిగిన మల్లిగాడు, తండ్రితోపాటు మిగిలిన ఊరందరికీ 'పెద్దప్పనాయుడు పైకి మంచిగా వుంటూ ప్రజలకు చేసే మోసాలను' గురించి వివరించి చెబుతాడు. అందరిలో మార్పు రావాలని ప్రయత్నం చేస్తాడు. పెద్దప్పనాయుడు తన వరి పొలం కోతకోసం కొడవళ్ళు చేయాలని కంసాలిని పట్టుబడతాడు. అంతకన్నా ముందే కొంతమంది రైతులు తమ చెరుకు తోట కోత కోసం కొడవళ్ళు చేయలేదని కంసాలి కొలిమిని ధ్వంసం చేస్తారు. దీంతో కంసాలి ఇద్దరి మధ్యా మానసికంగా నలిగిపోయి భౌతికంగా నష్టపోతాడు. అలాగే ఊర్లోని చాకలికి, ఈడిగ వాళ్లకూ వృత్తుల ద్వారా బతుకు కష్టమైతుంది. మిగిలిన వృత్తి పనులు చేసుకునే వాళ్లకూ ఎటువంటి గిట్టుబాటూ వుండక అందరి జీవితం దుర్భరంగా మారుతుంది. ఇదంతా చూసిన పూజారి వీళ్ళందరికీ న్యాయం చేయలేని దేవుడిని నిందిస్తూ గుడి తాళాలను పెదనాయుడుకిచ్చి తాను పూజారితనాన్ని వదిలిపెడతాడు. మల్లిగాని మాటలు విని అంతా పట్టణం వెళ్లి బతకాలని నిర్ణయించుకొని రాముడుండాడు రాజ్జిముండాది అనుకుంటూ బయలుదేరటంతో కథ ముగుస్తుంది. పల్లెలో నివసించేటువంటి వృత్తి పనివాళ్లకు, రైతులకు పెత్తందారులవల్ల, అధికార యంత్రాంగం వల్ల పల్లెల్లో బతకలేక నగరానికి వలసపోతున్నారని ఈ నవల తెలియజేయడమే కాకుండా ఆర్థికంగా చితికి పోతున్న వృత్తి కులాల వాళ్ళు వాళ్ళ వృత్తులను వదిలేసి పట్టణం చేరి ఏదో ఒక పని చేసుకుని బతుకుతున్నారన్నే వాస్తవాన్ని ఈ నవల తెలియజేస్తుంది. బహుజన జీవితాలలోని ఆర్థిక నష్టాలకు ప్రతిరూపంగా కేశవరెడ్డి ఈ నవల రచించాడు. ఈ నవల ముగింపు బహుజనుల కష్టాల కొనసాగింపుకు ఒక తార్కాణంగా వుంటుంది. ఇది వాస్తవికతకు దగ్గరైన ముగింపు.

అదే చిత్తూరు జిల్లాకు చెందిన మరొక నవలా రచయిత రాసాని వెంకట్రామయ్య. ఈయన 1994లో రచించిన నవల 'చీకటి రాజ్యం'. కురవ, వడ్డెరల జీవితాలలోని చీకట్లను చిత్రించిన నవల ఇది. చిత్తూరు జిల్లాలో వున్న నడిగడ్డ – గ్రామానికి కురువపల్లె, వడ్డెపల్లెలు అనుబంధ పల్లెలు. ఇందులో కురవలు గొర్రెలను, వడ్డెరలు పందులను మేపుకుంటూ జీవనాన్ని సాగిస్తుంటారు. ఈ రెండు కులాల మధ్య వైరుధ్యానికి కారకుడు ఆ ఊరి పెద్ద ఎర్రమరెడ్డి. ఎర్రవరెడ్డికి కుడి ఎడమ భుజాలు గంగిరెడ్డి, చిన్నమ్మరెడ్డి. ఎర్రమరెడ్డి చేసే కుట్రల ద్వారా నలిగిపోయిన రెండు కులాలు కురువ, వడ్డే కులాలు. ఈ రెండు కులాల చీకటి బతుకులలో వెలుగులు నింపిన యువత పాత్రలు వెంకట్రాముడు, గోవిందు, రామకృష్ణయ్యలు. వీరి అభ్యుదయ భావజాలాల ద్వారానే అమాయకులైన కురువ, వడ్డె కులాల పెద్దలకు ఎర్రమ్మ రెడ్డి అన్యాయం గురించి తెలుస్తుంది. కురవ వడ్డెరలంతా ఏకమవుతారు. ఇది జీర్ణించుకోలేని ఎర్రమరెడ్డి గంగిరెడ్డికి కురవల గుడిసెలను చిన్నమ్మరెడ్డికి వడ్డెర గుడిసెలను తగలబెట్టమని చెబుతాడు. తాను నారాయణ కూతురు నాగమ్మను గుడిలోకి రప్పించుకొని చెరచబోయి విఫలుడై గుడిలోని శూలాలు గుచ్చుకొని చనిపోతాడు. గుడిసెలకు నిప్పు పెడుతుండగా ప్రజలు చూశారనే అవమానాన్ని భరించలేక గంగిరెడ్డి ఆత్మహత్య చేసుకుంటాడు. ప్రజలకు తాను చేసిన పని తెలిసిపోయిందని భయపడి కాలుతున్న గుడిసెల మంటల్లో పడి చిన్నమరెడ్డి కాలిపోతాడు. ఈ ముగ్గిరి చావుతో చీకటి రాజ్యంగా వున్న నడిగడ్డ దీపావళి వెలుగులతో ప్రకాశిస్తుండగా నవల ముగుస్తుంది. చీకటి రాజ్యం నవల ఎర్రమరెడ్డి చేతలలో పీడితులై చాలా కాలం నలిగిపోయిన బహుజనులు వడ్డె, కురువల జీవితాలలోని బాధలను చిత్రించింది. బహుజనులంతా ఐకమత్యంతో తిరగబడితే పెత్తందారుల అఘాయిత్యాలు అంతం కాక తప్పదన్న సందేశాన్ని నవల చెబుతుంది. నవలలో బహుజనుల్లోని పాత తరానికి, కొత్త తరానికి తేడా కనిపిస్తుంది. పాతతరం బానిస జీవితానికి ప్రతీకగానూ, కొత్త తరం అభ్యుదయ భావజాలాలను అందిపుచ్చుకొన్న వైతాళికులుగానూ కనిపిస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా బహుజనులు ఏకమవుతున్నారన్న రహస్య వాస్తవం కూడా ఈ నవలలో ఉంది.

రాసాని గారు 2008లో రచించిన నవల 'పరస'. చిత్తూరు జిల్లాలోని మంగళంపేటకు నైరుతిగా మూడు

మైళ్ళ దూరంలో ఉన్న ఘంటావాళ్ళ పల్లె నవలకు కథా స్థలం. ఈ నవల గంగిరెద్దుల వారి జీవన విధానాన్ని తెలియజేస్తుంది. ఇందులో గంగిరెద్దులాడిస్తూ జీవనాన్ని కొనసాగించే పాత్ర బీశేరయ్య. నవలంతా ఈయన చుట్టూనే తిరుగుతూ ఉంటుంది. గంగిరెద్దులు ఆడించి పొట్ట పోసుకునే బీశేరయ్య గంగిరెద్దు కోసం పుంగనూరు సంతకు వెళ్లి నెల రోజులు ప్రాయమున్న దూడను కొనితెచ్చుకొని దానికి లచ్చుమయ్య అనే పేరు పెట్టి గంగిరెద్దు ఆటలో శిక్షణ ఇస్తాడు. అయితే ఊరి పెద్ద శంకర్ రెడ్డికి బీశేరయ్యకు గంగిరెద్దు విషయంలో కొంత విభేదం వస్తుంది. దీనితో శంకరరెడ్డి బీశేరయ్య తెచ్చుకున్న గంగెద్దును ఆచారం ప్రకారం దేవరెద్దుగా చేయిస్తాడు. అంతే కాకుండా సంక్రాంతి పండగనాడు గంగిరెద్దులు ఆడించడానికి బీశేరయ్య కుటుంబంలోని మగవాళ్లంతా పల్లెలు పట్టుకొని వెళ్ళిపోగా దానిని ఆసరాగా చేసుకుని శంకర రెడ్డి బీశేరయ్య పశువులన్నింటినీ దొంగతనం చేయిస్తాడు. చివరికి బీశేరయ్య చెంగారెడ్డినే పెద్దమనిషి అండవల్ల పోలీసుల సహాయంతో పశువులను ఇంటికి తెప్పించుకుంటాడు. శంకర రెడ్డి, శంకర రెడ్డి కొడుకు కేశవరెడ్డి బీశేరయ్య కుటుంబానికి చేసిన ద్రోహాన్ని చెంగారెడ్డి ఊరందరికీ చెబుతాడు. ఊర్లోని వారంతా శంకర రెడ్డిని, కేశవరెడ్డిని దుర్మార్గులుగా నిందిస్తారు. దీనితో ఇద్దరి రెడ్లకు బుద్ధి వస్తుంది. గంగిరెద్దు కోసం తెచ్చుకున్న ఎద్దు దేవరెద్దుగా మారిపోవడంతో బీశేరయ్య మళ్ళీ గంగెద్దు కోసం పుంగనూరు సంతకు వెళ్తాడు. అప్పుడు అక్కడ సంత వుండదు. మారిన కాలానికి అనుగుణంగా పశువుల సంతకు బదులు రాజకీయాల కోసం ఎగబడుతున్న మనుషులే బీశేరయ్యకు సంతగా కనిపించటంతో నవల ముగుస్తుంది. ఈ నవలలో గంగిరెద్దులాడించే బీశేరయ్య ఆత్మాభిమానంతో బతుకుతుంటాడు. అధికార గర్వంతో, కుల గర్వంతో విర్రవీగే శంకరరెడ్డి ఆయన కొడుకు కేశవరెడ్డి కులం తక్కువ వాడైన బీశేరయ్య తనతో పాటు సమానంగా వ్యవసాయం చేసి బతకటం చూసి ఓర్వలేక బీశేరయ్య జీవితాన్ని సర్వవిధాల నాశనం చేయడానికి ప్రయత్నించి విఫలమవుతారు. అయితే బీశేరయ్య అన్ని బాధలకు ఓర్చుకొని చివరికి సఫలుడౌతాడు. కానీ అప్పటికే బాగా చితికిపోయిన బీశేరయ్య కుటుంబం రెండుగా (బీశేరయ్యది, తన తమ్ముడిది) వేర్పడిపోతాయి. దీనితో బీశేరయ్య మళ్లీ కులవృత్తిలోకి వెళ్లాల్సి వస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కాలంలో కూడా గంగిరెద్దులాడించే కులవృత్తిని నమ్ముకొని జీవించాలి అనుకోవడం ఒక సాహసోపేతమైన నిర్ణయమే. ఇది కుల వృత్తులు నమ్ముకుని జీవించే బహుజనులకు ఒక ధైర్యం. కానీ వృత్తిని నమ్ముకొని జీవించే బహుజన కులాలు వృత్తి లేకుండా బతకటం కష్టమనటానికి కూడా ఈ నవలొక తార్కాణం. రచయిత పరస నవల ద్వారా వృత్తి కళాకారుల జీవితాలను గంగిరెద్దుల వారి జీవితం ఆధారంగా చూపించాడు. దీనితోపాటు బహుజనులలో భాగమైన వృత్తికళాకారులు తమ కళా వృత్తికి ప్రజాదరణ లేనప్పుడు వారి జీవితాలెలా చితికిపోతాయో ఈ నవల తెలుపుతుంది.

రాసాని 2015లో రచించిన మరో నవల 'బతుకాట'. ఇది వీధి నాటకాలు ఆడే వారి జీవితాన్ని తెలియజేస్తుంది. చిత్తూరుజిల్లా కుప్పం సమీపంలో యామిగానిపల్లె నవల కథాస్థలం. యామిగానిపల్లెలో వీధి నాటకాలు ఆడే నటులకు గురువు సిద్దోజీ. ఈయన యామిగాని పల్లెలోని వీధి నాటక కళాకారులకి ఐదవ తరం గురువు. ఈయన వద్ద గురువుల గతాలను తెలియజేసే 'గురువుల చరిత్ర' పుస్తకం ఉంది. దీనితోపాటు తన ఆధ్వర్యంలో తమ గురువుల సమాధులు ఉండే 'గురువులతోపు' ఒకటి సిద్దోజీకి సంబంధించిన తోట. గురువు వారసత్వాన్ని కొనసాగించే క్రమంలో తను ఆ ఊరి కళాకారులకు గురువవుతాడు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ఆధునిక కాలంలో వీధి నాటకాలకు ఆదరణ లేకపోవడం సిద్దోజికి బాధను కలిగిస్తుంది. అయినప్పటికీ ధైర్యంతో ఆ ఊరిలోని రకరకాల కులాలవారిని కలుపుకొని వీధి నాటకాలను నేర్పిస్తుంటాడు. వీధి నాటకంలో శృతి, తాళం సరిగా లేని వడ్డీల బుద్దయ్య కొడుకు గుర్రప్ప సిద్దోజితో పోటీ పడలేక సిద్ధప్పపై ద్వేషం పెంచుకుంటాడు. సిద్ధప్ప నాశనాన్ని కోరుకుని అవకాశం కోసం ఎదురు చూస్తూ వుంటాడు. సిద్ధప్ప తన కూతురు పెళ్లి కోసం గురువుల తోపును ఆయకం పెట్టి పదివేల రూపాయలు గుర్రప్ప దగ్గర అప్పు చేస్తాడు. సరైన సమయానికి అప్పు తీర్చలేకపోవటంతో గుర్రప్ప గురువులతోపుని తన సొంతం చేసుకునే

సమయంలో చెట్టు మీద నుంచి కింద పడి, వెన్ను విరిగి మంచం పట్టి చనిపోతాడు. సిద్ధప్ప తిరుపతికి గజ్జ కట్టి భజన చేస్తూ వెళ్లి తిరుమలలో భజన చేస్తూ చనిపోతాడు. సిద్ధప్ప కొడుకు నాగప్ప, అతని కొడుకులు కుప్పానికి వెళ్ళిపోతారు. 'గురువుల చరిత్ర' పుస్తకానికి కాలం చెల్లిపోతుంది. 'గురువులతోపు' దయ్యాలతోపుగా మారిపోతుంది. నవల ముగుస్తుంది. నాటకాలు ఆడించే వారులేక వీధి నాటకాలు ఆడే వారు వారి కళను ఏ విధంగా వదిలేయాల్సి వచ్చిందో ఈ నవల చెబుతుంది. రాయలసీమలో ఒకప్పుడు శోభాయమానంగా వెలిగిన వీధి నాటకం నవల రాసే సమయానికి ఆదరణ తగ్గి, క్షీణ దశకు వస్తుంది. కారణం వీధి నాటకం స్థానంలో సినిమా పాటలతో కూడిన 'అల్లీఅర్జున' లాంటి నాటకాలు రావటం. ప్రజలను శృంగార భావాలతో రెచ్చగొడుతూ, ఎకిలి చేష్టలతో, ఎగతాళి మాటలతో నిండిన ఇలాంటి నాటకాలు వీధినాటకం లాంటి ప్రాచీన కళలకు గొడ్డలిపెట్టుగా మారిన విధానాన్ని నవల విప్పి చెప్పింది. ఇది దురదృష్టకరం. వీధినాటక కళాకారులకే కాదు నాటక కళాకారులందరికీ నష్టం. నవలలో వీధినాటక చర్చే వుంది. కానీ అల్లీ అర్జున నాటకాల వంటి నాటకాలవల్ల మన పూర్వనాటక కళ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని రచయిత సిద్దోజీ ద్వారా వాపోతాడు. ఈ నేపథ్యంలో ఆంధ్రరాష్ట్రంలోని గురువుల చరిత్రలు కనిపించకుండాపోవటం, గురువులతోపులు దయ్యాల తోపులుగా మారటం లాంటి వాస్తవాలను ఈ నవల మన ముందుచుతుంది. మన సంస్కృతికి మూలస్తంభంగా వున్న నాటక ప్రక్రియ అంతరించిపోవటం అంటే ఆ ప్రాంత సంస్కృతి అంతరించిపోయినట్లేనన్న విషయాన్ని నవల చెబుతుంది. ఇటువంటి కళలను వృత్తిగా చేసుకొని జీవించే వారంతా బహుజనులే. ఈ నవలలో కళాకారుడైన సిద్దోజీ పడే బాధలన్నీ కళను నమ్ముకొని జీవించే బహుజన కళాకారులవే. ఇది తెలియజేయటంలో రచయిత సఫలీకృతుడైనాడు. బహుజనులలో భాగమైన కళాకారుల జీవితంలోని బాధల అనుభవాల్ని ఈ నవల బాగా చిత్రించింది.

రాయలసీమ నవలా సాహిత్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన అనంతపురానికి చెందిన నవలా రచయిత బండి నారాయణస్వామి. ఈయన1996లో రచించిన నవల గద్దలాడతాండాయి. రాయలసీమలో కరువులు ఎక్కువ. సరైన నీటి వసతి లేక రాయలసీమ రైతులు ఆర్థికంగా బలహీనులై కనిపిస్తారు. ప్రభుత్వం కట్టే ప్రాజెక్టుల వల్ల రైతులు లాభపడాలి. కానీ రాయలసీమలో ప్రాజెక్టు నిర్మాణంవల్ల పెద్ద రైతులు బలపడుతూ పేద రైతులు బలహీన పడటం ఈ నవల ద్వారా చిత్రితమైన అంశం. అనంతపురం జిల్లాలోని మల్లంపల్లిలో నిర్మించిన భైరవాణి తిప్ప ప్రాజెక్ట్ నవలకు కథాస్థలం. భైరవాణి తిప్ప ప్రాజెక్టు వల్ల పేద రైతులు ఆర్థికంగా చితికిపోయారని చెప్పటమే గద్దలాడతాండాయి నవల ప్రధాన ఇతివృత్తం. మల్లంపల్లిలో నాగేంద్రప్ప కుటుంబం బైరవానితిప్ప ప్రాజెక్టు నిర్మాణం తర్వాత ఆర్థికంగా చితికిపోయిన కుటుంబం. బోయ కులానికి సంబంధించిన నాగేంద్రప్ప ఇద్దరి తమ్ముళ్లతో కలిసి ఒకే కుటుంబంగా జీవించేవాడు. భైరవాణి తిప్ప ప్రాజెక్టు కారణంగా అతని వ్యవసాయం దివాలా తీసి అన్నదమ్ముల మధ్య కలతలు వస్తాయి. ఒక ఇల్లు మూడిళ్లవుతాయి. ఒక తమ్ముడు భీమప్ప నకిలీ విత్తనాల వ్యాపారిని కొట్టి జైలుకెళ్తాడు. భీమప్పను విడిపించటానికి కొంత డబ్బు ఖర్చవుతుంది. మరో తమ్ముడు వెంకటేశ్వర్లు వ్యవసాయంలో దివాలా తీసి భార్య మీద అనుమానపడి ఆత్మహత్య చేసుకుని చనిపోతాడు. దీంతో నాగేంద్రప్ప ఆస్తిపరంగా తీవ్రంగా నష్టపోయి ఊరి పెద్ద ఈశ్వర్‌రెడ్డికి లొంగిపోయి అతని పెత్తనానికి బానిస అవుతాడు. నాగేంద్రప్ప కూతురు జయమ్మ మోసగాడైన చలపతితో లేచిపోతుంది. ఈ సంఘటనతో నాగేంద్రప్ప ఈశ్వర్‌రెడ్డికి పూర్తిగా దాసుడవుతాడు. ఇది బోయ నాగేంద్రప్ప కుటుంబ కథ. నవలలో మొదటిది. దళితుడైన మల్లేష్ కథ రెండవది. సారాయి కోసం శంకర రెడ్డి ఇంట్లో దొంగతనం చేయ బోయి పట్టుబడతాడు. దీనికి శిక్షగా ముందుగా ఊరందరీ కాళ్లు పట్టుకుని తర్వాత ఈశ్వరరెడ్డి కాళ్లు పట్టుకొని క్షమించమని కోరతాడు. ఈ నవలలో రాజకీయ చిత్రణ కూడా ఉంది. నాగేంద్రప్ప చెల్లెలు జయమ్మ చలపతి చేతిలో మోసోయి ఒక దయ్యం లాంటి ఆడపిల్లను కని చనిపోతుంది. దీనితో నవల పూర్తవుతుంది. నిచ్చెన మెట్ల లక్షణమున్న సమాజ స్వరూపం ఈ నవలలో కనిపిస్తుంది. ఒక కులం

తన పైకులం చేత పీడింపబడుతూ అదే సమయంలో తన కింది కులం వాళ్లని పీడించడానికీ ప్రయత్నం చేస్తుంటుందన్న విషయం ఈ నవల స్పష్టం చేస్తుంది. ఇందులో మాదిగ మల్లేష్, బోయ నాగేంద్రప్ప ఇద్దరి ఆర్థిక పరిస్థితి చితికి పోవడం వల్ల ఈశ్వరరెడ్డి లాంటి పెత్తందారులకు బానిసలై జీవితాలను పెత్తందారుల పాదాల కిందపరిచి నలిగిపోవటాన్ని వారికి దాసోహ మనటమే గద్దలాడతాండాయి చెబుతుంది. రైతు బాగు పడాలని ప్రాజెక్టు నిర్మాణాలను చేపట్టటం వరకే ప్రభుత్వం పని. ఆ ప్రోజెక్టు నీళ్లు ఏ రైతుకు చేరుతున్నాయన్న విషయం ప్రభుత్వానికి పట్టదన్న విషయం గద్దలాడతాండాయి బయటపెడుతుంది. ప్రాజెక్టు కిందికి వచ్చే భూముల్లో చాలా భూములు చిన్న చితకా రైతులవి తక్కువగా వుంటాయి. ఎక్కువగా పెత్తందారులవే. ప్రాజెక్టుల్లోని నీటిపారుదల పంపకాలలోని మోసాలు, అతిరహస్యాలు ఎలా వుంటాయో? బహుజనులలో వ్యవసాయం చేసే రైతుల జీవితాలు పెద్ద రైతుల చేతుల్లో ఎలా నలిగిపోతున్నాయో? అన్న యథార్థాన్ని నవల చిత్రించింది. బహునులపై ధనికవర్గం పేర్చిన చితి వివరాలు ఈ నవల ద్వారా తేటపడతాయి.

నారాయణస్వామి 1997లో రచించిన మరో నవల మీ రాజ్యం మీరేలండి. ఈ నవల ముప్పై, నలభై సంవత్సరాల కాలంలో పండమేరు గ్రామంలోని బహుజనులలో వచ్చిన మార్పులను తెలియజేస్తుంది. రాయలసీమలోని అనంతపురం జిల్లాకు చెందిన పండమేరు గ్రామం నవలకు కథాస్థలం. ఈ గ్రామంలో బోయ, మాదిగ, వడ్డెర, కురుబ, దూదేకుల, చాకలి, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ కులాలు ఉంటాయి. రాజారెడ్డి, కొండారెడ్డి పెత్తందారులు. మిగిలిన బహుజనులంతా పీడితులు. పండుమేరు గ్రామంలో పండమేటి స్వామి సమాధి గుడిగా రూపొందింది. ఈ గుడికి  పూజారులు బోయలు. ఈ గుడికి 120 ఎకరాల మాన్యముంది. ఇది ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పటికీ ఆ ఊరి మోతుబరి రైతు రాజారెడ్డి ఈ మాన్యం మీద వచ్చే ఆదాయాన్ని అనుభవిస్తూ ఉంటాడు. ఆయన్ను ఎదిరించి బోయలు గుడిమాన్యం వేలం పాట కోసం ముందుకు రారు. వడ్డెర లోకప్ప ఒక రెడ్డి భార్యతో లేచిపోతాడు. లోకప్ప భార్య పాలమ్మ ఊర్లోని రెడ్లకు ఉంపుడుగత్తె అవుతుంది. దీంతో కొడుకు విరూపాక్ష కిరాయి హంతకుడుగా తయారవుతాడు. చాకలి గోవిందు కుల అవమానాలను తట్టుకోలేక కమ్యూనిస్టు గోవింద్‌గా మారిపోయి, బాగా సంపాదించి ఫ్యాక్షన్ రాజకీయాల బారిన పడి హత్య చేయబడతాడు. రాజారెడ్డి కురుబ తిరుపాలను చేరదీసి బహుజనుల మధ్య అగ్గి రాజేస్తూ ఉంటాడు. లింకుల చౌదరి పేదవాడు. అయితే స్వార్థపరుడు. తన అవసరం కోసం ఎంత నీచానికైనా దిగజారుతాడు. దూదేకుల కబీర్ అనే పేదరైతు భూమిని 'పీపుల్స్ వార్ గ్రూప్' వాళ్ళు దౌర్జన్యంగా లాక్కుంటారు. ఇవన్నీ నవలలో బహుజనుల జీవితాలను తెలియజేసే అంశాలు. పండమేటి గ్రామంలోని బహుజనుల జీవితాలు రాజకీయాలతో కూడా ముడిపడి కనిపిస్తాయి. థామస్ రెడ్డి మిషనరీల సహాయంతో బాగా డబ్బు సంపాదించటంతో అతని తమ్ముడు కొడుకు కొండారెడ్డి ఫ్యాక్షన్ నాయకుడౌతాడు. ఇతనికి ప్రత్యర్థి వీరప్ప నాయుడు. కొండారెడ్డి తన రాజకీయ బలానికి అడ్డుగా ఉన్నాడని వీరప్ప నాయుడిని చంపిస్తాడు. దీనితో వీరప్ప నాయుడి కొడుకు గరుడ శేఖర నాయుడు కొండారెడ్డిని చంపేస్తాడు. కొండారెడ్డి కొడుకు గంగుల రెడ్డి గరుడ శేఖర్ నాయకుడిని చంపడానికి ఉవ్విల్లూరు తుంటాడు. ఇక్కడ రెడ్డి, కమ్మ నాయకులకు చెందిన భార్యలు కూడా పురుషుల మాదిరే రాజకీయ ప్రత్యర్థులు. రాజారెడ్డిని విరూపాక్ష చంపేయటంతో మాదిగలు గుడిలోకి ప్రవేశిస్తారు. దీనితో రెడ్లు బడుగు బలహీన వర్గాల ఇళ్లను తగల బెడతారు. ఈ గొడవలో పూజారి భూమయ్య చనిపోతాడు. బడుగు వర్గాలు అందరూ ఏకమై గుడి మాన్యం వేలం పాటును వాయిదా వేయిస్తారు. లింకుల చౌదరి, మాదిగ పండమయ్య రాజకీయ ప్రత్యర్థులుగా ఎలక్షన్లో పోటికి నిలబడతారు. రచయిత పండయ్య గెలుస్తాడని, గెలవాలని కోరుతూ 'మీ రాజ్యం మీరేలండి' అనే నినాదంతో నవల ముగుస్తుంది. ఇందులో రాజకీయ నాయకులు, పెత్తందారులు తమ తమ అవసరాలకు, కుట్రలకు, కుతంత్రాలకు బహుజనులను బలిచేసిన సంఘటనలు, సందర్భాలు నవలలో చాలా వున్నాయి. కొన్ని సంవత్సరాల తర్వాత బహుజనులు ఏకమై వాళ్ళ రాజ్యాన్ని వాళ్లే పరిపాలించుకోవాలనే మార్పును నవల ద్వారా తీసుకు రావటమే రచయిత సంకల్పమని నవల చెబుతోంది. ఏది ఏమైనా బహుజనులంతా ఏకమై తమ రాజ్యాన్ని తామే

పాలించుకోవాలనే ఆలోచనకు రావటం గొప్ప పరిణామం. పండమేటి గ్రామంలోని బహుజనుల ఆధారంగా దేశంలోని బహుజనులందరినీ ఏకం చేయాలన్నది రచయిత దృఢ సంకల్పం.

అనంతపురం జిల్లాకు సంబంధించిన మరొక రచయిత శాంతి నారాయణ. 2000 సంవత్సరంలో ఈయన రచించిన నవల పెన్నేటి మలుపులు. ఇది బహుజన పోరాట నవల. అనంతపురం జిల్లాలోని చెన్నంపల్లి గ్రామం నవలకు కథా స్థలం. ఈ గ్రామంలో కురువ, వడ్డె, బోయ, ఈడిగ, ఉప్పర మొదలైన బహుజన కులాలతో పాటు దళితులూ నివసిస్తుంటారు. ఊరికి రెడ్డిరికం రామేశ్వర రెడ్డిది. చెన్నంపల్లెలో రామేశ్వర రెడ్డి రెడ్డిరికం పెత్తనం అతి దారుణంగా ఉండేది. ఆయనకు తప్ప ఊరిలో ఎవరికీ గౌరవం ఉండకూడదు, బాగా బతికే స్తోమత ఏర్పడకూడదు, అందరూ తనకన్నా తక్కువ స్థాయిలోనే బతకాలి అన్న ఆలోచనపరుడు రామేశ్వర రెడ్డి. రామేశ్వరరెడ్డి కొడుకు కొండారెడ్డి ఈ విషయంలో తండ్రి కంటే నాలుగు ఆకులు ఎక్కువే. రామేశ్వరరెడ్డి పెత్తనం చెన్నంపల్లి గ్రామంలోని ఏ కులాన్ని వదిలిపెట్టలేదు. గొర్రెలు, పశువులు మేపుకుని జీవించే కురవల పశు వుల్ని తనగాట్లో కట్టేసుకొని కురవలని బాధలకు గురి చేస్తాడు. యెడాదికొకసారి ఈత చెట్లు మీద పన్ను వసూలు చేస్తూ కూడా రెడ్డి అప్పుడప్పుడు అధిక పన్నులను వసూలు చేస్తుంటాడు. ఇదీ చాలక ఈడిగ సుంకన్న తన అవసరానికి రెండు గాడిదల కల్లు పంపిలేదని కుత్రతో ఈడిగలకు పోటీగా ఊళ్లో బోయల చేత సారాయి అంగళ్లను తెరిపిస్తాడు. దీనితో ఈడిగలు, బోయలు గొడవ పడి మనస్పర్ధలను ఏర్పరచుకుని గొడవలు చేసుకుంటారు. చెన్నంపల్లికి కొత్తగా బస్సు వస్తుంది. చెన్నంపల్లి నుంచి అనంతపురానికి బస్సులో ప్రయాణించేటప్పుడు రామేశ్వరరెడ్డికి చెన్నంపల్లి ప్రజలు ఎవరూ బస్సులో ఊర్లో ఇస్తున్న గౌరవం ఇవ్వరు. దీనితో రామేశ్వరరెడ్డి మండిపడతాడు. వడ్డె రామన్న కొడుకు లింగన్న తెలుగుదేశం పార్టీ సమితి సభ్యుడవడంతో తెలుగుదేశం పార్టీ సభ అనంతపురంలో ఉందని చెన్నంపల్లి ప్రజలంతా బస్సులో అనంతపురం వెళ్ళి పోతారు. అదేరోజు రాత్రికి బాగా వర్షం పడి రామేశ్వరరెడ్డి ఉల్లిపాయలు మొత్తం వర్షంలో తడిసిపోవటంతో రెడ్డికి రెండు లక్షల రూపాయిలు నష్టం వస్తుంది. దీనితో రెచ్చిపోయిన రామేశ్వరరెడ్డి అనంతపురం నుంచి మనుషులను పిలిపించి బస్సును తగలబెట్టిస్తాడు. పదవ తరగతిలో తమపిల్లలు ఫెయిలై, బహుజనుల పిల్లలు పాసైనారని చెన్నంపల్లిలోని హైస్కూల్‌ను తగలబెట్టిస్తాడు. ఇవేకాదు, రామేశ్వరరెడ్డి చెన్నంపల్లిలో వున్న బహుజనులను ఎంతోమందిని బాధిస్తాడు. రామేశ్వరరెడ్డి కొడుకు కొండారెడ్డి చెన్నంపల్లి పంచాయతీకి సభ్యుడిగా పోటీ చేసి దుర్గయ్య చౌదరి చేతిలో ఓడిపోతాడు. ఇది రామేశ్వర రెడ్డికి చెన్నంపల్లి ప్రజల మీద కోపాన్ని మరింత ఎక్కువ చేస్తుంది. చెన్నంపల్లిలో పీర్ల పండగ సందర్భంగా కొండారెడ్డికి, చెన్నంపల్లి బహుజనులకి జరిగిన గొడవలో కొండారెడ్డికి కత్తి దెబ్బ తగులుతుంది. రామేశ్వరరెడ్డి దీనిని సవాలుగా తీసుకొని ఊరి బహునుల మీద కక్ష కట్టి తన డబ్బుతో ప్రభుత్వాన్ని కొని పోలీసులను ఊరు నిండా దింపుతాడు. చెన్నంపల్లి బహుజన కులాల యువకులతో పాటు మరికొంతమంది మగవాళ్ళు భయపడి ఊరు వదిలిపెట్టి అడవులు పట్టి అజ్ఞాతంలోకి వెళ్ళిపోతారు. కొన్ని నెలలు గడుస్తాయి. ఊర్లో ఉన్న పెద్దవాళ్లంతా తమ స్థాయిని దిగజార్చుకొని రామేశ్వరరెడ్డితో సంధి సంప్రదింపులు జరిపినా రామేశ్వరరెడ్డి పారిపోయిన వాళ్లు ఊర్లోకి రావడానికి ఒప్పుకోడు. కురువ ఓబన్న తన అల్లుడు వెంగముని లాయరుతో మాట్లాడి లాయరికి యాభైవేలిచ్చి పారిపోయిన వాళ్లందర్నీ పోలీసులకు లొంగిపోనిచ్చి బైలు ద్వారా ఊరికి తీసుకొని వస్తారు. దీనితో మండిపోయిన రామేశ్వర్‌రెడ్డి రెచ్చిపోయి బహుజను లను ఇంకా బాధలుపెడతాడు. చివరికి బహుజనులంతా ఏకమై బండయ్య అనే గ్రామ సంరక్షణ సమితి నాయకుడిని కలుసుకొని అంతా ఒక పథకం ప్రకారం రామేశ్వరరెడ్డి బంధువులతో సహా ఓబులం వెళ్తుంటే దారిలో రెడ్డిని బంధువులతోసహా కిడ్నాప్ చేస్తారు. దీనితో రామేశ్వరరెడ్డి భయపడిపోయి కలెక్టర్ సమక్షంలో తన ఊళ్లోని జనం ముందు తప్పులన్నీ ఒప్పుకొని నష్టపరిహారాన్ని కట్టించి చెన్నంపల్లిని వదిలి వెళ్ళిపోతాడు. చెన్నంపల్లి ప్రజలంతా కొత్తగా ఉగాది పండుగను జరుపుకుంటారు. నవల

ముగుస్తుంది. బహుజనులైన కురవ, వడ్డె, బోయ, ఈడిగ, ఉప్పర మొదలైన కులాలకు చెందిన బహుజనులంతా ఏకమై తన అభివృద్ధికి ఓర్వలేని రామేశ్వరరెడ్డిని కలిసికట్టుగా ఒక పథకం ప్రకారం ఎదుర్కొని విజయాన్ని సాధించి ఊరు నుంచి వెళ్లగొడతారు. ఈ బహుజనుల విజయం నిజానికి చెన్నంపల్లిలోని పెద్దలది కాదు. చదువుకున్న యువకులది. మారుతున్న కాలంలో చదువుకున్న కొంతమంది యువకులు తమ అస్తిత్వాన్ని కాపాడుకునే ప్రయత్నంలో తమ పెద్దలను కాలాను గుణంగా మార్చి తమదారిలో నడిపించుకొని పెత్తందారుల దౌర్జన్యాన్ని, దోపిడిని అడ్డుకుని చివరికి విజయాన్ని సాధిస్తారు. పెన్నేటి మలుపులు నవల బహుజనుల తిరుగుబాటుతో సాధించిన విజయానికొక జ్ఞాపిక.

కడపజిల్లా నవలా రచయిత నన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి. ఈయన 2019లో రచించిన బహుజన నవల కొండపొలం. మేకలు, గొర్రెలు మేపుకొని జీవించే వారి జీవిత కష్టాలను వివరించిన నవల ఇది. ఈ నవలలోని రవి, పెద్ద పుల్లయ్య, గుర్రప్ప, అంకయ్య, పిచ్చన్న, రామచంద్ర, పాములేటి, మునెయ్య, తిరిపేలు, రామయ్య, భాస్కరు, శీను మొదలైన ఇరవై కుటుంబాలకు చెందిన వారంతా బహుజనులే. వీళ్లందరి జీవన విధానం మేకలు, గొర్రెలు మేపటం. గొర్రెలను, మేకలను మేపే విధానంలో ఉదయం తోలుకెళ్లి సాయంత్రానికి ఇంటికి చేరటం ఒక రకం. వారం పదిరోజులు మేపటం రెండవ రకం. ఇలా కాకుండా కరువుకాలంలో జీవాల మేత కోసం అడవిలో ఎక్కడో చినుకులు పడి నీళ్లు, గడ్డి దొరికే అనుకూలమైన తావులకు వెళ్ళి అక్కడ మేపటం మూడోరకం. గొర్రెలు, మేకలు మేపుకునే వీళ్లంతా మూడు నెలలపాటు వాటిని అడవిలో మేపుతూ, వాటితోపాటు జీవిస్తూ వాళ్లు అనుభవించే అనేకరకాలైన బాధల చిత్రీకరణే కొండపొలం నవలా ఇతివృత్తం. సాధారణంగా బహుజనులపై అగాయిత్యం చేసే పెత్తందారులెవరూ అక్కడ వుండరు. అయితే అడవిలో వీళ్ళకెదురైయ్యే పెత్తందారులు మరోవిధంగా వుంటారు. వాళ్లు చిరుత, ఎడగండు, పెద్దపులి లాంటి క్రూరమృగాలు. వీటితోపాటు ఎర్రచందనం దొంగలు, సారాయి కాచే వాళ్ళు, గంజాయిని పెంచే వాళ్ళు మొదలైనవారంతా వీరిని బాధించే పెత్తందార్లు. వీళ్లందరితో పోరాటం చేస్తూ, జీవాలను కాపాడుకొని ఎవరి పల్లెకు వాళ్లు చేరుకోవాలి. బహుజనుల జీవితాలు ఎక్కడున్నా బాధలతో కలిసి జీవిస్తుంటారనే సందేశం ఈ నవలలో వుంది. ఈ నవల బహుజన పోరాట నవల కాదు. బహుజనులలో ఒక తెగవారి జీవిత నేపథ్యాన్ని తెలిపే నవల. కాబట్టి ఇది బహుజన నవలే. తెలుగు నవలా సాహిత్యంలో చాలా అరుదైన నవల కొండపొలం. ఇది సీమ నవల కావటం విశేషం.

పీడితులై వుండి వెనుకబడిన వారంతా బహుజనులని మేధావుల తలంపు. ఇప్పటివరకూ చెప్పుకొచ్చిన నవలలన్నీ ఇలాంటి బహుజనుల జీవిత పోరాటానికి చెందిన నవలలు మాత్రమే. బహుజనులలో ప్రత్యేకంగా ఒక కులం, ఒక వర్గం నుంచి వస్తువును ఎంచుకొని ఆ జీవిత సారాంశాన్ని చిత్రించే నవలలు రావాల్సిన అవసరం వుంది. ఇలా ప్రత్యేకంగా చిత్రించిన నవలలన్నీ ఏకం చేసుకుంటే ఈ సమాజంలోని బహుజనుల జీవితం అర్థం అవుతుంది. అదొక బహుజన ఉద్యమ సాహిత్యంగా పరిగణింప బడుతుంది. రాయలసీమ బహుజన జీవితాలను చిత్రించిన కేశవరెడ్డి, రాసాని, స్వామి, శాంతినారాయణ గార్ల నవలలు బహుజన జీవితాలలోని పోరాటాన్ని తెలియజేశాయి. ఇది తెలుగు బహుజన సాహిత్యానికి ముందడుగుగా భావించాలి. ఈ నవలా రచయితలలో కేశవరెడ్డి, నన్నపురెడ్డిలను మినహాయిస్తే మిగిలిన రచయతలు బహుజనులే. అందువల్లే బహుజన జీవితాలను అత్యద్భుతంగా తమ నవలల్లో చిత్రించగలిగారు. వీరు బహుజన ఉద్యమసాహిత్యానికి మొదటితరం. ఈ రకంగా రెండవతరం మొదలు కావాల్సిన అవసరం వుంది. బహుజనులందరినీ సాహిత్యం ద్వారా ఏకం చేయాల్సిన బాధ్యత రచయితలదేనని ఈ నవలలన్నీ చెప్పకనే చెప్పాయి. ఇది రాయలసీమకే పరిమితం కాదు బహుజనులున్న ప్రతి ప్రాంతానికీ వర్తిస్తుంది.

డా. పొదిలి నాగరాజు
తెలుగు అధ్యాపకులు, కడప, ఫోన్ : 9052038569

## పతివాడ సూర్యనారాయణ ఓ గోదారి నాటకరంగపు అల,
## ఈ మేడమ్ టుస్సాడ్ మిసిమిలో చెక్కిన ఓ మైనపు శిల !

"11.5.2025 మీరు బుకింగ్, రాంబాబు గారికి కొల్లూరు నుండి దగ్గర, మనమిద్దరం సి.ఆర్.ఫౌండేషన్ నుండి ఉదయం 10 గం.కు వెళ్లదాం" అంతే ఒక మెసేజ్ పెట్టి, ఎవ్వరిని? ఎందుకు కలవాలని ప్రశ్నలు వేయరాదు-నన్ను-నా చేతలను బడిగా ఎప్పుడూ చేసే ఎ.కె.సార్!.

'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్-హిచ్ కాక్'ని రవిపాడి-పులగం కొత్తవంటగా ఏకదాటిన తినేసిన భుక్తాయాసంలో "హాలీవుడ్ నటి 'టిప్పి హెడ్రన్' రాసిన తెలియని కాంట్రాక్ట్ ఇంకా ఈ పదాల 'రిచ్ కాక్' తో బాకీ-నా రామనామంగా ఉన్నదా? అద్దంలో ఏమి కట్టుకొన్నానో కనులతో-ఏమి కొట్టుకొన్నానో వాసనలు కన్ఫర్మ్ చేసుకొని (లేకపోతే మరల మేకప్ చేయక వదలరు-**మిసిమి** బ్రాండ్ తగ్గరు- ఎ.కె) సి.ఆర్.పౌం గేట్ దగ్గర మా దార్శినికుని కలుసుకొన్నాను. "కూడా కాయలు తెచ్చుకోమని డబ్బులు నేను ఇచ్చేస్తాను (పాపం మరిచినారు అనుకోని వరదానందంలో) భోజనాలు అక్కడేయని ఆ పెద్దాయన పదేపదే ఫోన్ చేస్తున్నారు, మీకు తెలియదు కదా! ఆయనకు 96 ఏండ్లు" అశ్విని క్యాబ్‌లో కూర్చోగానే అన్నారు. కాయలేమిటి! పండ్లు కొందామా అనే నా కనులకు మీరు ఓ స్వీట్ పాకెట్ కొనండి-మౌనంగా మర్యాద పాటించండి-ఈ కొనసాగే హిచ్ కాక్ కెరటపు సస్పెన్స్.

నార్సింగ్ అపార్ట్ మెంట్ బిల్డింగ్స్‌లో బందీని కాను, నేను మీ సంబంధీననే కనులతో, నటనలేని ప్రేమఘటనతో నడుచుకొంటూ-తోడున్న సేవకరాలను తప్పుకోమని-'రండి రండి' యని కట్టుకొన్న పంచె ఒక చేయితో పట్టుకొని ఆహ్వానించారు-నాకు తెలియని శ్రీ పతివాడ సూర్యనారాయణ గారు. హాలులో వద్దు! యని ఎ.సి గదిలో కూర్చోబెట్టారు. రాంబాబు గారు వచ్చేలోపు-నన్ను మా వూరు పిప్పర-పగోజీ.గా పరిచయం చేశారు-ఎ.కె.

* * *

"అన్నట్లు పిప్పరంటే ఓ అమాయకుడు **మిసిమి**లో రాసేవాడు ఆయన తెలుసా? మీకు?" అని అడగ్గా-రెండవసారి నా బల్బ్ వెలిగి-ఆగి, అది 'నేనే' అన్నాను-గతంలో" కాంగో"లో పనిచేసినవాడిగా.

**మిసిమి** చాలాకాలంగా కొత్తఇంటికి వచ్చాక రావడంలేదు, మరల పంపించగలరు యని ఎ.కె నుండి మాట తీసుకొన్నారు. ఈ లోపు సి.యస్.రాంబాబు గారు మమ్ములను జాయిన్ అయ్యారు. తమ యధాతథపు ఇంటర్వ్యూ రికార్డింగ్ సెటప్ చేసుకొన్నారు. ఆ విశేషాలు మరోరూపంలో రావొచ్చు. ఇలాగున "ఇక వ్రాయను-తెలుగు రాయనుకాక-నేనుమోయను- నేను ఒక మామూలు 'రాయి'ను" ఎ.కెతో విన్నవించుకొన్నా-ఈ 'పతివాడ'సాధన చేసిన వృత్తి జీవనంలో ఏదో సంవృత్తి, తనప్రవృత్తి నాటకరంగ గమనంలో మేధో నివృత్తి. కాటనుదొర కట్ట దాచుకొని వదిలిన గోదారితరంగాల తీరపు పసిడి మట్టి రజనపు తొంభై ఆరు వసంతాలమాలలో నిజపువజ్రంలా మెరుస్తున్నట్లు అగుపించడం మూలాన మరల నా పదాల వలుగుతో చదువరులకు మరో మూలుగు తేబోతున్నందులకు మన్నించగలరు. అలా ఆయన చెదురుతున్న తెల్లని పంచె ఎ.కె సర్దుతూ ఉంటే, తన గత కళానాటక రంగంలో దాగిన కొంత నిజజీవితపు ప్రజ్వలించే పటకం కాంతులుగా కొన్ని **మిసిమి** టీంకు దర్శింపజేయగ రాయక తప్పవలదు.

"చిత్తము చిత్తము" తెరవెనుక పలుకే కదా, అయ్యా! నేనూ నాటకం వేసేస్తాను-పదేపదే పదేళ్ళ పసివాడు పంచెకడ్డుగా తగులుతుంటే-ఆంధ్రా నేతాజీ 'మద్దూరి అన్నపూర్ణయ్యగారు' ముద్దుగా ఈ సూర్యనారాయణకు నాటకనాందీ ప్రస్తావన చేయించక తప్పలేదు. అదే పసివాడు ఆ పై ఒక వాడకే పతిగా (రాజమండ్రి పట్టణ ప్రముఖుని అల్లుడిగా) 1929లో తనతో పుట్టిన ఆంధ్ర నాటక కళాపరిషత్‌లో నాటక రంగ ప్రవేశం. స్వేచ్ఛకై రగులుతున్న దేశభారతిలో విప్లవవీరుడు అల్లూరి శ్రీ(సీతా)రామరాజు క్లాన్ మేట్ వెలిగించిన శివ్య పరమాణువు. ఇక కదిలిన ఆగని ఆ సూర్యనారాయణ జీవితం, రగిలిన నాటకరంగం-ఇక్కడ కదలని మైనపు శిలగా మన **మిసిమి**లో వెలిగించే ప్రయత్నమే-ఈ మేడమ్ టుస్సాడ్ చిత్రణ/ఆవిష్కరణ. **మిసిమి**లో ప్రతి నెల ప్రతిబింబించే ప్రతి పెద్దాయన జీవితం ఒక మైనపు శిలయే. ఆ కరిగిన కాంతులలో మనకు తెలియని

విశేషాలు ఒకో ఆస్కార్ వైల్డ్ అగాధం నుండి ఎడిటర్ ఎ.కె & క్రెడిటర్ రాంబాబుల పదాల ప్రచురణలతో చదువరులు చలిస్తూనే ఉన్నారు.

కొన్ని చీకటిలో దాగిన ఈ కాంతిరేఖలు తన జీవితనాటక హారతి నుండి మీ వైపు తిప్పుతున్నాను. కొన్ని నిజాలు కాలేటట్లుగా తగిలితే-మన్నిస్తూ ఓ 'పతివాడ' నాటకంలో కల్పితంగా భావించగలరు-ఇవి ఆ కీర్తిశేషుల వ్యక్తిగతం కాదు- అలసిన పున్నమి చందమామలో నల్లని మచ్చలు రాకమానవు-ఓ **మిసిమి** చదివేమామ!.

* * *

ఇప్పటకీ తెలియని 'గిల్ట్'తో తపించే గురువు అన్నపూర్ణయ్య నామం. 'తెలుగు నేతాజీ స్వేచ్ఛా భారతికై తన త్యాగపు జీవిత పోరాటహారతి-గోదారి కెరటాలలో ప్రతిపడచు వదిలే-ఆ కొట్టుకొనిపోయే కార్తీక దీవపుమాల ఆ 'అన్నపూర్ణయ్య మద్దూరిని మన్నించమని ధరింపజేయడానికే వాటి ప్రతిఏటా విన్నపాల ప్రయాణం!'. పతివాడ వ్రాసిన 'రాజమహేంద్రవరం నాటకరంగం'లో బోలెడు కాటను ఆనకట్ట దాచిన గోదారివరద నాటక నటులపన్నీరు. 'పతివాడ' ఇలా కొన్ని చిత్తగించారు: మొదట తెలుగు విప్లవ నాటకం-'చిచ్చుల పిడుగ 'రాజమండ్రిలో మద్దూరి అన్నపూర్ణయ్య గారు ఎడిటర్గా 1929లో తను స్థాపించిన 'కాంగ్రెస్'పత్రికలో పబ్లిష్ చేయించి కఠినకారాగార శిక్ష అనుభవించారట. వ్రాసింది వారి సహచరులు 'రామచంద్రుని వెంకటప్పగారట! నీకు భవిష్యత్ పాడవుతుందని-ఆ దేశప్రేమ నేరం తన పైన వేసుకొన్నారు. ఫలితం మొదట 14 నెలలు మొత్తం 14 సంవత్సరాలు కఠిన కారాగార జీవితం. తెల్లవారు చీకటి నుండి తెల్లారిన తెలుగు భారత గడ్డపై కడుపేదరికంతో ఆ నిష్కళంకుడు కాలం చేయడం-మనం సాధించిన ఇప్పటికీ తీరని దారిద్ర్యం. విప్లవ వీరుడు 'అల్లూరి'ని కాల్చితే మరణించి మనం కట్టే విగ్రహాలలో ఇంకా కష్టపడి నిలబడుతున్నాడు. తన క్లాస్ మేట్ ఆ 'అన్నపూర్ణయ్య మద్దూరి' తెల్లవారి కారాగారంలో కాలీకాలక స్వాతంత్ర సిద్దితో లాబీయింగ్ పార్టీ సింగింగ్/ స్వింగింగ్ చేయక క్షణపుకాలంలో కరిగి పోయాడు.

ఓ పెద్ద పత్రికాఫీస్లో 'ఖాస్సా సుబ్బారావు' గారంతాయన "గురువుగారు మీరు రావాలా! ఏమి కావాలంటే? "మా సూర్యనారాయణకు 12th పాస్-23 వర్షాలుగా డింకీలుకొట్టి నిలబడ ప్రయత్నిస్తున్నాడు, ఏదన్నా వృత్తిలో పెట్టగలవని"-అప్పటికే పట్టణప్రముఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్ -ధనిక రాయలసీమ రెడ్డి గారమ్మాయితో ప్రేమపెళ్లి ప్రక్రియలో పతివాడ కాబోయే భార్యను పోషించే పౌరషంలో ఉన్నారు. అదే ఆఫీస్లో "ఆమె తెలుసా రా! మన అచ్యుత రామయ్య కూతురు? అదేనయ్యా! పేపరులో వార్తగా సాగిన ఒక తెల్లవాడు ఇరుకు కేస్లో పాపం అమాయకంగా ఇరుక్కొన్న గుమాస్తా గిరికేసు ''-నమస్కారాలతో పలకరించిన -ఆ రామలక్ష్మి గారి తో(?) "అమ్మా జాగ్రత్తగా ఉద్యోగం చేసుకోయని, నీకు వేరే అవకాశం మగవాడిగా చూద్దాం యని 'పతివాడ'ను తీసుకొచ్చేసారట.

ఆ పిదప మామ గారు & తోడల్లుడు ప్రోత్సాహంతో కావలసిన డిగ్రీ మరియు పోటీ పరీక్షల ద్వారా కమర్షియల్ టాక్స్ ఆఫీస్లో వృత్తి జీవితం. మద్రాస్ నుండి హైదరబాద్ (1953) త్రిపురనేని గోపిచంద్ ప్రక్కింటివాడిగా ఓ సమర్థుని జీవితయాత్ర కొనసాగిస్తూ-ఇప్పటికీ మైనపు ఒత్తులా కరగుతూ **మిసిమి** టీం తో గలగల గోదారి పుట్టిన ఎదపద ప్రహసనాలుగా పంచుకొన్నారు.

'గ్లామరస్ గోపీచంద్' చిక్కడపల్లి సంతకు తోడు పతివాడను తప్పక తీసుకొని వెళ్లేవారట. పంచె గోచకట్టులో కూరలు బేరం ఆడుతూ కొసరుఅంటూ 'కొన్ని' తన గోచకట్టులో వేసుకొంటూ ఉంటే "అయ్యా అదేమీ రాచఘోరం, అవేకదా మాకు లాభం" అమ్మేవారు అనడం. "వాటితోనే మా ఇంటికూర రుచి రా"యని కళాత్మకంగా నవ్వుకొంటూ కొనసాగేవారట.

ఒకసారి ఓ వనిత రమాదేవి గారు మన పతివాడకు 'లా' కాలేజి క్లాస్ మేట్ ( ఆ పైతరంలో కర్ణాటక గవర్నర్ గిరి ఎక్కారు) గోపీచంద్ గారికి తను వ్రాసిన "విరిగిన కుర్చీ "మరియు ఓ "కవి' పుస్తకాలు ఇచ్చి పంచుకోమన్నారట."

"ఏమయ్యా సూర్యం! నీవు చదివే ఉంటావ్, ఏమి అవేమి టైటిల్స్! నీ అభిప్రాయం ముందర చెప్పవోయ్-'నటుడిగా కాదు- నిక్కర్చోయ్!"

'పతివాడ' ఇదిగో మంగళ హారతి గైకొనుమా అంటూ "ఆ విరిగిన కుర్చీపై కవిరాజు పుత్రుడు-మీరే ఆ గోపీచందులన్నారట".

"ఏమి ప్రహసనం చేశావయ్యా! మరీ గోదారి గట్టుపై నాతోనే వెటకారంతో శీర్షాసనం వేయించావు" నవ్వులతో పొంగారట. (తెనాలి చావడి దిమ్మ పై గోపీచంద్ లేనివారిపై వేసే సెటైర్లకు భయపడి తమ సైకిళ్ళ టైర్ల

పగిలాయని ఎవ్వరూ చివరివరకు కదిలేవారు కాదట- ఎ.కె తో పాత తరం తెనాలి గాలి పీల్చిన వారన్నారట).

* * *

"Déjà vu" (డెజావు): మొన్ననే **మిసిమి** గ్రంథాలయంలో 'కేరాఫ్' రచయిత త్రిపురనేని సాయిచంద్ తమ తాత తల్లితండ్రుల స్మృతుల పుస్తకం చదవడం-నిన్ననే ఎ.కె నన్ను పరిచయం లేని పతివాడతో పసివాడి ప్రేమగా గోపీచంద్ గారి కబుర్లు-ఈ కాంక్రీట్ గుబుర్లలో పంచుకోవడం-అమరజీవి గోపీచంద్ గారితో కబుర్లు చెప్పుకొన్నట్లుగా ఉన్నది!. రాజమహేంద్రవరం నాటక రంగస్థలం-మరో మాయామశ్చీంధ్ర ఇంద్ర జాలం! జీవితం వేరు-నాటకం వేరు కాదు- షేక్స్ స్పియర్ అల్ వేస్ ఎట్ అవర్ రెయార్ (Rear) (Our life and drama -never separated -our very monolithique at our rear). పతివాడ సూర్యనారాయణ గారు నాటక రంగంలో ప్రత్యేక పాత్రలు ప్రవృత్తిగా పోషణకళావేశం-ఎంతో సునాయాసం యని తమ 96 మనస్సు/వయస్సు అలల సరస్సులో **మిసిమి**తో మరీ ముసిముసి ముచ్చట్లగా ఎంతో మర్యాదగా పంచుకొన్నారు. తెలుగు నాటకరంగం- కన్నడ దార్వాడ నాటక సంఘం రాజమండ్రి తాటియాకు పాకలోనే వదిలిన-ధాన్యం పాకల వద్ద మనవారు కాపీ పేస్ట్ (వీరేశలింగం పంతులు శిష్యగణం) అనుకరణతో అవతరించి-ఆ పై రంభ/ఊర్వశీ/ మేనక చలన చిత్రశాలలుగా తరింప, చివరికి ఇప్పుడు మనమన హస్తాలలో మన మనోమాయగా(మొబైల్) గుంజుతున్నది.

అన్నట్లు "మనిషన్నాక కొంచెం కళాపోషణ ఉండాలన్న" తిరుగులేని సినీ కళాకారుడు రావుగోపాల్రావు గారిని-ఈ పతివాడ 'కీర్తిశేషులు' నాటకం ద్వారా పరిచయం చేసారు. తను జీవించినంత కాలం-నిక్కార్సుగా ఏ ఖరుసు చూపక "గురువుగారని పతివాడకు మర్యాదలు చూపించిన మంచి శిష్యపరమాణువు - రావుగోపాలరావు!

విభిన్న సినీ దర్శకులు సింగీతం శ్రీనివాసురావుగారు మన 'పతివాడ'తో మద్రాసులో సహోద్యోగి. కారులో మద్రాసులో తిప్పేవారట. ఇంకా చాలా నాటక-సినీ రంగంవారు-వీరితో కలసిమెలసి తిరిగేవారు. సినీ నటి జయప్రద "మావయ్య గారని" ఇప్పటికీ పలకరించే మర్యాదస్తురాలు. పతివాడకు కుటుంబపు ఆప్తులు. డా.కొత్తపల్లి వీరభద్రరావు (శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారి-ఇలీట్ అల్లుడు) వీరికి వ్రాసిన ఒక లేఖ-మన రాంబాబు గారు **మిసిమి** ద్వారా బహుశా పంచుకోగలరు.

అందరూ ఒక ఎత్తు, 'బావా' యని పిలుచుకొనే కళావాచస్పతి కొంగర జగ్గయ్యగారు ఆకాశపుటంచు బహుళ అంతస్తు.

ఒకసారి **మిసిమి** కళాజ్యోతి వ్యవస్థాపకులు శ్రీ ఆలపాటి రవీంద్రులు తెనాలి సమావేశంలో-ఏకవచనంతో" ఏం జగ్గయ్యా! యని పలకరించడం-'సార్'యని జగ్గయ్య నిలబడి అనడం-ఈ పతివాడ కళ్ళార తిలకించారట- ఆ తెనాలి కళలహోలీ జాతరలో.

మద్రాసులో జగ్గయ్య ఎం.పి హోదాలో నుండగా పోలీస్ స్టేషన్ నుండి ఓ కాల్ వచ్చిందట- "బావా సూర్యం! కాన్ఫిడెన్షియల్ మేటర్ ! ఒకసారి ప్లీజ్!-ఎప్పుడు ఎక్కడ పారని వాటర్ గా కొంచెం మన 'అంజలిని' విడిపించు"- తన అజ్ఞాతపు అధికారాన్ని గోప్యంగా వాడుతూ అన్నారట. తిరుపతిలడ్డు చిదిగినట్లుగా మన రాంబాబు జుగుప్సా ముఖకవళికలలో-ఏదో వాకిట్లో సీతమ్మ అంజలి అమలాపురం కాదుకదా సుమీ! సముదాయించుకొనే తరుణంలో, "నటినర్గీస్ పై లండన్ పోలీస్ కేస్ బుక్ చేస్తే మన అంబాసిడర్ నట్వర్ సింగ్ ఆవగింజంత పుకారు గుంజకుండా కాపాడినట్లు తన స్వీయ చరిత్రపు (Profiles & Letters) వ్యాసాల సంపుటి కుంపటికి ఇప్పుడు ఎవరూ నిప్పు రగిలించలేరు కదా"యని నే ధైర్యమిచ్చాను. అలాగే ఎటూ మన లవకుశ సీతపాత్ర తెలుగు అంజలి నిజజీవితం సాయిబాబాకే అంకితం. నిజంగా ఆ'రూథర్ ఫర్డ్' కాపాడాడు అప్పుడు అల్లూరిని షూట్ చేయించినా- వ్యక్తిగా తెలుగు గౌరవం తదుపరి తరాలు తలఎత్తు కొనేలా చేశాడు. కళావాచస్పతి ఎంతైన రవీంద్ర గీతాంజలిని తెనిగించిన సరస్వతీ పుత్రుడు. కనుక అబల నటి అంజలికి కొండంత అండ అయ్యాడు. ఎంత విన్నవించుకొన్నా శ్రీ రాంబాబు భోజనం చేయకుండా-చుట్టాలొచ్చారంటూ కంగారుగా వదిలి తమ కొల్లూరు కోటకు మాయమయ్యారు.

* * *

"అపహృత స్త్రీ" 1948లో పతివాడ తన 18 సం టీనేజ్ వయస్సులో దేశవిభజన నేపథ్యంలో నవల వ్రాయగ శ్రీ వి.ఆర్.నార్ల తనే టైటిల్ నామకరణం చేయడం విశేషం. అనేక విషయాలు విచ్చలవిడిగా వదిలిన గోదారి గలగళంగా మాట్లాడుతూ ఎన్నాళ్ళు అయినాయాని అశ్వినీ సార్‌తో ఎన్నికృతజ్ఞతలు ఎలాచెప్పాలో యనే పక్రియలో- అంత హుషారు తన మారిన ముఖంలో మరో యువకుని గాంచవచ్చును. ఈలోపు "మధ్యాహ్నం '1' గంట దాటింది, అయ్యగారు 12 గం లకే భోజనం ముగించే

సమయం, కొంచెం గుర్తు చేయగలరు" 24*7 పతివాడ సేవకరాలు 2వసారి విన్నపం.

'ఆయన బ్రాహ్మణులు ఏమోయని భోజనం వేరేగా మామిడికాయ పప్పు&రసం చేయించా, మధ్యలోనే మజ్జిగ త్రాగి వెళ్ళిపోయారే! "పదేపదే పతివాడ అంటూ ఉంటే–" "కాదు ఆయనకు చుట్టాలుముట్టారు తప్పక వెళ్ళే పరిస్థితి" నేనన్నాను. "చికెన్ మీరే తినాలి మీ ఊరు పిప్పర వచ్చేవాడిని అప్పటి సాంస్కృత శాఖామాత్యులు 'ఇందుకూరి రామకృష్ణంరాజు' గారిని అనేకమార్లు కలిశాను. ఆయన ఆజానుభాహులు ఆరున్నరడుగులు పైనే ఉంటారు". మా ఊరు ఆర్య వైశ్య ప్రముఖుల పేర్లు చెబుతూ తుమ్మలపల్లి వీరభద్రం ఆంధ్రాబ్యాంక్ స్థాపిత బోర్డ్ మెంబరు అన్నారు. "మీరు అమాయికులు" మరోమారు నన్ను అన్నారు, కాదు "అమాయిక చక్రవర్తులు" అశ్విని గారు అదునుగా నన్ను రాంబాబు వదిలిన ఒంటరిగా రాగింగ్ చేస్తూనే ఉన్నారు. గరికపాటి రాజారావు ప్రజానాట్యమండలి "నీవు మమ్ము వదిలి ఆ బేపనోళ్లతో తిరగడం బాగాలేదని" పదేపదే 'పతివాడని' పాడుకొనే వారట. ఏమి కులాలో! కన్నీళ్ళతో "కాటనుదొర ఆనకట్ట గోదారికి కట్టి ఎక్కడ శ్రీకాకుళం – ఎక్కడ నెల్లూరు మా పూర్వీకుల దారులన్నీ రాజమండ్రికి త్రిప్పి అటుఇటు గ్రామాల్లో స్థిరబడేలా నిలబెట్టాడు. ఇప్పుడు తన కుటుంబంలో ఏడువర్ణాల ఇంద్రధనుస్సు మిశ్రమం–కాకపోతే ఒక మనవడు 'అమెరికన్', కాని 'ట్రంప్' కాదు మంచి వినసొంపులున్నవాడు–తెలుగుపంచకట్టుకొనేవాడు" అంటూ తమ గురుతుల్యులు తెలుగు నేతాజీ 'మద్దూరిని ముద్ద మింగలేక తలుచుకొనే ఉన్నారు."అన్నపూర్ణయ్య ఆయన నామం అయినా అన్నం లేక కాలారు".

'నాటకరంగం, రాజమహేంద్రవరం, గోదారితీరం, వీరేశలింగం, తెలుగుకేసరి ప్రకాశం' అన్నీఎక్కువే–మరి "గోదారి మెరక & ఇసుక వీధుల విధులేమిటి!" అమాయకులన్నారుగా ఎటాయని ఏ వేషం వేసుకోకుండా అడిగేశాను కిచెన్లో పరిచారిక నిద్రావస్థలో మునగడం గమనించి.

"వారు గోదారి మళ్లించిన కళల అలలు, కదిలే అప్సరసల శిలలు, ఎన్నో సాంఘిక కట్టుబాటల పూలమాలలు" అదే వీధుల్లో పెరిగిన 'పతివాడ' పసిడి పసివాడి మాటల మూటలు–అభివృద్ధి వరదల్లో కొట్టుకొని పోయిన మన తాతల భోగపువైభవం చెబుతూ "మండపేటలో ఒక పురప్రముఖుడు పెంచుకొన్న (ఉంచుకొన్నని–పెంచుకొన్ననే అనే పదం గా వాడారు) ఆమె తనకు రాసిచ్చిన ఏవదాస్తి ఆ ప్రముఖుని కొడుకు ఉన్నదంతా తగలేస్తే–ఈమె ఆయన మనవడికి చెందేలా తన ఆస్తిని తిరిగి ఇచ్చేసి బౌద్ధ సన్యాసిని లా కాలం చేసిందట."మోసాలు ఎరగరు మనుషుల వేషాలు వేయకుంటే–అవే మా రాజమహేంద్రవరపు భోగపు తరం–నిప్పునీరు గా' వివరించారు.

"ఇప్పటిలా బ్లాక్ మెయిళ్లు లేవు–అన్నిరైళ్లు గోదారి స్టేషన్ వైపు పరుగులే–పబ్లిక్ మల్లెల బ(బె)యిళ్ళే! "అసూయపడేలా నన్నురగిలించి వదిలారు. అలసిన అశ్విని తేలుకుట్టిన మాధవడిలా తను గోదారి పంచవటిలో అతిథి మర్యాదలు స్వీకరించిన వాడిగా/వాడనివాడి పోజులో ముసిముసి **మిసిమి** నవ్వులు వెదజల్లుతున్నారు.

* * *

"భీమవరం గన్నాబత్తుల వారు తెలుసా"యని అడిగారు. డి.యన్.ఆర్ కళాశాల ప్రాంగణంలో గన్నాబత్తుల వారి ఆటస్థలం నా జ్ఞాపకంగా 'ఊ' కొట్టాను. ఎంతో కళారాధకులు మరియు స్వేచ్ఛా పోషకులు–అబ్బో మా క్షత్రియకులం తక్కువచేసి కొన్ని ఇక రాయలేను. కొన్ని దిగమింగక తప్పదు. ఇప్పటి తరం జెన్–జెడ్ ఏమీ విలువలు పాటించడం లేదని సోది చెప్పనవసరం లేదు. వారు పాడవలేదని Geriatric trend గ్రహించ గలరు. గోదారి కొత్తనీరు పాత నీటి రిసర్కులేషను మాత్రమే. మరో గౌతముడు మరో భగీరధులవసరం లేదేమో యని–శ్రీ పతివాడ సూర్యనారాయణ మైనపు శిల ప్రక్కన 'సెల్ఫీ' దిగి–నా సెల్ఫ్ గల్ఫ్ (అగాధం అంచు) నుండి కిక్క్ ఆఫ్‌తో ఏదో తెలియని రిలీఫ్‌తో **మిసిమి** ఎడిటర్ గారికి కృతజ్ఞతలతో చదువరులకు శ్రీ "పతివాడ ని కొంచెం ఓ పసివాడిగా సృష్టించిన ఈ "మేడమ్ టుస్సాడ్స్–**మిసిమి** లో చెక్కిన ఓ మైనపు శిల" గా దర్శింప చేయ ప్రయత్నం. కొసమెరుపుగా మమ్ము వదలక వదిలారు శ్రీ పతివాడ సూర్యనారాయణ గారు, అయ్యా! మీరు మరల ఒకసారి గండిపేట తమ విల్లాకు వచ్చి రోజంతా గడపవలెనని **మిసిమి** టీంని ఆహ్వానించారు. తను చేసిన తేనీరు (టీ) మేము త్రాగి వస్తూ వుంటే ఆ పరిచారిక "అయ్యా! మీ రెవరు? ఏ ఊరు నుండి వచ్చారు. అయ్య గారిని ఎప్పుడిలా ఇంత ఉత్సాహంగా చూడ లేదు. నాతో ఎన్నడు మాట్లాడడు!" అన్నీ ఇంతంత కొండంతగా ఒకేసారి మురిసి పోవడం – మాయగా ఉన్నదని – తన పేరు 'కోమలి'గా అశ్విని గారితో తన వంట బాగుందని–షేర్/లైక్

అనిపించుకొన్నాక,'పతివాడ' శతజయంతి ఆమె బాధ్యతకు వదిలి తిరిగి ఇంటికి చేరాము.'మే11'గా సోషల్ మీడియాలో తల్లికి వందనం - మదర్స్ డే గా ప్రపంచమంతా కుందనాల టన్నుల ప్రేమ కన్నతల్లి పై చూపించు కొంటున్నారు. 2012లో, రాజమండ్రి దానవాయి పేట ఆసుపత్రి లో మరో రెండురోజులకు చనిపోయే తరుణంలో "పెద్దవాడా ఇక్కడ ఇడ్లీలు చట్నీ బయట చిన్నహొటల్‌లో నేను చూశాను నీకు నచ్చుతాయి-ఎక్కడా దొరకవు -తినురా" యని ఆఖరి కోరికగా నను కన్న అమ్మ అడిగి చాలించినది. ఇలా రాజమహేంద్రవరం పతివాడతో **మిసిమి** ద్వారా పరిచయం కబుర్లు - కన్నతల్లి ప్రేమను తాకినట్లు-కొంచెం నటన అనుకొన్నా-తలపించినది.

మరో విచిత్రం ఈ 'మే 15'న **మిసిమి** గ్రంథాలయంలో దిగంబర కవులతరపు 'నగ్నముని'కి '85వ జన్మదినపు కేకు' కట్ చేయిస్తూ ఎ.కె మరో మాట అన్నారు "ఆశ్చర్యంగా 'పతివాడ'లో ఇప్పటికీ జీవితపు ఏ నెగిటివ్ ఎమోషన్స్ ఆనమాలుగా కించ్చెత్తుగా కూడా లేవు-బహుశా అది ఎండని ఎద - గోదారి నది".

రాంబాబు గారు పంచుకొంటూ "ఇదే మే 15 'కాటన్ దొర 222 వ పుట్టినరోజు భలే కలిసొచ్చింది" వేదంలా భాషిస్తూ ముగించారు.

ఐ.వి.రామరాజు, పిప్పర/హైదారాబాద్
ఫోన్ : 9912644386, **మిసిమి** తరుపున.

## కమ్మతెమ్మెర

**మిసిమి** అభిమాన పాఠకులకోసం "నా ప్రయాణం నూరేళ్ళ పండుగ" శీర్షికన అశ్విని కుమార్ గారు 96 ఏళ్ళ పెద్ది సత్యనారాయణ గారితో మే 2025 మాసపత్రికలో అందించిన సంభాషణ వ్యాసం చాలా బావుంది. సత్యనారాయణ గారు రాజకీయాలలోకి రావటం ప్రమాదంతో పోల్చారు. నిజమే నాడు, నేడు అదేపరిస్థితి. వారి జీవితంలో జరిగిన విశేషాలు, విశ్లేషణలు పాఠకులను అలరించాయి. అనుభవజ్ఞులతో పరిచయాలు ఆదర్శవంతాలు. అశ్వనికుమార్ గారు సత్యనారాయణ గారినుండి విషయాలను సుతారంగా రాబట్టారు. See their cheeks అంటే అఘాయిత్యం ఎలా అవుంతుందో phrase అర్ధం కాలేదు. తెలిసినవారు తెలియజెప్పండి. వయసుతోపాటు మతిమరుపుకూడా రెండూ రైలు పట్టాల్లా చాలా సమాంతరంగా నడుస్తుంటాయి అనటం వయోవృద్ధులకందరకూ వర్తిస్తుంది. తుమ్మల సీతారామమూర్తి గారు రాసిన పుస్తకాలు సత్యనారాయణగారిని ఎలా ప్రభావితం చేశాయో సవివరంగా చెప్పారు - 'కడివెడు పాలు పిండెదవుగాని, నీ కంచములోకి గంజి నీళ్ళే' - ఆహా! ఎంతబాగా చెప్పారు. ఆయన చెప్పింది చదువుతున్నంతసేపూ కళ్ళముందు కదలాడే సినిమాలా అనిపించింది. వారిరువుమధ్య 'విరిసిన నవ్వు-సంభాషణ చివరివరకు వెలుగుతూనే ఉంది' అనటం అనితర సాధ్యం.




సంప్రదాయవాదులు ఛాందసులని నిర్మొహమాటంగా చెప్పారు. జీవితం వెంట మనం పోవాలిగానీ, మనవెంట అది రాదు అనే జీవిత సత్యాన్ని అందరికీ అందించారు. 'మంచినీళ్లు తాగటానికి ఇచ్చారు' అని చెప్పటానికి వారు 'దాహం ఇచ్చారు' అనటం కొంత వింతగా తోచింది. కవుల కలం ఎప్పుడూ కవిత్వాన్నే కోరుకుంటుందని సీతారామమూర్తి గారు రాసిన పోస్ట్ కార్డు నిరూపించింది. భోజనం కన్నా బుక్ చదవటం ముఖ్యమైందని తన రసజ్ఞతను కసిగా చెప్పారు సత్యనారాయణ గారు. శతాబ్దానికి దగ్గరవుతున్నా సత్యనారాయణగారి గొంతులో శబ్ద సౌందర్యం తగ్గలేదని అశ్వనికుమార్ గారు **మిసిమి** భాషలో చెప్పకనే చెప్పారు. ఆచార్య యెన్. జి. రంగా, మహాకవి జాషువా, తెలుగులెంక తుమ్మల సీతారామమూర్తి, కొండవీటి వెంకటకవి, కన్నెగంటి పాపారావు లాంటి గొప్ప వ్యక్తులతో సత్యనారాయణగారికున్న మధురస్మృతులను వెలికి తెచ్చి, మూటకట్టుకొచ్చిన జ్ఞాపకాలను అక్షర రాసులుగా **మిసిమి** పాఠకులకు అందజేసిన అశ్వినికుమార్ గారికి ధన్యవాదాలు.

*- షేక్ మొహమ్మద్, పి.హెచ్‌డి., ఫోన్ : 9849334621*

# కళా సంగమం
# ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

కళను ఒక తపస్సులా భావించి, అందులో లీనమై. తాను చిత్రీకరించినది లేదా చెక్కినది బయటి లోకానికి ఆవిష్కరించి చూపుతాడు. ఎవరికి తోచిన వ్యాఖ్యానం వారు చేసినా కళాకారుడు పట్టించుకోడు. తన బాధ్యత మనసులోని చిత్రానికి చక్కనిరూపం ఇవ్వటం దీక్షగా స్వీకరించుకుని వెళుతుంటాడు. గడచిన వంద సంవత్సరాల కాలంలో తమ చిత్రకళతో కళాప్రపంచాన్ని అలరించిన కళాకారులు ఎందరో ఉన్నారు. ఒకనాడు పాఠశాలల్లో డ్రాయింగ్ ఒక అంశంగా బోధించే టీచర్ ఉండేవాడు. బొమ్మలు చిత్రీకరణ ప్రాథమిక అంశాలు ప్రతి పిల్లవాడికీ అందించే యత్నం స్కూల్ స్థాయిలో జరిగేది. ఆ తర్వాత ఎవరికి నచ్చినరీతిలో వారు తమకు ఇష్టమైన అంశాన్ని తీసుకుని దానిమీద పట్టుసాధించేవారు. కాలేజీ స్థాయిలో కూడా కళని ఒక సబ్జెక్ట్‌గా బోధించిన కళాశాలగా బందరులోని జాతీయ కళాశాల నిలుస్తుంది. బెంగాల్ నుండి ప్రముఖ చిత్రకారులను తీసుకువచ్చి ఆధ్యాపకులుగా నియమించింది యాజమాన్యం. అడవి బాపిరాజు వంటి మేటి చిత్రకారుడు, రచయిత ఆ కళాశాలకు ప్రధాన అధ్యాపకుడిగా ఎంతో ముందుకు తీసుకువెళ్ళాడు. చిత్రకళను, పలువురు కళాకారులను తీర్చిదిద్దాడు.

దాదాపుగా అదే సమయంలో ఆంధ్రుల సాంస్కృతిక కేంద్రమైన గోదావరి తీర పట్టణం రాజమహేంద్రవరం లోని కాలేజీలో ఉన్న బ్రిటీష్ ప్రిన్సిపాల్ తన శిష్యులలోని టాలెంట్ని గుర్తించి వారికి పాశ్చాత్య చిత్రకళలోని మెళు కువలను నేర్పాడు. చిత్రకళకి అవసరమయిన పరికరాలను, పదార్థాలను విదేశాలనుండి తెప్పించి, అందజేసి ప్రోత్సహించాడు. అలా రాజమహేంద్రవరంలో దామెర్ల రామారావు గొప్ప కళాకారుడిగా రూపుదిద్దుకున్నాడు. వంద సంవత్సరాల కాలంలో ఒక చిత్రకళలోనే కాదు ఇతర కళలలోనూ ఎందరెందరో తమ ప్రతిభను ఆంధ్రదేశంలో ప్రదర్శించి, ఆ తర్వాత మెరుగైన అవకాశాలు, గుర్తింపు వెతుక్కుంటూ దేశంలోని ఇతర నగరాలకు, విదేశాలకు వెళ్ళి స్థిరపడ్డారు.




ఆ మేటి కళాకారుల వివరాలు, వారి చిత్రాలతో పాటు సమకాలీన చిత్ర, శిల్ప కళాకారులను ఒకచోటికి చేర్చి, పుస్తకంగా ప్రచురించే ప్రయత్నం విజయవాడకి చెందిన 64 కళలు డాట్ కాం పత్రిక నిర్వహిస్తున్న కళాసాగర్ యల్లపు చేశాడు. అతని దశాబ్దపు పైబడిన కృషి ఫలితం ఆంధ్రకళాదర్శిని-ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో వెలువరించిన కాఫీ టేబుల్ పుస్తకం.

కళారంగంలో మొదటకాలు పెట్టిననాటి నుండే అతడు రాష్ట్రంలోని చిత్రశిల్పకారులను ఒక త్రాటి మీదకు తెచ్చే ప్రయత్నం కమ్యూనికేషన్ వ్యవస్థ ఇంతగా అందుబాటులో లేని ఆ కాలంలోనే అతను సాదించాడు. సెల్ ఫోనులు, ఇంటర్నెట్ అందుబాటులో లేని ఆ కాలంలో కేవలం ఉత్తరాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మన తెలుగు కళాకారుల సమాచారాన్ని సేకరించి వాటన్నింటితో తొలిసారిగా 2001లో ఆంధ్రకళాదర్శిని మొదటి గ్రంథాన్ని, 2004 లో రెండవ గ్రంథాన్ని తీసుకు రావడం జరిగింది. ఆయన అప్పుడు ప్రచురించిన రెండు పుస్తకాలే రాష్ట్రంలో మూలమూలల్లో ఉన్న కళాకారులను తెలుసుకునేందుకు ప్రస్తుతము రాష్ట్రంలో నడుస్తున్న ఏ కళాసంస్థలకైనా మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. అటు తర్వాత అతడు మన తెలుగు కళారూపాల విశిష్టత కేవలం మన తెలుగు ప్రాంతానికే గాకా విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పంతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి చరిత్రలో నిలిచిపోయేలా తన కలకు ప్రతిరూపంగా 304 పేజీల చక్కటి నాణ్యమైన ఆర్ట్ పేపర్ పై, ఇంగ్లీష్‌లో సప్త వర్ణాల్లో ముద్రించిన చిత్ర శిల్పకళా ఉద్గ్రంథం ఈ 'ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' కాపి టేబుల్ బుక్. ఇందులో మన ఆంధ్ర చిత్రకళకు ఆద్యులై నేడు కీర్తి శేషులుగా మిగిలిన దామెర్ల రామారావు, వరదా వెంకటరత్నం, భగీరధి, అడవి బాపిరాజు, గుర్రం మల్లయ్య, అంకాల వెంకట సుబ్బారావు, అంట్యాకుల పైడిరాజు, మొక్కపాటి కృష్ణమూర్తి. వి.ఆర్. చిత్ర, ఎస్ యెన్ చామకూర, పిలకా లక్ష్మి నరసింహం దంపతులు. కృష్ణారెడ్డి, రెడ్డప్పనాయుడు, మాదవపెద్ది గోఖలే, మాదేటి

రాజాజీ, వడ్డాది పాపయ్య, సి.ఎస్.ఎన్. పట్నాయక్, బాపు, బాలి, కేతా, గంగాధర్, ఈశ్వర్ లాంటి దివంగత కళాకారుల చిత్రాలు సమాచారంతో బాటు ప్రస్తుత వర్తమాన కాలంలో జాతీయ అంతర్జాతీయంగా పేరు గడిస్తున్న మన తెలుగు చిత్ర, శిల్పకారుల పరిచయాలతో మూడొందల మందికి పైగా కళాకారుల చిత్రాలతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రకళా గ్రంథం దేశంలో ప్రతి చిత్రకారుడు మరియు కళాభిలాషుల సేకరణలో గ్రంథాలయంలో తప్పక ఉండవలసిన గ్రంథం ఈ ఆంధ్రకళాదర్శిని ART OF AP - COFFEE TABLE BOOK.

చక్కటి డిజైన్ మరియు హార్డ్ కేస్ బౌండ్‌తో మల్టీ కలర్‌లో లక్షల ఖర్చుతో ముద్రించబడిన ఈ అపురూపమైన గ్రంథం వెల - 2000/- రూపాయలు మాత్రమే. ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు కాస్త తగ్గింపు ధరలలో కూడా లభ్యమౌతుంది.

*ప్రతులకు : కళాసాగర్, సంపాదకుడు,*
*ఫోన్ : 9885289995*

---

## పదమూ పద్యము
## అన్నమయ్య వెంగమాంబల కవితా వీక్షణం

ఆచార్య అనుమాండ్ల భూమయ్య డిసెంబర్ 2024లో ప్రచురించిన 'పద్యమూ పదము అన్నమయ్య వెంగమాంబల కవితా వీక్షణం' విభిన్నమైన, విలక్షణమైన రీతిలో సాగిన పరిశోధనాత్మక పరిశీలన. భూమయ్యగారే జనవరి 2000లో వెలువరించిన 'నాయనితో కాసేపు' ఈ క్షేత్రంలో పూసిన తొలి పువ్వయితే 'అన్నమయ్య వెంగమాంబల కవితా వీక్షణం' మలిపండు. డా. భూమయ్యగారి ఈ సుకృతి 'అన్నమయ్య పదము- వెంగమాంబ పద్యము' అనే రెండు అధ్యాయాలుగా విభజింపబడింది. గ్రంథకర్త ఈ రెండు అధ్యాయాల్లోనూ పరిశోధనాంశాన్ని ఎన్నుకొనే విధానం, పరిశోధకుని అభిరుచి, విషయసేకరణ, అధ్యయనం, విశ్లేషణ, విమర్శ ఇత్యాది అంశాలపై పరిశోధనాభిలాషితో అంచెలంచెలుగా చర్చించారు. గ్రంథకర్త పరిశోధనకుని అభిరుచి, ఆసక్తి, ఆలోచనా దృక్పథం గ్రహించి పరిశోధనాంశంగురించి అతనితో చాలా సేపు చర్చిస్తారు. అతని అభిరుచికి అనుగుణమైన పరిశోధనాంశం సూచించి, ఆవిషయ వైశాల్యం, దాని స్వరూపం. పూర్వ పరిశోధక విద్వాంసులు రాసిన గ్రంథాల వివరాలు అతనికి అందిస్తారు. తాళ్ళపాక అన్నమాచార్యులు, తరిగొండ వెంగమాంబలు శ్రీతిరుపతి వేంకటస్వామి వారిపై రాసిన పదాల, పద్యాల తులనాత్మక అధ్యయనం చేసి వాళ్ల భక్తితత్త్వాన్ని విశదీకరించమని గురువు శిష్యునికి చెప్తారు.

డా. అనుమాండ్ల భూమయ్య జిజ్ఞాసువుకు అన్నమాచార్యుల భావ ఔన్నత్యాన్ని, భాషా వైశిష్ట్యాన్ని, మాండలిక భాష ఇంపుసొంపుల్ని, శయ్యా సౌభాగ్యాన్ని సోదాహరణంగా వివరించి ఆ బాటలో ముందుకు సాగమంటాడు. శ్రీవేంకటేశ్వరుల రూప గుణ విశేషాల్ని అన్నమయ్య వర్ణించిన విధానాన్ని లోతుగా అధ్యయనం చెయ్యమని పురికొల్పుతారు. ఆచార్య అనుమాండ్లవారు రెండవ అధ్యాయంలో తరిగొండ వెంగమాంబ గారు 'శ్రీవేంకటాచల మాహాత్మ్యము' కావ్యంలో శ్రీవేంకటేశ్వర స్వామి చరిత్రను కవిత్వీకరించిన ప్రతిభావిశేషాల్ని విశ్లేషించి చెప్పారు. గురువు శిష్యునికి వెంగమాంబ కథాకథన విధానం, పాత్రచిత్రణా కౌశలం, వర్ణనా వైదగ్ధ్యం, భక్తితత్త్వ వివేచన మొదలైన విషయాల్ని సోదాహరణంగా వివరించి చెప్పారు. పరిశోధనలో అన్నమయ్య, వెంగమాంబల భక్తి, కథాకథన పాత్రచిత్రణలకు ప్రాధాన్యమివ్వాలని, ఇద్దరి భాషాశైలుల గురించి ప్రత్యేక దృష్టి పెట్టాలని గురువు శిష్యునికి ప్రబోధిస్తారు. ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారి ఈ విశిష్టగ్రంథం పరిశోధన లోతుపాతుల్ని విషయవైశాల్యాన్ని, భాషాసౌందర్యాన్ని శైలీరామణీకాల్ని పరిశోధకులకు అరటిపండు వొలిచి పెట్టినట్లు తెలియచేస్తుంది. 'పరుసము చేతనుంటే బట్టిన దెల్లా బంగారమే' అన్న అన్నమయ్యవారి ఈ మాటకు నిదర్శనంగా, పరిశోధకులకు ఈ వినూత్న, విశిష్టగ్రంథం కైదివ్వెకాగలదు.

*(పదమూ పద్యము : అన్నమయ్య వెంగమాంబల కవితా వీక్షణం : రచయిత : ఆచార్య అనుమాండ్ల భూమయ్య పేజీలు: 121. వెల: రూ 100/- ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, కాచిగూడ క్రాస్‌రోడ్, ఆర్యసమాజ్ ఎదురుగా హైదరాబాదు - 500027. రచయిత ఫోన్ : 8897073999.)*


---

(ఘట్టమరాజు, బెంగళూరు-9964082076)

# చదవండి...


**- మిసిమి**

**సృష్టిగర్భ - డా. దీర్ఘాసి విజయకుమార్ :** జిజ్ఞాసి అత్యంత శ్రద్ధతో ఉపనిషత్తులను అధ్యయనం చేస్తే అతను జ్యోతిర్మయ లోకాన్ని సందర్శించగలడని చినవీరభద్రుడు అంటారు. విజయ భాస్కర్ ఈ రచన ద్వారా గంగను ఈ భూమిమీద ప్రవహింప చేసాడని ప్రశంసించారు. ఇదొక తపస్సుగా, దాని ఫలితంగా వారు వర్ణించారు. ఈ పుస్తకాన్ని వాక్కులమ్మ ప్రచురణ - లోకకవి అందెశ్రీ ప్రచురించి మనకు మేలు చేసారు.



*పేజీలు : 244, వెల : 250, ప్రతులకు : అందెశ్రీ, హైదరాబాద్, ఫోన్ : 9848560986*

**ఊహా విహంగాలు - సాహితీ తరంగాలు - శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం :** ఇది కథలు, వ్యాసాలు. పార్వతీశం గారి కథలు హాస్యము, చమత్కారాలు, విలువలతో నిండి ఉంటాయి. తిరిగొచ్చిన కథ, కల్లోలం, పిచ్చినాన్న ఇలాంటి శీర్షికలతో కథలు రాసారు. బహుమతి నగదుకు ప్రామిసనరీ నోటు రాసివ్వడం కూడా విడ్డూరమే. ఇక వ్యాస తరంగాలకొస్తే పోతన, జాన్‌కీట్స్, కాళిదాసుల రచనల గురించి కరుణశ్రీ కవితా మకరందం గురించి, దివాకర్ల వెంకటావధాని రచనల గురించి, విశ్వనాథ వారి గురించి సవివరంగా వారి రచనలను విశ్లేషించారు. వీరు ఇప్పుడు వచ్చే వ్యాసాలలో సమాజంలో లేని రుగ్మతలను అంటే కుల సంఘర్షణలను, ఆధిక్య భావాలను, స్త్రీ, పురుష విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వ్రాయుటం శ్రేయస్కరం కాదు అంటారు.





*పేజీలు : 208, వెల : 150/-, ప్రతులకు : శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం 9849779290,*

**అంతరంగ ఆలాపనలు -శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం :** పార్వతీశం గారు ఈ గ్రంథంలో సోమవార ప్రియ శతకం, షట్ కవితా సంపుటి, అష్టవ్యాస సంపుటి, త్రయో ఏక పాత్ర సంకలనం, కథాచతుష్టయ సంపుటి, సోమవార శతకం వీటి గురించి వివరంగా వ్యాస పరంపరలు ఈ పుస్తకంలో వ్రాసారు. మరేమి వ్రాసారో తెలుసు కోవాలంటే చదవవల్సిందే. వీరు వ్యాసాల గురించి చెబుతూ విద్వత్ వనంలో పార్వతీశం గారి గ్రంథం పారిజాతం లాంటిది అంటారు రామమోహన శర్మ గారు.




*పేజీలు : 222, వెల : 250/-, ప్రతులకు : శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం, ఫోన్ : 9849779290,*

**హంపీ దిద్దిన అక్షరాలు -కవితా సంకలనం - శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం :** ఆధునిక ఆంధ్ర సాహిత్య లోకంలో పార్వతీశం గారు సుగ్రహీత నామధేయులు అంటారు వెంకటేశ్వర శర్మ. వీరు హంపీ వెళ్లకుండానే, అక్కడ శిధిలాలు చూడ కుండానే, విజయ నగర సామ్రాజ్య వైభవ శకలాలను వీక్షించ కుండానే ఈ హంపీ దిద్దిన అక్షరాలు మనకు అందిస్తున్నారు. ఇవి పద్యాలు కావు, వచన కవిత్వం కాదు, మరేమిటో చదివి తెలుసుకోండి.







పార్వతీశం

పేజీలు : 284, వెల : 150/-, ప్రతులకు : శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం, ఫోన్ : 9490634849

**నిప్పు నుంచి నీరు - జె.ఎస్. మూర్తి (విహారి) :** పదహారు కథా సంపుటాలు, ఏడు నవలలు, పదిహేను విమర్శనాత్మక వ్యాస సంపుటాలు, ఒక సాహిత్య కదంబం, ఐదు కవితా సంపుటాలు, మూడు పద్య కావ్యాలు, మూడు దీర్ఘ కథా కవ్యాలు, ఒక నాటక పద్యాల వ్యాఖ్యాన గ్రంథం, చేతన వ్యాస సంపుటి ఇవన్నీ విహారి గారి రచనలు పుస్తకరూపంలో వచ్చినాయి. మూడొందల యాభై కథానికల గుణ విశేషాలను విశ్లేషిస్తూ పరిచయం చేసారు. అవన్నీ ఎన్నో పత్రికలలో ప్రచురింపబడినాయి. వీరు అనేక పత్రికలకు మూడొందల గ్రంథ సమీక్షలు చేసారు. అలాంటి చేయి తిరిగిన రచయిత నిప్పు నుంచి నీరు తీయగలరా? అదే ఈ కథా సంపుటి. ముద్రణా పత్రికల మీద కాలపరిణామ ప్రభావం ఎలా ప్రతిఫలిస్తోందో, అచ్చు పత్రికలు ఎలా తగ్గుముఖం పట్టాయో, ఎవరు చదవని వెబ్ మ్యాగ్‌జైన్స్ ఎలా విజృంభిస్తున్నాయో, సామాజిక మాధ్యమాల దుష్పరిణామాలు వీటన్నిటికీ కథా సాహిత్యం ఎలా లోనయ్యిందో అయినా కథా రచయితలు ఏవిధంగా రచనలు చేస్తున్నారో ఇవన్నీ కూలంకషంగా చర్చిస్తారు విహారి.




*పేజీలు : 153, వెల : 200/-, ప్రతులకు : జె.ఎస్. మూర్తి (విహారి), హైదరాబాద్, ఫోన్ : 98480 25600*

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి     బహుమతిగా పంపండి**

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : **మిసిమి** మాస పత్రికను పంపిణీ చేస్తున్న కొందరు పుస్తక విక్రేతలు సొమ్ము పంపని కారణగా వారికి పత్రికను పంపడం ఆపేతున్నాము. విజ్ఞులైన పాఠకులు **మిసిమి** ని వార్షిక చందాలు పంపి పొందవలసిందిగా మనవి.
మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ–మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి.
మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.


**A/C Name : Misimi  A Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹1200/- (రెండు సంవత్సరాలకు),
₹1800/- (మూడు సంవత్సరాలకు),
**Scan QR to Pay**
Misimi A Unit of Kalajyothi

## మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | దూరతీరాలలో... | బహుముఖ బనారస్ | ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం



పురస్కార సాహిత్యం | వ్యాస మంజూష | సారస్వత వ్యాసాలు | చార్లీ చాప్లిన్ | రజ్జు సర్ప భ్రాంతి | బైరన్ | యాత్రా కథనాలు



షెల్లీ జీవిత కథ | దోసిట చినుకులు | నృత్యభారతి | పారిజాతం | సిద్ధార్థ | సప్తపర్ణి | ప్రవాస సాహిత్యం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: **994 951 6567.**

**మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**